Estd. 1938

# ఆంధ్రప్రభ

www.prabhanews.com Journalism first!


**ముహూర్తం**

శ్రీ వికారినామ సంవత్సరం, దక్షిణాయణం, శరదృతువు, ఆశ్వయుజమాసం, కృష్ణపక్షం; తిథి: త్రయోదశి మ.3.46 వరకు; నక్షత్రం: ఉత్తర ఫల్గుణి ఉ.8.28 వరకు, తదుపరి హస్త, ఆదివారం ఉ.5.50 వరకు; అమృతకాలం: ఆదివారం ఉ.0.29 నుండి ఉ.1.55 వరకు; వర్జ్యం: మ.3.56 నుండి సా.5.22 వరకు; దుర్ముహూర్తం: ఉ.6.15 నుండి ఉ.7.47 వరకు; రాహుకాలం: ఉ.9.07 నుండి ఉ.10.33 వరకు; యమగండం: మ.1.26 నుండి మ.2.52 వరకు;







సంపుటి:58 సంచిక: 187 • శనివారం 26 అక్టోబర్ 2019 • హైదరాబాద్ * పేజీలు:10+4 • వెల: 5.00 • Published from:Hyderabad | Karimnagar| Nizamabad| Suryapet| Vijayawada | Guntur | Rajahmundry| Visakhapatnam| Tirupati | Kurnool | Anantapur | Nellore





## నేడు కృతజ్ఞతా సభ

మ.12గం.లకు హైదరాబాద్ నుంచి బయలుదేరనున్న సీఎం

3 గంటలకు నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌లు, పార్టీ ముఖ్యులతో భేటీ

అభివృద్ధి అజెండాపై అధికారులతోనూ సమీక్ష

మంత్రి జగదీష్‌రెడ్డి పర్యవేక్షణలో భారీ బహిరంగ సభకు ఏర్పాట్లు

సాయంత్రం ఐదింటికి సభ తర్వాత సీఎం తిరిగి హైదరాబాద్‌కు

**నల్గొండ/హైదరాబాద్, ఆంధ్రప్రభ:** పోటాపోటీగా జరిగిన హుజూర్‌నగర్ ఉపఎన్నికలో తెలంగాణ రాష్ట్ర సమితి అఖండ విజయం సాధించిన సందర్భంగా ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు ఆ నియోజకవర్గ ప్రజలకు కృతజ్ఞత తెలపాలని నిర్ణయించారు. ఆ మేరకు శనివారం హుజూర్‌నగర్‌లో 3వ పేజీలో...

### ఆర్టీసీ సమ్మెపై సీఎం కేసీఆర్ నిర్ణయం

# నేడు చర్చలు!

మధ్యాహ్నం అధికారులు, ఆర్టీసీ జేఏసీ నేతల మధ్య చర్చలు

సుదీర్ఘ సమీక్ష అనంతరం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిన సీఎం కేసీఆర్




**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** దాదాపు మూడు వారాల ఆర్టీసీ సమ్మె ఉత్కంఠకు ప్రభుత్వం తెర దించింది. రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం సూచనల మేరకు ఈ సమ్మెపై గత రెండు రోజులుగా ఉన్నత స్థాయి అధికారులతో సమీక్ష నిర్వహించిన సీఎం కేసీఆర్ ఎట్టకేలకు కార్మిక సంఘాలతో అధికారుల చర్చలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. సమ్మె విషయంలో ఇన్ని రోజులుగా అటు ప్రభుత్వం ఇటు కార్మిక సంఘాలు ఏ మాత్రం మెట్టు దిగకపోవడంతో తాజాగా ఈ చర్చలకు అత్యంత ప్రాధాన్యత ఏర్పడింది. ఆర్టీసీ జేఏసీ ఇచ్చిన సమ్మె నోటీసులోని 26 డిమాండ్లలో 21 డిమాండ్లపై 8వ పేజీలో...

• నేను డ్యూటీలో జాయిన్ అవుతా!


కూకట్‌పల్లి డిపోకు చెందిన డ్రైవర్ రాజు డిపో మేనేజర్‌కు లేఖ ఇస్తున్న దృశ్యం

## దరఖాస్తులతో విధుల్లోకి!

కార్మికులను ప్రభావితం చేసిన సీఎం ప్రకటన

మరుసటి రోజే విధుల్లో చేరిన ఓ డ్రైవర్

**హైదరాబాద్, ఆంధ్రప్రభ**: సీఎం కేసీఆర్ గురువారం తెలంగాణ భవన్‌లో చేసిన ప్రకటనతో 21రోజులుగా సమ్మెలో ఉన్న కార్మికులు పునరాలోచనలో పడినట్లు తెలుస్తోంది. యూనియన్ నేతల నమ్ముకుని సమ్మె చేయాలా..?, సీఎం కేసీఆర్ ఇచ్చిన ఆప్షన్ మేరకు విధుల్లో చేరాలా..? అని 5వ పేజీలో...



# ద్రవ్యలోటుకు కళ్లెం!

మూలధనేతర వ్యయ నియంత్రణ

కేంద్రం ప్రశంసలు

**(హైదరాబాద్, ఆంధ్రప్రభ ప్రత్యేక ప్రతినిధి)**

దేశంలోనే పెద్ద రాష్ట్రాల్లో తెలంగాణ స్థిరమైన అభివృద్ధిని నమోదు చేస్తోంది. 2016-17 ఆర్థిక సంవత్సరంలో తెలంగాణలో స్థూల ద్రవ్య లోటు 5.3శాతం నమోదైంది. 2019-20నాటికిది 2.4శాతానికి పరిమితమౌతోంది. ఇలా గత నాలుగేళ్ళలో స్థూల ద్రవ్యలోటును గణనీయంగా తగ్గించిన రాష్ట్రాలు తెలంగాణతో పాటు రాజస్థాన్, జార్ఖండ్, తమిళనాడు మాత్రమే. "స్టేట్‌ఫైనాన్స్ ఎ స్టడీ ఆఫ్ బడ్జెట్స్" ప్రతిఏటా రాష్ట్రాల ఆదాయ, వ్యయాలతో కూడిన ఆచరణాత్మక బడ్జెట్‌ను విశ్లేషిస్తుంది. 2019-20 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి విడుదల చేసిన నివేదికలో దేశవ్యాప్తంగా రాష్ట్రాల స్థూల ఆర్థిక లోటు రూ.5.52 లక్షల కోట్లు ఉంటుందని ఇది



అంచనా వేసింది. జాతీయ స్థూల ఉత్పత్తిలో ఇది 2.6శాతం కానుంది. 2018-19 ఆర్థిక సంవత్సరంలో అన్ని రాష్ట్రాల బడ్జెట్‌లలో మొత్తం రూ. 4.90 లక్షల కోట్ల ద్రవ్యలోటును అంచనా లేశారు. ఇది అప్పటి స్థూల జాతీయో త్పత్తి విలువలో 2.4శాతం. అఆర్థిక సంవత్సరం చివర్లో దీన్ని రూ.5.55 లక్షల కోట్లకు సవరించారు. ఇది స్థూల జాతీయోత్పత్తి 3వ పేజీలో...



### మున్సిపాలిటీలన్నీ మనవే కావాలి...

# హుజూరెత్తాలి!

**ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలదే బాధ్యత**

మంత్రులు, ఎంపీలు, ఇతర ప్రజాప్రతినిధులు ప్రచార బాధ్యతలు తీసుకోవాలి

గడపగడపకూ సంక్షేమ పథకాలపై ప్రచారం చేయాలి • సీఎం కేసీఆర్ దిశానిర్దేశం

**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** హుజూర్‌నగర్ ఉపఎన్నిక ఫలితంతో మంచి జోష్ మీదున్న తెరాస అధినేత కేసీఆర్ పురపాలక ఎన్నికలపై దృష్టి సారించారు. త్వరలో జరిగే మునిసిపల్ ఎన్నికల్లో హుజూర్‌నగర్ ఫలితాలే పునరావృతం కావాలని ఆయన తనను కలిసిన మంత్రులు, ఎమ్మెల్యేలకు చెబుతున్నట్టు సమాచారం. హుజూర్‌నగర్ ఉపఎన్నికలో ఘన విజయం సాధించిన నేపథ్యంలో పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు శుక్రవారం ప్రగతి భవన్‌లో సీఎం కేసీఆర్‌తో పాటు తెరాస కార్యనిర్వాహక అధ్యక్షుడు, మునిసిపల్ మంత్రి కేటీఆర్‌ను కలిశారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులతో ఇష్టాగోష్టిగా మాట్లాడిన కేసీఆర్, కేటీఆర్‌లు నగర పాలక, పురపాలక ఎన్నికల్లో విజయం ఏకపక్షంగా ఉండాలని ఎటువంటి పరిస్థితుల్లోనూ ఈ ఎన్నికలను తేలికగా తీసుకోవద్దని దిశానిర్దేశం చేసినట్టు తెలుస్తోంది. పురపాలక ఎన్నికలకు ఆయా నియోజక వర్గాలకు చెందిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు బాధ్యులుగా వ్యవహరించాల్సి ఉంటుందని ఆ జిల్లాకు చెందిన మంత్రులు, లోక్‌సభ, రాజ్యసభ సభ్యులు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మన్లు, పార్టీ ముఖ్య నేతలు స్థానికంగా ఉండి ప్రచారంలో పాల్గొనాలని సూచించినట్టు తెలుస్తోంది. పురపాలక ఎన్నికలకు సంబంధించిన కేసు సోమవారం హైకోర్టు సింగిల్ జడ్జి 3వ పేజీలో...

### ఐఏఎస్, ఐపీఎస్‌ల బదిలీలు?

ఇప్పటికే పెద్దసంఖ్యలో ఏఎస్పీ, డీఎస్పీల బదిలీలు 2








## దుష్యంత్‌కు డిప్యూటీ

హర్యానాలో బీజేపీ వ్యూహాత్మక అడుగులు

అధికారం కైవసం • జేజేపీ అధినేత దుష్యంత్‌కు

ఉపముఖ్యమంత్రి ఆఫర్ • కాంగ్రెస్‌కు 9

అవకాశమివ్వకుండా బీజేపీ గుప్పిట్లో స్వతంత్రులు

### కాశ్మీర్, లడఖ్‌లకు

## కొత్త లెఫ్టినెంట్ గవర్నర్లు

గోవాకు సత్యపాల్ మాలిక్ బదిలీ 9

మిజోరం గవర్నర్‌గా పీఎస్ శ్రీధరన్ పిళ్లై


గిరీష్ చంద్ర ముర్ము (జమ్మూ కాశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్)


రాధా కృష్ణ మాథుర్ (లడఖ్ లెఫ్టినెంట్ గవర్నర్)




కంగ్రాట్స్ కేటీఆర్ సార్...



## సమర్ధవంతంగా పనిచేశారు

### పార్టీ నాయకులతో మంత్రి కేటీఆర్

**హైదరాబాద్, ఆంధ్రప్రభ :** హుజూర్‌నగర్ ఉపఎన్నికలో ఎంతో సమర్ధవంతంగా పనిచేసి పార్టీ అభ్యర్ధి సైదిరెడ్డిని గెలిపించారని ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ టీఆర్ఎస్ నేతలను అభినందించారు. హుజూర్‌నగర్ ఉపఎన్నికలో పార్టీ తరపున బాధ్యులుగా వ్యవహరించిన వరంగల్ తూర్పు ఎమ్మెల్యే నన్నపనేని నరేందర్, శాసనమండలి సభ్యుడు పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ కోలేటి దామోదర్ శుక్రవారం ప్రగతి భవన్‌లో కేటీఆర్‌ను కలిశారు. నేరేడుచర్ల, హుజూర్‌నగర్ మండలాలకు ప్రచార బాధ్యతలను నిర్వహించిన నరేందర్, దామోదర్, శ్రీనివాస్ రెడ్డిలను కేసీఆర్ అభినందించారు. త్వరలో జరిగే పురపాలక, నగర పాలిక ఎన్నికల్లోనూ ఇదే ఊపుతో ప్రచారం నిర్వహించడంతో పాటు హుజూర్‌నగర్ ఫలితాలు పునరావృతం కావడానికి కృషి చేయాలని కేటీఆర్ కోరారు. ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపట్ల ప్రజలు సంతోషంగా ఉన్నారని, ఎటువంటి అవినీతికి ఆస్కారం లేకుండా పాలన అందుతోందనే ఆనందం ప్రజల్లో ఉందని కేటీఆర్‌కు నేతలు వివరించారు.

కీపిటప్.. నరేందర్, శ్రీనివాస్ రెడ్డి



## వైఎస్ భారతితో నటి నమ్రత భేటీ

**అమరావతి, ఆంధ్రప్రభ:** ఏపీ సీఎం సతీమణి వైఎస్ భారతితో సినీ నటుడు మహేష్ బాబు భార్య నమ్రత భేటీ అయ్యారు. గుంటూరు జిల్లా, తాడేపల్లిలోని సీఎం నివాసానికి నమ్రత చేరుకుని భారతిని కలిశారు. ఏపీలో పలు గ్రామాల దత్తత తీసుకునే అంశంపై చర్చించినట్లు తెలిసింది. మహేష్ బాబు స్వస్థలమైన గుంటూరు జిల్లా, బుర్రిపాలెం గ్రామాన్ని దత్తత తీసుకుని చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను భారతికి నమ్రత వివరించారు. తెలంగాణలోని సిద్ధాపూర్‌లో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను కూడా ఆమె వివరించారు.

భారతి గారు.. బాగున్నారా..!



# తెలంగాణ బూస్ట్ ఐ-హెల్త్

- పరిశ్రమలకు చికిత్సా కేంద్రం
- ఫలిస్తున్న కేటీఆర్ సాహస నిర్ణయం
- ప్రపంచంలోనే తొలి ప్రయోగం
- ఏడాదిన్నరలోనే అద్భుతమైన ఫలితాలు
- ఐ-హెల్త్ సేవల విస్తరణకు కసరత్తు

**హైదరాబాద్, ఆంధ్రప్రభ :** ఓ కుటుంబం పెద్ద జబ్బుపడినా, అకాల మరణం చెందినా ఆ ఫ్యామిలీ మాత్రమే సంక్షోభంలో పడుతుంది. అలాగే ఓ పరిశ్రమ జబ్బు పడినా.. ఖాయిలా పడి మూతపడితే దానిపై ఆధారపడిన కొన్ని వందల కుటుంబాలు రోడ్డునపడుతాయి. ఈ పరిస్థితి నుంచి ఎలా బయటపడాలని ఆలోచిస్తున్న ప్రభుత్వానికి... పదవీ విమరణ పొందిన పలువురు బ్యాంకింగ్, పారిశ్రామిక రంగ నిపుణులు చక్కటి సూచన చేశారు. అదే 'తెలంగాణ ఇండస్ట్రియల్ హెల్త్ క్లినిక్ లిమిటెడ్'. ఈ ఐడియాను వారంతా పరిశ్రమలశాఖ మంత్రి కేటీఆర్ ముందు ఉంచారు. ఇంకేముంది.. కొత్తదనం, ప్రయోగాలు, సాహస నిర్ణయాలంటే ఎంతో ఇష్టపడే మంత్రిగా పేరుతెచ్చుకున్న కేటీఆర్ పెద్దలు చెప్పిన ప్రతిపాదనకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ప్రపంచంలోనే తొలిసారి మరో కొత్త ప్రయోగానికి తెలంగాణ వేదికైంది.

### మార్పుకు బీజం వేసిన కేటీఆర్

నిపుణుల ప్రతిపాదనను అర్థం చేసుకోవడంతో పాటు దాన్ని ఆచరణలోకి తెస్తూ స్వయం ప్రతిపత్తితో 'తెలంగాణ ఇండస్ట్రియల్ హెల్త్ క్లినిక్ లిమిటెడ్'ను మంత్రి కేటీఆర్ ఏర్పాటు చేయడం కొత్త మార్పులకు బీజం పడింది. ఐదేళ్లుగా బ్యాంకులు చేయలేని పనిని ఈ సంస్థ ఏర్పడిన ఏడాదిన్నర కాలంలోనే చేసి చూపింది. కాయిలా పడిన పలు సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమలకు అండగా నిలిచి కొండంత ధైర్యాన్ని ఇచ్చింది. అంతటితో ఆగకుండా వాటి పనితీరును ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ కంటికి రెప్పలా కాపాడుతుండటం విశేషం.

### 'ఐ హెల్త్'తో ఖాయిలా పరిశ్రమలకు జీవం

'ఐ హెల్త్' పేరుతో ఇప్పటి వరకు 73 ఖాయిలా పడిన పరిశ్రమలకు రూ.1.62 కోట్ల ఆర్థికసాయం చేశారు. రూ.77కోట్ల విలువైన పరిశ్రమ ఆస్తులను ఖాయిలా నుంచి, సాంకేతికంగా, వ్యక్తిగత శ్రద్ధ వహించి కష్టాల నుంచి కేటీఆర్ గట్టెక్కించారు. ఎన్‌పీఏ జాబితాల నుంచి బయట పడేసి తిరిగి రుణాలందేలా సర్కార్ చేసింది. 5,900 మందికి ఉపాధి భద్రత కల్పించింది. పన్నులు, రాయితీల రూపంలో రూ.150 కోట్ల ప్రభుత్వ ఆర్థిక వ్యవస్థకు భద్రత ఏర్పడింది.



### తక్కువ సిబ్బందితో.. ఉత్తమ ఫలితాలు

అతి తక్కువ సిబ్బందితో సంస్థను నడిపిస్తూ అసాధారణమైన ఫలితాలను నమోదు చేస్తోంది ఈ సంస్థ. దీనికి రిజర్వ్ బ్యాంక్ మాజీ జనరల్ మేనేజర్, ఐడీఆర్‌బీటీ సీనియర్ డిమెన్ ఎక్స్‌పర్ట్ సంజయ మారువాడ సీఈఓగా ఉన్నారు. ప్రముఖ ఆర్థిక రంగ నిపుణుడు, ప్రభుత్వ సలహాదారు డాక్టర్ బి.ఎర్రం రాజు అండగా నిలిచారు. 10 మంది ఎగ్జిక్యూటివ్‌లు మాత్రమే ఉన్నారు. వ్యవహారాలు అన్నీ చాలావరకు ఆన్‌లైన్ ద్వారానే జరుగుతాయి. బయట నుంచి మరో 12 మంది కన్సల్టెంట్లను నియమించుకోవడం జరిగింది.

### వాటాగా రూ.10 కోట్లు ఇచ్చాం



తక్కువ వడ్డీతో ఖాయిలా పరిశ్రమలకు ఆర్థిక సాయం చేస్తూ వారిని తొందరగా కోలుకునేలా అవకాశాలు కల్పిస్తాం. ఇందు కోసం ప్రభుత్వం తనవాటాగా రూ.10కోట్లు అందించింది. తాము మరో రూ.90 కోట్లు సమీకరించేందుకు కసరత్తు ప్రారంభించాం. మొత్తం రూ.100కోట్ల నిధితో ఈ కార్యక్రమాలను మరింత ముమ్మరంగా చేపట్టనున్నాం. తక్కువ వడ్డీతో ఇవ్వగలిగే సోషల్ ఈక్విటీ అందించే సంస్థల గురించి అన్వేషిస్తున్నాం. 4 అంతర్జాతీయ ఆర్థిక సంస్థలతో చర్యలు జరుపుతున్నాం.

**- డాక్టర్ బి.ఎర్రం రాజు, ప్రభుత్వ సలహాదారు**

### అనుభవంతో ప్రతిపాదన తయారీ



తమ అనుభవంలో ఎదురైన ఘటనలతో ఈ ప్రతిపాదనను తయారు చేశాం. గత ప్రభుత్వాలకు చెప్పినా, స్పందించకపోవటంతో ఆచరణకు నోచుకోలేదు. పరిశ్రమ మంత్రి కేటీఆర్‌కు ఉన్న విషయ పరిజ్ఞానం, విదేశాల్లో పనిచేసిన అనుభవంతో వెంటనే మా ప్రతిపాదనలో ప్రత్యేకతను పసిగట్టారు. అధికారులతో చర్చించి సత్వరమే నిర్ణయం తీసుకొని ఆచరణలోకి తెచ్చారు. దాంతో సమాజానికి, పారిశ్రామిక అభివృద్ధికి సేవ చేయాలన్న సంకల్పం నెరవేరుతోంది.

**- సంజయ మారువాడ, ఆర్‌బీఐ మాజీ జీఎం**

# 2020 కృత్రిమ మేధో సంవత్సరం

### వ్యవసాయం, పట్టణ రవాణా, వైద్య ఆరోగ్య రంగాల్లో మరిన్ని సేవలు

### రాష్ట్ర ఐటీశాఖ మంత్రి కేటీఆర్




**హైదరాబాద్, ఆంధ్రప్రభ :** టెక్నాలజీ, ఐటీ రంగంలో మార్పులకు ఎప్పటికప్పుడు భాగమవుతూ అవకాశాలను అందుకుంటూ అగ్రభాగాన ఉన్న తెలంగాణ మరోసారి తనదైన ప్రత్యేకత చాటుకున్నది. వచ్చే 2020ని కృత్రిమ మేధో (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) సంవత్సరంగా పాటించనున్నది. ఇందులో భాగంగానే కృత్రిమ మేధని వివిధ రంగాల్లో ఉపయోగించుకునేందుకు టెక్నాలజీ కంపెనీలతో కలిసి పని చేయనున్నట్లు కేటీఆర్ తెలిపారు. వ్యవసాయం, పట్టణ రవాణా, వైద్య ఆరోగ్య రంగంలో కృత్రిమ మేధ ద్వారా అనేక రకాలైన ప్రయోజనాలున్నాయని, ఈ మేరకు తెలంగాణలో కృత్రిమ మేధో ద్వారా ఆయా రంగాల్లో మరిన్ని సేవలు అందించేందుకు ఉన్న అని అవకాశాలను వచ్చే ఏడాది వివిధ కార్యక్రమాలను నిర్వహించి అధ్యయనం చేయనున్నట్లు తెలిపారు. శుక్రవారం కేటీఆర్‌ను ప్రగతిభవన్‌లో నాస్కామ్ అధ్యక్షురాలు దేబ్ జానీ హోష్ కలిశారు. వచ్చే ఏడాదిని కృత్రిమ సంవత్సరంగా పాటిస్తే నాస్కామ్ పలు కార్యక్రమాలను నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నట్లు ఆమె మంత్రికి వివరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు. ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, కృత్రిమ మేధో, మెషిన్ లర్నింగ్, సైబర్ సెక్యూరిటీ, బ్లాక్ చైన్ టెక్నాలజీ వంటి రంగాల్లో వివిధ కంపెనీలను ఇక్కడికి తీసుకొచ్చే ప్రయత్నాలు ప్రారంభించినట్లు మంత్రి చెప్పారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా ఆయా రంగాల్లో మరిన్ని సేవలను అదనంగా అందించేందుకు వీలు కలుగుతుందన్నారు. ఈ మేరకు ఆయా రంగాల్లోని సవాళ్లను, సమస్యలను టెక్నాలజీ కంపెనీల సహకారంతో అందించే అవకాశాలను పరిశీలించనున్నట్లు మంత్రి తెలిపారు. ఆయా రంగాల్లో శిక్షణ నిర్వహించేందుకు తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. కృత్రిమ మేధను వినియోగించుకునేందుకు ప్రభుత్వం ముందుకు రావడంపై నాస్కామ్ అధ్యక్షురాలు ఘోష్ హర్షం వ్యక్తం చేశారు. ఈ రంగంలో ఇక్కడ అనుకూల ఈకో సిస్టమ్ తయారు చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. డేటా సైన్స్ రంగంలో రాష్ట్రంతో భాగస్వాములు అయ్యేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు.

> తెలంగాణ ప్రభుత్వం ప్రపంచ ప్రఖ్యాత కంపెనీల నుంచి పెద్ద ఎత్తున పెట్టుబడులను ఆకర్షిస్తున్నది. ఆయా కంపెనీలు తమ ఆర్ అండ్ డి , టెక్నాలజీ డెవలప్‌మెంట్ సెంటర్లను ప్రారంభిస్తోంది.
>
> -కేటీఆర్

# సచివుల చిరునామాలివే

**హైదరాబాద్, ఆంధ్రప్రభ :** నూతన సచివాలయ నిర్మాణ క్రమంలో ఇప్పుడున్న సచివాలయాన్ని ఖాళీ చేయించిన ప్రభుత్వం సచివులందరినీ తాత్కాలిక కార్యాలయాలను ఏర్పాటు చేసింది. నిత్యం మంత్రులు ఈ కార్యాలయాల్లో ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆదేశించింది. ప్రజా సమస్యలు, సామాజిక సమస్యలపై అందిన ఫిర్యాదులు, విజ్ఞప్తులను పరిశీలించి సంబంధిత అధికారులకు పంపేందుకు మార్గదర్శకాలు ఇచ్చింది. ఆ మేరకు మంత్రులందరికి తాత్కాలిక కార్యాలయ చిరునామాలు ఇలా ఉన్నాయి.

| పేరు | శాఖలు | కొత్తపేషీ |
|---|---|---|
| ఎర్రబెల్లి దయాకర్‌రావు | పంచాయతీరాజ్ | రంగారెడ్డి జడ్పీ కార్యాలయం, ఖైరతాబాద్ |
| తారక రామారావు | పురపాలక, పరిశ్రమలు, ఐటీ | సీడీఎంఏ కార్యాలయం, మాసబ్‌ట్యాంక్ |
| టి.హరీష్‌రావు | ఆర్థిక | అరణ్య భవన్ - సైఫాబాద్ |
| మహమూద్ అలీ | హోం, జైళ్ళు, అగ్నిమాపక | ఏపీ డీజీపీ ఆఫీస్ - లక్డీకాపూల్ |
| ఈటల రాజేందర్ | వైద్యఆరోగ్య, కుటుంబ సంక్షేమం | బీఆర్‌కే భవన్ |
| తలసాని శ్రీనివాస యాదవ్ | పశు సంవర్ధకశాఖ, సినిమాటోగ్రఫీ | పశు భవన్ - మాసబ్‌ట్యాంక్ |
| జగదీష్‌రెడ్డి | విద్యుత్ (ఇంధన) | టీఎస్ ఎన్‌పీడీసీఎల్ మింట్ కాంపౌండ్ |
| ఎ.ఇంద్రకరణ్‌రెడ్డి | అటవీ, దేవాదాయ, న్యాయ | అరణ్య భవన్ - సైఫాబాద్ |
| సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి | వ్యవసాయం, మార్కెటింగ్ | హాకా భవనం - సైఫాబాద్ |
| కొప్పుల ఈశ్వర్ | ఎస్సీ, మైనారిటీ, దివ్యాంగుల సంక్షేమం | సంక్షేమ భవనం |
| వేముల ప్రశాంత్‌రెడ్డి | ఆర్అండ్‌బీ, హౌజింగ్ | ఇఎన్‌సీ, ఆర్అండ్‌బీ - ఎర్రమంజిల్ |
| చామకూర మల్లారెడ్డి | కార్మిక | శిశు సంక్షేమ భవన్ - జూబ్లీహిల్స్ |
| పువ్వాడ అజయ్ కుమార్ | రవాణా | ట్రాన్స్‌పోర్టు కమిషనరేట్ - ఖైరతాబాద్ |
| శ్రీనివాస్ గౌడ్ | అబ్కారీ, పర్యాటక | రవీంద్ర భారతి - సైఫాబాద్ |
| గంగుల కమలాకర్ | బీసీ సంక్షేమం, పౌర సరఫరాలు | బీసీ కమిషన్ - ఖైరతాబాద్ |
| సబితా ఇంద్రారెడ్డి | విద్య | ఎస్సీఈఆర్టీ - బషీర్‌బాగ్ |
| సత్యవతి రాథోడ్ | గిరిజన, శిశు సంక్షేమం | సంక్షేమ భవన్ - మాసబ్‌ట్యాక్ |




# ఐఏఎస్, ఐపీఎస్‌ల బదిలీలు?



> 44 మంది అడిషనల్ ఎస్పీలు, 68 మంది డీఎస్పీలు బదలీ అయ్యారు

**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** పురపాలక ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందే పాలనలో భారీఎత్తున మార్పులు చేపట్టేందుకు సీఎం కేసీఆర్ సన్నద్ధమయ్యారు. ఇందులో భాగంగా కలెక్టర్లు, ఎస్పీలు, డీఆర్వోలు, మునిసిపల్ కమిషనర్ల బదిలీలకు శ్రీకారం చుట్టాలని సీఎం నిర్ణయించారు. తొలి విడతగా 44 మంది అదనపు ఎస్పీలు, 68 మంది డీఎస్పీలను బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేయగా శనివారం మరికొంత మందికి స్థానభ్రంశం కల్పించే అవకాశాలు ఉన్నాయని అధికార వర్గాలు చెబుతున్నాయి. పలువురు జిల్లా కలెక్టర్లు, సంయుక్త కలెక్టర్లు, ఏఎస్పీలు, కార్యదర్శి, సంయుక్త కార్యదర్శి హోదాలో పనిచేస్తున్న సీనియర్ ఐఏఎస్‌లను మార్చాలన్న ప్రతిపాదనలపై కేసీఆర్ సమాలోచనలు జరుపుతున్నట్టు తెలుస్తోంది. ఎస్పీలు, డీఐజీలతో పాటు ఐజీ హోదాలో పనిచేస్తున్న సీనియర్ ఐపీఎస్‌లపై కూడా బదిలీవేటు వేయాలన్న నిర్ణయానికి కేసీఆర్ వచ్చినట్టు అత్యంత విశ్వసనీయ వర్గాలు చెబుతున్నాయి. రంగారెడ్డి, నల్గొండ జిల్లాలకు పూర్తిస్థాయి కలెక్టర్లను నియమించాలని ప్రతిపాదించారు. నల్గొండ కలెక్టర్‌గా పనిచేసిన గౌరవ్ ఉప్పల్‌ను ఢిల్లీలోని తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్‌గా, రంగారెడ్డి కలెక్టర్ లోకేష్‌ను జీహెచ్ఎంసీ కమిషనర్‌గా నియమించి అక్కడున్న జేసీకు ఇంఛార్జి బాధ్యతలప్పగించిన సంగతి తెలిసిందే.

### కేంద్ర సర్వీసులకు నలుగురు ఐఏఎస్‌లు

పురపాలక పట్టణాభివృద్ధిశాఖ ముఖ్య కార్యదర్శి అర్వింద్ కుమార్‌తో పాటు వినయ్ కుమార్, రాజీవ్ రంజన్ మిశ్రా, అశోక్ కుమార్ కేంద్ర సర్వీసులకు వెళ్లారు. జీహెచ్ఎంసీ అదనపు కమిషనర్‌గా విధులు నిర్వహించిన ఆమ్రపాలి కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి కిషన్‌రెడ్డికి ఓఎస్డీగా నియమితులయ్యారు. పౌర సరఫరాలశాఖ కమిషనర్‌గా పనిచేసిన అకున్ సబర్వాల్ కూడా డిప్యూటేషన్‌పై కేంద్ర సర్వీసులకు వెళ్లారు. సీఎం కార్యాలయ అదనపు కార్యదర్శి స్మితా సబర్వాల్ కూడా డిప్యూటేషన్‌పై ఢిల్లీకి వెళ్లే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. పాఠశాల విద్యాశాఖ కమిషనర్‌తో పాటు సాంకేతిక విద్యాశాఖకు కొత్త అధిపతులను నియమించే అవకాశాలున్నాయనే చర్చ జరుగుతోంది. పల్లె ప్రగతి కార్యక్రమంలో చురుకుగా పనిచేసిన కొందరు కలెక్టర్లను ప్రధానమైన జిల్లాలకు బదలీ చేసే అవకాశాలున్నాయి. హుజూర్‌నగర్ ఉపఎన్నిక సందర్భంగా సూర్యాపేట ఎస్పీగా ఉన్న వెంకటేశ్వర్లును మార్చాలని కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశించడంతో ఆయన్ను తప్పించి ఆర్.భాస్కరన్‌ను నియమించింది. కేసీఆర్‌కు అత్యంత సన్నిహితంగా ఉన్న ఓ మంత్రి తిరిగి వెంకటేశ్వర్లను సూర్యాపేట ఎస్పీగా నియమించాలని కోరడంతో అంగీకారం తెలిపినట్టు రాజకీయ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది.

### కలెక్టర్ల పనితీరుపై నివేదిక..!

కొంత మంది కలెక్టర్లపై మంత్రులు, ఎమ్మెల్యేలు అసంతృప్తిగా ఉన్నారు. వారిని మార్చాల్సిందిగా కేసీఆర్, కేటీఆర్‌ను వారు కోరడంతో సానుకూలంగా స్పందించారన్న వార్తలు వినిపిస్తున్నాయి. మునిసిపల్ ఎన్నికల నోటిఫికేషన్ సోమ లేదా మంగళవారాల్లో వెలువడుతుందన్న ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో శని, ఆదివారాల్లో భారీఎత్తున బదిలీలకు అవకాశం ఉంటుందని అధికార వర్గాల్లో గుసగుసలు వినిపిస్తున్నాయి. దీనికి సంబంధించి శుక్రవారం కేసీఆర్ సీఎస్ ఎస్‌కే జోషి, ముఖ్య సలహాదారు రాజీవ్ శర్మతో సమాలోచనలు జరిపినట్టు తెలుస్తోంది.



## జీపీల అభివృద్ధే లక్ష్యం

### ఆర్థికశాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు

**సంగారెడ్డి , ప్రభ న్యూస్ :** గ్రామ పంచాయతీల అభివృద్దే లక్ష్యంగా కేసీఆర్ పని చేస్తున్నారని, సురక్షితమైన ప్రజల ఆరోగ్యం కోసం తలపెట్టిన 30 రోజుల కార్యక్రమం రాష్ట్రంలోనే జిల్లా ప్రథమ స్థానంలో ఉందని ఆర్థిక శాఖ మంత్రి హరీష్‌రావు అన్నారు. జీపీలకు ట్రాక్టర్లు, ట్రాలీలు, డోజర్లు, బ్లేడ్లు తదితర సామాగ్రిని అందజేయాలని సంకల్పంతో ముందుకు సాగుతున్నామన్నారు. శుక్రవారం సంగారెడ్డి పట్టణంలోని అంబేద్కర్ స్టేడియంలో గ్రామ పంచాయతీలకు ట్రాక్టర్లను, పనిముట్లను అందజేసే కార్యక్రమాన్ని కలెక్టర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. హరీష్‌రావు మాట్లాడుతూ.. సీఎం ముందుగా 30 రోజుల కారక్రమం అన్నప్పుడు అందరూ ఇది సాధ్యమేనా అనుకున్నారని, కానీ ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి గ్రామాలలో నెలకొన్న చెత్త చెదారాన్ని తీసివేయడమే కాకుండా చెట్లు నాటడం ఎటు చూసినా ఆహ్లాదకరమైన వాతావరణం కనిపించే విధంగా తయారు చేశారన్నారు. అందులో రాష్ట్రంలోనే జిల్లా ప్రథమ స్థానంలో ఉందన్నారు. గత ప్రభుత్వాలు గ్రామాలను పట్టించుకున్న పాపాన పోలేదన్నారు.

# కాంగ్రెస్‌లో మార్పు..?

### ఉప ఎన్నిక తీర్పుతో మారనున్న సమీకరణాలు

### హస్తినకు క్యూ కట్టనున్న సీనియర్లు

### టీపీసీసీ పదవిపై పలువురి కన్ను



**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** ఒక వైపు హుజూర్‌నగర్ ఉప ఎన్నికలో కాంగ్రెస్‌కు ప్రతికూల తీర్పు.. మరో వైపు వచ్చే నెల్లో మున్సిపల్ ఎన్నికలు. దీంతో కాంగ్రెస్ నేతల్లో అంతర్మథనం మొదలైంది. ఈ ఫలితం ప్రభావం ఎటు వైపు దారి తీస్తుందోనన్న చర్చ కాంగ్రెస్ నాయకుల్లో ప్రారంభమైంది. కాంగ్రెస్‌కి పట్టున్న నియోజకవర్గమే కాకుండా.. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సొంత ఇలాఖాలో పార్టీ ఓటమిని కాంగ్రెస్ శ్రేణులు జీర్ణించుకోలేకపోతున్నాయి. దీంతో రాష్ట్ర కాంగ్రెస్‌లో మార్పులు ఉంటాయా...? లేక మున్సిపల్ ఎన్నికల వరకు ఇలాగే కొనసాగిస్తారా..? అనే అంశంపై అంతర్గత చర్చకు దారి తీసింది.

### టీపీసీసీ మార్పుపై చర్చ

హుజూర్‌నగర్‌లో గెలుపోటములకు తానే బాధ్యత వహిస్తానని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి గతంలో ప్రకటించారు. కాంగ్రెస్ ఓడిపోవడంతో టీపీసీసీ మార్పుపై కాంగ్రెస్ నేతల్లో చర్చ జరుగుతోంది. ఇదే అదనుగా ఉత్తమ్ వ్యతిరేక వర్గీయులు అస్త్రాలకు పదునుపెట్టే అవకాశం ఉందంటున్నారు. టీపీసీసీ పదవిపై కన్నేసిన ఆశావహులు ఢిలీకి క్యూకట్టే అవకాశం ఉంది. టీపీసీసీ పదవిపై కాంగ్రెస్ ఎంపీలు రేవంత్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, మాజీ డిప్యూటీ సీఎం దామోదర రాజనరసింహ, శ్రీధర్‌బాబు, జీవన్‌రెడ్డి, ఏఐసీసీ కార్యదర్శులు సంపత్‌కుమార్, మధుయాష్కీగౌడ్, పీసీసీ మాజీ అధ్యక్షులు వీహెచ్, పొన్నాలతో పాటు పలువురు ప్రయత్నిస్తున్నారు.

### తలనొప్పిగా మారనున్న మున్సిపోల్స్

ఉప ఎన్నిక ఓటమి.. ఇటు మున్సిపల్ ఎన్నికల దగ్గరపడుతుండటం కాంగ్రెస్‌కు తలనొప్పిగా మారింది. ఇప్పటికే పంచాయతీ, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఘోర పరాజయం మూటగట్టుకుంది. ఒక్క జడ్పీ కూడా కైవసం చేసుకోలేదు. మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో పరిస్థితి ఎలా ఉంటుందనే దానిపై చర్చ జరుగుతోంది. ఎంతో కష్టపడి పని చేసినా హుజూర్‌నగర్‌లో ఎందుకు ఓడాం..? గతంలో చేసిన అభివృద్ధిని చెప్పి, ప్రభుత్వంపై ప్రజల్లో ఉన్న వ్యతిరేకతను క్యాచ్ చేసుకోవడంలో ఎందుకు వెనుకపడ్డామనే ఆలోచనలో ఉన్నారు.

### విభేదాలే కొంపముంచాయా..?

ఉప ఎన్నిక నోటిఫికేషన్‌కు ముందు ముఖ్య నేతల మధ్య నెలకొన్న విభేదాలే కొంప ముంచాయా..? అన్న చర్చ జరుగుతోంది. అభ్యర్థి ఎంపిక విషయంలో ఉత్తమ్ ఏకపక్షంగా ఎలా వ్యవహరిస్తారని, పార్టీలో చర్చించి నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని ఎంపీ రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. ఈ విషయంలో మిగతా సీనియర్లందరూ ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి బాసటగా నిలిచారు. ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఒక అడుగు ముందుకేసి మా జిల్లాలో పక్క జిల్లాకు చెందిన నేతల పెత్తనమేంటని రేవంత్‌రెడ్డినుద్దేశించి ఘాటుగానే స్పందించారు. దీంతో కాంగ్రెస్ నాయకుల్లో నెలకొన్న పంచాయితీని చూసి ఓటర్లు కూడా కాంగ్రెస్ ను విశ్వసించలేదనే వాదన బలంగా వినిపిస్తోంది.

### పత్తాలేని ఏఐసీసీ ఇన్‌చార్జీలు

టీఆర్ఎస్ తరఫున కేసీఆర్ వందలాది మంది నేతలను ఇన్‌చార్జీలుగా నియమించడమే కాకుండా ఎప్పటికప్పుడు దిశా నిర్దేశం చేశారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి కుంతియాతో పాటు ఏఐసీసీ కార్యదర్శులు ఉప ఎన్నికను పెద్దగా పట్టించుకోలేదని విమర్శలు వినిపిస్తున్నాయి.

## గ్రూప్-2 తుది ఫలితాలపై అభ్యంతరాలు

**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** టీఎస్‌పీఎస్సీ గురువారం ప్రకటించిన గ్రూప్-2 తుది ఫలితాలపై విమర్శలు వస్తున్నాయి. హైకోర్టు తుది తీర్పు వెలువరించకముందే టీఎస్‌పీఎస్సీ ఫలితాలను ఎలా ప్రకటిస్తారని అభ్యర్థులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. రాత పరీక్ష సమయంలో జరిగిన పొరపాట్లపై కమిషన్ నియమించిన టెక్నికల్ కమిటీ తన నివేదికను 21న జరిగిన విచారణ సందర్భంగా కోర్టుకు సమర్పించిందని అభ్యర్థులు చెబుతున్నారు. కొన్ని అంశాలపై న్యాయమూర్తి వివరణ కోరితే 10 రోజుల సమయం కావాలని టీఎస్‌పీఎస్సీ అభ్యర్థించారని చెబుతున్నారు. ఈ మరుసటి రోజే తుది ఫలితాలు ఎలా ప్రకటిస్తారని ప్రశ్నిస్తున్నారు. కోర్టు తుది తీర్పు వెలువరించలేదని, అయినా కమిషన్ నిర్లక్ష్యంగా వ్యవహరించిందని ఆరోపిస్తున్నారు.

ఔరా...!



# హుజూర్‌నగర్‌లో నేడు కృతజ్ఞతా సభ

● వరాల జల్లు కురిపించేందుకు సంసిద్ధమై వెళ్తున్న సీఎం కేసీఆర్



కేసీఆర్ సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రి జగదీష్, హుజూర్‌నగర్ తాజా ఎమ్మెల్యే సైదిరెడ్డి తదితరులు

(మొదటిపేజీ తరువాయి)

బహిరంగ సభ ఏర్పాటైన ప్రజలతో మమేకం కానున్నారు. అలాగే స్థానిక ప్రజా సమస్యలు, హామీల అమలుపై స్పష్టమైన ప్రకటన చేయనున్నారు. అదే సమయంలో హుజూర్‌నగర్ నియోజకవర్గానికి వరాల జల్లు కురిపించేందుకు కేసీఆర్ సంసిద్ధమై వెళుతున్నట్లు తెలుస్తోంది. ఆ ప్రాంతం నుంచి మంత్రివర్గంలో ప్రాతినిధ్యం వహిస్తున్న మంత్రి జగదీష్‌రెడ్డి నేతృత్వంలో ఇప్పటికే బహిరంగ సభ ఏర్పాట్లు పూర్తయ్యాయి. సీఎం కార్యాలయ వర్గాలు తెలిపిన సమాచారం మేరకు శనివారం మధ్యాహ్నం 12 గంటలకు సీఎం కేసీఆర్ ప్రత్యేక హెలికాప్టర్‌లో హైదరాబాద్ నుంచి బయలుదేరుతారు. మధ్యాహ్నం 2.30 గంటల వరకు హుజూర్‌నగర్ చేరుకుంటారు. 3 గంటలకు ఈ ఎన్నికలకు కృషిచేసిన నియోజకవర్గ ఇంచార్జిలు, పార్టీ నేతలు, ముఖ్యులతో సీఎం ప్రత్యేకంగా సమావేశమవుతారు. ఎన్నికల నేపథ్యంలో స్థానిక ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలు, వాటి అమలుపై చర్చిస్తారు. నియోజకవర్గ అభివృద్ధి అజెండాపై సాయంత్రం 4 గంటల వరకు స్థానిక జిల్లా అధికారులతోనూ సమావేశం కానున్నారు. అనంతరం బహిరంగ సభకు బయలుదేరుతారు. సాయంత్రం 5 గంటలకు వేదికపై ప్రజలను ఉద్దేశించి సీఎం కేసీఆర్ ప్రసంగించనున్నారు.

### స్థానిక నేతలతో కేసీఆర్ విజయోత్సాహం

భారీ మెజారిటీ సాధించి పార్టీ ప్రతిష్టను నిలబెట్టిన హుజూర్‌నగర్ నియోజకవర్గ నేతలు, ఇంఛార్జిలతో సీఎం కేసీఆర్ విజయోత్సాహాన్ని పంచుకోనున్నారు. ఈ ఉపఎన్నిక టీఆర్ఎస్, కాంగ్రెస్‌లు ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి.. హోరాహోరీగా తలపడ్డాయి.. కానీ చివరి రెండ్రోజుల్లో పరిస్థితులు మారడంతో వార్ వన్‌సైడ్ అయ్యింది.. కారు పరుగులతో గులాబీజెండా రెపరెపలాడింది. గతంలో ఎన్నడూలేనంతగా హుజూర్‌నగర్ చరిత్రలో 43వేల పైచిలుకు భారీ మెజారిటిని అందించారు. అయితే ఎన్నికల ప్రచార సభకు గులాబీ దళపతి, ముఖ్యమంత్రి కేసీఆర్ రావల్సి ఉన్నప్పటికి భారీ వర్షంతో రద్దయ్యింది. ఆతర్వాత టీఆర్ఎస్ పార్టీ కేడర్ అంతా కొంత నిరాశ చెందారు. కానీ ఉపఎన్నికల్లో విజయమే లక్ష్యంగా ప్రతి ఒక్కరు పనిచేయడంతో ఘన విజయం దక్కింది.

### కృతజ్ఞతా సభకు భారీ ఏర్పాట్లు

హుజూర్‌నగర్‌లో జరగనున్న సీఎం కేసీఆర్ కృతజ్ఞత సభకు అధికార యంత్రాంగంతో పాటు గులాబీ శ్రేణులు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. హుజూర్‌నగర్ నియోజకవర్గంలోని ఏడు మండలాల నుంచి టీఆర్ఎస్ పార్టీ నేతలు కార్యకర్తలు, అభిమానులను పెద్ద ఎత్తున తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. అన్ని ప్రాంతాల నుంచి భారీగా తరలించి సభను విజయవంతం చేయాలని నేతలకు పిలుపునిచ్చారు. ఇదిలా ఉంటే కృతజ్ఞత సభ జరిగే వేదిక, ఏర్పాట్లను రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి, శాసనమండలి విప్, హుజూర్‌నగర్ ఎన్నికల ఇన్‌చార్జీ డాక్టర్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, రాజ్యసభ సభ్యులు బడుగుల లింగయ్య యాదవ్, ఎమ్మెల్యేలు శానంపూడి సైదిరెడ్డి, గాదరి కిశోర్‌లు పరిశీలించారు. అంతే కాకుండా కలెక్టర్ అమయ్ కుమార్ అక్కడే ఉండి ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

### అధికార యంత్రాంగం ముందు జాగ్రత్త చర్యలు

ముఖ్యమంత్రి సభకు ఎటువంటి ఇబ్బందులు ఎదురుకాకుండా అధికార యంత్రాంగం ముందస్తు చర్యలు చేపడుతుంది. ఇదిలా ఉంటే సభ జరిగే ప్రాంగణంలో ట్రాఫిక్ ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉండడంతో పోలీసులు ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు చేపడుతున్నారు. టీఆర్ఎస్ పార్టీ నేతలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేసేందుకు కృషి చేస్తున్నారు. ఇవన్నీ ఇలా ఉంటే సీఎం కేసీఆర్ హుజూర్‌నగర్ సభా వేదికగా వరాల వర్షం కురిపిస్తారని ఆశిస్తున్నారు. 30ఏళ్ళ ఉత్తమ్ పాలనలో అభివృద్ధి జరగలేదని, మూడేళ్ళలోనే అభివృద్ధి చేసి చూపిస్తామని చెప్తుండడంతో సీఎం కూడా అందుకనుగుణంగా వరాలు ప్రకటిస్తారనే ఆశతో ఉన్నారు.

### నియోజకవర్గానికి ప్రత్యేక ప్రాధాన్యత

హుజూర్‌నగర్ నియోజకవర్గంలోని ప్రధానమైన సమస్యలతో పాటు ఎత్తిపోతల పథకాలు, సబ్‌స్టేషన్ల నిర్మాణం, డబల్‌బెడ్‌రూం ఇళ్ళ నిర్మాణం, హుజూర్‌నగర్, నేరేడుచర్ల మున్సిపాలిటీల అభివృద్ధి ప్రణాళికలను ముఖ్యమంత్రి ముందు ఉంచి హామీలు తీసుకునేవిధంగా జిల్లామంత్రితో పాటు ఎమ్మెల్యే సైదిరెడ్డి ప్రయత్నాలు చేయనున్నట్లు చెప్తున్నారు. ఏది ఏమైనా సీఎం కేసీఆర్ బహిరంగసభకు హుజూర్‌నగర్‌లో భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. అయితే ముఖ్యమంత్రి కేసీఆర్ హైదరాబాద్ నుంచి ప్రగతిభవన్ నుంచి రోడ్డుమార్గం గుండానే హుజూర్‌నగర్ చేరుకోనున్నారు. కృతజ్ఞతసభముగిసిన తర్వాత మళ్ళీ రోడ్డు మార్గం గుండానే వెళ్ళనున్నట్లు చెప్తున్నారు. అందుకనుగుణంగా అధికారులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు.

# ద్రవ్యలోటుకు కళ్లెం!



(మొదటిపేజీ తరువాయి)

విలువలో 2.9శాతం. గతేడాదితో పోలిస్తే ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ద్రవ్యలోటు 0.3శాతం తగ్గుతుందని ఈ అధ్యయనం తేల్చింది. ఇందుక్కారణం తెలంగాణ, రాజస్థాన్, జార్ఖండ్, తమిళనాడు రాష్ట్రాల్లో చేపట్టిన వ్యయ నియంత్రణగా పేర్కొంది. ఈ రాష్ట్రాల్లో స్థూల జాతీయోత్పత్తి విలువ పెరుగుతోంది. అదే వేగంతో వ్యయక్రమబద్ధీకరణకు ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటున్నాయి. మరోవైపు జమ్మూకాశ్మీర్, అసోం, ఒడిషా, చత్తీస్‌గఢ్ తదితర రాష్ట్రాల్లో ద్రవ్య లోటు శాతం ఏటేటా పెరుగుతోంది. ఇది ఆయా రాష్ట్రాల్లో సంక్షేమ పథకాల అమ లుపై తీవ్ర ప్రభావం చూపిస్తోంది. దీంతో పాటు రిజర్వ్‌బ్యాంక్ నుంచి రుణం పొం దగలిగే పరిమితులను తగ్గిస్తోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఆంధ్రప్రదేశ్ 3.3 శాతం స్థూల ద్రవ్యలోటును ఎదుర్కోనుంది. జమ్మూకాశ్మీర్ 6.5, కర్ణాటక 3.0, మధ్యప్రదేశ్ 3.5, ఒడిశా 3.5, పంజాబ్ 3.4, రాజస్థాన్ 3.2, ఉత్తర్‌ప్రదేశ్ 3.0శాతం ద్రవ్యలోటుకు గురికానున్నాయి. తెలంగాణ, తమిళనాడు 2.4, ఉత్తరాఖండ్ 2.6, మహారాష్ట్ర, జార్ఖండ్‌లు 2.0, గుజరాత్ 1.8శాతం ద్రవ్య లోటుకే పరిమిత మౌతున్నాయి.

ఎఫ్‌ఆర్‌బిఎమ్ చట్టం ప్రకారం రాష్ట్రాల ద్రవ్యలోటు ఆయా రాష్ట్రాలస్థూల ఉత్పత్తిలో 3శాతం కంటే తక్కువుండాలి. అప్పుడే ఆ రాష్ట్రాల ఆర్థికపరిస్థితి ప్రభుత్వాల అదుపులో ఉన్నట్లు కేంద్రం, రిజర్వ్‌బ్యాంక్‌లు భావిస్తాయి. అలాగే ఈ లోటు భర్తీకి నిధుల సమీకరణ చేసిన విధానాల్ని కూడా ఇవి పరిగణనలోకి తీసుకుం టాయి. భారతదేశాన్ని రాష్ట్రాల సమాఖ్యగా రాజ్యాంగం ప్రకటించింది. భారత రాజ్యాంగంలోని 12వ విభాగంలోని చాప్టర్-1లో రాష్ట్రాల ఆర్థిక హక్కులు, చట్టా ల్ని నిర్దేశించింది. అందుబాటులో ఉన్న వనరుల్ని ప్రజా ప్రయోజనం నిమిత్తం వ్యయం చేసేందుకు రాష్ట్రాలకు ఈ విభాగంలోని ఆర్టికల్ 282 ప్రకారం స్వయం ప్రతిపత్తి దఖలైంది. ఈ హక్కును ఒక్కో రాష్ట్రం ఒక్కో విధంగా వినియోగిస్తున్నాయి. అలాగే ప్రజాప్రయోజనాల కోసం వ్యయం చేసే అధికారాన్ని కూడా తమ రాజకీయ ప్రయోజనాల్ని దృష్టిలో పెట్టుకుని వినియోగించు కుంటున్నాయి. ఈ కారణంగా ఏటేటా దేశంలోని పలు రాష్ట్రాల స్థూల ద్రవ్యలోటు పెరుగుతోంది. దీన్ని దృష్టిలో పెట్టుకుని 2003లో కేంద్రం ద్రవ్య బాధ్యత, బడ్జెట్ నిర్వహణ చట్టాన్ని అమల్లోకి తెచ్చింది. ఇందు కను గుణంగా రాష్ట్రాల ఆదాయం, వ్యయాలు చేసే విధానాన్ని రాష్ట్ర పనితీరుకు నిదర్శనంగా లెక్కిస్తోంది.

మూలధనేతర వ్యయాన్ని నియంత్రించగలిగిన రాష్ట్రాలే స్థూల ద్రవ్య లోటును తగ్గించుకుంటు న్నాయి. ఈ మూల ధనేతర వ్యయం ఉత్పాదకతకు సంబంధించింది కాదు. ఇది భవిష్యత్‌కు అవసరమైన పెట్టుబడి కాదు. దీన్ని కొనసాగిస్తూ కలిగే ద్రవ్యలోటును తీర్చుకోవడానికి మార్కెట్ నుంచి దీర్ఘకాలిక రుణాలు పొందడం భవిష్యత్‌లో ఆర్థిక వ్యవస్థను దెబ్బతీస్తుంది. తెలంగాణతో పాటు తమిళనాడు, జార్ఖండ్, రాజస్థాన్ రాష్ట్రాలు స్థూల ద్రవ్యలోటు తగ్గింపు కోసం మూల ధనేతర వ్యయాన్ని నియంత్రించుకుంటున్న విధానాన్ని కేంద్ర ఆర్థిక శాఖ ప్రశంసించింది. ముఖ్యంగా మూలధనేతర వ్యయం తగ్గించే మార్గాల్ని ఈ రాష్ట్రాలు కనుగొనడం ద్వారా ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా మారాయని భారతీయ రిజర్వ్‌బ్యాంక్ తన నివేదికలో పేర్కొంది.

## మున్సిపాలిటీలన్నీ మనవే కావాలి...

# హుజోరెత్తాలి!



గడగడపకు సంక్షేమ కార్యక్రమాల గురించి చెప్పండి

క్షేత్రస్థాయిలో ఎమ్మెల్యేలు, ఎమ్మె ల్సీలు, ఇతర ముఖ్య నేతలు సమన్వయం చేసుకుని ఎన్నికల్లో ప్రచారాన్ని నిర్వహించాలని ప్రతి ఇంటి గడప తొక్కి గత ఐదేళ్ళలో తెరాస ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్ర మాలను వివరించడంతో పాటు జాతీయ స్థాయిలో సాధించిన ప్రగతిని వారికి విశదీకరించి ఎన్నికల్లో పార్టీ ఎంపిక చేసిన అభ్యర్థుల పక్షాన నిలవాలని తద్వారా పట్టణాలను అభివృద్ధి చేస్తామన్న భరోసాను వారిలో కల్పించాలని సూచించారు.

(మొదటిపేజీ తరువాయి)

ఎదుట విచారణకు వస్తోందని ఆ రోజునే తుదితీర్పు వెలువడుతుందని కేసీఆర్ చెప్పినట్టు సమాచారం. ఇప్పటికే రాష్ట్ర ఎన్నికల సంఘం పురపాలక సమరానికి సిద్ధంగా ఉన్నామన్న విషయాన్ని హైకోర్టుకు నివేదించిందని తీర్పు వెలువడిన వెంటనే ఎన్నికల నోటిఫికేషన్ కూడా జారీ అవు తుందని సీఎం తనను కలిసిన ప్రజా ప్రతినిధులకు సంకే తాలిచ్చినట్టు తెలుస్తోంది. పురపాలక, నగర పాలికలలో వార్డులు, డివిజన్లన్నింటినీ తెరాస అభ్యర్థులు కైవసం చేసుకో వాలని ఎన్నికల్లో అప్రమత్తంగా ఉండాలని అభ్యర్థుల ఎంపిక మొదలు నామినేషన్ల దాఖలు, వాటి పరిశీలన, ఎన్నికల సమయంలో స్థానికంగా ఉంటూ ఎప్పటికప్పుడు పార్టీ యంత్రాంగాన్ని సమాయత్తం చేస్తూ ఉండాలని ఆదేశించినట్టు సమాచారం.

### అభ్యర్థుల ఎంపిక బాధ్యత ఎమ్మెల్యేలు.. ఇన్‌చార్జీలదే

పురపాలక, నగర పాలిక ఎన్నికల్లో అభ్యర్థులను ఎంపిక చేసే బాధ్యత మంత్రులు, ఎమ్మెల్యేలు, ముఖ్య నేతలదని పోటీకి సిద్ధంగా ఉన్నవారి పేర్లను గుర్తించి ఆ జాబితాను పార్టీ రాష్ట్ర కార్యాలయం తెలంగాణ భవన్‌కు పంపాలని ఆ తర్వాత ఎవరిని ఎన్నికల బరిలో నిలబెట్టాలన్నది అధిష్టానం నిర్ణయిస్తుందని కేసీఆర్ చెప్పినట్టు సమాచారం. అభ్యర్థుల ఎంపికలో మార్గదర్శకాలను పాటించాలని తెలంగాణ ఉద్యమ సమయంలో పోరాడిన వారికి ఈ ఎన్నికల్లో అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని దీనికితోడు సమాజంలో మంచి పేరున్న వారిని ఎంపికచేసి భవిష్యత్తులో వారు పార్టీని బలోపేతం చేసే వారిగా తయారు చేయాలని చెప్పినట్టు సమాచారం. అభ్యర్థుల ఎంపికలో ఎటువంటి ఒత్తిళ్ళకు లోనుకావద్దని రాజకీయ ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని ఎంపిక జరగాలని కోరారు. సామాజిక సమీకరణాల ఆధారంగా అభ్యర్థులను పురపాలక ఎన్నికల్లో నిలబెడతామని అన్ని వర్గా లకు సమ ప్రాధాన్యం దక్కేలా చూస్తామని కేసీఆర్ హామీ ఇచ్చి నట్టు తెలుస్తోంది. మహిళలకు ఈ ఎన్నికల్లో పెద్దపీట వేయా లని ఎన్నికల సంఘం ఖరారు చేసిన రిజర్వేషన్ల ఆధారంగా ఆ సామాజిక వర్గాల్లో మంచి పేరున్న వారిని అభ్యర్థులుగా నిలబెట్టాలని సూచించారు. ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన వెంటనే ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఇతర ముఖ్య నేతలు స్థానికంగా పార్టీ విస్తృతస్థాయి సమావేశాన్ని ఏర్పాటుచేసి ఎన్నికల్లో పోటీకి సిద్ధంగా ఉన్నవారి వివరాలు సేకరించాలని కోరారు. ఒక్కో డివిజన్‌లో ఒకరికి మించి ఎక్కువ సంఖ్యలో పార్టీ నేతలు పురపాలక ఎన్నికల్లో పోటీకి ముందుకు వస్తారని ఆ సమయంలో వారి పూర్వాపరాలను పరిగణలోకి తీసుకుని ఎంపిక ప్రక్రియను చేపట్టాలని కోరినట్టు సమాచారం. పురపాలక, నగరపాలక ఎన్నికల్లోనూ గతంలో జీహెచ్ ఎం సీలో సాధించిన ఫలితాలే వస్తాయని ఇందులో ఎటు వంటి అనుమానం లేదని కేసీఆర్ స్పష్టంచేసినట్టు తెలుస్తోంది.

### ఒక్కో మునిసిపాలిటీకి ఎమ్మెల్యేతో పాటు మరో సీనియర్ నేతకు బాధ్యతలు

త్వరలో జరిగే నగర పాలక, పురపాలిక ఎన్నికల్లో విజయకేతనం ఎగురవేయాలన్న భావనతో ఉన్న కేసీఆర్ ఒక్కో మునిసిపాలిటీకి ఆ నియోజకవర్గ ఎమ్మె ల్యేతో పాటు మరో ఎమ్మెల్యే లేదా ఎమ్మెల్సీ, కార్పొ రేషన్ ఛైర్మన్‌కు ప్రచార బాధ్యత లను అప్పగించాలని నిర్ణయించినట్టు తెలుస్తోంది. ఒకటి, రెండు రోజుల్లో తెరాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ తెలంగాణ భవన్‌లో మునిసిపల్ ఎన్నికలపై ఉన్నతస్థాయి సమీక్షనిర్వహించాలని సంకల్పించారు. ఈ సమావేశానికి ఆయా జిల్లాల మంత్రులు, పార్టీ ముఖ్య నేతలు, కార్యవర్గ సభ్యులను ఆహ్వానించాలని ప్రతిపా దించారు. ఆ తర్వాత జిల్లాల వారీగా మంత్రులు, ఎమ్మెల్యే లను సమావేశపరచాలని భావిస్తున్నారు. పురపాలక, నగర పాలిక ఎన్నికల్లో పార్టీ వ్యూహాన్ని, అన్ని స్థానాల్లో విజయం దుందుభి మోగించేం దుకు ప్రణాళికలను రూపొందిం చను న్నారు. వార్డుల వారీగా అభ్యర్థులను ఎలా ఎంపిక చేయాలి, ఎంపికకు అవలంబిం చాల్సిన విధానాలు, మార్గదర్శకాలను సిద్ధంచేసి ఈ సమా వేశంలో ఎమ్మెల్యేలు, మంత్రులు ఇతర పార్టీ ముఖ్య నేతలకు ఇవ్వనున్నట్టు తెలుస్తోంది.

**అభ్యర్థుల ఎంపికలో పార్టీ నిబద్ధులకు ప్రాధాన్యతనివ్వండి**

గత ఏడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికలతో పాటు 2014లో జరిగిన సార్వత్రిక ఎన్నికలు వరుసగా జరిగిన గ్రామ పంచా యతీ, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్ని కల్లో పార్టీ అభ్యర్థుల విజయానికి కృషి చేసిన వారిని గుర్తించి వారిని ఎన్నికల్లో పోటీకి పెట్టాలని సూచిం చారు. హుజూర్ నగర్ ఉపఎన్నికలో ఏ తరహా వ్యూహాన్ని అమలు చేశామో అదే వ్యూహాన్ని పురపాలక ఎన్నికల్లోనూ కొనసాగించాలని ఎక్కడికక్కడ ప్రజా ప్రతినిధులు తిరుగుతూ ఓటర్లను కలవాలని సూచిం చారు. పురపాలక ఎన్నికలకు సమయం కేవలం 20 నుంచి 25 రోజులు మాత్రమే ఉంటుందని ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే సోమ లేదా మంగళవారాల్లో వచ్చే అవకాశం ఉన్నందున ఒక విడత నియో జక వర్గాల్లో పర్యటించి అందరినీ ఎన్నికలకు సమాయత్తం చేయాలని కేసీఆర్, కేటీఆర్ సూచిం చినట్టు తెలుస్తోంది. గ్రామ పంచాయతీ, జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో ఫలితాలు తెరాసకు ఏకపక్షంగా వచ్చాయని మున్సిపల్ ఎన్నికల్లోనూ ఇంతకు మిం చిన ఫలితాలు రా వాలని ఇందు కు ప్రతి ఒక్క రూ పని చేయా ల్సిన అవసరం ఉందని సీఎం చెప్పినట్టు సమాచారం.

ఖమ్మం, వరంగల్ నగర పాలక సంస్థలకు ఎన్నికలు లేకపోవడంతో ఆ నగరాలకు చెందిన ఎమ్మె ల్యేలు, ఇతర ముఖ్య నేతలను ఉమ్మడి జిల్లాల్లో జరిగే పురపాలక ఎన్ని కలకు బాధ్యులుగా ఎంపిక చేయాలని కేటీఆర్ నిర్ణయించినట్టు తెలుస్తోంది.



# మున్సి 'పోల్స్'కు సిద్ధం

● ఓటరు జాబితాలు రెడీ ● ఈ ఏడాది జనవరి 1నాటికి 18 సంవత్సరాలు నిండిన వారందరికీ ఓటు హక్కు ● రాష్ట్ర ఎన్నికల సంఘం వెల్లడి

**హైదరాబాద్, ఆంధ్రప్రభ :** మునిసిపల్ ఎన్నికలకు సంబంధించి ఓటరు జాబితాలు సిద్ధంగా ఉన్నాయని రాష్ట్ర ఎన్నికల సంఘం తెలిపింది. ఈ ఏడాది జనవరి 1న కేంద్ర ఎన్నికల సంఘం అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ప్రచురించిన జాబితాలనే ప్రస్తుతం మునిసిపల్ ఎన్నికలకు వర్తింపజేస్తున్నట్లు ప్రకటించింది. ఇందుకు సంబంధించి శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేసింది. ఈ ఏడాది జులై 16న అన్ని పుర పాలక సంఘాలు, కార్పొరేషన్లు ఓటరు జాబితాలను పబ్లిష్ చేశారని, వాటినే పరిగణలోకి తీసుకుంటు న్నామని పేర్కొన్నారు. వార్డుల వారీగా ఓటర్ల జాబితాలు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. ఆ జాబితాలను తెలంగాణ సీఈవో వెబ్‌సైట్‌లో ప్రజలందరికీ అందు బాటులో ఉంచామన్నారు. ఈ జాబితాల్లో ఏవైనా అభ్యంతరాలు ఉంటే సంబంధిత ఓటరు నమోదు అధికారికి ప్రొఫార్మా దరఖాస్తులో సమర్పించాలని, వాటిని సవరించేందుకు ఆదేశాలు ఇచ్చామని వెల్లడించారు. 2019, జనవరి 1 నాటికి 18 సంవత్సరాలు పూర్తి చేసుకున్న వారందరూ మునిసిపల్ ఎన్నికల్లో ఓటుహక్కు కలిగి ఉంటారని పేర్కొన్నారు. అర్హులు ఎవరికైనా ఓటుహక్కు లేకుంటే ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని రాష్ట్ర ఎన్నికల సంఘం సూచించింది.




# స్టే ఎత్తి వేయండి

● 77 మున్సిపాలిటీలపై ప్రభుత్వ అభ్యర్ధన

**హైదరాబాద్, ఆంధ్రప్రభ :** తెలంగాణలోని దాదాపు 77 మున్సిపాలిటీల ఎన్నికల నోటిఫికేషన్‌పై విధించిన స్టే ఉత్తర్వులను కొట్టివేయాలని హైకోర్టు సింగిల్ జడ్జి ని ప్రభుత్వం అభ్యర్థించింది. తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పి.నవీన్‌రావు ఈ వ్యాజ్యాలపై శుక్రవారం మరో సారి విచారణ చేపట్టారు. తదుపరి విచారణ 31కి వాయిదా వేశారు. ఈ సందర్భంగా తెలంగాణ అదనపు అడ్వకేట్ జనరల్ జె.రామచంద్రరావు వాదనలు వినిపిస్తూ...మున్సిపోల్స్ ముందస్తు ప్రక్రియలో జరిగిన అక్రమాలు, అవకతవకలను సవాలు చేస్తూ దాఖలైన రెండు ప్రజాహిత వ్యాజ్యాలను తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రాఘ వేంద్రసింగ్ చౌహాన్, జస్టిస్ ఏ అభిషేక్ రెడ్డి తో కూడిన డివిజన్ బెంచ్ కొట్టివేసిన నేపథ్యంలో 77 మున్సిపాలిటీ ల ఎన్నికలపై విధించిన స్టే ఉత్తర్వులను కొట్టివేయా లని అభ్యర్థించారు. దీన్ని పిటిషనర్ల తరపు తీవ్రంగా వ్యతిరేకించారు. తాము లేవ నెత్తిన అభ్యంతరాలను పూర్తిగా అమలు చేసే వరకు స్టే ఎత్తి వేయరాదని అభ్య ర్థించారు. ఈ వ్యాజ్యాలపై 31న వాదనలు వింటామని న్యాయమూర్తి ప్రకటించారు.

# ఉద్యోగ నియామకాలకు లైన్‌క్లియర్..!



● నూతన జోనల్‌కు అనుగుణంగా కేడర్ ● స్థానికత, ఖాళీలను సేకరిస్తున్న సర్కార్ ● ఉద్యోగ విభజనకు సన్నాహాలు

**హైదరాబాద్, ఆంధ్రప్రభ** : ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగ నియామకాలకు ఉన్న అడ్డంకులు తొలగడంతో శాఖల వారీగా ఖాళీల గుర్తింపునకు సర్కార్ చర్యలు తీసుకుంటోంది. కొత్త జోనల్ విధానం అందుబాటులోకి వచ్చిన తర్వాత ఉద్యోగాల భర్తీ దిశగా ప్రభుత్వం శాఖల వారీగా ఖాళీలు, ఉద్యోగుల విభజనకు నిర్ణయం తీసుకుంది. త్వరలో వీటిని తేల్చి ఉద్యోగ భర్తీకి నోటిఫికేషన్లు ఇచ్చే దిశగా కార్యాచరణ ముమ్మరం చేసింది. నూతన జోనల్ విధానంలో జిల్లా, జోనల్, మల్టీ జోనల్ కేడర్‌లలో నియామకాలు జరగనున్నాయి. ఇందుకనుగుణంగా ప్రస్తుత ఉద్యోగుల కేడర్‌ను నూతన జోన్ల ప్రకారం విభజిం చాల్సిందిగా ప్రభుత్వం ఆదేశించనుంది. కొత్త జిల్లాల వారీగా స్థానికత, జోనల్, మల్టీ జోనల్ స్థాయిల పరిధిలను నిర్ధారించేలా సర్కార్ కృషి చేయనుంది. ఉద్యోగ భర్తీకి స్థానికత ప్రామాణికం కోసం ప్రభుత్వం ఇప్పటికే ప్రతిపాదనలు సిద్ధం చేసింది. ఇప్పటివరకు పూర్వపు ఉమ్మడి జిల్లాల్లోనే విద్యార్హతల ఆధారంగా వారిని అక్కడి స్థానికులుగానే గుర్తించారు.

**రాష్ట్రంలో 1,08,214 ఖాళీలు**

కమల్‌నాథన్ కమిటీ తీవ్ర జాప్యం అనంతరం సర్కార్ స్వయంగా అన్ని శాఖల్లో ఉద్యోగ ఖాళీల గుర్తింపునకు ప్రయత్నించింది. రాష్ట్రంలో మొత్తం ఉద్యోగాల సంఖ్య 4,41,995 మంది కాగా ఇప్పుడు 3,33,781గా ఉందని తేల్చారు. మొత్తంగా 1,08,214 ఖాళీలను గుర్తించింది. వీటిని భర్తీ చేస్తే ప్రభుత్వంపై రూ.3వేల కోట్ల అదనపు ఆర్థిక భారం పడనుంది. వీటికి అదనంగా ఒప్పంద, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల రూపంలో 2.2 లక్షల మంది సేవలందిస్తున్నారు..

రాష్ట్ర విభజన అనంతరం కొత్త జిల్లాల ఏర్పాటు, ఉద్యోగుల పంపిణీ, ఇతర సమస్యలతో ప్రభుత్వ శాఖల్లో సిబ్బంది అవసరం భారీగా నెలకొన్నది. ఈ మేరకే లక్ష ఉద్యోగాల కల్పనకు కేసీఆర్ హామీ ఇచ్చారు. ఆ తర్వాత శాఖల వారీగా ఖాళీలను గుర్తించగా 33 ప్రభుత్వ శాఖల్లో 1.07 లక్షల ఖాళీలున్నాయని తేల్చా రు. పదోన్నతులు, కొత్త జిల్లాల్లో ఆర్డర్ టూ సర్వ్, తా త్కాలిక కేటాయింపులు, 371 డీ రద్దు, నూతన జోనల్ వ్యవస్థ ఏర్పాటుకు ఏర్పడిన ఆటంకాలతో నియామకాలపై కొంత జాప్యం ఏర్పడింది.

### కేంద్రం నుంచి అనుమతే తరువాయి!

కేంద్ర నుంచి అనుమతి రాగానే సర్వీస్ రూల్స్ మారనున్న నేపథ్యంలో అందుక నుగుణంగా ప్రభు త్వం సిద్ధమవుతున్నది. శాఖల వారీగా జిల్లా, జోనల్, మల్టీ జోనల్ పోస్టుల విభజన లెక్కలు రెడీ చేస్తున్నారు. వర్గీకరించిన వీటి ఆధారంగా సర్వీస్ నిబంధనలకు మార్పులు చేస్తున్నారు. కొత్త విధానం అమలుతో స్థానికులకు ఉద్యోగ వాటాలో భారీ లబ్ధితోపాటు పదోన్నతులతో భారీ ప్రయోజనం పొందనున్నారు. నియామకాలన్నీ మల్టీ జోనల్‌కే పరిమితం చేయడంతో ప్రమోషన్లకు కీలక స్థానం దక్కనున్నది. గ్రూప్-1 పోస్టుల భర్తీ కూడా మల్టీజోనల్‌లోనే జరగ నున్నాయి. స్థానికత కీలకం కావడంతో 61 రకాల పోస్టుల్లో 95 శాతం స్థానికులనేని ప్రభుత్వం భావిస్తున్నది. 34 రకాల పోస్టులు మల్టీ జోనల్ పరిధిలోకి తేవడంద్వారా రాష్ట్రస్థాయి కీలక పోస్టులన్నీ పదోన్న తులద్వారానే భర్తీ అవుతాయి.

# ఏపీ టీడీపీకి మరో షాక్..!

● వైకాపాలోకి ఎమ్మెల్యే వల్లభనేని వంశీ..?
● రాజీనామాకు రెడీ ● సీఎం జగన్ గ్రీన్ సిగ్నల్



**అమరావతి, ఆంధ్రప్రభ:** సార్వత్రిక ఎన్నికల్లో ఘోర పరాజయం చవి చూసిన టీడీపీకి రోజుకో షాక్ తగులుతోంది. ఇప్పటి వరకు పలువురు కీలక నేతలు, రాజ్యసభ సభ్యులు తెదేపాను వీడారు. కొందరు బీజేపీ గూటికి చేరగా మరికొందరు అధికార వైకాపా తీర్థం పుచ్చుకున్నారు. ఈ నేపథ్యంలోనే ఎవ్వరూ ఊహించని విధంగా తెదేపాకు ఆది నుంచి అత్యంత విధేయుడిగా ఉన్న కీలక నేత, గన్నవరం ఎమ్మెల్యే వల్లభనేని వంశీ మోహన్ ఆ పార్టీని వీడాలని నిర్ణయించుకున్నట్లు సమాచారం. దాదాపు ఆయన తెదేపాకు గుడ్‌బై చెప్పడం ఖాయంగా కనిపిస్తోంది. రెండు రోజుల క్రితం టీడీపీ అధినేత చంద్రబాబునాయుడును కలిసి తాను ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఆయన దృష్టికి తీసుకురావడంతో పాటు పార్టీని వీడనున్న సమాచారాన్ని కూడా తెలియజేసినట్లుగా తెలుస్తోంది. వంశీ ఏ పార్టీ వైపు వెళతారో శుక్రవారం సాయంత్రం వరకు స్పష్టత లేదు. అయితే అదే రోజు ఉదయం ఆయన తెదేపాను వీడి ఇటీవల బీజేపీలో చేరిన కేంద్ర మాజీ మంత్రి, ఎంపీ సుజనా చౌదరితో గుంటూరులో భేటీ అవ్వడం రాజకీయ వర్గాల్లో చర్చకు దారితీసింది. అయితే ఈ సమావేశం అనంతరం వంశీ కేవలం సుజనా చౌదరితో ఉన్న బంధుత్వంతోనే ఆయనను కలిసినట్లుగా చెప్పుకొచ్చారు. ఆయనతో పాటే ప్రకాశం జిల్లా పర్యటనకు వెళ్లిన వంశీ తిరిగి ఆకస్మాతుగా అమరావతికి చేరుకున్నారు. అధికార వైకాపా మంత్రులు, వంశీకి అత్యంత సన్నిహితులైన కొడాలి నాని, పేర్ని నానిలతో కలిసి తాడేపల్లిలో ముఖ్యమంత్రి జగన్‌తో భేటీ అయ్యారు. సుమారు అరగంటపాటు సాగిన ఈ సమావేశంలో వంశీ స్థానికంగా తాను ఎదుర్కొంటున్న ఇబ్బందులు, పోలీసు కేసులను ముఖ్యమంత్రి జగన్ దృష్టికి తీసుకువచ్చారు. తాను ఇకపై తెదేపాలో కొనసాగలేనని, వైకాపాలో చేరేందుకు సిద్ధంగా ఉన్నట్లు స్పష్టం చేసినట్లు తెలిసింది. ముఖ్యమంత్రిగా జగన్ అధికార పగ్గాలు చేపట్టిన నాడే పార్టీలోకి ఎవరు వచ్చినా స్వాగతిస్తానని అయితే పదవులకు రాజీనామా చేస్తేనే ఎంట్రీ ఉంటుందని స్పష్టం చేశారు.

తెలంగాణ ప్రభుత్వము
పంచాయతీరాజ్ శాఖ
చిట్ టెండరు ప్రకటన
నెం.హెచ్‌డి/టెండర్స్/05/2019-20 తేది :22.10.2019
మిర్యాలగూడ పంచాయతీరాజ్ డివిజన్ వారుMPLADS నిధుల నుండి మిర్యాలగూడ టౌన్, నాగార్జున నగర్‌లోని గోకుల్ సంక్షేమ భవన్‌లో రీడింగ్ రూం నిర్మాణం కొరకు రిజిష్టరు అయిన కాంట్రాక్టర్ల నుండి సీలు వేసిన టెండర్లను ఆహ్వానిస్తున్నారు. **అంచనా విలువ: రూ.10.00 లక్షలు.** టెండరు షెడ్యూలు కోరుటకు చివరి తేది:**29-10-2019.** టెండరు షెడ్యూలు జారీ చేయుటకు చివరి తేది:**30-10-2019.** టెండరు స్వీకరించు టకు చివరి తేది:**31-10-2019 మ.3.00గం.లకు.** టెండరు తెరుచు తేది:**31-10-2019 మ.3.30గం.లకు.** కార్యాలయ ఫోన్: 08689-242717
సం/- కార్యనిర్వాహక ఇంజనీరు, పం.రా. మిర్యాలగూడ
Ro No.1475/CL/Advt/1/2019-20, Dt. 25.10.2019

తెలంగాణ ప్రభుత్వము
రహదారులు మరియు భవనముల శాఖ
ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్రకటన
నెం.12/టి7/డిఇఇ/డిఎస్ఇ/ఎస్ఇడబ్ల్యు/2019-20 తేది: 22-10-2019
ఎన్ఐటి నెం.24,25/టి7/టి2& టి5/డిఇఇ/డిఎస్ఇ/ఎస్ఇడబ్ల్యు/2019-20 తేది : 22-10-2019
1.వరంగల్ అర్బన్ జిల్లాలో పెదపెండ్యాల (వడ్డెరకాలనీ) గ్రామంలో 2బిహెచ్‌కె (40నెం.లు) ఇల్లు నిర్మించుట. అంచనా విలువ: **రూ.201.60 లక్షలు.** 2. మహబూబాబాద్ జిల్లాలో కొత్తగూడ పై కి.మీ. 8/0-10/0 నుండి సదిరెడ్డిపల్లి రోడ్డు వరకు పేవర్ ప్యాచ్‌లు ఏర్పాటు చేయుట కొరకు ఇఆర్- అంచనా విలువ: **రూ.37.00 లక్షలు.** టెండరు షెడ్యూళ్ళ డౌన్‌లోడింగ్: **30-10-2019న సా॥4.00గం.ల నుండి.** టెండర్లు స్వీకరించుటకు చివరి తేది: **07-11-2019న మ॥ 3.30గం.లకు.** తదుపరి వివరాలను ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ అనగా www.eprocurement.gov.in. వద్ద చూడవచ్చును.
సం/- సూపరింటెండింగ్ ఇంజనీర్ (ఆర్ & బి), రీజినల్ కార్యాలయం, వరంగల్
Ro No.1470/CL/Advt/1/2019-20, Dt. 25.10.2019

ANDHRA PRADESH MEDICAL SERVICES & INFRASTRUCTURE DEVELOPMENT CORPORATION
2nd Floor, Plot No.9, Survey No.49, IT Park, Mangalagiri - 522 503, Ph.No.8978680708, email: aphmhidc@gmail.com
Tender Notice No.7/APMSIDC/Equipment/2019-20, Dated:25.10.2019
APMSIDC invites tenders through e-procurement platform for
1. EoI - APMSIDC is planning to establish CT and MRI scanning facilities at Government hospitals in Andhra Pradesh. Interested participants may attend the meeting. Date and Time of meeting: **7th November 2019 @ 11:00 a.m.** Venue of the meeting: APMSIDC, Mangalagiri, Andhra Pradesh.
2. RFP- APMSIDC invites tenders to upgrade the e-Aushadhi platform of the state.
3. RFP for Supply of fully Equipped Ambulances for providing Emergency Response Services (108) across Andhra Pradesh. (2nd Call)
4. RFP for Supply of fully Equipped Mobile Medical Units for providing Healthcare Services (104) across Andhra Pradesh. (2nd Call)
For detailed notification and further details please visit the web site http://msidc.ap.nic.in & www.tender.apeprocurement.gov.in.
APMSIDC will reserve the right to cancel the EoI and/or RFP at any time without assigning any reasons.
for Managing Director

సత్యం బ్రూయాత్, ప్రియం బ్రూయాత్
నబ్రూయాత్ సత్యమప్రియం, ప్రియంచ నానృతం బ్రూయాత్

ఆంధ్రప్రభ

శనివారం 26 అక్టోబర్ 2019

## టాప్‌టెన్‌లో భారత్

ప్రధానమంత్రి నరేంద్రమోడీ తీసుకుంటున్న చర్యల ఫలితంగా సుల భతర వాణిజ్యంలో మన దేశం మూడేళ్ళలో 130వ స్థానం నుంచి 63 స్థానా నికి ఎగబాకింది. విదేశీ పెట్టుబడులను ఆకర్షించేందుకు మోడీ ప్రభుత్వం తీసుకున్న చర్యలు సత్ఫలితాలను ఇవ్వడంవల్లనే ఇది సాధ్యమైందని ప్రపంచ బ్యాంకు వార్షిక నివేదికలో పేర్కొంది. అంత ర్జాతీయంగా వివిధ దేశాలతో ద్వైపాక్షిక సంబంధాలను పెంపొం దించడంతో పాటు వాణిజ్య బంధాన్ని బలపర్చుకునేందుకు మోడీ ఆయా దేశాలతో జరుపుతున్న చర్చలు, చేసుకుంటున్న ఒప్పందాలు సత్ఫలితాలనిస్తున్నాయి. వ్యాపార నిర్వహణలో సమర్ధవంతంగా పనిచేస్తున్న మొదటి పది దేశాల్లో భారత్ వరుసగా మూడోసారి స్థానం సంపాదించుకోవడాన్ని ప్రపంచ బ్యాంకు ప్రశంసించడం మనకు గర్వకారణం. 2017లో 130 వ స్థానంలో ఉన్న భారత్ గత ఏడాది 23 స్థానాలు ఎగబాకి 77వ స్థానానికి చేరుకుంది. ఈ ఏడా ది 14 స్థానాలు ఎగబాకి 63వ స్థానానికి చేరుకుంది. అంతర్జాతీయ స్థాయిలో 2008 నాటి ఆర్థిక మాంద్యంవంటి పరిస్థితులను నెలకొన్న ప్రస్తుత పరిస్థితులలో వాణిజ్య సంబంధాల విషయంలో మోడీ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ ఇటీవల మన దేశాన్ని సందర్శించినప్పుడు ఆయనతో జరిపిన చర్చల్లో ప్రధానాంశం వాణిజ్యమే. అలాగే, ఐక్య రాజ్యసమితి సర్వప్రతినిధి సమావేశాలకు హాజరైనప్పుడు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో జరిపిన చర్చల్లోనూ ఆయన వాణిజ్య సంబంధాల గురించే ప్రధానంగా చర్చించారు. మోడీ అధికారంలోకి రాగానే ప్రకటించిన ముఖ్యమైన కార్యక్రమాల్లో మేక్ ఇన్ ఇండియా అత్యంత ప్రధానమైంది. ఈ కార్యక్రమం విజయవంతం కోసం రక్షణ రంగంతో సహా పలు రంగాల్లో ప్రభుత్వ వాటాలను తగ్గించి ప్రైవేటుకు ప్రోత్సాహాన్ని ఇచ్చారు. పన్నుల విధానాన్ని సరళతరం చేశారు. గతంలో వ్యాణిజ్య, పారిశ్రామిక వేత్తలు పన్నుల సుడిగుండాల్లో చిక్కుకుని విలవిలలాడేవారు. చిన్న వ్యాపారుల సంగతి సరేసరి. పన్నుకట్టే వారిని గౌరవించాలన్న సంస్కృతిని ప్రవేశపెట్టింది మోడీ ప్రభుత్వమే. ఈ విషయాన్ని ఆయన ప్రతి సందర్భంలోనూ స్పష్టం చేస్తున్నారు. ఒకే దేశం - ఒకే పన్ను విధానాన్ని (వస్తు, సేవల పన్ను -జిఎస్‌టీ)ని తీసుకుని రావడం పన్నుల సంస్కరణల్లో అతిపెద్ద ముందడుగుగా పలువురు ఆర్థిక శాస్త్రజ్ఞులు ప్రశంసించారు. జిఎస్‌టీపై ప్రతిపక్షాలు పనిగట్టుకుని వ్యతిరేక ప్రచారం చేస్తున్నాయనీ, లోపాలను ఎత్తి చూపిస్తే సరిచేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ తాజాగా వ్యాఖ్యానించారు. చిన్న లోపాలు ఉన్నంత మాత్రాన మొత్తం జిఎస్‌టీ విధానాన్నే తప్పు పట్టడం రాజకీయ దురుద్దేశ్యమే అవుతుంది. నిజానికి జిఎస్‌టీ గురించి పూర్వపు యూపీఏ ప్రభుత్వం కూడా ఎంతో కసరత్తుచేసింది. భాగస్వామ్య పక్షాల మధ్య ఏకాభిప్రాయం లేకపోవడం వల్ల చట్టాన్ని తేలేకపోయింది. మోడీ ప్రభుత్వం ఈ బిల్లును తెచ్చినప్పుడు కాంగ్రెస్, తదితర పార్టీలు తీవ్రంగా వ్యతిరేకించినప్పటికీ ఆయా పార్టీలకు నచ్చజెప్పేందుకు పూర్వపు ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీ ఎంతో శ్రమించారు. కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియాగాంధీ వద్దకు ఆనాటి కేంద్ర మంత్రి, ప్రస్తుత ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు వెళ్ళి కాంగ్రెస్‌కు ఉన్న అనుమానాలు తీర్చారు. జిఎస్‌టి మండలి సమావేశాలను దాదాపు ప్రతి మాసం నిర్వహిస్తూ ప్రతిపక్షాలు అధికారంలో ఉన్న రాష్ట్రాల ముఖ్య మంత్రులతో సహా అన్నిరాష్ట్రాల ముఖ్యమంత్రుల అభిప్రాయాలను తీసుకున్నారు. నిర్మలా సీతారామన్ ఆ సంప్రదాయాన్ని ఇప్పటికీ పాటిస్తూ, ప్రతిపక్షాల సూచనలను పరిగణనలోకి తీసుకుంటున్నారు.

ఆర్థికమాంద్యం ప్రభావం మన దేశం మీద పడకుండా చూసేందుకు కేంద్రం తీవ్ర స్థాయిలో కసరత్తు చేస్తోంది. కార్పొరేట్ పన్నును తగ్గించింది. కంపెనీలు, కార్పొరేట్ సంస్థల యాజమాన్యాలతో తరచు సమావేశాలను నిర్వహిస్తూ ఉత్పత్తికి దోహదం చేసే కార్యక్రమాలకు చేయూత నిస్తోంది. ఎగుమతులను ప్రోత్సహిస్తోంది. సరిహద్దు వాణిజ్యం విషయంలో కూడా మోడీ ప్రభుత్వం గతంలో కన్నా ఎంతో చొరవనూ, సాహసాన్ని ప్రదర్శించింది. పొరుగు దేశమైన పాకిస్తాన్ కలసి రాకపోయినా, చైనా, బంగ్లాదేశ్, మాల్దీవులు, శ్రీలంక వంటి దేశాలతో ఒప్పందాలను కుదుర్చుకుంటూ వాణిజ్య విస్తరణకు చర్యలు తీసుకుంటోంది. మహాబలిపురంలో చైనా అధ్యక్షునితో అనధికార సమావేశాన్ని జరిపినప్పుడు మోడీ వాణిజ్య సంబంధాలు ఇచ్చిపుచ్చుకునే ధోరణిలో ఉండాలని ఖరాకండిగా స్పష్టం చేశారు. అలాగే, అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌తో చర్చల సందర్భంగా కూడా ఆయన ఈ విషయాన్ని నిష్కర్షగా చెప్పారు. ప్రైవేటు సంస్థలకు ఎక్కువ భాగస్వామ్యం కల్పిం చేందుకే 17 సంవత్సరాలుగా అమలులో ఉన్న చమురు రిటైల్ రంగంలోకి ప్రైవేటు సంస్థలను ఆహ్వానించాలని నిర్ణయించింది. 250 కోట్ల రూపాయల టర్నోవర్ కలిగిన ఈ రంగంలోకి ప్రైవేటు రంగాన్ని ఆహ్వానించడం అంటే విప్లవాత్మకమైన చర్య. అమెరికాతో మూడేళ్ళ క్రితం కుదిరిన వ్యూహాత్మక భాగస్వామ్య ఒప్పందం ఆధారంగా అమెరికాతో ఇంధన వాణిజ్యాన్ని మరింత పెంచేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఇటీవల ట్రంప్‌తో జరిపిన చర్చల్లో మోడీ ఇరుదేశాల మధ్య ఇంధన వాణిజ్యం ఈ ఏడాది 42 శాతం పెరిగేందుకు చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు ఇటీవల ఆఫ్రికా దేశాల్లో జరిపిన పర్యటన సందర్భంగా కూడా పలువాణిజ్య ఒప్పందాలను కుదుర్చు కున్నారు.

వాణిజ్య రంగం విస్తరణతోనే భారత్ భవిష్యత్ ఆధారపడి ఉందని మోడీ ప్రభుత్వం గట్టిగా విశ్వసిస్తోంది. అలాగే, రక్షణ రంగానికి చెందిన విడి భాగాలు, యంత్రాల తయారీకి ఎఫ్‌డిఐలను ఆహ్వానించాలని నిర్ణయించింది. ఈజ్ డూయింగ్ బిజినెస్‌లో మన స్థానం పెరగడానికి మోడీ ప్రభుత్వం తీసుకుంటున్న ఇటువంటి చర్యలే ప్రధాన కారణం. 30 శాతం పన్ను చెల్లిస్తున్న వారికి ఊరట కలిగించేందుకూ, పన్ను తగ్గించి వినియోగాన్ని పెంచేందుకు చర్యలు తీసుకోవాలని నిర్ణయించింది. ఐదేళ్ళలో ఐదు లక్షల కోట్ల డాలర్ల ఆర్థిక వ్యవస్థ సాధన లక్ష్యంగా ఎన్నో కార్యక్రమాలను చేపట్టింది. ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ వంటి పథకాలను రైతులను ప్రోత్సహించేందుకు ప్రవేశపెట్టింది. ఈజ్ డూయింగ్ బిజినెస్‌లో మోడీ అధికారాన్ని చేపట్టే నాటికి 190 దేశాల్లో భారత్ స్థానం 142వ స్థానంలో ఉంది. భారత్ స్థానం 50కి లోపు ఉండేలా ప్రభుత్వం కృషిచేస్తోందని నిర్మలా సీతారామన్ చెప్పారు. వాణిజ్యవేత్తలు, కార్పొరేట్ రంగానికి చెందిన దిగ్గజాలతో ఆమె తరచూ సమావేశాలను నిర్వహిస్తూ వాణిజ్య విస్తరణకు ఇంకా ఏయే చర్యలు తీసుకోవాలో సూచనలు చేయాలని కోరుతున్నారు.

జిఎస్‌టి వసూళ్ళలో అలసత్వం ఏమీలేదనీ, కొన్ని ప్రాంతాల్లో ప్రకృతి వైపరీత్యాల కారణంగానే వసూళ్ళు తగ్గాయని ఆమె వివరణ ఇచ్చారు. గతంలో వాణిజ్య శాఖ మంత్రిగా పనిచేసిన అనుభవం ఉండటం వల్ల ఆమె ఆర్థిక మంత్రిగా వాణిజ్య విస్తరణ కార్యకలపాలకు అడ్డంకులను తొలగించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. బ్యాంకుల విషయంలో కూడా ఆమె వైఖరి చాలా స్పష్టంగా ఉంది. బ్యాంకుల విలీనం ప్రతిపాదనపై ఆమె ఇచ్చిన వివరణ తార్కికంగానే ఉంది.

నిరర్ధక ఆస్తుల విషయంలో ఎగవేతదారుల నుంచి వీలైనంత ఎక్కువగా బకాయిలు రాబట్టేందుకే కృషి చేస్తున్నారు. అలాగే, బ్యాంకింగ్ రంగం గ్రామాలకూ, మారుమూల ప్రాంతాలకు విస్తరింపజేయడానికి వీలుగానే విలీనం ప్రక్రియను చేపట్టినట్టు ఆమె స్పష్టం చేశారు. చిన్న, మధ్యతరగతి వర్గాలకు (ఎంఎస్ఎంఈ) రంగానికి రుణాలను పెంచేందుకు తగిన ఆదేశాలు జారీ చేశారు.

# బీజేపీ ఓట్లు తగ్గాయ్..!



లోక్‌సభ ఎన్నికల్లో బంపర్ మెజారిటీతో అధికారాన్ని చేజిక్కించుకున్న బీజేపీ నేతృత్వంలోని ఎన్‌డీఏ కూటమి ప్రభ కాస్తంత తగ్గినట్టు కనిపిస్తోంది. లోక్‌సభ ఎన్ని కలతో పోల్చితే హర్యానా, మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్‌డీఏ ఓటు శాతం తగ్గింది. ప్రధానంగా హర్యానాలో బీజేపీ ఓటు శాతం భారీగా క్షీణించింది. ఏప్రిల్-మే నెలల్లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో 58 శాతం ఓటు షేరుతో పదికి పది సీట్లను గెలుచుకున్న బీజేపీకి అసెంబ్లీ ఎన్నికల్లో 22 శాతం తగ్గి 36.49 శాతం ఓట్లతో సరిపె ట్టుకుంది. అయితే 2014 అసెంబ్లీ ఎన్నికలతో పోల్చితే మూడు శాతం ఓట్లను అదనంగా సంపాదించగలిగింది. అయితే ఓటు శాతం తగ్గినప్పటికీ హర్యానాలో విజయం సాధించినట్టేనని బీజేపీ అధిష్ఠానం భావిస్తోంది. ఫలితాల అనంతరం ఢిల్లీలోని బీజేపీ కేంద్ర కార్యాలయంలో మాట్లాడిన ప్రధాని మోడీ ఫలితాలపై సంతోషం వ్యక్తం చేశారు. 2014తో పోల్చితే మూడు శాతం ఓట్లు పెరగడం కార్యకర్తలకు మనోధైర్యాన్ని నింపిందని ఆయన అన్నారు. మరోవైపు మహారాష్ట్రలో 2019 సార్వత్రిక ఎన్నికలతో పోల్చితే అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఓట్ల శాతం భారీగా తగ్గింది. 2014 అసెంబ్లీ ఎన్నికల్లో 47 లక్షల ఓట్లతో 122 స్థానాలను బీజేపీ గెలుచుకోగా ఈసారి 41 లక్షల ఓట్లతో 105 స్థానాలకు పరిమితమైంది. 2014లో బీజేపీ, శివసేన వేర్వేరుగా పోటీ చేయగా ఈసారి కూటమిగా బరిలోకి దిగాయి. అయితే ఈ ఫలితాలపై బీజేపీ సానుకూలంగా స్పందించింది. ఈసారి ఎన్నికల్లో స్ట్రైక్ రేటు ఎక్కువగా ఉంది. పోయినసారికంటే ఈసారి తక్కువ స్థానాల్లో పోటీ చేశామని బీజేపీ నేతలు వ్యాఖ్యానించారు.

**జార్ఖండ్‌లోనూ ఇంతేనా?:** డిసెంబర్‌లో జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో మహారాష్ట్ర, హర్యానా ఫలితాలు బీజేపీని కలవరపెట్టడం ఖాయమని రాజకీయ పండితులు విశ్లేషిస్తున్నారు. మహారాష్ట్ర, హర్యానాల్లో పరిస్థితులు దాదాపుగా జార్ఖండ్‌లోనూ ఉండడమే ఈ అంచనాలకు కారణమంటున్నారు. మహారాష్ట్ర, హర్యానాల్లో మాదిరిగా జార్ఖండ్‌లో ప్రస్తుతం బీజేపీ ప్రభుత్వమే కొనసాగుతోంది. 2014లో బీజేపీ అధిష్ఠానం సామాజిక సమీకరణాలను మార్చింది. మహారాష్ట్ర, హర్యానా, జార్ఖండ్ మూడు రాష్ట్రాల్లోనూ సాంప్రదాయానికి విరుద్ధంగా రాజకీయ ఆధిపత్యం ఉన్నవారికి కాకుండా ఇతర సామాజిక వర్గానికి చెందిన వ్యక్తులకు సీఎం పీఠాన్ని అప్పగించింది బీజేపీ అధిష్ఠానం. బ్రాహ్మణ సామాజిక వర్గానికి చెందిన దేవేంద్ర ఫడ్నవీస్ మహారాష్ట్ర ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేశారు. మరాఠాల ప్రాబల్యం మహారాష్ట్రలో సామాజికవర్గాల సమీకరణానికి బీజేపీ ప్రాధాన్యత ఇచ్చింది. అదేవిధంగా పంజాబీ అయిన మనోహర్‌లాల్ ఖట్టర్‌కు హర్యానా సీఎం పీఠాన్ని అప్పగించింది. హర్యానా రాజకీయాలను శాసించే జాట్లను కాదని ఆయనకు ముఖ్యమంత్రి బాధ్యతలను బీజేపీ అధిష్ఠానం కట్టబెట్టింది.

**జార్ఖండ్‌లో ట్రైబల్స్‌దే ఆధిపత్యం:** 2000 సంవత్సరంలో బీహార్ నుంచి ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడిన తర్వాత జార్ఖండ్ రాజకీయాల్లో గిరిజనుల ఆధిపత్యాన్ని కొనసాగిస్తున్నారు. 2000 తర్వాత మొత్తం ఐదుగురు ముఖ్యమంత్రులు బాధ్యతలు చేపట్టారు. బాబూలాల్ మరండీ, అర్జున్ ముండా, శిబూ సోరెన్, మధు కొడా, హేమంత్ సోరెన్ అందరూ ఎస్టీ సామాజిక వర్గాలకు చెందినవారు. అయితే 2014లో అధికారంలోకి వచ్చిన బీజేపీ తొలిసారిగా గిరిజనేతర సామాజికవర్గానికి చెందిన వ్యక్తి రఘుబర్ దాస్‌కు సీఎం పదవీ బాధ్యతలు అప్పగించింది. దాస్ ఓసీసీ కేటగిరిలోని తొలి సామా జికవర్గానికి చెందిన వ్యక్తి. కాగా మహారాష్ట్రలో 288కి 145 సీట్లు, హర్యానాలో 90కి 75 సీట్లు వస్తాయని బీజేపీ లెక్కలు కట్టింది. కానీ ఫలితాల్లో అనుకున్నట్టు జరగలేదు. కుల సమీకరణాలే ప్రధానంగా బీజేపీని దెబ్బతీశాయనే అంచనాలున్నాయి. రెండు రాష్ట్రాల్లోనూ ఆర్థిక మందగ మనం, యువతకు ఉద్యోగాల కరవు, ఇబ్బందుల్లో వ్యవసాయం రంగం వంటి కారణాలు కూడా బీజేపీని దెబ్బ తీశాయి. జమ్ముకాశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తిని కల్పించే ఆర్టికల్ 370, 35ఏ అధికరణాలను రద్దు, 2016లో సర్జికల్ స్ట్రైక్స్ వంటి జాతీయాంశాలు బీజేపీకి పెద్దగా కలిసిరాలేదు. 2024 నాటికల్లా దేశవ్యాప్తంగా ఎన్‌ఆర్‌సీని అమలు చేస్తామని అమిత్ షా చెబుతున్నారు. కానీ ఈ అంశాలేవీ కలిసి రాలేదు. కులసమీకరణాలే మహారాష్ట్ర, హర్యానాల్లో ప్రభావం చూపాయి. దాదాపుగా ఇవే పరిస్థితులు జార్ఖండ్ లోనూ నెలకొని ఉండడంతో తాజా ఫలితాలే జార్ఖండ్ లోనూ వెలువడే అవకాశాలున్నాయనే అంచనాలు వ్యక్తమవుతున్నాయి.

2014లో నరేంద్ర మోడీ తొలి దశ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత అదే ఏడాది అక్టోబర్‌లో మహారాష్ట్ర, హర్యానాకు, డిసెంబర్‌లో జార్ఖండ్ అసెంబ్లీకి ఎన్నికలు జరిగాయి. మూడు చోట్లా బీజేపీ ప్రభుత్వాలు ఏర్పడ్డాయి. 2019 లోక్‌సభ ఎన్నికల తర్వాత ఇదే క్రమంలో ఎన్నికలు జరుగుతున్నాయి. మహారాష్ట్ర, హర్యానాల్లో మిశ్రమ ఫలితాలను చవిచూడాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి.

-వి.సాయినాథ్

# బెంగాల్‌లో మమత X గవర్నర్



మన దేశంలో రాష్ట్రాల ముఖ్యమంత్రులకూ, గవర్నర్లకూ మధ్య వివాదాలు ఘర్షణలకు దారితీయడం 1967 నుంచి ఉంది. ఇంకా వెనక్కి వెళ్తే కేరళలో తొలి కమ్యూనిస్టు ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన ఈఎంఎస్ నంబూద్రిపాద్‌కూ, ఆనాటి గవర్నర్‌కూ మధ్య ఘర్షణ గురించి మనకు తెలుసు. 1983లో అవిభక్త ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా పార్టీ పెట్టిన తొమ్మిది మాసాల్లోనే ప్రమాణం చేసిన వెండితెర వేలుపు నందమూరి తారక రామా రావు, గవర్నర్ రామ్ లాల్‌ల మధ్య ఘర్షణ ఇంకా మనస్మృతిపథంలోనే ఉంది. ఆనాటి కేంద్ర ప్రభుత్వం ఒత్తిళ్ళకు లొంగి ఎన్‌టీఆర్ ప్రభుత్వాన్ని రామ్‌లాల్ రద్దు చేయడం, ఎన్టీఆర్ ప్రజాస్వామ్య పోరాటం జరిపి నెల రోజుల్లోనే తిరిగి అధికారంలోకి రావడం గురించి తరచూ ప్రస్తావనకు వస్తూ ఉంటుంది. ఇప్పుడు పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీకీ, ఆ రాష్ట్ర గవర్నర్ జగదీప్ ధన్‌కర్‌కీ మధ్య వివాదం చినికి చినికి గాలివాన అవుతోంది. బెంగాల్‌లో 1967లో ఆనాటి గవర్నర్ ధరమ్‌వీర్ ఆనాటి యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వంతో ఘర్షణకు దిగడం, ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వామపక్ష ఫ్రంట్ ప్రభుత్వంతో కూడా ఆయనకు సరిపడకపోవడం మనకు తెలుసు. బెంగాల్ గవర్నర్‌గా ఇంతవరకూ వ్యవహరించిన కేసరీనాథ్ త్రిపాఠీ బీజేపీకి అనుకూల వైఖరి తీసుకుంటున్నారన్న విమర్శలు వచ్చేవి. రాజ్‌భవన్‌ను ఆయన ఆర్ ఎస్ ఎస్ శాఖగా మార్చివేశారంటూ తృణమూల్ నాయకులు తరచూ ధ్వజమెత్తేవారు. ఆయనకు సంఘ్ పరివార్ నాయకులతోనూ, బీజేపీ జాతీయ నాయకుల నుంచి రాష్ట్ర నాయకుల వరకూ ఎక్కువ సన్నిహిత సంబంధాలు ఉండేవి. ఆయనను రీకాల్ చేయాలని తృణమూల్ ఎంపీలు పార్లమెంటులో డిమాండ్ చేశారు కూడా. పరివార్ నాయకులూ, బీజేపీ నాయకులూ ఎప్పుడు వచ్చినా సులభంగా అపాయింట్‌మెంట్ ఇచ్చేవారని తృణమూల్ కాంగ్రెస్ నాయకులు ఆరోపించేవారు. ప్రస్తుత గవర్నర్ ధన్‌కర్ కూడా బీజేపీ సీనియర్ నాయకుడే కాకుండా గతంలో కేంద్ర మంత్రిగా కూడా వ్యవహరించారు. వృత్తి రీత్యా సుప్రీంకోర్టు న్యాయవాది, రాజస్థాన్ అసెంబ్లీ సభ్యునిగా, అదే రాష్ట్రం నుంచి లోక్‌సభ సభ్యునిగా కూడా వ్యవహరించారు. అందువల్ల ఆయనకు కూడా కమలనాథులతో ఎక్కువగా సంబంధాలు ఉన్నాయి. కాంగ్రెస్ హయాంలో రాజకీయ నిరుద్యోగులను గవర్నర్లుగా నియమిస్తున్నారంటూ పదే పదే ఆరోపించిన బీజేపీ కూడా ఇప్పుడు అదే చేస్తోంది, ప్రధాని కొన్ని రాష్ట్రాలకు రిటైర్డ్ ఐఏఎస్‌లనూ, ఉన్నతాధికారులను నియమించారు. వారు గవర్నర్లుగా ఉన్న రాష్ట్రాల్లో కూడా వారికీ, ముఖ్యమంత్రులకూ తరచూ విభేదాలు తలెత్తుతున్నాయి.


ఉదాహరణకు పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్, మాజీ ఐపీఎస్ అధికారిణి కిరణ్ బేడీ, ముఖ్యమంత్రి నారాయణ స్వామిల మధ్య వివాదాల వార్తలు తరచూ వస్తున్నాయి. ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్‌కూ, ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ఘర్షణలు ఆ మధ్య తరచూ పత్రికల పతాక శీర్షికలయ్యేవి. ఇప్పుడు వారు సర్దుకుని పోతున్నారు. ఇప్పుడు తాజాగా పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి, తృణమూల్ అధ్యక్షురాలు మమతా బెనర్జీ, గవర్నర్ ధన్‌కర్‌ల మధ్య వివాదం కేంద్రం దృష్టికి వెళ్ళింది. కేంద్ర హోం మంత్రి, బీజేపీ అధ్యక్షుడు అమిత్ షా ఇప్పటికే ఇప్పటికే ధన్‌కర్‌ని ఢిల్లీకి పిలిపించి పరిస్థితి తెలుసుకున్నారు. లోక్‌సభ ఎన్నికల సందర్భంగా అమిత్‌షా ర్యాలీలకు మమత బెనర్జీ ప్రభుత్వం అనుమతి ఇవ్వకపోవడం వల్ల ఇరువురూ తారస్థాయిలో ఆరోపణలూ, ప్రత్యారోపణలూ చేసుకున్నారు. అమిత్ షా ఆ కక్షతోనే గవర్నర్‌ను తన ప్రభుత్వం మీదకు ఉసిగొల్పుతున్నారని మమతా బెనర్జీ ఆరోపిస్తున్నారు. దీనికి తోడు రాష్ట్ర బీజేపీ నాయకుడు, కేంద్ర మంత్రి బాబుల్ సుప్రియో జాదవ్‌పూర్ యూనివర్శిటీలో అఖిల భారత విద్యార్థి పరిషత్ (ఎబీవీపీ) శాఖ ఏర్పాటు చేసిన సమావేశానికి హాజరైనప్పుడు తృణమూల్ కాంగ్రెస్ కార్యకర్తలు ఈలలు వేసి, వ్యతిరేక నినాదాలు చేసి ఆయనను అవమానించారన్న ఆరోపణలు రాగానే గవర్నర్ ధన్‌కర్ వెంటనే కేంద్ర హోం మంత్రి దృష్టికి తీసుకువెళ్ళడం మమతా బెనర్జీకి నచ్చలేదు. ఇలాంటివి ప్రతిచోటా జరుగుతూ ఉంటాయనీ, దీనికి గవర్నర్ జోక్యం చేసుకోవడం సముచితంగా లేదని ఆమె బహిరంగంగానే వ్యాఖ్యానించారు. తృణమూల్ కార్యకర్తలు, నాయకులు మరో అడుగు ముందుకు వెళ్ళి, గవర్నర్ కేంద్రం ఏజెంటుగా పనిచేస్తున్నారంటూ తీవ్రమైన ఆరోపణలు చేశారు. తమ ప్రభుత్వానికి వ్యతిరేకంగా గవర్నర్ కేంద్రానికి నివేదికలు పంపుతున్నారంటూ ఆమె ఆరోపించారు. సాధారణంగా ఇలాంటి ఆరోపణలు అన్ని రాష్ట్రాల్లోనూ వస్తూ ఉంటాయి. తృణమూల్‌కూ, బీజేపీకీ పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే వాతావరణం గత లోక్‌సభ ఎన్నికల సందర్భంగా ఏర్పడింది. మూడున్నర దశాబ్దాల మార్క్సిస్టు ఫ్రంట్ పాలనలో బెంగాల్‌లో బీజేపీ ప్రవేశించేందుకు ఎన్ని ప్రయత్నాలు చేసినా ఫలించలేదు. కేంద్రంలో వాజ్‌పేయి ప్రభుత్వంలో మంత్రిగా వ్యవహరించిన మమతా బెనర్జీ మార్క్సిస్టు ఫ్రంట్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్దఎత్తున ఉద్యమాన్ని నడిపినప్పుడు బీజేపీ సహకారం తీసుకున్నారు. ఆ విధంగా బెంగాల్‌లో బీజేపీ అడుగు పెట్టగలిగింది. మార్క్సిస్టు ఫ్రంట్ ప్రభుత్వాన్ని గద్దెదింపి అధికారాన్ని చేపట్టిన తర్వాత బీజేపీని ప్రధాన శత్రువుగా ఎంచుకున్నారు. ఆమె మొదటి విడత ముఖ్యమంత్రిగా వ్యవహరించినప్పుడే బీజేపీ పుంజుకుంది. తర్వాత తన బలాన్ని పెంచుకుంది. గత లోక్‌సభ ఎన్నికల్లో తృణమూల్‌కు 22 ఎంపీ సీట్లు రాగా, బీజేపీకి 18 సీట్లు వచ్చాయి. మోడీకి దీటైన నాయకుణ్ణి ఎంపిక చేయడం కోసం ప్రతిపక్షాలతో సంప్రదింపులు జరపడం వల్ల ఆమెకు వ్యతిరేకంగా శారదా చిట్‌ఫండ్ కుంభకోణాన్ని కేంద్రం తవ్వి తీసింది. ఈ నేపథ్యంలో గవర్నర్‌గా వచ్చిన ధన్‌కర్‌పై కూడా ఆమె ఆరోపణలు చేశారు. అంతేకాకుండా దుర్గాపూజ ఉత్సవాల సందర్భంగా జరిగిన కార్యక్రమానికి మమత తనను ఆహ్వానించకుండా అవమానించారంటూ గవర్నర్ బహిరంగంగానే వ్యాఖ్యానించారు. దాంతో బెంగాల్‌లో కేంద్రమంత్రులకే కాకుండా, గవర్నర్‌కు రాష్ట్ర ప్రభుత్వం మర్యాద ఇవ్వడం లేదంటూ కమలనాథులు ఆరోపణల స్వరాన్ని పెంచారు. మళ్ళీ అమిత్ షా గవర్నర్‌ని పిలిపించి వాస్తవాలను తెలుసుకున్నారు. రాష్ట్రంలో చీమచిటుక్కుమన్నా కేంద్రం వెంటనే స్పందిస్తోందనీ, ఇతర రాష్ట్రాలను గురించి పట్టించుకోవడం లేదనీ, అమిత్ షా లోక్‌సభల ఎన్నికల నాటి కక్షతోనే ఇలా చేస్తున్నారంటూ తృణమూల్ నాయకులు ఆరోపించారు, అంతేకాకుండా చిట్‌ఫండ్ కుంభకోణంలో దర్యాప్తు చేస్తున్న సీబీఐ మమతకు విధేయుడైన ఐపీఎస్ అధికారి రాజీవ్ కుమార్‌ను అరెస్టు చేయడంతో ఆమె అగ్గిమీద గుగ్గిలం అయ్యారు. ప్రతిపక్షాలను అణగదొక్కేందుకు సీబీఐని కేంద్రం ప్రయోగిస్తోందంటూ ధ్వజమెత్తారు.

ఇటీవల గవర్నర్ ధనకర్ ఉత్తర బెంగాల్‌లో పర్యటించినప్పుడు ఆప్రాంతానికి చెందిన ఎంపీలూ, ఎమ్మెల్యేలలో ఏ ఒక్కరూ ఆయనను కలవలేదు. దీనిపై ఆయన దిగ్భ్రాంతిని ప్రకటించినప్పుడు గవర్నర్‌ను కలుసుకోమని ప్రజా ప్రతినిధులకు లేఖలు పంపాలని రాష్ట్ర ప్రభుత్వం తమకు తెలియజేయలేదంటూ జిల్లా అధికార యంత్రాంగం వివరణ ఇవ్వడంతో ఆయన మరింత ఆగ్రహోదగ్రులయ్యారు. గవర్నర్‌కు ప్రజా ప్రతినిధులు ఇచ్చే మర్యాద ఇదేనా అంటూ తీవ్రంగా వ్యాఖ్యానించారు. దుర్గా పూజా ఉత్సవాల సందర్భంగా తృణమూల్ కాంగ్రెస్ కార్యకర్తలు చొచ్చుకుని వచ్చి వ్యతిరేక నినాదాలు చేశారు. ఈ అనుభవం తర్వాత గవర్నర్ తనకు ప్రత్యేక భద్రత కల్పించాలని కేంద్రాన్ని కోరడం, కేంద్ర హోం మంత్రి అమిత్ షా వెంటనే ధన్‌కర్‌కు జెడ్ ప్లస్ భద్రతను కల్పించడంతో తృణమూల్ నాయకులు మరింత మండిపడ్డారు. రాష్ట్ర శాసనసభ ఎన్నికలకు ఇంకా 18 మాసాల గడువుంది. ఈలోగానే మమత ప్రభుత్వాన్ని రద్దుచేసి ధన్‌కర్‌ని అడ్డుపెట్టుకుని రాష్ట్రంలో పాలన సాగించాలని కేంద్రంలో కమలనాథులు ప్రయత్నిస్తున్నారన్న ఆరోపణలు కూడా చేశారు, వీరిద్దరి వివాదం మరింత ముదరకుండా సర్దుబాటు చర్యలు తీసుకోవల్సిన కేంద్రం గవర్నర్‌కే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తోందన్న భావన తృణమూల్ నాయకుల్లో పెరిగింది. అందుకే వారు ఎదురుదాడి ప్రారంభించారు.

పద్మనాభస్వామి

# కథల నిఘంటువు కొడవటిగంటి!

**అక్టోబర్ 28 కుటుంబరావు 110వ జయంతి**



తెలుగు సాహిత్యంలో నిశ్చిత అభిప్రాయాలు ప్రకటించిన ఏకైక రచయిత కొడవటిగంటి కుటుంబరావు. కొ.కు.గా ఆయన ప్రసిద్ధుడు. పిల్లలకు ఆయన చందమామ, (పత్రిక)ని చేతుల్లో పెట్టి ఒకతరాన్ని మేధావులుగా తీర్చిదిద్దిన ఘనత ఆయన చరిత్రలో మణిహారం. యువ మాసపత్రికలో 'గల్పికలు' ఆయన ముచ్చటగా చిగుర్లవంటి కథలశాద్వలాలని పంచిపెట్టి యువకులని రచయితలని చేసిన మన తెనాలి ముద్దుబిడ్డడాయన. కొ.కు. బెనారస్ హిందూ యూనివర్సిటీ అందించిన బుద్ధికొలత సిద్ధాంతవాద పరిశోధ కుడాయన. గుంటూరు ఏసీ కాలేజీ గోడల్లో ఎక్కడో ఆయన ఇంటర్ చదివిన రోజులు జ్ఞాపకాలు పొడుస్తూ ఉంటాయి. విజయనగరం మహారాజా కాలేజీలో ఫిజిక్స్ డిగ్రీ చదివిన జాడలు ఇప్పటికీ తాజా వార్తలుగానే గురజాడ ఇల్లు గుర్తుచేస్తూ వుంటుంది. అంతటి మహా మహోపాధ్యాయుడు కొడవటిగంటి కుటుంబరావు. 13 ఏటనే కలం పట్టి కలం నాగలిగా చేసుకున్న కొ.కు. తన జీవితాంతం మంచి పంటలనే పండించి తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేసిన గొప్ప జర్నలిస్ట్ ఆయన. కళ అనేది జీవితాన్ని మరవటానికీ, జీవితం అపహరించే జీవశక్తుల్ని కూడగట్టుకోవటానికి టానిక్కు కింద విని యోగ పరుచుకోవటానికి సాధనంగా పరిణమించదని 'మా భూమి' నాటకం సమీక్షచేస్తూ ఒక చక్కటి అభిప్రాయాన్ని కొ.కు. వెలువరించాడు. కానీ అది ఆలోచిస్తే ఆయన చేసిన విమర్శగా లోతుగా చూడాల్సి ఉంటుం ది. కళలు టానిక్కులు కావు. సంఘ జీవులకు నిత్యాహారం. అవి ప్రజలలో కలిగించే ఉత్తేజాన్ని బట్టీ, ప్రత్యక్ష యధార్థ సమస్యలని ఎదుర్కొనే శక్తినిచ్చే సామర్థ్యాన్ని బట్టీ అవి సక్రమ ఆహారం అవునో కాదో అభ్యుదయ విమర్శకుడు నిర్ణయిస్తాడని ఆయన ఆశావహంగా బోధపరుస్తాడు. అందుకే తెలంగాణ పోరాటాన్ని చిత్రీకరించిన మాభూమి నాటకం ఇప్పటికీ ఆ జ్ఞాపకాలు మనల్ని ఇప్పటికీ కట్టి పడవేశాయి. అలాంటి నిశిత దృష్టితోనే కొ.కు. తన నవలలు, కథలు రాశాడు. యువకులు కథలు రాసినంత గొప్పగా, వయస్సు మీరిన కొద్దీ రచయితలు లోకాన్ని గురించిన అనుభవం పెరిగి చెప్పదల్చుకున్న విషయం ఇమడ్చడం కష్టమవుతుందనే అభిప్రాయానికి భిన్నంగా కొ.కు. కథలు రాశాడు. కథ ఆలోచించినప్పుడల్లా ఆ పాత్రల వెనక ఉండే వాతావరణమూ మనస్తత్వమూ ఊహల్లో తెగ పెరిగి పెద్దకథ రాయాలనే ప్రేరణ కలగటమే కాదు ఒక్కొక్కప్పుడు బుద్ధి నాటకం రాయా లన్నంతదాకా కోరిక పెంచుకొనే వాడాయన. కథలో శిల్పం తప్ప మరేమీ ప్రారంభంలో ఆలోచించేవాడు కాదు కొ.కు. కానీ అనుభవం పెరిగేకొద్దీ ఆ వైఖరి నుంచి చాలా సులభంగా బైటపడ్డాడాయన కథాశిల్పం గురించి జంకు లేకుండా ఆ తర్వాత కథలు రాశాడాయన. శిల్ప ప్రదర్శన కోసమే కథ రాయటం ఒట్టి దండుగగా భావిస్తూ కూడా కథకి శిల్పం ఆయువు పట్టు అని బతికున్నంత కాలం ఒప్పుకున్నాడాయన. కథలో శిల్పం లేక పోయినాక ఇంకెన్నున్నా దండగే అంటాడు కొ.కు. అంతేకాదు ఇంకొంచెం ముందుకుపోయి కథ యెంత వాస్తవికమైనా కథానికలో శిల్పం మృగ్యం అయితే కథ కుంటు బడుతుందనే ప్రశ్నకి జవాబుగా. వర్తమానంలో కథకులు ముఖ్యంగా ఈనాటి యువకులు తమ కథల ద్వారా పరిస్థితులని మార్చాలనే చూస్తున్నారే గాని. కథ యొక్క వాస్తవికత శిల్పం మీద ఎంత ఆధారపడిఉందో గ్రహించటం లేదు అంటాడాయన. తన కథలు చదివే వారికి అవి వాస్తవికంగా తోచడానికి తన కథల్లోని శిల్పమే ప్రధాన కారణంగా చెప్తాడాయన. ఎంత వాస్తవికమైన పాత్రలూ, సంఘటనలూ తీసుకున్నా శిల్పలోపం చేత అవి అవాస్తవికంగా కనబడే అవకాశం లేకపోదనేది కొ.కు. నిశ్చితాభిప్రాయం. ఇతివృత్తం నుంచి శిల్పాన్ని వేరు చేయటం సాధ్యం కాదని అనుకున్న తర్వాత, శిల్పంతో ప్రమేయం లేకుండా ఇతివృత్తం లోని ఒక పాత్ర గాని ఒక సన్నివేశం గాని యదార్థం అనుకోవటంలో అర్థమే లేదు, పైగా అలాంటి ఉద్దేశంలో అనేకమంది రచయితలు శిల్పాన్ని పోగొట్టుకునేది జీవితంలో తాము గమనించిన కొన్ని విషయాలు తీసుకొని వాటికి బలత్కారంగా తమ ప్రయోజనం జోడించటం వల్లనే వాస్తవిక భ్రాంతికి రచయిత లోనవుతున్నారని కొ.కు. గమనించాడు. అసలు యదార్థం అనే సంఘటనని చూసే వారి దృష్టిని బట్టి వేరు వేరు అంతరార్థంతో కనిపించటమే గాక ఈ వైవిధ్యాన్ని కథాకారుడు కాచి వడబోసి నిగ్గుతేల్చి ఏ దృక్పథం నుంచి ఆ సంఘటనల్లోని సత్యాన్ని లోకానికి వ్యక్తం చేయాలో నిర్ణయించుకోవటమే కాదు, అలా నిర్ణయించుకున్న అనంతరం అతని కథ వివిధ మనస్తత్వాల వారికి ఒకే అనుభూతిని ఇవ్వగలిగితేనే కళ అనేదాని విశాల ప్రయోజనం ఇమిడి ఉంటుందని చెప్తారా యన. కథలో వివిధ పాత్రల, వ్యక్తుల మనస్తత్వాలు కథకుడు ఇమడ్చ లేకపోతే కథ కాకుల్ని గొట్టి గద్దలకి వేసినట్లవడమే కాదు కథకుడి ప్రయోజనం కోసం కథలు బలి అవటమే కాదు, సాధారణంగా కథకుడి ప్రయోజనంలో సాంఘికమైన విలువలోపించినప్పుడు అటువంటి రచనలు రాయటం జరగడమే గాక దానిని సహృదయులు ఆదరింపలేరు,



పైగా శిల్పం దృష్ట్యా అది మంచి రచన అనిపించుకోదని కొ.కు. స్పష్టం చేశాడు. అంతేకాదు కొ.కు. తనెప్పుడూ తన కథలలో ప్రకృతిని పాత్రలకి అనువుగా ఉపయోగిం చుకోలేదు. దాంతోపాటు వర్ణనల జోలికి పోలేదు. ఆయన శిల్పంలో పొదుపు ఉండేది. ఉపజ్ఞా అనంతంగా ఉండేది. మంచికథ ఏది చదివినా అందులో ఒక వ్యర్థపదం ఉన్నట్టుగాని ఒక వాక్యం తేలిపోయినట్టుగాని కొ.కు. కథలు ఉండవు. కథని ఏ పాత్ర ద్వారా చెప్పాలో ఎలా చెప్పాలో అలా కథలు రాశాడాయన. అలాగే కథాశిల్పం ఎరిగి చిన్నకథలో ఒక జీవిత గాథని ఇమడ్చటానికి ఆయన ఎన్నడూ ప్రయత్నించలేదు.

శిల్పానికి రచనయొక్క ప్రయోజ నానికి అవినాభావం ఉందని గ్రహిం చినట్టయితే, శిల్పంలో దోషాలన్నింటికీ మూలం కథ ప్రయోజనంలో దొరికిపోయినా కనీసం శిల్పం బాగుండి ప్రయోజనం పల్చబడవచ్చుగాని, శిల్పం పల్చబడి ప్రయోజనం విస్పష్టం కావడం సాధ్యం కాదని కొ.కు. స్పష్టం చేశాడు. రచయిత రాసే క్రమంలో తన ఆశయం ఒకటే రచయితని సామాజికుడ్ని చేస్తుందని కొ.కు. చాలా సార్లు పేర్కొ న్నాడు. తద్వారా పాఠకుడు సహృదయుడు అవుతాడని కొ.కు. భావించాడు. అంతేకాదు రచన ఎప్పుడూ జీవితం నుంచి రావాల్సిందేగాని సిద్ధాంతాల నుంచి వచ్చే అవకాశం లేదంటాడు. సానుభూతి సిద్ధాంతాలు మంచి రచనలు చెయ్యడానికి చాలవని, రచయిత తాను రచించే విషయాన్ని గురించి అనుభవంతోపాటు ఆ అనుభవం వెనకఉండే జీవిత సత్యాన్ని తెలుసుకొనేశక్తి కూడా ఉండాలని చాటి చెప్పాడాయన.

-సాగర్ శ్రీరామ కవచం

# సమ్మె విరమించం

## కార్మికుల కోణంలో చూడాలి

- ప్రైవేటు బస్సులనూ గ్రామీణ ప్రాంతాల్లో తిప్పాలి
- నష్టాలు ఎందుకు వస్తాయో అప్పుడు తెలుస్తుంది
- ప్రెస్‌మీట్‌లో సీఎం వ్యాఖ్యలు అనుచితం
- ఆర్టీసీ కార్మిక జేఏసీ కన్వీనర్ అశ్వత్థామరెడ్డి

**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** ప్రభుత్వం డిమాండ్లను పరిష్కరించేంత వరకు సమ్మెను విరమించేది లేదని ఆర్టీసీ కార్మిక జేఏసీ కన్వీనర్ అశ్వత్థామరెడ్డి స్పష్టం చేశారు. కార్మిక యూనియన్ల స్వార్థం కోసం పెట్టిన డిమాండ్ ఒక్కటి ఉన్నా... ఇప్పుడే సమ్మె విరమిస్తామని వ్యాఖ్యానించారు. ఆర్టీసీ కార్మిక సంఘాల నేతలతో కలిసి శుక్రవారం టీఎంయూ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రెస్‌మీట్‌లో సీఎం కేసీఆర్ చేసిన వెటకారం, హాహాకారాలు, వ్యంగ్యాస్త్రాలు ముఖ్యమంత్రి స్థాయికి తగవన్నారు. ఆర్టీసీ, యూనియన్లపై కార్మికులపై సీఎం కేసీఆర్ ఎన్నో తప్పుడు ఆరోపణలు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. యూనియన్లు కార్మికుల హక్కుల కోసం ఉంటాయని, డిమాండ్లను పరిష్కరించేంతవరకు సమ్మె కొనసాగుతుందని తేల్చి చెప్పారు. సమ్మెలో ఆర్టీసీ కార్మికులు స్వచ్ఛందంగా పాల్గొంటున్నారని ప్రకటించారు. ఆర్టీసీ విషయంలో పొరుగు రాష్ట్రం ఏపీ ప్రభుత్వం తీసుకున్న చర్యలను కూడా సీఎం కేసీఆర్ చులకన చేయటం తగదన్నారు. రాజకీయ పార్టీలకు అయిదు సంవత్సరాలకు ఎన్నికలు వస్తే... ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి కార్మిక సంఘాలకు ఎన్నికలు జరుగుతాయని సీఎం కేసీఆర్‌కు గుర్తు చేశారు. ఒకసారి కార్మిక చట్టాలను చదివి అవగాహన కల్పించుకోవాలని హితవు చెప్పారు. ప్రయివేటు బస్సులను కూడా గ్రామీణ ప్రాంతాల్లో తిప్పాలని, నష్టాలు ఎందుకు వస్తాయో అప్పుడు తెలుస్తుందని ప్రభుత్వానికి సూచించారు. దూరప్రాంతాలకు నడిచే ఆర్టీసీ బస్సులు కూడా లాభాలను ఆర్జిస్తున్నాయని గుర్తు చేశారు. ఆర్టీసీ కార్మికుల సమ్మెను రాజకీయ కోణంలో కాకుండా... కార్మికుల కోణంలో చూడాలని సూచించారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తే కార్మికసంఘాలు ఉండవని సీఎం కేసీఆర్ వ్యాఖ్యలకు కౌంటర్‌గా అన్నారు. గతంలో కరీంనగర్ సభలో ఇచ్చిన హామీలకు కట్టుబడి ఉండాలని సీఎం కేసీఆర్‌ను డిమాండ్ చేశారు. ఆర్టీసీ యూనియన్లకు ఎన్నికలు వద్దనుకుంటే భవిష్యత్‌లో టీఎన్‌జీవోలకు కూడా ఎన్నికలుండవన్నారు. సమ్మె విరమించి విధుల్లో చేరాలని సీఎంకేసీఆర్ ప్రకటించినా, విధుల్లో చేరేందుకు కార్మికులు సిద్ధంగా లేరని స్పష్టం చేశారు. ఆర్టీసీ కార్మిక జేఏసీ కో.కన్వీనర్ రాజిరెడ్డి మాట్లాడుతూ... కార్మికుల మనోభావాలు దెబ్బతినేవిధంగా సీఎం కేసీఆర్ వ్యవహరిస్తున్నారని విమర్శించారు. కార్మికులకు రూ.50వేల జీతం ఉందని సీఎం కేసీఆర్ అనటం హాస్యాస్పదంగా ఉందన్నారు. సమ్మె విషయంలో సీఎం కేసీఆర్ చెప్పినవన్నీ అబద్ధాలేనని కో.కన్వీనర్ వీఎస్.రావు స్పష్టం చేశారు. ఆర్టీసీ నష్టాలను సీఎం కేసీఆర్ పెంచి చెప్పారని తప్పుబట్టారు. ఆర్టీసీకి ఒక్క రూపాయిని కూడా ఈక్విటీ రూపంలో ప్రభుత్వం ఇవ్వలేదన్నారు. ఆర్టీసీకి రావాల్సిన బకాయిలు, అప్పులపై యాజమాన్యంతో బహిరంగ చర్చకు తాము సిద్ధంగా ఉన్నామని సవాల్ విసిరారు. కార్మికులు, కార్మిక సంఘాల మధ్య విభేదాలు తెచ్చేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని మండిపడ్డారు. తమ ఉద్యోగాలు తీసేందుకే కేసీఆర్ సీఎం అయ్యారా..? అని ప్రశ్నించారు.



### కార్మికులు ధైర్యంగా ఉండాలి

- ఆర్టీసీ టీజేఎంయూ నేత కే. హనుమంతు

ఆర్టీసీ కార్మికులు యూనియన్ల నేతల కోసం సమ్మె చేయటంలేదని ప్రభుత్వానికి ఆర్టీసీ తెలంగాణ జాతీయ మజ్దూర్ యూనియన్ నేత కే. హనుమంతు హితవు చెప్పారు. ఉద్యోగాలు ఎక్కడకు పోవని, ధైర్యంగా ఉండాలని కార్మికులకు పిలుపునిచ్చారు. శుక్రవారం విద్యానగర్‌లోని టీజేఎంయూ(జేఏసీ-1) కేంద్ర కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కార్మికుల ఉద్యోగాలు తీసే హక్కు ప్రభుత్వానికి లేదని స్పష్టం చేశారు. ఆర్టీసీ కార్మికులు రోజూ 14 నుంచి 16 గంటలు పనిచేస్తారని సీఎం కేసీఆర్‌కు గుర్తు చేశారు. ఆర్టీసీ కార్మికుల ఉద్యోగాలను తొలగించి, ప్రయివేటు బస్సులను ప్రవేశపెట్టేందుకేనా..? ముఖ్యమంత్రి అయింది..? అని సీఎం కేసీఆర్‌ను నిలదీశారు. ఆర్టీసీ కార్మికులకు చెల్లించే జీతాల విషయంలో నూ ప్రభుత్వం కోర్టును తప్పుదోవపట్టిస్తోందని ఆరోపించా రు. ఆర్టీసీ ఆస్థులను టీఆర్‌ఎస్ ప్రభుత్వం తాకట్టు పెడుతోందని మండిపడ్డారు. బాధ్యతాయుతమైన ముఖ్యమంత్రి పదవిలో ఉన్న సీఎం కేసీఆర్... సమ్మెను పరిష్కరించే ప్రయత్నం చేయకపోగా కార్మికులను రెచ్చగొడుతున్నా రని ఆగ్రహం వ్యక్తం చేశారు.

## సమ్మె చట్టవిరుద్ధమని ప్రకటించాలి

- హైకోర్టులో రెండు ప్రజాహిత వ్యాజ్యాలు

**హైదరాబాద్, ఆంధ్రప్రభ :** తమను ప్రభుత్వంలో విలీనం చేయాలనే డిమాండ్ తో సమ్మె చేస్తున్న ఆర్టీసీ కార్మికల సమ్మెను చట్టవిరుద్ధమైనదిగా ప్రకటించాలని అభ్యర్థిస్తూ హైకోర్టులో రెండు ప్రజాహిత వ్యాజ్యాలు దాఖలయ్యాయి. కార్మిక సంఘాల పిలుపు మేరకు కార్మికులు గత అక్టోబర్ 5 నుంచి చేస్తున్న సమ్మెను వెంటనే విరమించి, విధుల్లో చేరేలా కార్మిక సంఘాలను ఆదేశించాలని అభ్యర్థిస్తూ వాచ్-వాయిస్ ఆఫ్ ద పీపుల్ అనే స్వచ్ఛంద సంస్థ ప్రధాన కార్యదర్శి కొలిమి గణేష్ రావు, మెదక్ జిల్లా, జహీరాబాద్ కు చెందిన కె.భాస్కర్ రెడ్డి హైకోర్టులో వేర్వేరుగా ప్రజాహిత వ్యాజ్యాలు దాఖలు చేశారు. అక్రమంగా సమ్మె చేస్తున్న కార్మికులను సర్వీసు నుంచి తొలగించేలా ఆదేశించాలని పిటిషనర్లు అభ్యర్థించారు. ఈ ప్రజాహిత వ్యాజ్యాల్లో ప్రతివాదులుగా తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, రవాణా శాఖ ముఖ్యకార్యదర్శి, మేనేజింగ్ డైరెక్టర్, తెలంగాణ రాష్ట్ర రోడ్డు ట్రాన్స్‌పోర్ట్ యూనియన్, తెలంగాణ ఆర్టీసీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్, జేఏసీ, తెలంగాణ రోడ్డు రవాణా మజ్దూర్ సంఘాన్ని ప్రతివాదులుగా చేర్చారు. తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రాఘవేంద్రసింగ్ చౌహాన్, జస్టిస్ ఏ అభిషేక్ రెడ్డి తో కూడిన డివిజన్ బెంచ్ ఈ ప్రజాహిత వ్యాజ్యాలపై విచారణ చేపట్టే అవకాశం ఉంది.

## దరఖాస్తులతో విధుల్లోకి!

(మొదటిపేజీ తరువాయి)

అంతర్మథనంలో కార్మికులు ఉన్నారని ఆర్టీసీ ఉన్నతాధికారులు అంటున్నారు. విధుల్లో చేరుతావ ని పెద్ద సంఖ్యలో కార్మికులు తమను సంప్రదిస్తు న్నారని ఉన్నతాధికారులు చెబుతున్నా రు. ''ఆర్టీసీ కార్మికులను ఉద్యోగాల నుంచి ఎవరూ వెళ్లగొట్ట లేదు. అర్ధంపర్థంలేని సమ్మె పేరుతో వాళ్లంతట వాళ్లే స్వచ్ఛందంగా వెళ్లిపోయారు. తిరిగి దరఖాస్తు చేసుకుని స్వచ్ఛంధంగా విధుల్లో చేరొచ్చు'' అని సీఎం కేసీఆర్ మీడియా సమావేశంలో ప్రకటించిన సంగతి తెలిసిందే. సమ్మెను కొనసాగిస్తే ఇప్పటికే నష్టాల్లో ఉన్న ఆర్టీసీ ని మరింత ఇబ్బందుల్లోకి నెట్టినట్టవుతుందన్న సీఎం కేసీఆర్ వాదనతో చాలా మంది కార్మికులు ఏకీభవిస్తున్నట్లు ఆర్టీసీ యాజ మాన్యం అభిప్రాయపడుతోంది. వాస్తవానికి సమ్మె 20రోజులపాటు కొనసాగుతుందని కార్మికులు ఊహించలేదు. ఇన్నిరోజులపాటు సమ్మె చేయటం తో ఇటు ఉద్యోగాలకు, అటు కుటుంబం గడిచేందు కు ఇబ్బందులు ఎదురవుతుండటంతో విధుల్లో చేరేందుకే కార్మికులు మొగ్గుచూపుతున్నారని సమాచారం. సీఎం కేసీఆర్ ఆఫర్ ఇచ్చిన తెల్లవారే కూకట్‌పల్లి డిపోకు చెందిన డ్రైవర్ రాజు స్వచ్ఛం ధంగా విధుల్లో చేరుతున్నట్లు దరఖాస్తు చేసుకున్నా రు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలన్న డిమాండ్‌తో కార్మికుల్లో విషం నింపుతున్నారని ఆర్టీసీ కార్మిక జేఏసీ కన్వీనర్ అశ్వత్థామరెడ్డిపై ఆయన పోలీసులకు ఫిర్యాదు కూడా చేశారు. సమ్మెపై కార్మికులు ఎంత వ్యతిరేకతతో ఉన్నారో ఈ పరిణామం రుజువు చేస్తోందని ఆర్టీసీ యాజమాన్యం భావిస్తున్నది. సీఎం కేసీఆర్ ఇచ్చిన మాట మేరకు స్వచ్ఛందంగా విధుల్లో చేరిన రాజును ఆర్టీసీ యాజమాన్యం ఎలాంటి షరతులు లేకుండా వెంటనే విధుల్లోకి తీసుకుంది. శుక్రవారం ఆయన పోలీసుల భద్రత నడుమ డ్యూటీలో చేరారు. స్వచ్ఛందంగా తిరిగి విధుల్లో చేరొచ్చన్న సీఎం కేసీఆర్ తాజా ప్రకటనతో కార్మికుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. రాజు మాదిరిగానే రానున్న ఒకటి, రెండు రోజుల్లో మరికొంతమంది కార్మికులు విధుల్లో చేరుతారని ఆర్టీసీ ఉన్నతాధికారులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

## కార్మికులకు అండగా ఉంటాం

- సమ్మె కార్యాచరణపై విపక్షాల భేటీ

**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** ఆర్టీసీ కార్మికుల సమ్మెకు అండగా ఉంటామని విపక్ష నేతలు ప్రకటించారు. తెలంగాణ భవన్‌లో సీఎం కేసీఆర్ చేసిన వ్యాఖ్యలను ఖండించారు. ఆర్టీసీ, కార్మికుల సమ్మెపై గురువారం సీఎం కేసీఆర్ కీలక వ్యాఖ్యలు చేసిన నేపథ్యంలో శుక్రవారం ఎస్‌వీకేలో అఖిలపక్ష నేతలు సమావేశమయ్యారు. అనంతరం టీజేఎస్ అధినేత ప్రొ. కోదండరాం విలేకరులతో మాట్లాడుతూ... సీఎం కేసీఆర్ ఏకపక్ష వైఖరికి గురువారం నాటి ప్రెస్‌మీటే నిదర్శనమన్నారు. వీధి నేత తరహాలో సీఎం కేసీఆర్ వ్యవహరించటం దురదృష్టకర మన్నారు. చట్టప్రకారం ప్రభుత్వం ఆర్టీసీకి ఇవ్వాల్సిన దానికంటే తక్కువ నిధులనే ఇచ్చారని స్పష్టం చేశారు. పేదలకు ఆర్టీసీ తప్ప మరో రవాణా సదుపాయాలు లేవన్నారు. సీఎం కేసీఆర్ ఓ ప్రయివేటు సంస్థ యజమానిలా మాట్లాడారని ఆరోపించారు. ఆర్టీసీ ప్రజలకు అవసరమైన సంస్థ అని గుర్తు చేశారు. ఆర్టీసీ సమ్మె విషయంలో అంతా ఏకమై, గ్రామాలకు వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించాలని విపక్షాలకు పిలుపునిచ్చారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం మాట్లాడుతూ... సీఎం కేసీఆర్ బాధ్యతారాహిత్యంగా మాట్లాడారని విమర్శించా రు. కోర్టులను పట్టించుకోనవసరం లేదన్న తరహాలో సీఎం మాట్లాడటం దురదృష్టకరమన్నారు. ఆర్టీసీ కార్మికులే కాదు... టీఎన్‌జీవోలు కూడా అసంతృప్తితో ఉన్నారని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వం అనాలోచితంగా తెచ్చిన మోటారు వాహన చట్టాన్ని అమలు చేస్తామనటం సీఎం కేసీఆర్‌కు తగదన్నారు. సీఎం వ్యాఖ్యల దాడి కేవలం ఆర్టీసీ యూనియన్ల పైనే కాదని, ఉద్యోగులందరిపై జరిగిన దాడిగా అభివర్ణించారు. ఆర్టీసీ కార్మికుల ఉద్యమాన్ని నీరుగార్చేం దుకే సీఎం కేసీఆర్ బాధ్యతారాహిత్యంగా మాట్లాడారని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ నేత పోటు రంగారావు ధ్వజమెత్తారు. హోదాని మరిచి మాట్లాడటం సీఎం కేసీఆర్‌కు తగదని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి సాదినేని వెంకటేశ్వరరావు అన్నారు.





## నేలరాలిన మరో ఆర్టీసీ కార్మికుడు


- గుండెపోటుతో మృతి
- ఆస్పత్రి వద్దకు ప్రజాసంఘాలు, కార్మికులు.. ర్యాలీకు అనుమతించని పోలీసులు

**నల్గొండ (టౌన్), ప్రభన్యూస్ :** ఆర్‌టిసి కుటుంబం మరో కార్మికుడిని కోల్పోయింది. నల్గొండ జిల్లా, నార్కట్‌పల్లి డిపో డ్రైవర్‌గా పనిచేస్తున్న జమీల్(42) శుక్రవారం తెల్లవారు జామున నల్గొండ ప్రభుత్వ ఆస్పత్రిలో గుండె పోటుతో మరణించారు. జమీల్‌కు భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. 9ఏళ్ళుగా ఆర్‌టిసిలో డ్రైవర్‌గా పనిచేస్తున్నారు. ఆర్‌టిసి కార్మికులు చేపట్టిన సమ్మెలో జమీల్ చురుకుగా పాల్గొని గురువారం కేసీఆర్ ప్రెస్‌మీట్ టీవీలో చూస్తుండగా కేసీఆర్ ఆర్‌టిసిపై చేసిన వ్యాఖ్యలతో మనో వేదనకు గురై ఒకేసారి కుప్పకూలిపోయాడు. అతనిని ఆస్పత్రికి తీసుకెళ్ళి చికిత్స చేస్తుండగా మృతి చెందారు. జమీల్ మృతి చెందిన విషయం తెలుసుకున్న ఆర్‌టిసి కార్మికులు, అఖిలపక్ష ప్రజా సంఘాల నాయకులు పెద్ద ఎత్తున ఆస్పత్రికి చేరుకోవడంతో పోలీసులు వారిని అడ్డుకు న్నారు. ఆస్పత్రి నుంచి మృతదేహాన్ని తరలిస్తున్న క్రమంలో బస్టాండ్ వరకు అనుమతివ్వాలని పోలీసులను కార్మిక నేతలు విజ్ఞప్తి చేసినా అనుమతివ్వకపో వడంతో అడ్డుపడ్డారు. వారిని పోలీసులు అరెస్టు చేసి మృతదేహాన్ని తరలించారు. జమీల్ మృత దేహానికి పలువురు నివాళు లర్పించి సంతాపం వ్యక్తం చేశారు. కార్యక్ర మంలో తెలంగాణ ఇంటిపార్టీ రాష్ట్ర అధ్యక్షులు చెరుకు సుధాకర్, సీపీఎం జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, నాయ కులు పాలడుగు నాగార్జున, ఎం.డి.సలీం, బీజేపి జిల్లా అధ్యక్షులు నూకల నర్సింహారెడ్డి, కిసాన్‌మోర్చా అధ్యక్షులు గోలి మధుసూదన్‌రెడ్డి, మాదగోని శ్రీనివా స్‌గౌడ్, బండారు ప్రసాద్, సీపీఐ జిల్లా నాయకులు పబ్బు వీరస్వామి, జనసమితి నాయకులు గోపాల్‌రెడ్డి, ఎంఆర్‌పిఎస్ నాయకులు బకరం శ్రీనివాస్, పీడీఎస్‌యు నాయకులు ఇందూరు సాగర్, వీరానా యక్, కొండేటి మురళీ, ఏర్పుల శ్రవణ్, శివ తదితరులు ఉన్నారు.




## కార్మికులకు బీజేపీ భరోసా

**హైదరాబాద్, ఆంధ్రప్రభ :** ఆర్టీసీ కార్మికుల సమ్మెపై సీఎం కేసీఆర్ చేసిన వ్యాఖ్యల పట్ల బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కె.లక్ష్మణ్ మండిపడ్డారు. హుజూర్‌నగర్ ఉపఎన్నికల ఫలితాల తర్వాత కేసీఆర్ రెచ్చగొ ట్టేలా మాట్లాడు తున్నారని విమ ర్శించారు. పార్టీ కార్యాల యంలో ఆయన మీడియాతో మాట్లాడు తూ, ఆర్టీసీ జేఏసీ నాయకులు సమ్మెపై నాతో చర్చించారన్నారు. అంతకు ముందు లక్ష్మణ్‌తో ఆర్టీసీ జేఏసీ కన్వీనర్ అశ్వత్థామ రెడ్డి, కో కన్వీనర్‌లు రాజిరెడ్డి, థామస్ రెడ్డి, వీఎస్ రావు తదితరులు భేటీ అయ్యారు. 20 రోజులుగా కార్మికులు శాంతియుతంగా సమ్మె చేస్తుంటే హుజూర్‌నగర్ ఉపఎన్నిక ఫలితం తర్వాత కేసీఆర్ రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. హుజూర్‌నగర్ ఉపఎన్నికలో టీఆర్‌ఎస్ గెలుపు ఓ గెలుపేనా అని లక్ష్మణ్ వ్యాఖ్యా నించారు. భవిష్యత్తులో ఆర్టీసీ కార్మికులు చేపట్టే ప్రతి కార్యక్రమానికి భాజపా అండగా ఉంటుందని అన్నారు. కార్మికులతో కలిసి పోరాడుతూనే పార్టీ పరంగా ఉద్యమాలు నిర్వహిస్తామన్నారు. అవసరమైతే ఆర్టీసీ సమ్మెను ఢిల్లీకి కూడా తీసుకు వెళ్తామన్నారు. ఆర్టీసీని ప్రైవేట్ పరం చేయోచ్చని, కేంద్రం ఇటీవల ఇందుకు అనుకూలంగా చట్టం చేసిందం టూ ముఖ్యమంత్రి కేసీఆర్ చేసిన వ్యాఖ్యలు పూర్తి అబద్ధమని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. ఆర్టీసీ జేఏసీ నేతలు శుక్రవారం కిషన్‌రెడ్డి ఎంఎల్ఎ క్వార్టర్స్‌లోని కార్యా లయంలో కలిశారు. ఈ సందర్భంగా కిషన్‌రె డ్డి మాట్లాడుతూ, కార్మికుల పొట్ట కొట్టమని ఏ చట్టం చేయలేదన్నారు. తన పన్నాగాన్ని కేంద్రంపై నెట్టేం దుకు కేసీఆర్ ప్రయత్నించడం దారుణమన్నారు. ఆర్టీసీ సమస్య ను పరిష్కరించేం దుకు కేసీఆర్ ప్రయ త్నించాలి తప్ప కేంద్రంపై నెట్టడం సరైంది కాదని అన్నారు.



## కేసీఆర్‌కు అహంభావం పెరిగింది


- ఆర్టీసీ ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించే కుట్ర
- సీఎల్పీ నేత భట్టి విక్రమార్క ధ్వజం



**హైదరాబాద్, ఆంధ్రప్రభ :** ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావులో అహంభావం కొట్టొచ్చినట్లు కనిపిస్తోందని సీఎల్పీ నేత భట్టి విక్రమార్క దుయ్యబట్టారు. హుజూర్‌నగర్ గెలుపుతో మరింత పెరిగిందని ఆయన ఆరోపిం చారు. ఆర్టీసీ సమ్మెపై కేసీఆర్ మాట్లాడిన తీరు ప్రజాస్వామ్య వాదులను ఆశ్చర్యా నికి గురి చేసిందని ఆయన ఆరోపిం చారు. కేసీఆర్ మాట్లాడిన తీరు ప్యూడల్ మనస్థత్వానికి నిదర్శనమని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం మీడియాతో మాట్లాడిన తీరును చూస్తుంటే కేసీఆర్ నిజస్వరూపం బయటపడిందన్నారు. ఆర్టీసీ ఆస్తులను అమ్మకానికి పెట్టాలనుకుంటే కాంగ్రెస్ చూస్తూ ఊరుకోదని ఆయన హెచ్చరించారు. ఆర్టీసీని ప్రయివేట్ పరం చేయడం వల్ల మరిన్ని అసమానతలు పెరుగుతాయని ఆయన హెచ్చరించారు. శుక్రవారం ఆయన సీఎల్పీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. ' కార్మిక యూనియన్లు కార్మిక సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకొస్తాయి. అంత మాత్రాన వాటిని పనికి మాలిన పనులు అంటారా..? ' అని భట్టి విక్రమార్క దుయ్యబ ట్టారు. కార్మికుల డిమాండ్లను ప్రభుత్వం అంగీకరించక పోవడం తోనే కార్మికులు సమ్మెకు వెళ్లిన విషయాన్ని గుర్తుంచుకోవాలని ఆయన హితవు పలికారు. కార్మికులను చర్చలకు పిలవాల్సిన వ్యక్తే నోటికి వచ్చినట్లు మాట్లాడటాన్ని చూస్తే కేసీఆర్‌కు అహంభావం ఎంతుందో అర్థమవుతోందని మండిపడ్డారు. ఆర్టీసీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలనే ఆలోచన కేసీఆర్‌కు లేదని, చర్చలకు పిలిచే ధోరణి లేకపోవడంవల్లే ఆర్టీసీ పని అయిపోయిందని వ్యాఖ్యానించారని ఆయన విమర్శించా రు. ఆర్టీసీ సంస్థను కేసీఆర్ సృష్టించలేదని, దశాబ్దాలుగా గత ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన ఆస్తి ఆర్టీసీ అంటూ ఆయన వివరించారు. కడుపు కాలి ఆకలితో ఉన్న కార్మికులు జీతాలు చాలక హక్కుల కోసం సమ్మె నోటిసు ఇచ్చారని ఆయన వివరించారు. కార్మికులను మనుషులుగా గుర్తించాలన్నారు. హైకోర్టు ఇచ్చిన తీర్పు కాపీని సీఎం కేసీఆర్ చదివితే బాగుంటుందని ఆయన విమర్శించారు. సమ్మె విషయంలో హై కోర్టు తీర్పును స్వాగతిస్తున్నట్లు తెలిపారు. సమాజంలో అసమానతలు తగ్గించే బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. దేశంలో 73 శాతం సంపద కేవలం 1 శాతం ప్రజలు అనుభవిస్తున్నారని ఆయన వ్యాఖ్యానించారు. ఇప్పుడు ఆర్టీసీని ప్రయివేట్ పరం చేస్తే 73 శాతానికి పైగా దేశ సంపదను ఒక శాతం బడాబాబులకే వెళ్ళిపోతుందన్నారు. పెట్టుబడిదారులకు కొమ్ము కాసే విధానానికి కేసీఆర్ స్వస్తి పలకాలన్నారు. రాష్ట్రంలో అప్పులు ఎక్కువైతే రాష్ట్రాన్ని కూడా అమ్మేస్తారా..? అని ఆయన నిలదీశారు. మధ్యప్రదేశ్‌లో ఆర్టీసీని ప్రయివేట్ పరం చేశారనడం సరికాదని, మనం మాట్లాడేది తెలంగాణ గురించి అనే విషయం గుర్తుంచుకోవాలన్నారు. రాష్ట్రంలో డెంగ్యూ జ్వరాలపై కోర్టులు ఆందోళన వ్యక్తం చేసినా సీఎం కేసీఆర్‌కు చీమకుట్టినట్లు కూడా అనిపిస్తలేదని ఆయన మండిపడ్డారు.

### కేసీఆర్ వ్యాఖ్యలు దుర్మార్గానికి నిదర్శనం

ఆర్టీసీ సమ్మె, కార్మికుల విషయంలో సీఎం కేసీఆర్ చేసిన వ్యాఖ్యలు దుర్మార్గానికి పరాకాష్ట అని తెలంగాణ జనసమితి అధ్యక్షుడు కోదండరామ్ అన్నారు. ప్రశ్నలు అడిగిన వారిని దబాయించారే తప్పా.. ఆయన నుంచి జవాబు మాత్రం రాలేదని కోదండరామ్ దుయ్యబట్టారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. కేసీఆర్ మాట్లాడిన తీరును చూస్తుంటే వీధిరౌడీ మాట్లాడిఉన్నట్లుగా ఉందని ఆయన దుయ్యబట్టా రు. కేసీఆర్ వ్యాఖ్యలు తామందరినీ ఏకం చేసేలా ఉన్నాయన్నారు. అన్ని పక్షాలు ఏక తాటిపైకి రావాలని ఆయన పిలుపునిచ్చారు. ఆర్టీసీ లేకపోతే వచ్చే నష్టాలను ప్రజలకు వివరిస్తామన్నారు. ఆర్టీసీకి చట్టప్రకారం ఇవ్వాల్సిన దానికి కంటే తక్కువగా ఇచ్చారని ఆయన తెలిపారు. కార్మికులు అవార్డులు తెచ్చారంటూనే.. నష్టాలకు కారణమంటున్నారని ఆయన విమర్శించారు.



### భట్టితో కోదండరాం భేటీ

సీఎల్పీ నేత భట్టి విక్రమార్కతో టీజేఎస్ అధ్యక్షుడు కోదండరామ్ భేటీ అయ్యారు. శుక్రవారం అసెంబ్లీ ఆవరణలోకి వచ్చిన కోదం డరామ్ సీఎల్పీ కార్యాలయంలో భట్టిని కలిసి రాష్ట్రంలో నెలకొన్న రాజకీయ, తాజా పరిస్థితులపై చర్చించారు. ఆర్టీసీ కార్మికుల సమ్మెతో పాటు హుజూర్‌నగర్ ఉప ఎన్నిక ఫలితం తదితర అంశాలు చర్చించారు.


తెలంగాణ ప్రభుత్వము
రెవిన్యూ శాఖ
కలెక్టర్ జనగాం గారి ప్రకటన
ఫారం-సి
(తెలంగాణ భూసేకరణ చట్టంలోని సెక్షన్ 11 ప్రకారము)
(10ఎ మినహాయింపు)
(రూల్ 6/12 చూడండి)

జిల్లా గెజిట్ నెం.: జిఎస్/ఎల్.ఎ/89/2019 తేది : 27.09.2019

జనగాం జిల్లా, దేవరుప్పుల మండలము, మాదాపురం గ్రామములోని ఈ క్రింద చూపబడిన భూమి ప్రజా ప్రయోజన నిమిత్తము అనగా 10 యల్ ఆఫ్ 4 ఎల్ ఆఫ్ ఆర్ఎస్. ఘన్‌పూర్ ప్రాజెక్ట్ - కి.మీ 0.000 నుండి 0.200 వరకు కాలువ నిర్మాణము నిమిత్తము అవసరమై ఉందని తెలంగాణ ప్రభుత్వము / జిల్లా కలెక్టర్ గారు భావిస్తున్నారు.

కావున జనగాం జిల్లా, దేవరుప్పుల మండలములోని మాదాపురం గ్రామములో గల భూమి ఈ దిగువ అనుబంధములో వివరించిన ప్రకారము సదరు కెనాల్ త్రవ్వకం నిమిత్తము సేకరించుచున్న ప్రతిపాదిత భూమి సవివరమైన వివరణ దిగువ ఇవ్వబడింది.

కలెక్టర్ జనగాం ఫైల్ నెం.: జి3/821/2019 రాజస్వ మండల అధికారి ఫైల్ నెం.సి/1087/2018-1,

షెడ్యూల్
10యల్ ఆఫ్ 4 ఎల్ ఆఫ్ ఆర్ఎస్. ఘన్‌పూర్ ప్రాజెక్ట్ కి.మీ 0.000 నుండి 0.200
గ్రామము: మాదాపురం మండలం: దేవరుప్పుల జిల్లా: జనగాం

| క్రమ సంఖ్య | సర్వే నెం. | టైటిల్ రకం | భూమి రకం (తరి/ ఖుష్కి) | భూ సేకరణ చేయు విస్తీర్ణం | పట్టాదారుని పేరు/ అనుభవదారుని పేరు | హద్దులు |
|---|---|---|---|---|---|---|
| 1 | 202 | పట్టా | ఖుష్కి | 0-07 | లకావత్ మల్లు (త) నానుక | ఉ: |
| | | | | | లకావత్ శంకర్ (త) నానుక | ద: |
| | | | | | ఎంజాయిమెంట్ ప్రకారం | తూ: |
| | | | | | లకావత్ నానుక (త) చందు | ప: |
| 2 | 211 | పట్టా | ఖుష్కి | 1-05 | లకావత్ పీట్టమ్మా (భ) సీతారామ్ | ఉ: |
| | | | | | ఎంజాయిమెంట్ ప్రకారం | ద: |
| | | | | | లకావత్ పీట్టమ్మా (భ) సీతారామ్ | తూ: |
| | | | | | | ప: |
| | | మొత్తం | | 1-12 | | |

వృక్షములు/నిర్మాణములు
గ్రామము : మాదాపురం మండలము : దేవరుప్పుల జిల్లా : జనగాం

| సర్వే నెం. | విస్తీర్ణము | చెట్లు | నిర్మాణములు | రిమార్కులు |
|---|---|---|---|---|
| - | - | - | - | - |

భూమి యొక్క ప్లాన్ మరియు వివరములు జిల్లా కలెక్టర్, జనగాం మరియు భూసేకరణ అధికారి మరియు రాజస్వ సంబంధిత వ్యక్తులు ఏదైనా పని దినములలో కార్యాలయ వేళలలో మండల అధికారి, జనగాం గారి కార్యాలయములో ఉంచవలెను. తనిఖీ చేసుకొనవచ్చును. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వము/ జిల్లా కలెక్టర్, జనగాం గారు రాజస్వ మండల అధికారి జనగాం గారిని మరియు వారి సిబ్బందిని ఇట్టి భూసేకరణకు సంబంధించి సెక్షన్ 12 ప్రకారం పైన తెలిపిన భూములలో ఏదైనా ప్రదేశములో ప్రవేశించి సర్వే, భూమి కొలతలు, తీసుకొనుటకు మరియు ఇతర పనులు చేపట్టడానికి అనుమతించనైనది.

చట్టం సెక్షన్ 11(4) క్రింద జిల్లా కలెక్టర్ జనగాం గారి ముందస్తు అనుమతి లేకుండా ప్రాథమిక ప్రకటన జారీ చేసిన తేదీ నుండి ఆ ప్రకటనలో తెలుపబడిన భూములకు సంబంధించి ఎటువంటి వ్యవహారములు అనగా కొనుగోలు, అమ్మకము, తనఖీ వంటి భూమార్పిడి చర్యలు మరియు భూమిపై హక్కులను సృష్టించడము మొదలైన చర్యలు చేపట్టరాదు.

భూసేకరణ విషయములో సంబంధిత భూ యజమానులకు ఏమైనా అభ్యంతరములున్న యెడల చట్టములోని 15 విభాగము ప్రకారము జిల్లా కలెక్టర్ / భూసేకరణ అధికారి జెసిఆర్‌జిఎల్ బిపి జనగాం గార్లకు ఇట్టి ప్రకటన జారీ చేసిన (60) దినముల లోపల వారి అభ్యంతరములు లిఖిత పూర్వకంగా తెలియజేయవచ్చును.

సం/- భూసేకరణ అధికారి మరియు రాజస్వ మండల అధికారి జనగాం | సం/- సంయుక్త కలెక్టర్, జనగాం | సం/- జిల్లా కలెక్టర్, జనగాం

DIPR No.956/LA/PP/Agency/2019-20



తెలంగాణ ప్రభుత్వం
జిల్లా కలెక్టర్, యాదాద్రి-భువనగిరి వారి నుండి
రూఢీ ప్రకటన
సవరణ

జిల్లా కలెక్టర్ ఫైల్ నెం.G/1946/17 తేది: 18.10.2019
గెజిట్ నెం.92/2019 తేది: 18.10.2019

[illegible]

షెడ్యూల్
(గతములో ప్రచురించిన ప్రాథమిక ప్రకటన ప్రకారము)

[illegible]

ప్రస్తుత సవరణ

[illegible]

ప్రత్యేక ఉప కలెక్టర్, భూసేకరణ, యాదాద్రి-భువనగిరి జిల్లా | సంయుక్త కలెక్టర్, యాదాద్రి-భువనగిరి జిల్లా | జిల్లా కలెక్టర్, యాదాద్రి-భువనగిరి జిల్లా

DIPR No.962/LA/PP-Agency/2019-20

# ధనత్రయోదశి అమ్మకాలు.. అంతంతే!



• 40 శాతం తగ్గిన పసిడి, వెండి సేల్స్
• ఆర్థిక మ్యాందం ప్రభావం • వెండి నాణెలతో సరిపెటుకుంటున్న కొనుగోలుదారులు

**న్యూఢిల్లీ / ముంబై:** మందగించిన ఆర్థిక వ్యవస్థ ప్రభావం దీపావళికి ముందు వచ్చే ధనత్రయోదశి అమ్మకాలపై కనిపించింది. బంగారం, వెండి అమ్మకాలు ఏకంగా 40 శాతం తగ్గాయి. ఒక విధంగా చెప్పాలంటే ధరలు అమాంతంగా పెరిగిపోవడంతో పాటు వినియోగదారులు బంగారం, వెండి కొనుగోళ్లపై తక్కువ వ్యయం చేస్తున్నారు. శుక్రవారం నాడు రాజధాని ఢిల్లీలో పది గ్రాముల బంగారం రూ.220 పెరిగి రూ.39,240 చేరింది. క్రితం ఏడాది దంతేరస్ రోజు పది గ్రాములు రూ.32,690 పలికింది. క్రితం ఏడాదితో పోల్చుకుంటే ధరలు 20 శాతం వరకు పెరిగాయి.

### 6వేల కిలోల బంగారం అమ్మకాలు

కాన్ఫెడరేషన్ ఆఫ్ ఆల్ ఇండియా ట్రేడర్స్ (సీఏఐటి) అంచనా ప్రకారం శుక్రవారం సాయంత్రం వరకు సుమారు 6,000 కిలోల బంగారం విక్రయాలు జరిగి ఉంటాయని అంచనా. వీటి విలువ రూ.2,500 కోట్లు. క్రితం ఏడాది 2018లో ఇదే ధన త్రయోదశి రోజున 17,000 కిలోల పసిడి అమ్మకాలు జరిగాయి. వీటి ధర రూ.5,500 కోట్లు ఉంటుంది. దీన్ని బట్టి చూస్తే వ్యాపారం 35 నుంచి 40 శాతం వరకు తగ్గే అవకాశం ఉందని సీఏఐటికి చెందిన గోల్డ్ అండ్ జ్యువెలరీ కమిటి చైర్మన్ పంకజ్ అరోరా ఒక ప్రకటనలో ఆందోళన వ్యక్తం చేశారు.

### ధరలు పెరగడమే కారణం

అమ్మకాలు తగ్గడానికి ప్రధాన కారణం బంగారం, వెండి ధరలు పెరగడమే. ధరలు పెరగడంతో డిమాండ్ తగ్గందని అన్నారు. గత పది సంవత్సరాల కాలంలో ఈ స్థాయిలో అమ్మకాలు పడిపోలేదని ఆయన తెలిపారు. మొత్తానికి అమ్మకాలు నిరుత్సాహానికి గురి చేస్తున్నాయన్నారు. ఆల్ఇండియా జెమ్స్ అండ్ జ్యువెటరీ డొమెస్టిక్ కౌన్సిల్ (జీజెసీ) చైర్మన్ అనంత పద్మనాభన్ మట్లాడుతూ.. వ్యాల్యూమ్స్ ప్రకారం 20 శాతం తగ్గే అవకాశం ఉందని, విలువ ప్రకారం చూస్తే గత ఏడాది మాదిరిగా ఉండ వచ్చునని, ఎందుకంటే ఈ ఏడాది ధరలు పెరగడమే కారణమన్నారు.

ధనత్రయో దశి సందర్భంగా ప్రజలు ఎంతో కొంత మొత్తంలో బంగారం కొనుగోలు చేయాలన్న సెంటిమెంట్ ఉంది కాబట్టి అమ్మకాల విలువ గత ఏడాది స్థాయిలో ఉండవచ్చునని పద్మనాభన్ అన్నారు. పెళ్లిళ్ల సీజన్‌లోగా ధరల్లో కరెక్షన్ రావచ్చునని ఆశిస్తున్నామన్నారు. దేశంలోని ఇతర ప్రాంతాలతో పోల్చుకుంటే పశ్చిమ ప్రాంతాన అమ్మకాలు ఊపందుకున్నా యన్నారు. పశ్చిమ ప్రాంతం వారికి దీపావళి అత్యంత ప్రముఖమైన పండుగ ఘనంగా జరపుకుంటారని ఆయన చెప్పారు.

### ఢిల్లీలో పరిమితి స్థాయిలో కొనుగోళ్లు

ఢిల్లీలోని కరోల్‌బాగ్ జ్యువెలరీ అసోసియేషన్ ప్రెసిడెంట్ విజయ్ ఖన్నా మాట్లాడుతూ.. ధనత్రయోదశి కారణంగా మొక్కుబడిగా కొనాలంటే కొనాలి అనే పద్ధతిని ప్రజలు ఎంతో కొంత కొనుగోలు చేశారని చెప్పారు. ఈ సారి ధనత్రయోదశిలో అమ్మకాలు అంతంత మాత్రంగా ఉన్నాయి. రాబోయే పండుగ సీజన్‌లో అమ్మకాలు పుంజుకుంటాయన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. సెన్కో గోల్డ్ అండ్ డైమండ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సువాంకర్ సేన్ మాట్లాడుతూ.. అమ్మకాలు తగ్గుతాయని ముందుగా ఊహించిందేనని అన్నారు. ఆర్థికమాంద్యం ఒకవైపు, ధరల పెరుగుదల మరోవైపు ఈ నేపథ్యంలో ప్రజల్లో కొనుగోలు శక్తి తగ్గుతోందన్నారు. తన అంచనా ప్రకారం అమ్మకాలు 10-15 శాతం తగ్గుతాయన్నారు. విలువ ప్రకారం చూస్తే గత ఏడాది మాదిరిగా ఉంటాయని... ఎందుకంటే ఈ ఏడాది ధరలు పెరిగాయన్నారు.ముంబైలోని జవేరి బజార్‌కు చెందిన కుమార్‌జైన్ మాట్లాడుతూ.. పెళ్లిళ్ల నగల బుకింగ్ ఇప్పుడిప్పుడే జోరందుకుంటోందన్నారు. తక్కువ ధరకు లభించే బంగారు ఆభరణాల అమ్మకాలు పుంజుకుంటున్నాయని తెలిపారు. వరల్డ్ గోల్డ్ కౌన్సిల్ ఇండియా ఎండీ సోమసుందరం పీఆర్ మాట్లాడుతూ.. ధరలు పెరగడం.. దీంతో పాటు బులియన్ మార్కెట్లో భారీ డిస్కౌంట్ల వల్ల దాని ప్రభావం క్యూ3 ఫలితాలపై కనిపిస్తుందన్నారు.బంగారం ధర పది గ్రాములు రూ.39వేలు అత్యంత ఖరీదైన వ్యవహారం కాబట్టి కొనుగోలుదారులు వెండి నాణెలతో సరిపెట్టుకుంటున్నారని గోల్డ్ రిఫైనరీ ఎంఎంటీసీ పీఏఎంపీ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ రాజేశ్ ఖోస్లా చెప్పారు.

## నిరుత్సాహపరిచిన సంవత్ 2075


• 11.6 శాతం ఆదాయం
• రేపటి నుంచి సంవత్ 2076.. దీపావళి మూరత్ ట్రేడింగ్ షురూ



సంవత్ 2075కు చివరి ట్రేడింగ్ రోజు స్టాక్ మార్కెట్లు లాభాలతో ముగిశాయి. క్యూ2 ఫలితాలు మెరుగ్గా ఉండటంతో మదుపరులు ఎంపిక చేసిన బ్యాంకింగ్, ఐటి రంగానికి చెందిన షేర్లను కొనుగోలు చేశారు. శుక్రవారం సెన్సెక్స్ 523 పాయింట్ల వరకు ఊగిసలాడి చివరకు 37.67 పాయింట్ల లాభంతో 39,058.06 వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈ కేవలం 1.30 పాయింట్లు లాభపడి 11,583.90 వద్ద స్థిరపడింది.మొత్తానికి హిందూ కేలండర్ సంవత్ 2075 నిరుత్సాహానికి గురి చేసిందని చెప్పవచ్చు. గత ఏడాది సంవత్‌తో పోల్చుకుంటే సెన్సెక్స్ 4,066.15 పాయింట్లు లేదా 11.62 శాతం, నిఫ్టీ 1,053.90 పాయింట్లు లేదా 10 శాతం లాభపడింది. ఈ వారం మొత్తానికి చూస్తే సెన్సెక్స్ 240.32 పాయింట్లు, నిఫ్టీ 77.95 పాయింట్లు లాభపడ్డాయి. శుక్రవారం బీఎస్ఈలో అత్యధికంగా లాభపడిన షేర్లలో ఎస్ బ్యాంకు అగ్రస్థానంలో ఉంది. తర్వాతి స్థానం ఎస్‌బీఐ దీని షేరు 7.19 శాతం వరకు లాభపడింది. క్యూ2లో ఆరురెట్లు నికరలాభాన్ని ప్రకటించింది. ఈ రెండు షేర్లతో పాటు ఐసీఐసీఐ బ్యాంకు, సన్‌ఫార్మా, టీసీ ఎస్, హెచ్‌సీఎల్ టెక్, మారుతి, భారతి ఎయిర్‌టెల్, ఇన్ఫోసిస్ షేర్లు 3.18 శాతం వరకు పుంజుకున్నాయి. దీనికి వ్యతిరేకంగా టాటామోటార్స్, వేదాంత, హెచ్‌డీఎఫ్‌సీ, కొటక్ బ్యాంకు, హీరోమోటో కార్ప్, ఎన్ టీపీసీ షేర్లు 4.87 శాతం వరకు క్షీణిం చాయి. ప్రస్తుతం ఫలితాల సీజన్ మొదలైంది కాబట్టి ఇన్వెస్టర్లు వేచి చూసే ధోరణిని అవలంబిస్తున్నారు. రాబోయే రోజుల్లో నిఫ్టీ 11,000 నుంచి 11,700 మధ్యలో ట్రేడ్ కావచ్చునని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు.ఫలితాలను బట్టి చూస్తే ఆటో,రియల్టీ, అతి పెద్ద ప్రైవేట్ బ్యాంకులు ఇతర రంగాలకు చెందిన షేర్ల కంటే ఈ రంగానికి చెందిన షేర్లు ఊపందుకుంటాయని, సెప్టెంబర్ త్రైమాసికం తర్వాత నుంచి పైన తెలిపన రంగాలకు చెందిన షేర్లు కోలుకుంటాయని చెబుతున్నారు. బీఎస్ఈలో బ్యాంకెక్స్, ఐటి, టెక్, రియల్టీ, చమురు సహజవాయువు, ఫైనాన్స్, హెల్త్‌కేర్, సూచిలు 1.07 శాతం వరకు లాభపడగా. కన్స్యూమర్ డ్యూ రబుల్స్, టెలికం, ఇండస్ట్రియల్స్, విద్యుత్, యుటిలిటిలు, క్యాపిటల్‌గూడ్స్ రంగానికి చెందిన సూచిలు 1.78 శాతం వరకు నష్టపోయాయి. గ్లోబల్ మార్కెట్ల విషయానికి వస్తే మిశ్రమ స్పందన కనిపించింది. బ్రెగ్జిట్‌పై అనిశ్చిత నెలకొనడంతో దాని ప్రభావం గ్లోబల్ మార్కెట్లపై పడింది.


సంవత్ 2075లో సెన్సెక్స్ 11 శాతం లాభపడింది. మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచిలు వరుసగా 7 శాతం, 10 శాతం నష్టపోయాయి. ఈ ఏడాది మొత్తానికి చూస్తే తీవ్ర ఒడిదుడుకులకు గురైంది. కేంద్రంలో మోడీ ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత స్టాక్ మార్కెట్లు సరొకొత్త శిఖరాలకు చేరాయి. సంవత్ 2075లో బీఎస్ఈ సెన్సెక్స్, నిఫ్టీలు ఆల్‌టైం రికార్డు బద్దలుకొట్టాయి. సెన్సెక్స్ 40వేల పాయింట్లకు, నిఫ్టీ 12000 పాయింట్లకు ఎగబాకాయి.

## టాటామోటార్స్ నష్టం రూ.188 కోట్లు



**న్యూఢిల్లీ:** దేశీయ ఆటో దిగ్గజం టాటామోటార్స్ సెప్టెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో ఏకీకృత నష్టం రూ.187.7 కోట్లని తెలిపింది. దేశీయ మార్కెట్లో వాహనాలకు డిమాండ్ తగ్గిందని తెలియజేసింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో నికర నష్టం రూ.1,009.49 కోట్లని బీఎస్ఈకి సమాచారం అందించింది. మొత్తం రెవెన్యూ క్యూ2లో రూ.65,431.95 కోట్లకు దిగిరాగా.. ఏడాది క్రితం రూ.71,981.08 కోట్లని తెలియసేజింది. బ్రిటిష్ అనుబంధ సంస్థ జాగ్వార్ ల్యాండ్ రోవర్ పన్ను చెల్లించడానికి ముందు 156 మిలియన్ పౌండ్లులాభాన్ని ప్రకటించగా.. ఏడాది క్రితం 246 మిలియన్ పౌండ్లని తెలిపింది. కాగా బ్రిటిష్ బ్రాండ్ హోల్‌సేల్ అమ్మకాలు క్యూ2లో 2.9 శాతం పెరిగి 134,489 యూనిట్లకు చేరింది. జెఎల్ఆర్ లాభాలతో పాటు రెవెన్యూ కూడా పెరుగుతోందని, కొత్త వ్యాపార పంథాతో కొత్తటెక్నాలజీ వినియోగించడంతో అవార్డులు, రివార్డులు వచ్చాయని జెఎల్ఆర్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ రాల్ఫ్ స్పెత్ అన్నారు. స్టాండ్ఎలోన్ ప్రాతిపదికన నికరనష్టం రూ.1,281.97 కోట్లకు ఎగబాకగా.. ఏడాది క్రితం రూ.109.14 కోట్ల నికరలాభాన్ని ప్రకటించింది. దీర్ఘకాలంగా ఆటో రంగం మందగమనంలో కొట్టుమిట్టాడుతోందని, ఆర్థిక వ్యవస్థ మందగించడంతో దాని ప్రభావం అమ్మకాలపై పడిందని టాటా మోటార్స్ సీఈవో గుంటెర్ బట్స్‌చక్ అన్నారు. బీఎస్ఈలో దీని షేరు 4.87 శాతం క్షీణించి రూ.126.95 వద్ద ముగిసింది.

## అలంబిక్ ఫార్మా లాభం రూ.250 కోట్లు



• క్యూ2లో 25 శాతం వృద్ధి

**న్యూఢిల్లీ :** అలంబిక్ ఫార్మాస్యూటికల్స్ క్యూ2 నికరలాభంలో 25.12 శాతం వృద్ధితో రూ.250.45 కోట్లు ఆర్జించింది. ఏడాది క్రితం రూ.200.09 కోట్లని బీఎస్ఈకి సమాచారం అందించింది. రెవెన్యూ రూ.1,240.87 కోట్లకు ఎగబాకగా.. ఏడాది క్రితం రూ.1,127.06 కోట్లని రెవెన్యూలో 10 శాతం వృద్ధి సాధించామని కంపెనీ ఎండీ ప్రణవ్ అమిన్ తెలిపారు. ఆర్అండ్‌డిపై పెద్ద మొత్తంలో పెట్టుబ డులు పెడతామని అమిన్ అన్నారు. బీఎస్ఈలో దీని షేరు 0.10 శాతం పెరిగి రూ.50.95 వద్ద ఇంట్రాడేలో ట్రేడ్ అయ్యింది.

## మారికో లాభం రూ.253 కోట్లు



**న్యూఢిల్లీ :** ఎఫ్ఎంసీజీ దిగ్గజం మారికో లిమిటెడ్ సెప్టెంబర్‌తో ముగిసిన త్రైమాసికం ఏకీకృత నికరలాభంలో 17.12 శాతం వృద్ధితో రూ.253 కోట్లు ఆర్జించింది. ఏడాది క్రితం నికర లాభం రూ.216 కోట్లని బీఎస్ ఈకి సమాచారం అందించింది. అమ్మకాలు మాత్రం స్వల్పంగా తగ్గి రూ.1,829 కోట్లకు దిగిరాగా.. ఏడాది క్రితం రూ.1,837 కోట్లని తెలిపింది. రూ.1 ముఖవిలువ కలిగన షేరుపై రూ.2.75 డివిడెండ్‌ను ప్రకటించింది. బీఎస్ఈలో దీని షేరు 0.32 శాతం క్షీణించి రూ.393.40 వద్ద ముగిసింది.

## స్ట్రైడ్స్ ఫార్మా లాభం రూ.142 కోట్లు



**న్యూఢిల్లీ:** ప్రముఖ ఔషధ కంపెనీ స్ట్రైడ్స్ ఫార్మాసైన్స్ సెప్టెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో ఏకీకృత నికరలాభం రూ.141.91 కోట్లు ఆర్జించింది. ఏడాది క్రితం ఇదే త్రైమాసికంలో రూ.8.70 కోట్లు నష్టాన్ని ప్రకటించినట్లు బీఎస్ఈకి సమాచారం అందించింది. మొత్తం ఆదాయం రూ.728.08 కోట్లకు ఎగబాకగా.. ఏడాది క్రితం రూ.529.46 కోట్లని తెలిపింది. క్యూ2లో కంపెనీ వ్యూహాత్మకంగా వ్యవహరించి వృద్ధిరేటుపై ఫోకస్ పెట్టడంతో పాటు లాభాల మార్జిన్‌పై దృష్టిపెట్ట డంతో మంచి ఫలితాలను సాధించామని స్ట్రైడ్స్ ఫార్మా సైన్సెన్స్ గ్రూపు సీఈవో, ఎండీ, అరుణ్‌కుమార్ చెప్పారు. బీఎస్ఈలో దీని షేరు 6.39 శాతం పెరిగి రూ.366.45 వద్ద ఇంట్రాడేలో ట్రేడ్ అయ్యింది.

## ఇన్ఫీ దర్యాప్తునకు సహకరించండి

• సెబీని కోరిన ఎస్ఈసీ

**న్యూఢిల్లీ :** దేశీయ టెక్ దిగ్గజం ఇన్ఫోసిస్ సీఈవో అనైతిక చర్యలకు పాల్పడుతు న్నారని కంపెనీ ఉద్యోగులే పెద్ద ఎత్తున ఆరోపణలు చేయడం పెద్ద దుమారాన్ని లేపింది. సీఈవో, సీఎఫ్ఓ ఖాతాల్లో లాభాలను ఎక్కువచేసి చూపించారని ఆరోపించారు. దీంతో ఇన్ఫోసిస్ షేర్లు భారత్‌తో పాటు అమెరికాలో ఎన్‌వై ఎస్ఈలో ట్రేడ్ అవుతాయి. ఇన్ఫీపై వచ్చిన ఆరోపణల నేపథ్యంలో భారత్‌తో పాటు అమెరికాలో దీని షేరు భారీగా పతనమైంది. ఇన్వెసర్టర్లు భారీ ఎత్తున చేతులు కాల్చుకున్నారు. దీంతో అమెరికాలో ఇన్వెస్టర్లు ఇన్ఫోసిస్‌పై చర్య తీసుకొని తమ నష్టాన్ని తిరిగి ఇప్పించాలని అక్కడి యూస్ సెక్యూరిటీస్ అండ్ ఎక్స్చేంజీ కమిషన్ (ఎస్ ఈసీ)కి దరఖాస్తు చేసుకున్నారు. కాగా ఇన్ఫోసిస్ వచ్చిన ఆరోపణలపై దర్యాప్తు చేసేందుకు సహకరించాల్సిందిగా ఎస్ఈసీ సెబి సహాయాన్ని కోరినట్లు విశ్వసనీయవర్గాలు శుక్రవారం నాడు తెలిపాయి.

## బిగ్ సీ 2వ లక్కీ డ్రా విజేతలకు కార్ల అందజేత



**హైదరాబాద్:** దసరా, దీపావళి సందర్భంగా దసరావళి డబుల్ ధమాకా ఆఫర్‌కు ప్రజల నుంచి చక్కని స్పందన లభించిందని బిగ్ సీ వ్యవస్థాపకుడు ఎం బాలుచౌదరి తెలిపారు. ఈ ఆఫర్ సెప్టెంబర్ 30 నుంచి అక్టోబర్ 29వ తేదీ వరకు కొనసాగుతుందన్నారు. శుక్రవారం నాడు రెండవ లక్కీ డ్రా తీయడం జరిగిందని అన్నారు. లక్కీ డ్రా కారు విజేతలకు కార్లు అందజేయడం జరిగింద న్నారు.

**రెండవ వారం కార్లు గెలుచుకున్న విజేతలు**


1. మహ్మద్ అథర్‌అలీ, కూపన్ నెంబర్ 16873 2. టి కోటేశ్వరరావు కూపన్ నెం. 38271, 3. వెంకటరమణ కూపన్ నెం 29892, 4. ప్రేమ్ కుమార్ కూపన్ నెం. 57623, 5. పీ శ్రీను కూపన్ నెం. 116872, 6. నవీన్ కూపన్ నెం. 18005, 7. డి గణేశ్ కూపన్ నెం.113972, 8. పీ. బాలస్వామిరెడ్డ కూపన్ నెం.64730, 9. మహ్మద్ లతీఫ్ కూపన్ నెం. 110486, 10. కె శ్రీనివాసరావు కూపన్ నెం. 112291. అని బిగ్ సీ ఒక ప్రకటనలో పేర్కొంది.

## ధనత్రయోదశి సందర్భంగా 700 హెక్టార్ల ఎస్‌యూవీల డెలివరీ

**న్యూఢిల్లీ:** ఎంజీ మోటార్స్ ఇండియా దంతేరస్ సం ద ర్భంగా దేశవ్యాప్తంగా 700 యూనిట్ల ఎస్‌యూవీ హెక్టా ర్లను డెలివరీ చేసింది. ఢిల్లీ - ఎన్‌సీఆర్‌లోనే సుమారు 200 యూనిట్లను కస్టమర్లకు అందజేసింది. ఒక్క రోజులోనే భారీ మొత్తంలో హెక్టార్లను డెలివరీ చేసి రికార్డు సృష్టిం చినట్లు ఎంజీ మోటార్ ఇండియా డైరెక్టర్, సేల్స్ రాకేశ్ సిదానా ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటి వరకు హెక్టా ర్‌మోడల్స్ బుకింగ్‌లు 38 వేలు జరిగాయన్నారు. బుకిం గ్‌లు భారీగా పెరిగినందున నవంబర్ నుంచి రెండవ షిఫ్ట్ ప్రారంభించి ఉత్పత్తిని పెంచుతున్నట్లు ఆయన తెలిపారు.

## ప్రపంచ కుబేరుడు బిల్‌గేట్స్

• నెంబర్ వన్ స్థానం నుంచి జెఫ్ బెజోస్ ఔట్




**సియాటెల్ :** అమెజాన్ వ్యవస్థాపకుడు, సీఈవో జెఫ్ బెజోస్ ప్రపంచంలోనే అత్యంత సంపన్నుడు అనే టైటిల్‌ను కోల్పోయాడు. క్యూ3 ఫలితాలు పేలవంగా నమోదు కావడంతో అమెజాన్ షేర్లు గురువారం నాడు ఏడు శాతం వరకు పడిపోయాయి. మార్కెట్ విలువ ఏకంగా ఏడు బిలియన్ డాలర్లు కరిగిపోయింది. దీంతో బెజోస్ సంపద 103.9 బిలియన్ డాలర్లకు దిగివచ్చింది.

దీనికి వ్యతిరేకంగా మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాపకుడు బిల్‌గేట్స్ ప్రస్తుత సంపద 105.7 బిలియన్ డాలర్లుగా తేలింది. గేట్స్ విషయానికి వస్తే వరుసగా 24 సంవత్సరాల పాటు ప్రపంచంలో అత్యంత సంపన్నడుగా రికార్డు బద్దలు కొడుతూ వస్తున్నారు. అయితే 2018లో గేట్స్ జోరుకు బెజోస్ బ్రేకు వేసి ఆ కిరీటాన్ని దక్కించుకున్నారు. అప్పుడు బెజోస్ నికర సంపద 160 బిలియన్ డాలర్లుగా తేలింది. సెప్టెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో అమెజాన్ నికర ఆదాయం 26 శాతం తగ్గింది. 2017 తర్వాత ఈ స్థాయిలో ఆదాయం తగ్గడం ఇదే మొదటిసారి అని ఫోర్బ్స్ వెల్లడించింది. గురువారం ట్రేడింగ్ ముగిసిన తర్వాత అమెజాన్ షేరు సుమారు 9 శాతం క్షీణించి 1,624 డాలర్ల వద్ద ముగసింది. బిల్‌గేట్స్ విషయానికి వస్తే ఫోర్బ్స్ బిలియనీర్ జాబితాలో 1987లో స్థానం దక్కించుకున్నారు. అప్పుడు ఆయన నికర సంపద 1.25 బిలియన్ డాలర్లు. అదే ఫోర్బ్స్ 400 సంపన్నుల జాబితాలో బెజోస్ 1998లో చేరారు. అమెజాన్ ఐపీఓకు వెళ్లిన తర్వాత సంవత్సరంలో బేజోస్ ఫోర్బ్స్ జాబితాలో చేరారు. అప్పుడు ఆయన సంపద 1.6 బిలియన్ డాలర్లుగా తేలింది. ఇదిలా ఉండగా బేజోస్ ఈ ఏడాది ఏప్రిల్‌లో భార్యతో విడాకులు తీసుకున్నారు. ఆమెకు 36 బిలియన్ డాలర్లు షేర్లు భరణంగా ఇచ్చారు. చరిత్రలో ఇదే ఖరీదైన విడాకులుగా రికార్డు కెక్కింది.



## దుమ్మురేపిన ఎస్‌బీఐ

• నికరలాభం రూ. 3,375 కోట్లు • క్యూ2లో ఆరు రెట్లు వృద్ధి • కలిసొచ్చిన బీమా వాటాల విక్రయం



**ముంబై:** ప్రభుత్వరంగానికి చెందిన స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) సెప్టెంబర్‌తో ముగిసిన త్రైమాసికం నికరలాభంలో 6 రెట్లు వృద్ధిని నమోదు చేసింది. క్యూ2 నికరలాభం రూ.3,375.40 కోట్లు కాగా, ఏడాది క్రితం ఇదే త్రైమాసికంలో రూ.576.46 కోట్లని ఎస్‌బీఐ ఒక ప్రకటనలో తెలిపింది. క్యూ2లోనే ఎస్‌బీఐకి చెందిన అనుబంధ బీమా సంస్థలో కొంత వాటాను విక్రయించడంతో దాని ప్రభావం లాభాలపై కనిపించింది. బ్యాంకు మొత్తం ఆదాయం (ఏకీకృతం) రూ.89,347.91 కోట్లకు ఎగబాకగా.. ఏడాది క్రితం రూ.79,302.72 కోట్లని బీఎస్ఈకి సమాచారం అందించింది. ఎస్‌బీఐ లైఫ్ ఇన్స్యూరెన్స్ నుంచి 4.5 శాతం వాటాలను రూ.3,190.97 కోట్లకు విక్రయించింది. ఎస్‌బీఐ లైఫ్ ఇన్స్యూరెన్స్‌లో ఎస్‌బీఐ తన వాటాను 62.10 శాతం నుంచి 57.60 శాతానికి తగ్గించుకుంది.

స్టాండ్ఎలోన్ ప్రాతిపదికన చూస్తే బ్యాంకు నికర లాభం 3 రెట్లు పెరిగి రూ.3,011.73 కోట్లకు చేరగా.. ఏడాది క్రితం రూ.944.87 కోట్లుగా తేలింది. స్టాండ్ ఎలోన్ ప్రాతిపదికన ఆదాయం రూ.72,850.78 కోట్లకు చేరగా.. ఏడాది క్రితం రూ.66,607.98 కోట్లని తెలిపింది. నికర వడ్డీ ఆదాయం ఏడాది ప్రాతిపదికన 17 శాతం పెరిగి రూ.24,600 కోట్లకు ఎగబాకగా.. ఏడాది క్రితం రూ.23,075 కోట్లని తెలిపింది. బ్యాంకు నాణ్యమైన ఆస్తుల విలువ కూడా కాస్తా మెరుగుపడింది. నిరర్థక ఆస్తులు లేదా మొండిబకాయిలు క్యూ2లో 7.19 శాతానికి దిగిరాగా.. ఏడాది క్రితం 9.95 శాతంగా నమోదయ్యాయి. నికర ఎన్‌పీఏ కూడా 2.79 శాతానికి దిగిరాగా.. ఏడాది క్రితం 4.94 శాతంగా నమోదైంది. వివరంగా చెప్పాలంటే గరిష్ఠ ఎన్‌పీఏ రూ.1.61 లక్షల కోట్లకు దిగిరాగా.. ఏడాది క్రితం ఇదే త్రైమాసికంలో రూ.2.05 లక్షల కోట్లుగా నమోద య్యాయి. మొండిబకాయిల కోసం కేటా యింపులు రూ.11,396.87 కోట్లు తగ్గితే... ఏడాది క్రితం రూ.10,381.31 కోట్లు తగ్గాయి. అలాగే నికరవడ్డీ మార్జిన్ కాస్తా మెరుగుపడి 3.22 శాతానికి ఎగబకాగా.. ఏడాది క్రితం 2.78 శాతంగా నమోదైంది.

### డీహెచ్‌ఎఫ్ఎల్ గురించి..

డీహెచ్‌ఎఫ్ఎల్‌కు రూ.7,000 కోట్ల రుణాలు ఇచ్చామని, క్యూ3లో ఇది మొండి బకాయిగా మారిపోయే అవకాశం ఉందన్నారు. దీని కోసం ఇప్పటికే 20 శాతం కేటా యింపులు చేసి పెట్టామన్నారు. డీహెచ్‌ఎఫ్ఎల్‌కు బ్యాంకులు, మ్యుచువల్ ఫండ్స్ రుణాలు ఇచ్చి ఇబ్బందులు పడుతున్నాయన్నారు. అయితే త్వరలోనే దీనిపై ఒప్పందం కుదురుతుందన్న నమ్మకాన్ని వ్యక్తం చేశారు. ఎన్‌బీఎఫ్‌సీలకు బ్యాం కులు రుణాలు ఇవ్వవద్దని హెచ్చరికలు వస్తున్న విషయం వాస్తవమే కానీ.. వాస్తవానికి ఎన్‌బీ ఎఫ్ సీల సంక్షోభం భూతద్దంలో చూపిస్తున్నారన్నారు. ఎస్‌బీఐ కేవలం డీహెచ్‌ఎఫ్ ఎల్ ఒక్క ఖాతాతోనే ఇబ్బంది పడుతోందని.. మిగిలిన ఎన్‌బీ ఎఫ్‌సీలకు ఇచ్చిన వాటితో ఎలాంటి సమస్య లేద న్నారు. రిటైల్ రుణాలపై పూర్తిగా ఫోకస్ పెట్టినట్లు, ఆటోరంగం నుంచి ఎలాంటి ఇబ్బందులు లేవన్నారు.

### నెట్‌వర్కు విస్తరణ గురించి

ఈ ఆర్థిక సంవత్సరం ముగిసేలోగా కొత్తగా 600 బ్రాంచీలను ప్రారంభిస్తామన్నారు. ఏడాది క్రితం ఇదే త్రైమాసికంలో 275 బ్రాంచీలను తెరిచినట్లు ఎస్‌బీఐ చైర్మన్ చెప్పారు. ఎస్‌బీఐ జనరల్ ఇన్స్యూ రెన్స్ ఐపీవో ఉప సంహరణ గురించి ప్రస్తావిస్తూ.. వాటాల విక్రయానికి ముందే దీని విలువ రూ.50వేల కోట్లు దాటిపోయిందన్నారు. అందుకే ఐపీవోకు రాలేకపోయామ న్నారు.

ఈ ఆర్థిక సంవత్సరం మాత్రం ఐపీవోకు రాలేమన్నారు. అయితే మార్చితో ముగిసే త్రైమాసి కంలో వచ్చే అవకాశం ఉందన్నారు. ఎస్‌బీఐ ఫలితాలు మాత్రం అంచనాలను మించాయని బ్రోకరేజీ సంస్థలు పేర్కొంటున్నాయి. మొండిబకాయిలు అదుపులోకి రావడం బ్యాంకుకు బాగా కలిసొచ్చే అంశమని చెబుతున్నారు. బీఎస్ఈలో దాని షేరు 7.54 శాతం పెరిగి రూ.282.50 వద్ద ముగిసింది.

### ఎస్‌బీఐ చైర్మన్ కాన్ఫరెన్స్ కాల్ వివరాలు



ఎస్‌బీఐ చైర్మన్ రజనీష్‌కుమార్ కాన్ఫరెన్స్ కాల్‌లో మాట్లాడుతూ.. ఆర్థిక వ్యవస్థ మందగించడంతో కార్పొరేట్లకు కేటాయించిన మూలధ నంలో కొద్ది మంది మాత్రమే తీసుకున్నారని, దీంతో కార్పొరేట్ రుణాల డిమాండ్ 9 శాతానికి పరిమితమైందన్నారు. దీంతో ఇక నుంచి రిటైల్ రుణాలపై ఫోకస్ పెట్టామన్నారు. రిటైల్ రుణపుస్తకం 19 శాతం నుంచి 60 శాతానికి పెరిగిపోయిం దని రజనీష్‌కుమార్ కాన్ఫరెన్స్ కాల్‌లో చెప్పారు. త్వరలోనే కార్పొరేట్ రుణపుస్తకం కూడా పెరుగు తుందన్న విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. రుణాల మాఫీ వల్ల బ్యాంకుపై సుమారు రూ.16వేల కోట్ల భారం పడిందని,, సాధారణంగా అయితే రూ.8,000 కోట్లకు పరిమితం అవుతుందన్నారు. భవిష్యత్తులో దీన్ని రెండు శాతానికి పరిమితం చేస్తా మని భరోసాను వ్యక్తం చేశారు. ఎస్‌బీఐ లైఫ్‌లో వాటాను విక్రయించ డం ద్వారా రూ.3,500 కోట్లు సేకరించా మని చెప్పారు. ఈ నిధులను విద్యుత్ కంపెనీకి ఇచ్చిన రూ.2,600 కోట్ల ఖాతాకు విని యోగిం చుకుంటామన్నారు. వాస్తవా నికి ఈ ఖాతాను పునర్వ్యవస్థీకరించాలి కానీ.. అది వీలుపడలేద న్నారు. అలాగేమరో రూ.900 కోట్ల ఖాతా కూడా ఎన్‌పీఏగా మారిపోయింది. బీమా కంపెనీ వాటా లను విక్రయించడం ద్వారా వచ్చిన డబ్బును ఈ ఖాతాల కింద వినియోగించుకుంటామని తెలిపారు.

## 'పాడి' ప్రోత్సాహకాలు విడుదల

**హైదరాబాద్, ఆంధ్రప్రభ :** దీపావళి పండుగకు ముందే ప్రభుత్వం పాడి రైతులకు శుభవార్త తెలిపింది. గతంలో సీఎం కేసీఆర్ చేసిన ప్రకటన మేరకు ప్రతి లీటరుపై రూ.4 చొప్పున ప్రోత్సాహకాన్ని ఇచ్చేందుకు నిధులు విడుదలయ్యాయి. అలాటే గోపాలమిత్రల పారితోషకం మొత్తం కూడా మంజూరైంది. పాడి రైతులకు ప్రోత్సాహక నిధి కింద రూ.55.50 కోట్లు, గోపాల మిత్రలకు రూ.8.63 కోట్లు విడుదలచేస్తూ శుక్రవారం ఉత్తర్వులు వెలువడ్డాయి. అలాగే పశు వైద్యశాలలకు మందుల సరఫరా కోసం రూ.6.50 కోట్లు, పరికరాల సరఫరాకు రూ.2.50 కోట్లు, సంచార పశువైద్యశాలల నిర్వహణకు రూ.7.87 కోట్ల మొత్తాన్ని విడుదల చేశారు. అలాగే సబ్సిడీ గొర్రెల పథకం అమలుకు ఎన్సీడీసీ ద్వారా తీసుకున్న రుణంపై వాయిదాల చెల్లింపుకు రూ.22.39 కోట్లు కూడా విడుదల చేస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఇచ్చిన మాట ప్రకారం సీఎం కేసీఆర్ పాడి రైతులకు ప్రోత్సాహక నిధులను మంజూరు చేయడం, గోపాలమిత్రలను ఆర్థికంగా ఆదుకోవడంపట్ల రాష్ట్ర పశు సంవర్ధశాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ కృతజ్ఞతలు తెలిపారు.

## ఫెయిలైన ఇంటర్ విద్యార్థుల ఫీజు వాపస్

**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** 2019 ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల్లో ఫెయిలై రీవెరిఫికేషన్, రీకౌంటింగ్ కోసం ఫీజు చెల్లించిన విద్యార్థులకు తిరిగి చెల్లించనున్నట్టు ఇంటర్ బోర్డు కార్యదర్శి సయ్యద్ ఉమర్ జలీల్ తెలిపారు. ఇందుకు సంబంధించిన నిధులు రూ. 1,62,25,100లను జిల్లా ఇంటర్ విద్యాధికారు లకు విడుదల చేసినట్టు బోర్డు కార్యదర్శి శుక్రవారం ఒక ప్రకటన లో తెలిపారు. 2019 మార్చిలో జరిగిన ఇంటర్ వార్షిక పరీక్షల్లో ఫెయిలైన వారందరికీ ఉచితంగా రీవెరిఫి కేషన్, రీకౌంటింగ్ నిర్వహిస్తామని ప్రభుత్వం ప్రకటించిన ప్రకారం ఫీజు చెల్లించిన విద్యార్థులు వారి హాల్‌టికెట్లు గానీ, ఫీజు చెల్లించిన రశీదులను జిల్లా ఇంటర్ విద్యాధికారులకు చూపి ఫీజులను తిరిగి పొందాలని బోర్డు కార్యదర్శి ఉమర్ జలీల్ స్పష్టం చేశారు.

## కేజీబీవీ బదలీల దరఖాస్తు గడువు 28 వరకు పెంపు

**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** రాష్ట్రంలో సమగ్ర శిక్షా అధ్వర్యంలో నడుస్తున్న కస్తూర్బాగాంధీ బాలికా విద్యాల యాల్లో తాత్కాలికంగా కాంట్రాక్ట్ పద్ధతిపై పనిచేస్తున్న ఉద్యోగులు, సిబ్బంది బదలీల షెడ్యూల్‌లో స్వల్ప మార్పులు చేశారు. బదలీల కోసం దరఖాస్తు చేసుకోవడానికి గడువును 25 నుంచి 28 వరకు పొడిగించినట్టు పాఠశాల విద్య కమిషనర్ టి విజయ్ కుమార్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. 29న ఎడిట్ ఆప్షన్‌కు అవకాశం కల్పించారు. స్పెషల్ ఆఫీసర్లు తమ సర్టిఫికెట్లను డీఈవోలకు 30లోపు సమర్పించాలి. 6న తమకు కావల్సిన ప్రాంతాల వెబ్ ఆప్షన్లను ఇవ్వాల్సి ఉంటుంది. స్పౌజ్ కేసులకు సంబంధించిన వారి దరఖాస్తులను డీఈవోఉ నవంబర్ 6న పరిశీలిస్తారు. బదలీల తుది వెబ్ అలాట్‌మెంట్‌ను 7న ప్రకటిస్తారు. 11న పాత కాంట్రాక్ట్ రద్దయినట్టు కొత్తగా చేరిన కేజీబీవీల్లో నూతనంగా కాంట్రాక్ట్ ప్రారంభం అవుతున్నట్టు ప్రకటిస్తారు.

## ఓఎంసీ కేసు విచారణ 30కి వాయిదా

**హైదరాబాద్, ఆంధ్రప్రభ :** ఓబులాపురం మైనింగ్ కేసులో గాలి జనార్ధన్‌రెడ్డి, ఐఏఎస్ శ్రీలక్ష్మి సీబీఐ కోర్టుకు హాజరయ్యారు. వీరితో పాటు శ్రీనివాస్‌రెడ్డి, రాజగోపాల్, కృపా నందం, ఆలీఖాన్ కూడా వచ్చారు. ఓఎంసీ కేసుపై హైదరా బాద్‌లోనే విచారణ జరపాలన్న సీబీఐ పిటిషన్‌పై వాదనలు జరిగాయి. న్యాయ మూర్తి తదుపరి విచారణను ఈ నెల 30కి వాయిదా వేశారు.

# విద్యార్థుల్లేని బడులకు తాళాలు..?

- మూడేళ్లుగా విద్యార్థుల్లేని స్కూళ్లు 916
- మూసివేత దిశగా ప్రభుత్వం కసరత్తు
- రేషనలైజేషన్‌లో భాగంగా యోచన
- విద్యార్థులు చేరకపోవడంతోనే నిర్ణయం
- సమీప స్కూల్స్‌లో కొన్ని స్కూల్స్ విలీనం

**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** రాష్ట్రం లోని కొన్ని మారుమూల పాఠశాలల్లో విద్యార్థులు చేరడం లేదని మూడేళ్ల క్రితం పాఠశాల విద్య శాఖ అధికా రులు గుర్తించారు. వాటిలో విద్యార్థులు చేరకపోయి నప్పటికీ ఉపాధ్యాయులు కొనసాగుతున్నారు. ఈ నేపథ్యంలో పాఠ శాలల క్రమబద్దీకరణ చేస్తే ఆయా స్కూల్స్‌లోని ఉపాధ్యా యులను ఇతర పాఠశాలల్లో చేర్చుకోవ డానికి ఉపయోగం ఉంటుందని అధి కారులు భావించారు. ఈ నేపథ్యంలోనే పాఠశాలల క్రమ బద్దీకరణకు చర్యలు తీసు కుంటే బాగుం టుందని అధికారులు భావిం చారు. అందులో భాగంగా విద్యార్థులు చేరని పాఠశాలలను మూసివేసి కి.మీ. దూరంలో రెండు స్కూల్స్ ఉంటే వాటిలో ఒకదానినే కొన సాగిం చాలని.. ఒక ఊరిలో ప్రైమరీ స్కూల్‌తో పాటు, హైస్కూల్ ఉంటే రెండింటిని ఒకటిగా చేసి ఒకటే పాఠ శాలగా కొనసాగేలా చూడాలని ప్రతిపాద నలు సిద్ధం చేశారు. మారుమూల ఏజెన్సీల్లో విద్యార్థులు చేరని పాఠశాలలు ఎక్కువగా ఉంటున్నాయి.

### ఆందోళనలతో ప్రక్రియలో జాప్యం

క్రమబద్దీకరణ పేరుతో ప్రభుత్వ స్కూల్స్‌ను మూసివేసే చర్యలు చేపడుతోందని ఇటు ఉపాధ్యాయ సంఘాలతోపాటు, అటు విద్యార్థి సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో మూడేళ్ల క్రితం చేయాల్సిన పాఠశాలల క్రమబద్దీకరణ తాత్కాలికంగా ఆగిపోయింది. అయితే అప్పటి నుంచి ప్రభుత్వ స్కూల్స్‌లో చేరుతున్న విద్యార్థుల సంఖ్యను పరిశీలించారు. మూడేళ్లుగా రాష్ట్రంలోని 916 స్కూల్స్‌లో ఒక్క విద్యార్థి కూడా చేరడం లేదని అధికారుల లెక్కలు చెబుతున్నాయి. మూడేళ్ల క్రితం విద్యార్థులు చేరని స్కూల్స్ సుమారు 1500 వరకు ఉండగా, వాటిలో 2019-20 నాటికి 916కు పడిపోయింది. ఈ నేపథ్యంలో వాటిని మూసివేస్తే బాగుం టుందని పాఠశాల విద్య శాఖ అధికారులు భావిస్తున్నారు.

### ఫలితాలివ్వని సర్కార్ ప్రయత్నాలు

ప్రభుత్వ విద్యను పటిష్టం చేయడం కోసం తెలంగాణ సర్కార్ అనేక చర్యలు చేపట్టింది. అందులో భాగంగా ప్రభుత్వ పాఠశా లలు బలోపేతం చేయడం కోసం చర్యలు తీసుకున్నది. పాఠశాలల్లో మౌలిక వసతులను ఏర్పాటు చేయడమే కాకుండా కనీస సౌకర్యాలను కల్పించడం కోసం నిధులను సైతం కేటాయించింది. ప్రధా నంగా బాలికలు ఎక్కువగా ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో మరుగుదొడ్ల నిర్మాణాలు చేపట్టడమే కాకుండా ఉన్న వాటిని మరమ్మతులు చేయించింది. ప్రభుత్వ బడులపై ప్రజలకు నమ్మకం కలిగేలా చేయడానికి బడిబాటను సైతం ప్రారంభించింది. ప్రభుత్వ బడుల్లో విద్యార్థులు ఎక్కువ మంది చేరేలా చేయడానికి ఉపాధ్యాయులతో పాటు విద్యా వాలంటీర్లకు కూడా బాధ్యతలు అప్పగించింది.

ప్రభుత్వ పాఠశాలల్లో 6వ తరగతి నుంచి 10 వతరగతి వరకు చేరుతున్న విద్యార్థుల సంఖ్య ప్రైవేటు పాఠశాలల కంటే ఎక్కువగా ఉంటుంది. 1 నుంచి 5వ తరగతి వరకు ఎక్కువ మంది విద్యార్థులు ప్రైవేటు పాఠ శాలల్లో చేరుతున్నారని, కానీ అదే హైస్కూల్ స్థాయిలో అంటే 6 నుంచి 10 తరగతి వరకు ప్రభుత్వ స్కూల్కలో చేరు తున్నారు. కాబట్టి ప్రభుత్వ హైస్కూల్స్‌లో కనీస సౌకర్యాల కల్పనకు చర్యలు తీసుకుం టున్నారు. 1 నుంచి

### విద్యార్థుల 'ప్రైవేటు' బాట

5వ తరగతి వరకు విద్యార్థులు ప్రైవేటు కంటే తక్కువగా చేరుతు న్నందున ప్రభుత్వ బడుల్లో ప్రీప్రైమరీ క్లాసులను ప్రారం భిస్తే ఎలా ఉంటుందని, అలాగే 1వ తరగతి నుంచే ఇంగ్లీష్ మీడియంను ప్రభుత్వ బడుల్లో మొదలు పెట్టడంపై కూడా పాఠశాల విద్య శాఖ అధికారులు ఆలోచనలు చేస్తున్నారు. ఈ రెండు అంశాలపై ప్రభుత్వ నిర్ణయం కోసం అధికారులు ఎదురుచూస్తున్నట్టు సమాచారం. ఇప్పటికే ఈ సమస్య లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని పాఠశాల విద్య శాఖ ఉన్నతాధికారి ఒకరు చెప్పారు. అయితే ప్రభుత్వ నిర్ణయం మేరకే తాము వ్యవహరించుకుంటామని చెబుతున్నారు.

బడీడు పిల్లలందరూ పాఠశాలలోనే ఉండేలా చర్యలు తీసుకుం టుంది. కానీ అవి సత్ఫలితాలు ఇవ్వడం లేదనేది తెలుస్తోంది.

# డిజిటల్ లైబ్రరీలు ఏర్పాటు చేస్తాం


### మంత్రి సబితా ఇంద్రారెడ్డి



**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న గ్రంథాలయాలను ఆధునీకరించి డిజిటల్ లైబ్రరీలను ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోనున్నట్టు విద్య శాఖ మంత్రి పి సబితా ఇంద్రారెడ్డి తెలిపారు. గ్రంథాలయాల్లో విద్యార్థులు, నిరుద్యోగ యువతకు పోటీ పరీక్షలకు ఉపయోగపడే పుస్తకాలను ఉంచేలా చూడాలని గ్రంథాలయా సంస్థల చైర్మన్లను మంత్రి ఆదేశించారు. జిల్లా గ్రంథా లయా సంస్థల చైర్మన్లతో మంత్రి శుక్రవారం తన కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. సమావేశంలో రాష్ట్ర గ్రంథాలయా సంస్థ చైర్మన్ ఆయాచితం శ్రీధర్, విద్య శాఖ కార్యదర్శి బి జనార్దన్‌రెడ్డి, గ్రంథాలయా సంస్థ డైరక్టర్ రమణకుమార్‌తోపాటు జిల్లా గ్రంథాలయా సంస్థల చైర్మన్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మారుతున్న కాలానుగుణంగా గ్రంథాలయాల తీరుతెన్ను లతోపాటు పని విధానంలో మార్పులు రావల్సిన అవసరం ఉందన్నారు. సాంకేతిక పరిజ్ఞానం పెరుగుతున్నందున గ్రంథాలయాలను ఆధునీకరించాల్సిన అవసరం ఉందన్నారు. హైదరాబాద్ నగరంతోపాటు జిల్లా కేంద్రాల్లోనూ డిజిటల్ లైబ్రరీలను, ఎలక్ట్రానిక్ లైబ్రరీలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ఆలోచిస్తుందన్నారు. మున్సిపాలిటీలు, కార్పొరేషన్లతోపాటు గ్రామపంచాయతీల నుంచి జిల్లా గ్రంథాలయాలకు రావల్సిన సెస్సును వెంటనే ఇప్పించేందుకు ఆయా శాఖల మంత్రులతో తానే స్వయంగా మాట్లాడతానని మంత్రి చైర్మన్లకు చెప్పారు. కొత్తగా ఏర్పడిన జిల్లా కేంద్రాల్లో అనువైన స్థలాలు ఉంటే వెంటనే జిల్లా గ్రంథాలయ భవన నిర్మాణ పనులను ప్రారంభిస్తామని మంత్రి స్పష్టం చేశారు. ఇప్పటికీ ప్రభుత్వ స్థలాలను గుర్తించని జిల్లా కలెక్టర్లకు వెంటనే స్థలాలు సేకరించాలని ఆదేశాలు జారీ చేస్తామన్నారు. గ్రంథాలయ సంస్థల పరిధిలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేసే విషయాన్ని సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఆర్థికంగా పరిపుష్టితో ఉన్న జిల్లా గ్రంథాలయా సంస్థల్లో ఖాళీగా ఉన్న పోస్టులను ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో భర్తీ చేసుకొనే అంశాన్ని పరిశీలిస్తామన్నారు.

జిల్లా చైర్మన్లను జిల్లా పరిషత్‌తోపాటు మండల పరిషత్, మున్సిపల్ సమావేశాల్లో పాల్గొనే విషయాన్ని ప్రభుత్వం పరిశీలిస్తోందని తెలిపారు. రాష్ట్రంలోని గ్రంథాలయాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరిం చేందుకు ప్రతి 3 నెలలకొకసారి గ్రంథాలయ సంస్థల చైర్మన్లతో ప్రత్యేకంగా సమావేశాలను ఏర్పాటు చేయాలని గ్రంథాలయ సంస్థ డైరక్టర్‌ను ఆదేశించినట్టు మంత్రి సబితా ఇంద్రారెడ్డి సమావేశంలో స్పష్టం చేశారు. గ్రామపంచాయతీలు గ్రంథాలయాలను నిర్వహించేందుకు ముందుకు వస్తే అక్కడ మినీ లైబ్రరీలను ఏర్పాటు చేయాలని అధికారులను మంత్రి సబితా ఇంద్రారెడ్డి అధికారులను ఆదేశించారు.

## ఎంఐఎం గెలుపు ప్రమాదకరం



**న్యూఢిల్లీ:** బీహార్ అసెంబ్లీ ఉప ఎన్నికల్లో అఖిల భారత మజ్లిస్ ఇ ఇత్తెహాదుల్ ముస్లిమీన్ (ఎఐఎం ఐఎం) విజయం సాధించడం బీహార్ లోని సామాజిక సమగ్రతకు ముప్పు ను సూచిస్తుందని కేంద్ర మంత్రి గిరి రాజ్‌సింగ్ అన్నారు. ఒవైసీ నేతృ త్వం లోని ఎఐఎంఐఎం కిషన్‌గంజ్ సీటును గెలుచుకోవడం జిన్నా భావ జాలం విజయమని బీజేపీ సీనియర్ నేత గిరి రాజ్‌సింగ్ అన్నారు. అత్యంత ప్రమాద కరమైన ఎన్నికల తీర్పు బీహార్ ఉప ఎన్నికల్లో వచ్చింద న్నారు. ఒవైసీకి జిన్నా మనస్తత్వం ఉందన్నారు. వారు వందే మాత రాన్ని ద్వేషిస్తున్నారు. సామాజిక సమ గ్రతకు ముప్పు తెస్తున్నారని సింగ్ ట్వీట్ చేశారు.

## 'కచ్చులూరు' బాధితులకు ఎక్స్‌గ్రేషియా

- ఒక్కొక్కరికి రూ.10 లక్షలు విడుదల చేసిన ఏపీ సర్కార్
- తెలంగాణ మృతులు 12 మంది

**అమరావతి, ఆంధ్రప్రభ :** కచ్చులూరు బోటు ప్రమాదంలో మృతిచెందిన బాధిత కుటుంబ సభ్యులకు ఏపీ ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియాను విడుదల చేసింది. ఈ దుర్ఘటనలో మృతిచెందిన తెలంగాణకు చెందిన 12 మంది బాధితులకు ఒక్కొ క్కరికీ రూ. 10లక్షల చొప్పున మొత్తం రూ. కోటి 20 లక్షలను విడుదల చేసింది. దీనికి సంబంధించి శుక్రవారం జీవీ ఆర్‌టీ నెం. 1071ను విడుదల చేసింది. తూర్పుగోదావరి జిల్లా దేవిపట్నం మండలం కచ్చులూరు వద్ద జరిగిన బోటు ప్రమాదంలో తెలంగాణకు చెందిన బాస్కి రాజేందర్(వరంగల్), బాస్కి అవినాష్(వరంగల్), బాస్కి రాజేంద్రప్రసాద్(వరంగల్), గోరే రాజేంద్రప్రసాద్(వరం గల్), దోమల హేమంత్(వరంగల్), బాస్కి ధర్మరాజు(వరంగల్), కొమ్ముల రవి(వరంగల్), కొండూరు రాజ్‌కుమార్(వరంగల్), రేపాకుల విష్ణు(ఖమ్మం), జి. సునీల్(జనగాం), ఈరన్ సాయికుమార్(రంగారెడ్డి)లు మృతిచెందారు. ఈ క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం సీఎంఆర్ఎఫ్ కింద బాధిత కుటుం సభ్యులకు ఎక్స్‌గ్రేషియాగా అందిస్తుంది.

## 'ఆర్సీఈపీ నుంచి భారత్ వైదొలగాలి'

**హైదరాబాద్,ఆంధ్రప్రభ:** ప్రాంతీయ సమగ్ర ఆర్థిక భాగస్వామ్యం (ఆర్సీఈపి) ఒప్పందం నుంచి భారత్ వైదొలగాలని అఖిల భారత రైతాంగ పోరాట సమితి పిలుపునిచ్చింది. ఈ మేరకు శుక్రవారం రాష్ట్ర వ్యాప్తంగా రైతులు ఆందోళనలు చేపట్టారు. వనపర్తిలో వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డికి రైతులు వినతి పత్రం అందించారు. ర్యాలీలు, ప్రదర్శనలు, నిరసనలు,కలక్టరేట్ల ముట్టడి చేపట్టారు. అనంతరం కలక్టర్లకు వినతి పత్రాలు అందించారు. హైదరాబాద్‌లోని సుందరయ్యాపార్క్ వద్ద జరిగిన నిరసన కార్యక్రమంలో ఆలిండియా కిసాన్ సభ(ఏఐకేఎస్)జాతీయ ఉపాధ్యక్షులు సారంపల్లి మల్లారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్సీఈపి ఒప్పందం అముల జరిగితే దేశ వ్యవసాయం, అనుబంధ రంగాలు మరింత సంక్షోభంలో కూరుకుపోతాయన్నారు. రైతులు, పాల ఉత్పత్తిదారుల జీనోపాధిపై తీవర్మైన ప్రభావం పడుతుందని తెలిపారు. దేశఝంలో పదికోట్ల రైతు కుంటుంభాలకు పాడి పరిశ్రమ జీవనాదారంగా ఉందన్నారు. పాలధరలో 71శాతం రైతంగానికి చేరుతుందని అన్నారు. దేశంలో పాలపాడి కిలో రూ.260 ఉండగా,న్యూజిలాండ్ లో కేవలం రూ.160 నుంచి 170 కే లభిస్తుందన్నారు. ఈ నేపథ్యంలో ఒప్పందం ప్రకారం 85శాతం మంది చిన్న,సన్నకారు రైతులు ఉపాధికోల్పొతారని పేర్కొన్నారు.


## విద్యుదాఘాతంతో విద్యార్థి మృతి



**నిజామాబాద్ అర్బన్, ప్రభన్యూస్ :** విద్యుత్ అధి కారుల నిర్లక్ష్యం వల్ల ఓ విద్యార్థి ప్రాణాన్ని గాలిలో కలిసేలా చేసింది. ఈ విషాదకర సంఘ టన జిల్లా కేంద్రం లోని కోట గల్లి ప్రభుత్వ బాలికల కళాశాల ఆవరణలో శుక్రవారం మధ్యా హ్నం చోటు చేసుకుంది. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో అసద్‌బాబా నగర్‌కు చెందిన అయాన్(10) విద్యార్థి 5వ తరగతి చదువు తున్నాడు. శుక్రవారం మధ్యాహ్నం పాఠ శాలకు ఆనుకుని ఉన్న బాలికల కళాశాల ఆవరణలో ఆడుకుంటుండగా కిందికి వేలాడుతున్న విద్యుత్ తీగలు తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు సిరాజ్‌భాయ్, నజీయాబేగంలు అక్కడికి చేరుకుని కొడుకు మృతదేహాన్ని చూసి బోరున విలపించారు. కన్నీరుమున్నీరుగా విలపి స్తున్న వారిని చూసి స్థానికులు సైతం కంట తడిపెట్టుకున్నారు. సిరాజ్‌భాయ్, నజీయబేగం దంపతులకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు కాగా విద్యుదాఘాతంతో మృత్యువాత పడ్డ అయాన్ పెద్ద కొడుకు. సిరాజ్‌భాయ్ ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. అధికారుల నిర్లక్ష్యంతో విద్యార్థి మృతి చెందాడని ఆరోపిస్తూ విద్యార్థి సంఘాలు పాఠశాలలో ఆందోళన కార్యక్రమాలు చేపట్టారు.


## ముదిగొండ శివప్రసాద్‌కు గుప్తా ఫౌండేషన్ సాహితీ పురస్కారం

### 31న ఏలూరులో ప్రదానం



**హైదరాబాద్, ఆంధ్రప్రభ :** దేశానికి కీర్తి ప్రతిష్టలు తెచ్చి పెట్టిన జాతీయ, అంతర్జాతీయ స్థాయి గల విద్వాంసులకు ప్రతీ సంవత్సరం గుప్తా ఫౌండేషన్ శ్రీకృష్ణమూర్తి సాహితీ పురస్కారం అందించడం జరుగుతుందని ఆ ఫౌండేషన్ చైర్మన్ ఎం.మోహన గుప్తా తెలిపారు. 2019 ఏడాదికిగాను ఈ పురస్కారాన్ని హైదరా బాద్‌కు చెందిన చారిత్రక నవలా చక్రవర్తి ప్రొ. ముదిగొండ శివప్రసాద్‌కు ఇవ్వనున్నట్టు తెలిపారు. రూ.2లక్షల నగదు, ఇతర లాంఛనాలు నవలా చక్ర వర్తికి అందజేస్తున్నారు. ప్రొ.శివప్రసాద్ ఇప్పటి వరకు 108 గ్రంథాలు రచించారని, జాతీయ, అంతర్జాతీయ వేదికలపై వేలాది సాహితీ సాంస్కృతిక ప్రసంగాలు చేశారన్నారు. 1,100 సార్లు భువన విజయం సాహితీ రూపక ప్రదర్శనలు ఇచ్చారని, ప్రముఖ కవుల నుంచి సనాతన ధర్మసాహితీ పురస్కారం, నోరి నరసింహశాస్త్రి శతజయంతి సాహితీ సన్మానం వంటి వందలాది సత్కారాలు భారత్‌తో పాటు పలు దేశాల్లో అందుకున్నారు. తన తండ్రి శ్రీ కృష్ణమూర్తి పేరు మీద ఏలూరులో 1994లో 'అత్యున్నత సాహితీ పురస్కారం' ఏర్పాటు చేసినట్టు వివ రించారు. ఎం.మోహన గుప్తా జన్మదినం సందర్భంగా అక్టోబర్ 31 న ఏలూరులో శివప్రసాద్‌ను 'గుప్తా ఫౌండేషన్ శ్రీకృ ష్ణమూర్తి సాహితీ పురస్కారం'తో సత్కరిస్తున్నట్టు ఫౌండేషన్ మేనేజర్ పి.శ్రీనివాస్, ఎం.పద్మసుషమ తెలిపారు.

## రైల్వే అప్రెంటీషిప్‌లో తెలంగాణకు అన్యాయం



**హైదరాబాద్, ఆంధ్రప్రభ :** ఐటీఐ విద్యార్థులకు అప్రెం టీషిప్ అవకా శాలు కల్పించే విషయంలో దక్షిణ మధ్య రైల్వే అధికారులు నిబంధనలు సక్రమంగా పాటించకపోవ డంతో తెలంగాణ యువత క ు తీరని అన్యాయం జరుగుతోందని రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ బోయిన్‌పల్లి వినోద్ కువూర్ ఆందోళన వ్యక్తం చేశారు. తెలంగాణకు జరుగుతున్న అన్యా యంపై కేంద్ర రైల్వే శాఖ మంత్రి పీయూష్ గోయల్‌కు ఆయన లేఖ రాశారు. ఐటీఐ పూర్తి చేసిన అభ్యర్థులకు అప్రెం టీషిప్ అవకాశాలు కల్పించే విషయంలో స్థానిక ఎంప్లాయి మెంట్ ఎక్స్చేంజ్‌లో పేరు నమోదు చేసుకున్న వారికే ఇవ్వాలన్న నిబంధనలు ఖచ్చితంగా అమలు చేసేలా దక్షిణ మధ్య రైల్వే జీఎంను ఆదేశించాలని లేఖలో కోరారు.2014లో సవరించిన చట్టాన్ని అమలు చేయాలనిఆయన కేంద్ర మంత్రిని కోరారు.

## సమయపాలనలో ఎస్‌సీఆర్ భేష్

**హైదరాబాద్, ఆంధ్రప్రభ :** సమయ పాలన పనితీరును మెరుగుపరుచుకునే దిశలో భారతీయ రైల్వే నిరంతరంగా కృషి చేస్తున్నది. తత్ఫలితంగా భారతీయ రైల్వే సమయపాలన పని తీరులో గత ఏడాది నమోదు 67.05 శాతం కంటే అధి కంగా 72. 21 శాతంగా నమోదు చేసింది. దక్షిణ మధ్య రైల్వేలో ఈ ఆర్థిక సంవత్సరం మొదటి ఆరు నెలల్లో సమయ పాలన 82 శాతానికి పెరిగింది. మెయిల్, ఎక్స్‌ప్రెస్ రైళ్ళ సమ య పాలన పనితీరు గత ఆర్థిక సంవత్సరం (2018-19) ఇదే సమయంలో 70 శాతం మాత్రమే. గత ఏడాదితో పోలిస్తే దక్షిణ మధ్య రైల్వే సమయ పాలన పని తీరులో సగటున 8 శాతం వృద్ధి కనిపిస్తోంది.

## గ్రూప్-2లో 242 మంది బీసీ స్టడీసర్కిల్ అభ్యర్థులు ఎంపిక

**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** గ్రూప్-2 తుది ఫలితాల్లో తెలంగాణ బీసీ స్టడీ సర్కిల్‌లో శిక్షణ పొందిన 242 మంది అభ్యర్థులు గురువారం తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ప్రకటించిన గ్రూప్-2 ఉద్యోగాలు పొందారని బీసీ సంక్షేమ శాఖ ముఖ్యకార్యదర్శి సి పార్థసారథి తెలిపారు. స్టడీ సర్కిల్‌లో ఉచిత శిక్షణ పొంది గ్రూప్-2 ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులను బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్ శుభాకాంక్షలు తెలిపి, అభినందించారు. శుక్రవారం బీసీ సంక్షేమ శాఖ అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలోని బీసీ స్టడీసర్కిల్స్‌ను మరింత బలోపేతం చేస్తామని మంత్రి గంగుల కమలాకర్ అన్నారు.

## రవిప్రకాష్‌కు స్వల్ప ఊరట

**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** టీవీ9 మాజీ సీఈవో రవిప్రకాశ్‌కు హైకోర్టులో స్వల్ప ఊరట లభించింది.సైబరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసు స్టేషన్‌లో నమోదైన కేసులో రవిప్రకాశ్ పెట్టుకున్న బెయిల్ దరఖాస్తును పరిశీలిం చాలని రంగారెడ్డి జిల్లా, కూకట్‌పల్లి లోని 9వ అదనపు మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టును హైకోర్టు ఆదేశించింది. హైకోర్టు బెయిల్ ఇచ్చిన కారణం గా కింది కోర్టులో పెండింగ్ లో ఉన్న బెయిల్ దరఖా స్తును పరిశీ లించేలా ఆదేశాలు జారీ చేయాలని రవి ప్రకాష్ అభ్యర్థించారు. పిటిషనర్ పెట్టుకున్న బెయిల్ దరఖా స్తును పరిశీలించాలని అదనపు మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టును హైకోర్టు ఆదేశించింది. తదుపరి విచారణ నాలుగు వారాలకు వాయిదా వేశారు.

## నార్సింగిలో మహిళ కిడ్నాప్.. గ్యాంగ్‌రేప్

**హైదరాబాద్, ఆంధ్రప్రభ :** హైదరాబాద్ శివారులో శుక్రవారం సాయంత్రం మరో దారుణం చోటు చేసుకుంది. హైదరాబాద్ నార్సింగి ప్రాంతంలోని పుప్పాలగూడలో ముగ్గురు కామాంధులు ఒంటరి మహిళపై కన్నేసి ఆమెను కిడ్నాప్ చేశారు. అనంతరం నిర్మా నుష్య ప్రాంతానికి తీసుకెళ్లి నోట్లో గుడ్డలు కుక్కి చిత్రహింసలకు గురిచేశారు. అనం తరం ఆమెపై సామూహిక అత్యాచారానికి పాల్ప డ్డారు. అయితే దుండగుల బారి నుండి తప్పించుకుని రోడ్డుపైకి వచ్చి కేకలు వేసింది. దీంతో సమీ పంలో ఉన్న స్థానికులు అక్కడికి చేరుకుని ఆ ముగ్గురు దుండగులను పట్టు కునేందుకు యత్నించారు. వారిలో ఇద్దరు పారిపోగా ఒకరు స్థానికులకు చిక్కాడు. దీంతో స్థానికులు ఆ దుండగుడికి దేహశుద్ధి చేసి అనంతరం పోలీసులకు అప్ప గించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. అత్యా చారానికి గురైన మహిళను వైద్యచికిత్సల నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.

# గ్రామీణ ఆర్థికాభివృద్ధికి కృషి

### డిండిలో గొర్రెలు, గేదెలు పంపిణీ చేసిన మంత్రి తలసాని



**డిండి, ప్రభన్యూస్ :** గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం కోసం తెరాస ప్రభుత్వం కృషి చేస్తుందని రాష్ట్ర పశుసంవర్ధక, మత్స్యశాఖల మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. శుక్రవారం నల్గొండ జిల్లా డిండి మండల కేంద్రంలోని డిండి రిజర్వాయర్‌లో 14.50 లక్షల చేపపిల్లలను దేవరకొండ ఎమ్మెల్యే రమావత్ రవీంద్ర కుమార్, అచ్చంపేట ఎమ్మెల్యే గువ్వల బాలురాజు లతో కలిసి ఆయన విడుదల చేశారు. స్థానిక మార్కెట్ యార్డులో పశుప్రదర్శనను, లేగదూడల ప్రదర్శనను ప్రారంభించి 24మందికి రెండవ విడత గొర్రెల పంపిణీ, 28మందికి పాడిగేదెలను సబ్సిడీపై పంపిణీ చేసి 8మందికి గేదెలు చనిపోయిన వారికి ఇన్సూరెన్స్ కింద మళ్లీ ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి తలసాని మాట్లాడుతూ ఐదు సంవత్సరాల్లో తెలంగాణలో ఎంతో మార్పు వచ్చిందని, రైతుబంధు, రైతు బీమాలు దేశానికే ఆదర్శమన్నారు. ఇతర రాష్ట్రాలు, కేంద్ర ప్రభుత్వం ఆశ్చర్యపోయేలా సీఎం కేసీఆర్ పథకాలను చేపడుతున్నారని అన్నారు. కులవృత్తులు, చేతివృత్తుల వారికి అనేక ప్రోత్సాహకాలు ఇస్తున్నారని, గొల్ల కుర్మలను బలోపేతం చేసేందుకు రూ.1.25 లక్షలతో 21 గొర్రెలు అందిస్తున్నారని, చనిపోయినా ఇన్సూరెన్స్ సౌకర్యం అందిస్తున్నారని అన్నారు. గొర్రెల మేత కోసం 75శాతం సబ్సిడీపై గడ్డి విత్తనాలు అందిస్తు న్నారని విజయ డెయిరీ, నల్గొండ డెయిరీ పాలకు రైతుల వద్ద నుంచి సేకరించే పాలకు రూ.4 ఇన్సెంటివ్ ఇస్తున్నారని, కానీ ఈ సంవత్సరం ఆర్థిక మాంద్యం వలన ఇవ్వడం లేదని త్వరలోనే ఇస్తామని మంత్రి అన్నారు. మత్స్యకారులకు సంబంధించి గత ప్రభుత్వాల్లో రూ.5 కోట్లు మాత్రమే ఇచ్చేవారని, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రూ.1000 కోట్లు ఇస్తున్నారని అన్నారు. డిండిలో కేవలం 21ఫీట్ మేర నీరు ఉన్నా 14.50 లక్షల చేపపిల్లలను విడుదల చేశామని అన్నారు. కొన్ని పార్టీల వారు ఏవో లేనిపోని ఆరోపణలు చేస్తుంటారని, టీవీల్లో, పేపర్లలో రావడానికి సీఎం కేసీఆర్, ఆయన కుటుంబం పై ఆరోపణలు చేస్తున్నారని దానికి ధీటుగా హుజూర్‌నగర్ ప్రజలు తీర్పు చెప్పారని అన్నారు. గత కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమ పథకాలు సక్రమంగా అమలు చేయనపుడు నాడు విమర్శలు చేయని నాయకులు నేడు తెరాస ప్రభుత్వం ప్రజాసంక్షేమ పథకాలను చేపడుతుంటే విమర్శలు చేస్తున్నారని అన్నారు. అనంతరం దేవరకొండ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ మాట్లాడుతూ రెండవ విడుత గొర్రెల పంపిణీ డిండిలో ప్రప్రథమంగా చేపట్టినందుకు మంత్రి తలసాని కి ధన్యవాదాలు చెప్పారు. కుల వృత్తుల వారికి తెరాస ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తూ వారికి గొర్రెలు, గేదెలు పంపిణీ చేస్తుందని, చేపపిల్లలను ఉచితంగా చెరువుల్లో, రిజర్వాయర్లలో వదులుతోందని, వాహనాలను సబ్సిడీ పై ఇస్తుందని అన్నారు. ప్రజా సంక్షేమంలో తెరాస సర్కారు దేశంలోనే అగ్రగామి అని అన్నారు. మత్స్యకారులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం స్టాల్స్ ను ఇవ్వడం జరిగిందని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఇన్‌చార్జ్ కలెక్టర్ వి.చంద్రశేఖర్, రాష్ట్ర పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ వంగాల లక్ష్మారెడ్డితోపాటు పలువురు అధికారులు , స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. మంత్రి తలసాని దృష్టికి స్థానికులు పలు సమస్యలు తీసుకొచ్చి పరిష్కరించాలని కోరారు.

## ఉప ఎన్నికల్లో జేడీయూకు దెబ్బ

**పాట్నా:** బీహార్‌లో అక్టోబర్ 21న జరిగిన ఐదు అసెంబ్లీ నియోజకవర్గాల ఉప ఎన్నికల్లో ఎన్డీయే మిత్రపక్షం, అధికారిక జేడీయూకి ఎదురుదెబ్బ తగిలింది. ఈ ఉప ఎన్నికలు జేడీయూ ఇమేజ్‌ను దెబ్బతీయగా ప్రధాన ప్రతిపక్షం ఆర్జేడీకి జీవనాధారంగా మారాయి. అధికార జనతాదళ్ యునైటెడ్ (జేడీయూ) ఈ ఉప ఎన్నికల్లో మూడు సొంత అసెంబ్లీ స్థానాలను కోల్పోయింది. రాష్ట్రీయ జనతాదళ్ (ఆర్జేడీ) రెండు స్థానాల్లో విజయం సాధించింది. 2015లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఆర్జేడీ 80 స్థానాల్లో విజయం సాధించింది. అనంతరం జరిగిన ఉప ఎన్నికల్లో తన సొంత డెహ్రీ నియోజకవర్గాన్ని కోల్పోయింది. దీంతో 244మంది అసెంబ్లీ సభ్యుల్లో ఆర్జేడీ బలం 79కి పడిపోయింది. అయితే తాజాగా జరిగిన ఉప ఎన్నికల్లో రెండు అసెంబ్లీ నియోజకవర్గాలను గెలుచుకోవడం ద్వారా అసెంబ్లీలో తన బలాన్ని ఆర్జేడీ 81కు పెంచుకుంది. 2015 ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ 53స్థానాలను గెలుచుకుంది.తాజాగా జరిగిన ఎన్నికల అనంతరం కూడా బీజేపీ బలం యథాతథంగా ఉంది. గురువారం ఫలితాలు తరువాత బీజేపీ, జేడీయూ సమావేశమై ఫలితాల సరళిపై చర్చించాయి. 2015లో జేడీయూ 71 స్థానాల్లో విజయం సాధించింది. అనంతరం ఇద్దరు రాష్ట్రలోక్‌సమతా పార్టీ ఎమ్మెల్యేలు జేడీయూలో చేరిన తరువాత దాని బలం 73కు పెరిగింది. 21న జరిగిన ఉప ఎన్నికల్లో మూడు స్థానాలను కోల్పోవడంతో అసెంబ్లీలో జేడీయూ బలం 70స్థానాలకు పరిమితమైంది. మరోవైపు బీహార్ అసెంబ్లీలో కాంగ్రెస్ సభ్యుల సంఖ్య 26కు తగ్గిపోయింది. కిషన్‌గంజ్‌లో అసదుద్దీన్ ఒవైసీ నేతృత్వంలోని ఎంఐఎం ఖాతా తెరవడంతో కాంగ్రెస్ ఆ స్థానాన్ని కోల్పోయింది.

## గుప్త నిధుల తవ్వకాలు.. ముగ్గురు పోలీసులు అరెస్ట్

**హైదరాబాద్, ఆంధ్రప్రభ :** యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండలంలోని వేల్పుపల్లి గ్రామంలో సెప్టెంబర్ 13న జరిపిన గుప్తనిధుల తవ్వకాల కేసును ఎస్వోటీ పోలీసులు ఛేదించారు. మొత్తంగా పది మంది నిందితుల్లో ముగ్గురు ఖాకీలతో సహా నలుగురు పోలీసులకు చిక్కారు. ఈ కేసులో భాగస్వాములైన మరో ముగ్గురు వ్యక్తులు పరారీలో ఉన్నారు. భువనగిరి హోంగార్డు రామకృష్ణ మూటకొండూరు కానిస్టేబుల్ ప్రభాకర్, చౌటుప్పల్ హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్‌రెడ్డి అరె స్టయిన వారిలో ఉన్నారు. భూయజమాని ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అనుమానితులను విచారించిన క్రమం లో గుప్త నిధుల తవ్వకాల్లో ఖాకీల ప్రమేయం వెల్లడైంది.

## అచ్చెన్నాయుడుకు బెయిల్

**అమరావతి, ఆంధ్రప్రభ:** తెదేపా సీనియర్ నేత, మాజీ మంత్రి అచ్చెన్నాయుడు శుక్రవారం మంగళగిరి కోర్టులో లొంగిపోయారు. హైకోర్టు సూచనలకు అనుగుణంగా మంగళగిరి కోర్టులో లొంగిపోయిన అచ్చెన్నాయుడుకు ఆ కోర్టు బెయిల్ మంజూరు చేసింది. గత నెలలో టీడీపీ ఛలో ఆత్మకూరు కార్యక్రమంలో ఆయన పోలీసులను దుర్భషలా డారని కేసు నమోదు చేయడం జరిగింది. ఆయ నపై సొంత నియోజకవర్గంలో కూడా అదే రోజు పోలీ సులు కేసు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో ఆయన హైకోర్టును ఆశ్ర యించారు. అయితే హైకోర్టు స్థానిక కోర్టులో లొంగిపోయి బెయి ల్ తీసుకోవాలని సూచించింది. మంగళగిరి కోర్టుకు హాజరైన ఆయన రూ.50వేల పూచీకత్తుపై విడుదల య్యారు. అచ్చెన్నా యుడు మాట్లాడుతూ వైకాపా ప్రభుత్వం అక్రమ కేసులు నమోదు చేస్తుందని ఆరోపించారు. రాష్ట్రంలో ఇసుక కొరతపై ప్రభుత్వం పొంతన లేని సమాధానాలు చెబుతుందని, వైకాపా నేతలు అర్ధ రాత్రి ఇసుకను ఇతర రాష్ట్రాలకు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారని ధ్వజమెత్తారు.

## ఏపీ సర్కార్‌పై ప్రధానికి ఫిర్యాదు చేస్తా

### జగన్ ప్రభుత్వంపై పవన్ మండిపాటు



**అమరావతి, ఆంధ్రప్రభ:** వైకాపా ప్రభుత్వం, ఏపీ సీఎం జగన్మోహన్‌రెడ్డి అనుసరిస్తున్న విధానాలపై జనసేన అధినేత పవన్ కల్యాణ్ తీవ్రంగా స్పందించారు. దొంగల్లా అర్ధరాత్రి ఇసుక ఆన్‌లైన్ బుకింగ్‌లు ఏమిటని ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. రాష్ట్రంలో ఇసుక కృత్రిమ కొరత వల్ల లక్షలాది మంది భవన నిర్మాణ రంగ కార్మి కులు రోడ్డునపడ్డారని, అయినా ప్రభుత్వానికి చీమ కుట్టినట్లు అయి నా లేదని ధ్వజమెత్తారు. నవ్యాంధ్ర రాజధానిపై ప్రభుత్వం ఒక స్పష్టత నివ్వాలని ఏపీ సీఎం జగన్ దీనిపై ఒక స్పష్టమైన ప్రకటన చేయాలని జనసేనాని పవన్‌కల్యాణ్ డిమాండ్ చేశారు. అసలు అమరావతిలో రాజధానిని నిర్మిస్తారా..? లేదా అన్న విషయాన్ని తేల్చిచెప్పాలన్నారు. వైకాపా ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రధాని మోడీకి ఫిర్యాదు చేస్తానన్నారు. ఇసుక రవాణాకు సంబంధించి లారీల కొనుగోళ్లలో భాగంగా ప్రభుత్వం జారీ చేసిన 486 జీవోను ప్రధానికి, కేంద్ర హోంమంత్రి, ఆర్థిక మంత్రి, జీఎస్టీ కౌన్సిల్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు చెప్పారు. జగన్ సర్కార్‌ల మిగిలిన రాష్ట్రాలు కూడా వారి వారి ప్రయోజనాల కోసం ఇటువంటి ఉత్తర్వులు జారీ చేస్తే ప్రజల ప్రయోజనాలు దెబ్బతింటాయని ఆందోళన వ్యక్తం చేశారు.

## ల్యాండ్‌యాక్ట్ ఉల్లంఘనలపై సోరెన్ కుటుంబానికి నోటీసులు



**రాంచీ:** భూమిచట్టం ఉల్లంఘనకు సంబంధించి జార్ఖండ్ ముక్తి మోర్చా (జేఎంఎం) అధ్యక్షుడు శిబు సోరెన్‌తోపాటు ఆయన కుటుంబ సభ్యులకు నోటీసులు జారీ అయ్యాయి. రాంచీ, ధన్‌బాద్, బోకారో జిల్లాల్లో భూమికొనుగోలుదారులు, అమ్మకం దారులకు ఆయా జిల్లాల అదనపు కలెక్టర్‌లు నోటీసులు జారీచేశారు. నోటీసులుపై వారి స్పందన తెలియజేయవలసిందిగా కోరారు. జార్ఖండ్‌లోని మూడు జిల్లాల్లో 16పోలీస్ స్టేషన్లలో సోరెన్ కుటుంబ సభ్యులపై సుమారు 28 ల్యాండ్‌యాక్ట్ ఉల్లంఘన ఫిర్యాదులు నమోద య్యాయి. బీజేపీ రాజ్యసభ ఎంపీ సమీర్ ఒరాన్, బీజేపీ శాసనసభ్యుడు రామ్ కుమార్ పహాన్ ఫిర్యాదు ఆధారంగా ఈ నోటీ సులు జారీ అయ్యాయి. శిబుసోరెన్ కుటుం బసభ్యులు భూమిచట్టం ఉల్లంఘనపై దర్యాప్తునకు సంబంధించి అక్టోబర్ 21న ప్రధాన కార్యదర్శికి మెమోరాండం సమర్పించారని అధికారులు తెలిపారు.జార్ఖండ్ ముఖ్యమంత్రి రఘుబర్‌దాస్ గతంలోనే శిబుసోరెన్ ఆయన కుమారుడు, మాజీ ముఖ్య మంత్రి హేమంత్ సోరెన్ వారి కుటుంబ సభ్యులు భూచట్టాలను ఉల్లంఘించారని ఆరోపించారు. జార్ఖండ్‌లో రెండు భూ చట్టాలు అమలులో ఉన్నాయి. సీఎన్‌టీ, ఎస్‌పీటీ చట్టాలు అమల్లో ఉన్నాయి. సోరెన్‌కుటుంబ సభ్యులు పరిమితికి మించి భూమిని కొనుగోలుచేశారని ఆరోపణలు ఉన్నాయి. జార్ఖండ్‌లో మరో కొన్ని నెలల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో నోటీసులు జారీ అవడం రాజకీయ కుట్రగా జేఎంఎం పేర్కొంది.



## కీటక జనిత వ్యాధుల నిరోధానికి ప్రత్యేక కార్యాచరణ

- వైద్య ఆరోగ్యశాఖకు సీఎస్ ఎస్కే జోషి ఆదేశం

**హైదరాబాద్, ఆంధ్రప్రభ :** రాష్ట్రవ్యాప్తంగా కీటక జనిత వ్యాధుల నిరోధానికి ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను అమలు చేయాల్సిందిగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్కే జోషి వైద్య ఆరోగ్యశాఖ అధికారులను ఆదేశించారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాలకు వేర్వేరు కార్యాచరణలు సిద్ధంచేసి ప్రభుత్వానికి అందజేయాలని, సాధ్యమైనంత త్వరలో అమలుకు శ్రీకారం చుట్టాలని స్పష్టం చేశారు. రాష్ట్రంలో మలేరియా, డెంగ్యూ, చికన్‌గున్యా, ఫైలేరియా, జపానీస్ ఎన్‌సెఫలైటిస్ వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో ఈ ఆదేశాలు ఇచ్చారు. ఈ అంశంపై శుక్రవారం బీఆర్కే భవన్‌లో ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఇప్పటి వరకు దోమకాటుతో విష జ్వరాలు సోకి మరణించిన వారి వివరాల జాబితాను అందజేయాలని ఆదేశించారు. అలాగే జ్వరాల బారినపడి ఆసుపత్రుల్లో చేరిన వారి వివరాలను కూడా ఇవ్వాలన్నారు. రాష్ట్రంలో విష జ్వరాల తీవ్రతను గుర్తించిన కేంద్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి ప్రత్యేక బృందాన్ని పంపించిందని సీఎస్ తెలిపారు. ఈ వ్యాధుల నియంత్రణకు ప్రత్యేక దృష్టిసారించి అమలు చేస్తున్న కార్యాచరణ ప్రణాళికను వారికి నివేదించాల్సిన అవసరం ఉందన్నారు. దోమల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, మురుగునీటి నిర్వహణలో మరింత మెరుగైన జాగ్రత్తలు పాటించాలని, ఎక్కడ పడితే అక్కడ చెత్త పారవేయకుండా చూడాలని సీఎస్ అధికారులతో స్పష్టం చేశారు. మలేరియా, డెంగ్యూ లాంటి విషజ్వరాలు ప్రబలిన ప్రాంతాలను గుర్తించి అక్కడ యుద్ధ ప్రాతిపదికన నివారణ చర్యలు చేపట్టాలన్నారు. అదే సమయంలో ఆసుపత్రుల్లో చేరిన వారికి మెరుగైన వైద్యం అందేలా చూడాలని, అవసరం మేరకు మందులు అన్ని ఆసుపత్రుల్లో నిల్వ ఉంచాలని, గ్రామీణ ప్రాంతాల్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోనూ విష జ్వరాలకు వైద్యసేవలు అందాలని సీఎస్ ఆదేశాలు ఇచ్చారు. జ్వరాల నియంత్రణకు వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు.



## అంతర్గత భద్రతపై ప్రత్యేక దృష్టి

- కేంద్రమంత్రి జి. కిషన్‌రెడ్డి

**రాజేంద్రనగర్, ప్రభన్యూస్ :** దేశ సరిహద్దులు, అంతర్గత భద్రతపై కేంద్రప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారిస్తుందని కేంద్ర హోంశాఖ సహాయమంత్రి జీ.కిషన్‌రెడ్డి అన్నారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ 144వ జయంతి సందర్భంగా శుక్రవారం రాజేంద్రనగర్ సర్కిల్ శివరాంపల్లిలోని విజయానంద్ క్రీడా మైదానంలో సీఆర్పీఎఫ్ ఆధ్వర్యంలో స్నేహపూర్వక క్రికెట్ మ్యాచ్ నిర్వహించారు. క్రికెట్ మ్యాచ్‌ను నిర్వహించారు. మ్యాచ్ ప్రారంభోత్సవంలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి పాల్గొని ప్రసంగించారు. పోలీసు అమరవీరుల త్యాగాలు యువతకు తెలపాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. పోలీసుల త్యాగాలు మరువలేనివని కొనియాడారు. దేశరక్షణకోసం సైనికులు సరిహద్దులో తీవ్రమైన చలిలో కూడా సేవలనందించి ప్రజలను శత్రుదేశాల నుంచి కాపాడుతున్నారని వివరించారు. పోలీసులకు ప్రపంచ స్థాయి సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తేవడానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. పోలీసులు ఢిల్లీ వెళ్లినప్పుడు తప్పనిసరిగా పోలీసుల స్మారకస్థూపాన్ని సందర్శించాలని విజ్ఞప్తి చేశారు. 21నుంచి 27వరకు సంస్మరణ దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా క్రీడలు నిర్వహిస్తున్నట్లు సీఆర్పీఎఫ్ ఐజీ ఎంఆర్.నాయక్ చెప్పారు. సీఆర్పీఎఫ్ బ్యాండ్ సమర్పించిన పాటలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి.

## ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు

- యూనియన్లను బదనాం చేసేందుకే ఎత్తుగడ
- సమ్మెపై యూనియన్లతో చర్చించాకే ప్రభుత్వ నిర్ణయం.. పెదవి విరిచిన కార్మిక నేతలు

**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** సమ్మెను పరిష్కరించే దిశగా యూనియన్లతో చర్చలు జరపాలన్న ప్రభుత్వ నిర్ణయంపై ఆర్టీసీ కార్మిక జేఏసీ నేతలు పెదవి విరుస్తున్నారు. చర్చల విషయంలో ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉన్నట్లు కనిపించటం లేదని కార్మిక జేఏసీ కో.కన్వీనర్ థామస్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. ఈ మేరకు శుక్రవారం ఆయన 'ఆంధ్ర ప్రభ'తో ఫోన్‌లో మాట్లాడారు. చర్చలకు రావాలని ప్రభుత్వం నుంచి తమకు శుక్రవారం రాత్రి వరకు ఎలాంటి ఆహ్వానం అందలేదన్నారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే... చర్చలు ప్రారంభించాకనే ఈడీ కమిటీని వేసి ఉండేదన్నారు. కోర్టు ఆదేశాల మేరకే తప్పదన్నట్లు ప్రభుత్వం చర్చలకు పిలిచిందని అనుమానం వ్యక్తం చేశారు. యూనియన్లతో చర్చలను ప్రభుత్వం ఫలప్రదం కానివ్వబోదని అనుమానం వ్యక్తం చేశారు. చర్చలు జరిపినా సమ్మె పరిష్కారం కాలేదని కోర్టుకు విన్నవించేందుకే ప్రభుత్వం ఈ ఎత్తుగడ వేసినట్లు కనిపిస్తోందని అభిప్రాయపడ్డారు.

### ఎల్లంపల్లి నుండి నీటి విడుదల

**మంచిర్యాల, ప్రభన్యూస్ :** గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాలతో శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్ట్‌లోకి భారీగా వరదనీరు చేరడంతో ప్రాజెక్ట్ పూర్తి స్థాయి నీటి మట్టం 148 అడుగులు కాగా 147.76 అడుగులకు చేరుకుందని, ప్రాజెక్ట్ సామర్థ్యం 20.175టిఎంలు కాగా 19.5086 టిఎంసిలుగా నీరు చేరిందని అధికారులు తెలిపారు. ప్రాజెక్ట్‌లోకి 1,45,867 క్యూసెక్కులుగా ఇన్‌ఫ్లోగా వచ్చి చేరుతుండటంతో శుక్రవారం నాడు 20 గేట్లను ఎత్తి 1,84,450 క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలారు.

### భైంసా గడ్డెన్నవాగు ప్రాజెక్టు గేట్ల ఎత్తివేత

**భైంసా, ప్రభన్యూస్ :** కొద్ది రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు గడ్డెన్న వాగు ప్రాజెక్టుకు భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. ఎగువ ప్రాంతం నుండి పెద్ద ఎత్తున నీరు వచ్చింది. దీంతో శుక్రవారం సాయంత్రం రెండు గేట్లను ఎత్తి దిగువకు నీటిని వదిలారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 358.7 మీటర్లు ఉండగా పూర్తిగా నిండింది. అయితే మొత్తం 4 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా అంతే నీటిని అవుట్‌ఫ్లో కింద సుద్దవాగులోకి వదిలినట్లు ప్రాజెక్టు అధికారులు తెలిపారు.

### కడెం ప్రాజెక్టుకు జలకళ

**కడెం, ప్రభ న్యూస్ :** ఇటీవల కురుస్తున్న వర్షాల కారణంగా ఎగువ ప్రాంతాల నుంచి కడెం జలాశయానికి వరద నీరు చేరడంతో శుక్రవారం ఆయకట్టు అధికారులు 17వ నెంబర్ గేటును ఎత్తి దిగువకు నీటిని విడుదల చేశారు. మూడు, నాలుగు రోజులుగా జలాశయం ఎగువ ప్రాంతంలో కురుస్తున్న వర్షాల వల్ల ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతాల నుంచి వరద నీరు వచ్చి చేరుతుంది.

# ఆస్పత్రులు భద్రమేనా?

- ఇష్టారీతిన భవన నిర్మాణాలు
- గాల్లో దీపంలా రోగుల ప్రాణాలు
- పట్టించుకోని ఫైర్‌సేఫ్టీ అధికారులు
- మార్కెట్‌లోకి నకిలీ ఎన్‌ఓసీలు..!
- క్యాష్ చేసుకుంటున్న అధికారులు



**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** ఆస్పత్రుల భవన నిర్మాణాల్లో శాస్త్రీయత లోపించడమే తరుచూ అగ్ని ప్రమాదాలకు కారణంగా తెలుస్తోంది. ప్రభుత్వాలు దీని కోసం మార్గదర్శకాలను రూపొందించినా.. ఆచరణలో పాటించలేదనేది తాజా ఘటనతో వెల్లడైంది. భద్రతా సిబ్బందిలో ఫైర్ సేఫ్టీ ప్రొటోకాల్స్ తెలిసిన ఫైర్ సేఫ్టీ అధికారి కూడా ఉండాలి. ఇతను మొత్తం ఫైర్ సేఫ్టీ వ్యవస్థకు ఇన్‌చార్జిగా వ్యవహరించాలి. భద్రతా కమిటీ ఆమోదం పొందిన రాత పూర్వక ప్రణాళిక (ఫైర్ సేఫ్టీ మ్యాను వల్)ను సిద్ధం చేసుకోవాలి. షైన్ ఆస్పత్రిలో సంభవించిన అగ్ని ప్రమాదంతో నగరం ఒక్కసారిగా ఉలికిపడింది. ప్రభుత్వ లెక్కల ప్రకారం... రాష్ట్రంలో 8వేల ప్రైవేటు నర్సింగ్ హోంలు, ఆస్పత్రులు ఉన్నాయి. హైదరాబాద్ డీఎంఅండ్‌హెచ్‌వో పరిధిలో 1,294, వీటిలో గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో 1,600 ఆస్పత్రులు, నర్సింగ్ హోంలు ఉన్నాయి. వీటిలో ఉమ్మడి రంగారెడ్డి జిల్లా డీఎంఅండ్‌హెచ్‌ఓ పరిధిలో 1,200 ఉన్నాయి. వీటిలో హైదరాబాద్‌తో ఉమ్మడి రంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో విస్తరించిన గ్రేటర్ హైదరాబాద్ పరిధి పరంగా చూస్తే 1,600 ఆస్పత్రులు, నర్సింగ్ హోంలు ఉంటాయి.

### ఎన్‌ఓసీపై భిన్నవాదనలు

షైన్ ఆస్పత్రి విషయంలో ఎన్‌ఓసీపై భిన్నవాదనలు వినిపిస్తున్నాయి. వైద్య ఆరోగ్య శాఖ అధికారులు ఫైర్ ఎన్‌ఓసీ పత్రం తమకు సమర్పించినట్లు చెబుతున్నారు. జీహెచ్‌ఎంసీ అధికారులు మాత్రం తీసుకోలేదంటున్నారు. అంటే వైద్య ఆరోగ్య శాఖ అధికారులకు సమర్పించిన ఎన్‌ఓసీ నకిలీదా అనే అనుమానం కలుగుతోంది. ఫైర్ ఎన్‌ఓసీలు కూడా నకిలీవి ఉన్నాయన్న ఆరోపణలకు ఈ విషయం బలాన్నిస్తోంది. అధికారులు ఈ అంశంపై దృష్టి సారించి, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాల్సిన అవసరం ఉంది.

### పక్కదారి పడుతున్న ప్రక్రియ

ఈ ప్రక్రియలో పెద్దఎత్తున డబ్బులు చేతులు మారుతూ పేషంట్ల భద్రతను ప్రశ్నార్థకం చేస్తున్నట్లు ఆరోపణలున్నాయి. తనిఖీల సమయంలో అధికారులకు మామూళ్లు ఇచ్చి.. లోపాలున్నా చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. ఉమ్మడి రాష్ట్రంగా ఉన్నప్పుడు పంజాగుట్టలోని ఓ ఆస్పత్రిలో భారీ అగ్నిప్రమాదం జరిగింది. నీలోఫర్ ఆస్పత్రిలోనూ పలుమార్లు అగ్నిప్రమాదాలు సంభవించాయి. ప్రకృతి వైపరీత్యాలను సైతం ముందస్తుగా గుర్తించి నష్టనివారణ చర్యలు చేపట్టడంలో మానవ తప్పిదాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

### ఫైర్ సేఫ్టీ మ్యానువల్ అంటే..?


అగ్ని ప్రమాదాల నివారణ, నియంత్రణ (ఫైర్ ప్రివెన్షన్ అండ్ కంట్రోల్) అనేవి ఈ వ్యవస్థలోని ప్రధాన అంశాలు. వాటికి తగిన వ్యవస్థలు, నిర్వహణ పట్టిక, ఫైర్ సేఫ్టీ పరికరాల తనిఖీ విధానాలు (ప్రోటోకాల్స్), అత్యవసర పరిస్థితుల్లో ప్రకటనలకు చెందిన కొండ గుర్తులు (కోడ్స్), పాటించే పద్ధతులు, కమ్యూనికేషన్ ప్రోటోకాల్స్ వంటివి ఇందులో ఉంటాయి. అగ్ని ప్రమాదాల సమయంలో వివిధ విభాగాల బాధ్యతలు, మాక్‌డ్రిల్స్ కోసం నిర్దేశించిన పద్ధతి, కాల వ్యవధి, ఆచరించే తీరు వివరాలు, ప్రమాదం నుంచి తప్పించుకునే పద్ధతులు, విద్యుత్ పరికరాలు ఫైర్ సేఫ్టీ మ్యానువల్‌లోని కీలక విషయాలు.

### నేషనల్ బిల్డింగ్ అగ్నిమాపక శాఖ పాత్ర ఏంటి..?

- అగ్నిమాపక శాఖ నుంచి నో అబ్జెక్షన్ సర్టిఫికేట్ తప్పనిసరి. వాటిని ప్రతియేటా రెన్యూవల్ చేయాల్సి ఉంటుంది.
- వైద్య సంస్థలు సంబంధిత నియమనిబంధనలు, చట్టాలు, వాటి అమలు విధానాలు, తనిఖీలపై అవగాహన కలిగి ఉండాలి.
- సంస్థ పరిసరాలు, సదుపాయాలు రోగులు, వారి కుటుంబ సభ్యులు, సిబ్బంది, సందర్శకుల భద్రతకు లోబడి ఉండాలి.
- ఫైర్ సేఫ్టీ అధికారి సమక్షంలో వివిధ రంగాలకు చెందిన వారితో కూడిన కమిటీ.. నాన్ క్లినికల్ ప్రాంతంలో ఏడాదిలో ఒకసారి, క్లినికల్ ప్రాంతంలో రెండు సార్లు తనిఖీలు చేయాలి.
- తనిఖీల్లో గుర్తించిన అంశాలను నివేదిక రూపంలో ఆస్పత్రి సేఫ్టీ కమిటీకి సమర్పించాలి.
- మాక్ డ్రిల్ సమయంలో గుర్తించిన సమస్యలపై తగిన చర్యలు తీసుకునే విధంగా సేఫ్టీ కమిటీకి నివేదికలు ఇస్తుండాలి. సరైన ప్రదేశాల్లో ఫైర్ సైనేజీలను ఏర్పాటు చేయాలి. అవి చీకట్లో మెరిసే విధంగా రేడియంతో ఉండాలి.
- ప్రమాదాలు సంభవించిన సమయంలో రోగులు, సిబ్బంది సురక్షితంగా బయటపడేలా సైన్ బోర్డులు, సూచికలు పెట్టాలి.
- ఆస్పత్రి చుట్టూ అగ్నిప్రమాపక యంత్రాలు తిరిగే విధంగా స్థలం వదలాలి.
- అగ్ని ప్రమాదం జరిగిన సమయంలో లిఫ్టులు వాడరాదు.

ఇలాంటి మొత్తం 42 నిబంధనలున్నాయి. వీటిని పాటిస్తే చాలావరకు ప్రమాదాలను నివారించొచ్చని నిపుణులు పేర్కొంటున్నారు.

### షైన్ ఆస్పత్రి ఎండీ అరెస్టు



**హైదరాబాద్, ఆంధ్రప్రభ :** నాలుగు నెలల చిన్నారి మృతికి కారణమైన ఎల్బీనగర్‌లోని షైన్ పిల్లల ఆస్పత్రి ఎండీ సునీల్ కుమార్‌తో పాటు డ్యూటీ డాక్టర్ హరికృష్ణ, డ్యూటీ నర్సులు స్రవంతి, శాంతి దీపికా, ఎలక్ట్రిషియన్ బషీర్‌లను పోలీసులు శుక్రవారం అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చి రిమాండ్‌కు తరలించారు. 21న ఆస్పత్రి నాల్గో అంతస్తులో ఎన్‌ఐసీయూలో రిఫ్రిజిరేటర్ సమీపంలో అగ్ని ప్రమాదం సంభవించింది. దీంతో 4 నెలల పసికందు విక్కీ మృతి చెందాడు. మరో నలుగురు చిన్నారులు గాయపడ్డారు. మొత్తం 43 మంది చిన్నారులు చికిత్స పొందుతుండగా.. 38 మంది ప్రమాదానికి గురవ్వకుండా రక్షించబడ్డారు. ప్రమాదానికి సంబంధించి వైద్య శాఖ అధికారులు పూర్తి నివేదికను అందజేశారు. ఆస్పత్రి యాజమాన్యానిదే తప్పని నివేదికలో పేర్కొన్నట్లు తెలుస్తోంది. విక్కీ తండ్రి పోలీసు కానిస్టేబుల్ డొంగరి నరేష్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనపై ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ స్పందిస్తూ.. చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సరైన భద్రతా ప్రమాణాలు పాటించని 350 ఆస్పత్రులకు నోటీసులు జారీ చేశారు. అత్యంత గోప్యంగా పోలీసులు ఐదుగురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించడంపై బాధితులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

### అర్బన్ లోకల్ బాడీల పాత్ర

ఫైర్ సేఫ్టీ జాగ్రత్తలు, పరికరాల ఏర్పాటుపై ఆయా అర్బన్ లోకల్ బాడీలు ఎన్‌ఓసీలు ఇవ్వాల్సి ఉంటుంది. పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, లోకల్ అర్బన్ బాడీల ఎన్‌ఓసీలతో పాటు వివిధ పత్రాలను జతజేసి డీఎంఅండ్‌హెచ్‌ఓలకు దరఖాస్తు చేసుకోవాలి. క్షేత్రస్థాయి తనిఖీ చేసి, నిబంధనల ప్రకారం తొలుత తాత్కాలికంగా రిజిస్ట్రేషన్ ఇస్తారు. ఏవైన లోపాలుంటే తగిన గడువులోగా పూర్తి చేయాలంటూ నోటీసులు ఇవ్వాలి. ఆ లోపాలు సరిదిద్దుకున్నట్టు నిర్ధారించుకున్న తరువాతే పర్మినెంట్ రిజిస్ట్రేషన్ మంజూరవుతుంది.

### కోడ్-2005 ఏం చెబుతోంది..?

ఆస్పత్రుల్లో నిస్సహాయ స్థితిలో ఉండే రోగుల భద్రత కోసం 2005లో అప్పటి యూపీఏ ప్రభుత్వం 'నేషనల్ బిల్డింగ్ కోడ్'ను రూపొందించింది. ఈ కోడ్ నిబంధనల ప్రకారం.. అగ్ని ప్రమాదాలు, తుఫాను, భూకంపాలను తట్టుకొని తప్పించుకునేలా ఆస్పత్రుల నిర్మాణాలు ఉండాలి. ఈ మార్గదర్శకాలే నేషనల్ బిల్డింగ్ కోడ్‌లో ఉంటాయి. ఈ అంశాలన్నింటినీ సీ-1 గ్రూపులో చేర్చింది. అంటే ఆస్పత్రి భవనాలు మిగితా బిల్డింగ్‌ల కంటే భిన్నంగా నిర్మించాల్సి అవసరాన్ని సూచిస్తుంది. అంతే గాక నిర్మాణంలో వాడాల్సిన పదార్థాలు, సామాగ్రి విషయం లోనూ ప్రత్యేక సూచనలు చేసింది. మన్నిక, ఫైర్‌ప్రొటెక్షన్, సదుపాయాలు, 15 మీటర్లకు పైఅంతస్తుల భవనాల్లో ఉండాల్సిన వసతులను స్పష్టం చేసింది. ఆస్పత్రి భవనానికి రెండు వైపులా బయటకు వెళ్లే దారులు ఉండాలి. ఇవి కూడా ప్రతీ అంతస్తులో ఉండాలి. ఇవి నేరుగా ప్రమాదం నుంచి సురక్షితంగా బయటపడేలా ఏర్పాటు చేయాల్సి ఉంటుంది.

### మానసిక వైద్యశాలల్లో మార్పులు

సైకియాట్రిక్, మానసిక రుగ్మతలు గల రోగులకు సంబంధించిన వైద్యశాలల నిర్మాణంలో కొన్ని మార్పులు ఉంటాయి. సాధారణ ఆస్పత్రులతో పోలిస్తే ఈ వైద్యశాలలకు కొన్ని మినహాయింపులు ఉన్నాయి. వారికోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఆటోమేటిక్ (రిమోట్ కంట్రోలింగ్) లేదా అటెండెంట్లు వాడగలిగే విధంగా కామన్ బటన్ బారికేడ్లు, డోర్లు ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. అవి ప్రమాదాల సమయంలో రోగులను కాపాడేందుకు ఉపయోగపడతాయి.

## ఆర్టీసీ సమ్మెపై సీఎం కేసీఆర్ నిర్ణయం

# నేడు చర్చలు!

(మొదటిపేజీ తరువాయి)

అధ్యయనం చేసేందుకు ఎండీ సునిల్ శర్మ ఈడీల కమిటీని నియమించిన విషయం తెలిసిందే. రెండు రోజుల పాటు ఈడీల కమిటీ భేటీ అయి డిమాండ్లలోని పలు అంశాలను అధ్యయనం చేసి రిపోర్టును శుక్రవారం అందించింది. ఈ కమిటీ ఇచ్చిన రిపోర్టుపై రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్‌తో పాటు ఆ శాఖ ముఖ్య కార్యదర్శి, ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ సునిల్‌శర్మ తదితరులతో సీఎం కేసీఆర్ సుదీర్ఘంగా సమీక్షించారు. అనంతరం 12 డిమాండ్లపై కార్మిక సంఘాలతో చర్చించేందుకు సీఎం అనుమతించారు. ఈ 12 డిమాండ్లు ఏ మాత్రం ఆర్థిక పరమైనవి కావని తెలిసింది.

శనివారం మధ్యాహ్నం బస్‌భవన్‌లో కానీ, ట్రాన్స్‌పోర్ట్ భవన్‌లో గానీ కార్మిక సంఘాలతో సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ సునీల్‌శర్మ, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు చర్చించనున్నారు. కండక్టర్, డ్రైవర్‌లకు ఉద్యోగ భద్రత, మహిళా కండక్టర్లకు రాత్రి గం. 9 వరకే డ్యూటీలు వేయడం, ఇంటర్‌స్టేట్ ఒప్పందం ప్రకారం బస్సులను నడపడం, అక్రమ రవాణాను నివారించేందుకు చర్యలు చేపట్టడం, వన్‌టైం మెజర్ కింద బదలీలు, కొరియర్, పార్సిల్, గూడ్స్ రవాణాకు అనుమతించడం, ఎంటిడబ్ల్యు ప్రకారం డ్యూటీలను వేయడం లాంటి అంశాలపై కార్మిక సంఘాలతో చర్చించనున్నట్లు తెలిసింది.

సమ్మెపై విచారించిన కోర్టు సూచించిన మేరకు ఆర్థిక పరమైన అంశాలతో ముడిపడని వాటిపైనే చర్చించాలని సమావేశంలో కేసీఆర్ సూచించడంతో అధికారులు తమ స్థాయిలో పరిష్కారమయ్యే అంశాలను వివరించారు. దీనిపై అధికారుల అభిప్రాయాలను తెలుసుకున్న అనంతరం కార్మిక సంఘాలతో చర్చించాలని ఎండీ సునీల్‌శర్మను ఆదేశించారు. దీంతో శనివారం మధ్యాహ్నం కార్మిక సంఘాలతో చర్చలకు అధికారులు నిర్ణయించారు.

కార్మిక సంఘాల ప్రధాన డిమాండ్లలో సంస్థను ప్రభుత్వంలో విలీనం చేయడం, పీఆర్సీ ప్రకటించడం, అద్దె బస్సులను పూర్తిగా రద్దు చేయడం, కాలం చెల్లిన బస్సుల స్థానంలో కొత్తవి కొనుగోలు చేయడం, కార్మికులకు చెందిన పీఎఫ్ డబ్బులతో పాటు వివిధ పొదుపు సంఘాల నుంచి సంస్థ తీసుకున్న డబ్బులను వడ్డీతో సహాచెల్లించడం తదితర డిమాండ్లను పూర్తిగా పక్కకు పెట్టినట్లు తెలిసింది. వీటిపై నిర్ణయం తీసుకునే అధికారం ప్రభుత్వానికి మాత్రమే ఉంది. వీటి విషయాన్ని ప్రభుత్వానికి వదిలేయాలని, కార్మికులు సమ్మెను విరమించి విధుల్లోకి చేరిన తర్వాత ఏం చేయాలన్న అంశంపై ప్రభుత్వం ఆలోచిస్తుందని సీఎం చెప్పినట్లు సమాచారం.

కార్మిక సంఘాలతో చర్చలకు ముందు ఈడీల కమిటీతో ఎండీ సునీల్ శర్మ శనివారం ఉదయం భేటీ అవుతారు. ఈ భేటీలో ఏయే అంశాలపై చర్చించాలన్న విషయంలో ఒక నిర్ణయానికి రానున్నారు. సంస్థ ఆర్థిక పరిస్థితిని మరోసారి వివరించడంతో పాటు ప్రభుత్వ వైఖరిని తేటతెల్లం చేసే అవకాశాలున్నట్లు తెలుస్తోంది. సమ్మెను విరమిస్తే తప్ప ఆర్థిక పరమైన అంశాలపై ప్రభుత్వం స్పందించే అవకాశాలు లేవన్న విషయాన్ని కూడా కార్మిక సంఘాల నేతలకు స్పష్టం చేయనున్నారని సమాచారం.



## ఒడిసి పడితేనే!

- చుక్కనీటి కోసం కొట్లాటలు.
- సముద్రంలోకి వృథాగా నీరు
- ఈ సీజన్‌లో ఇప్పటి వరకు రికార్డు స్థాయిలో 3,874 టీఎంసీలు కడలిపాలు
- నీటి కొరత వల్ల రైతాంగం ఇబ్బందులు

**అమరావతి, ఆంధ్రప్రభ:** ఒక్క టీఎంసీ నీటి కోసం రాష్ట్రాల మధ్య గొడవలు, మనుషుల మధ్య కొట్లాటలు జరుగుతున్న రోజులివి. చుక్కనీరు కోసం ఓ వైపు ప్రజలు, మరో వైపు రైతులు, ఇంకొకవైపు ప్రభుత్వాలు జగడాలు పడుతూ, కోర్టులకెక్కుతున్న తరుణమిది. అటువంటి 'నీటి' తగాదాలు జరుగుతున్న వేళ, వరుణుడు కరుణించి వరాల వర్షపు జల్లులను కురిపిస్తుంటే, కనీసం వాటిలో ఒక్క శాతం కూడా సంరక్షించుకోలేని నిస్సహాయస్థితిలో మనం ఉన్నాం. ప్రభుత్వాలు ముందు చూపుతో వ్యవహరించకపోవటంతో కోట్లాది ప్రజల గొంతు తడిపి, లక్షలాది హెక్టార్లను సస్యశ్యామలం చేసే గంగమ్మ ఎవరికీ ఉపయోగపడకుండానే కడలిలో కలిసిపోతోంది. ఇలా ప్రతి సీజన్‌లో లక్షలాది క్యూసెక్కుల నీరు, వేలాది టీఎంసీల జలాలు సముద్రం పాలవుతుంటే మనస్సు తరక్కుపోతోంది. ప్రధానంగా ఈ సంవత్సరం పెద్దస్థాయిలో నీరు సముద్రంలో కలుస్తోంది. ఇప్పటి వరకు (జూన్ 1 నుంచి అక్టోబరు 25 వరకు) కృష్ణా, గోదావరి నదులకు చెందిన 3,961 టీఎంసీల నీరు సముద్రంలోకి చేరిపోయింది.

### సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం..

ఈ సంవత్సరం నైరుతి, ఈశాన్య రుతుపనాలు, అల్పపీడనాల ప్రభావం వల్ల తెలుగు రాష్ట్రాల్లో భారీస్థాయిలో వర్షం పడింది. అక్టోబర్ నెల వచ్చినా ఇప్పటికి కూడా ప్రతిరోజూ వర్షం పడుతూనే ఉంటుంది. ఈ క్రమంలో సాధారణం కంటే ఎక్కువ స్థాయిలో వర్షపాతం నమోదైంది. అంటే గత 15 సంవత్సరాలతో పోల్చుకుంటే ఈ సంవత్సరమే అధికంగా వర్షపాతం నమోదైందన్నమాట. సాధారణం కంటే అధికంగా వర్షం పడటంతో సహజంగానే వాగులు, వంకలు పొంగి ప్రవహించాయి. ఎగువ రాష్ట్రాల్లోనూ పెద్ద ఎత్తున వర్షాలు కురవటంతో సాధారణంగానే నదులకు వరద పోటెత్తింది.

### సముద్రంపాలైన 3,961 టీఎంసీల నీరు

భారీ వర్షాలకు, వరదలకు తెలుగు రాష్ట్రాల్లోని ప్రధాన జలాశయాలు, చెక్‌డ్యాంలు, చిన్న, చిన్న ప్రాజెక్టులు, బ్యారేజీలన్నీ నీటితో తొణికిస లాడుతున్నాయి. కృష్ణానదికి సంబంధించి ప్రకాశం బ్యారేజీ నుంచి ఈ జూన్ నుంచి ఇప్పటి వరకు మొత్తం 579.77 టీఎంసీల నీటిని సముద్రంలోకి విడిచి పెట్టారు. గోదారి నదికి సంబంధించి అత్యధికంగా 3,295.77 టీఎంసీల నీటిని కడలిలోకి వదిలిపెట్టారు.

### కొత్త డ్యాంలపై ఆలోచన చేస్తేనే..

వర్షాకాల సీజన్‌లో లక్షల క్యూసెక్కుల నీరు సముద్రంలోకి వెళ్లిపోతోంది. సరైన విజన్, ప్లానింగ్ లేకపోవటంతో వృధాగా పోతున్న వరద నీటిని ఒడిసిపట్టి అటు ప్రజలకు, ఇటు రైతాంగానికి న్యాయం జరగలేదు. కేవలం ఒక్క టీఎంసీ నీటి కోసం తగాదాలు పడుతున్న ప్రభుత్వాలు కృష్ణా, గోదా వరి నదల నుంచి వృధాగా పోతున్న వరద నీటిలో ఒక్కశాతానైనా ఒడిసిపట్టి రైతుకు, ప్రజలకు మేలు చేకూర్చేందుకు ఆలోచన చేస్తే అందరికీ మేలు జరుగుతుంది.

## శ్రీరామసాగర్‌కు వరదపోటు

- బాలేగావ్ ప్రాజెక్టు 9 గేట్ల ఎత్తివేత
- లక్షా20వేల క్యూసెక్కులు వదిలిన అధికారులు

**నిజామాబాద్, ప్రభన్యూస్ బ్యూరో :** శ్రీరామసాగర్ ప్రాజెక్టులోకి మరికొద్ది గంటల్లో భారీగా ఇన్‌ఫ్లో వచ్చిచేరనున్నట్లు ప్రాజెక్టు డీఈ జగదీష్ తెలిపారు. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు ఎగువ భాగమైన మహారాష్ట్రాలోని బాలేగావ్ ప్రాజెక్టు 9 గేట్లను ఎత్తి లక్ష 20వేల క్యూసెక్కులను దిగువన ఎస్సారెస్పీకి వదులుతున్నట్లు మహారాష్ట్ర నీటిపారుదల శాఖ అధికారులు సమాచారం అందించినట్లు తెలిపారు. రానున్న 24 గంటల్లో ఎస్సారెస్పీలోకి లక్ష 20వేల క క్యూసెక్కులు వచ్చిచేరనున్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రాజెక్టులోకి 34వేల 444 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా 16 గేట్లను ఎత్తి గోదావరినదిలోకి 50వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ఎస్కేప్ గేట్లద్వారా 2500 క్యూసెక్కులు, కాకతీయ కాలువద్వారా 5500 క్యూసెక్కుల నీటి విడుదల కొనసాగుతుంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1091 అడుగులు 90 టీఎంసీలు కాగా శుక్రవారం నాటికి 1090.80 అడుగులు 89.212 టీఎంసీల నీటినిల్వ ఉన్నట్లు తెలిపారు. గత ఏడాది ఇదే రోజున ప్రాజెక్టులో 1074.60 అడుగులు



38.773 టీఎంసీల నీటినిల్వ ఉన్నట్లు వివరించారు. అధికారులు ఆదేశానుసారం శ్రీరామసాగర్ ప్రాజెక్టునుండి సరస్వతి కాలువద్వారా నీటి విడుదలను అధికారులు ప్రారంభించారు. మధ్యాహ్నం 12 గంటలకు 400 క్యూసెక్కుల నీటిని విడుదల చేసిన అధికారులు సాయంత్రానికి 600 క్యూసెక్కులకు పెంచారు.

# భళా.. శరద్ పవార్..!

● ఎన్సీపీపై ప్రశంసల జల్లులు ● 54 స్థానాల్లో ఘన విజయం ● పవార్ ప్రచారశైలిపై సేన కితాబు



**అలీబాగ్:** మహారాష్ట్ర ఎన్నికల సరళి పూర్తయ్యింది. అధికారం పంచుకోవడమే తరువాయి. ఇలాంటి సమయంలో బీజేపీపై పలువురు విమర్శలు గుప్పిస్తున్నారు. లోక్‌సభ ఎన్నికలతో పోలిస్తే.. అసెంబ్లీ ఎలక్షన్‌లలో పార్టీ అంతగా ఓటర్లను ఆకట్టుకోలేదనే వార్తలు వినిపిస్తున్నాయి. మహారాష్ట్రలో మాత్రం 'మహా జనదేశ్' లేదని చెప్పుకుంటున్నారు. శివసేన కూడా ఓటర్లను తనవైపు తిప్పుకోవడంలో సఫలీకృతం కాలేదని విమర్శలు వస్తున్నాయి. ఇప్పుడు మహారాష్ట్ర వ్యాప్తంగా ఎన్సీపీపై జోరుగా చర్చ జరుగుతోంది. రాజకీయ విశ్లేషకులు కూడా ఎన్సీపీ అధినేత శరద్ పవార్‌పై ప్రశంసల జల్లులు కురిపిస్తున్నారు. ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్ మొత్తం 288 నియోజకవర్గాల్లో 200 అసెంబ్లీ సెగ్మెంట్‌లలో అక్టోబర్ 21కి ముందు వరకు 'మహా జనదేశ్ యాత్ర'లో పాల్గొన్నారు. 24న ఎన్నికల ఫలితాలు వెల్లడవుతున్న సాయంత్రం వరకు బీజేపీ 200కు పైగా స్థానాలను కైవసం చేసుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు.

# 15 మంది రెబల్స్ మావైపే..!

● మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్

**ముంబై:** మహారాష్ట్ర ఎన్నికల్లో ఏ పార్టీకి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే మెజార్టీ రాలేదు. బీజేపీ 105 స్థానాల్లో, శివసేన 56 స్థానాల్లో గెలుపొందాయి. కాంగ్రెస్‌కు 44, ఎన్సీపీకి 54 స్థానాలు దక్కాయి. దీంతో 288 అసెంబ్లీ స్థానాల్లో మ్యాజిక్ ఫిగర్ 145. బీజేపీ, శివసేన కూటమిగా 161 స్థానాలతో మ్యాజిక్ ఫిగర్‌ను దాటి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే దిశగా అడుగులు వేస్తున్నాయి. ఈ నేపథ్యంలో మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవిస్ ఓ కీలక ప్రకటన చేశారు. 15 మంది స్వతంత్ర అభ్యర్థులు తమతో టచ్‌లో ఉన్నారని, వారంతా బీజేపీ, శివసేన నుంచి రెబల్‌గా పోటీ చేసిన వాళ్లే అని తెలిపారు. బీజేపీలో చేరేందుకు అందరూ సిద్ధంగా ఉన్నారని చెప్పుకొచ్చారు. ఇంకా కొంత మంది ఎన్డీఏ కూటమిలో చేరే అకాశాలు ఉన్నాయని, ఇప్పటికి అయితే 15 మంది రెడీ ఉన్నట్టు వివరించారు. ఎన్నికలకు ముందు బీజేపీ, శివసేన నిర్ణయించుకున్నట్టు ముందుకు వెళ్తోందని మహారాష్ట్ర ఓటర్లకు అభినందనలు తెలియజేశారు.

## 'మహా'లో 24మందే మహిళా విజేతలు

**ముంబై:** మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీలతోపాటూ ఓటర్లూ మహిళా అభ్యర్థులకు ప్రాధాన్యం ఇవ్వకపోవడం రాజకీయవర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. 288 మంది అసెంబ్లీ సభ్యుల్లో కేవలం 24మంది అభ్యర్థులే చట్టసభలోకి అడుగుపెట్టనున్నారు. మొత్తం అన్ని పార్టీల నుంచి కలిపి సుమారు 235మంది ఎన్నికల్లో పోటీచేయగా వారిలో కేవలం 24మంది మాత్రమే విజయం సాధించారు. వీరిలో అత్యధికంగా బీజేపీకి చెందిన వారే ఉన్నారు. బీజేపీ నుంచి గరిష్ఠంగా 12మంది మహిళలు విజయం సాధించారు. బీజేపీ మిత్రపక్షం శివసేన నుంచి ఇద్దరు మహిళా అభ్యర్థులు మాత్రమే ఎన్నికయ్యారు. ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్ నుంచి ఐదుగురు మహిళలు శాసనసభకు ఎన్నికవగా దాని మిత్రపక్షమైన నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ నుంచి ముగ్గురు మహిళలు శాసనసభ్యులుగా ఎన్నికయ్యారు.

### బీజేపీ మహిళా బ్రిగేడ్‌లో ఉన్న సభ్యులు

మనీషా చౌదరీ (దహిసర్) విద్యా ఠాకూర్ (గోరేగావ్), భారతి లవేకర్ (వెర్సోవా) వీరు ముంబైలోని అసెంబ్లీ ఆయా స్థానాల నుంచి గెలుపొందారు. మందా మత్రే (బేలాపూర్, నవీ ముంబై), మాధురి మిసాల్ (పారవాటి), ముక్త తిలక్ (కాస్బాపేత్, పుణే), దేవయాని ఫరాండే (నాసిక్ సెంట్రల్) సీమా హైర్ (నాసిక్ వెస్ట్), శ్వేతా మహాలే (చిఖ్లి), మేఘనా బోర్డికర్ (జింటూర్) నమితా ముండాడా (కేజ్) మోనికా రాజాలే (షెవ్‌గావ్) ఉన్నారు.

### కాంగ్రెస్ మహిళా ఎమ్మెల్యే బృందంలో..

మహా అసెంబ్లీ ఎన్నికల్లో ఈ సారి కాంగ్రెస్ పార్టీ తరపున పోటీచేసిన మహిళా అభ్యర్థుల్లో ఐదుగురు గెలుపు బావుటా ఎగురవేశారు. విజయం సాధించి చట్టసభలో కాంగ్రెస్ తరపున పోరాడే వారిలో వర్షా గైక్వాడ్ (ధారావి-ముంబై), ప్రణీతి షిండే(సోలాపూర్ సెంట్రల్, ప్రతిభా ధనోర్కర్ (వరోరా), సులభా ఖోడ్కే (అమరావతి), యశోమతి ఠాకూర్ (టియోసా) ఉన్నారు. కాంగ్రెస్ మిత్రపక్షం ఎన్సీపీ నుంచి గెలుపొందినవారిలో సుమన్ ఆర్ఆర్ పాటిల్ (తస్గావ్-కవతే మహంకల్) అదితి తత్కరే (శ్రీవర్ధన్) సరోజ్ అహిరే (దేవ్లాలి) ఉన్నారు. ఇద్దరు స్వతంత్ర విజేతల్లో మంజుల గవిత్ (సక్రీ), బీజేపీ రెబల్ గీతాజైన్ (మీరా- భయందర్) ఉన్నారు. ఓటమి పాలైన ప్రముఖ మహిళా అభ్యర్థుల్లో బీజేపీ మంత్రి పంకజముండే (పార్లి), ఆమ్ ఆద్మీ పార్టీకి చెందిన పరోమిత గోస్వామి (బ్రహ్మపురి), అఖిల భారత మానవతాపార్టీకి చెందిన వనితా రౌత్ (చిమూర్) ప్రముఖంగా ఉన్నారు.

# 2028 కొత్త పార్లమెంట్

● ఆర్కిటెక్ కన్సల్టెంట్‌గా గుజరాత్ సంస్థ

**న్యూఢిల్లీ:** కేంద్రప్రభుత్వానికి అత్యంత ప్రతిష్టాత్మకమైన పార్లమెంట్ భవనం పునరాభివృద్ధికి ఆర్కిటెక్చురల్ కన్సల్టెంట్‌గా అహ్మదాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న హెచ్‌సీపీ డిజైన్, ప్లానింగ్ మేనేజ్‌మెంట్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ఎంపికైంది. ప్రభుత్వం నిర్వహించిన బిడ్ ఈ సంస్థ ఎంపికైందని ప్రభుత్వం వెల్లడించింది. పార్లమెంట్ భవనంతోపాటు రాజ్‌పథ్, ఉమ్మడి సెంట్రల్ సెక్రెటేరియేట్‌లతో కూడిన సెంట్రల్ విస్తాను ఈ సంస్థ పునరాభివృద్ధి చేయనుంది. ఒప్పందంలో భాగంగా నిర్మాణాలకు మాస్టర్ ప్లాన్లు, డిజైన్లు, వ్యయం అంచనాలు,పార్కింగ్ సౌకర్యాలతోపాటు ఇతర అంశాలకు సంబంధించిన మాస్టర్ ప్లాన్లను కూడా సంస్థ రూపొందించింది. బిమాల్ పటేల్ సారథ్యంలో హెచ్‌సీపీ డిజైన్స్ సంస్థ పనిచేయనుంది. ఒప్పందం విలువ రూ.229.7 కోట్లని కేంద్ర పట్టణాభివృద్ధిశాఖ మంత్రి హర్దీప్ పురీ ప్రకటించారు. మొత్తం రూ.448 కోట్లుగా అంచనావేయగా బిడ్డింగ్‌లో తక్కువ ధరకే ఒప్పందం కుదిరిందని ఆయన వివరించారు.



# తొలి గిటార్ ఆకృతి హోటల్

**హాలీవుడ్, ఫ్లోరిడా :** అద్భుత ఇంజనీరింగ్ సృజనాత్మకత ప్రపంచంలో ఎన్నో అద్భుతమైన నిర్మాణాలకు ప్రాణంపోసింది. అలాంటి మరో నిర్మాణానికి జీవం పోశారు ఇంజనీర్లు. 450 అడుగుల ఎత్తుతో గిటార్ రూపంలో భారీ హోటల్‌ను నిర్మించారు. ప్రపంచంలో గిటార్ ఆకృతిలో నిర్మించిన మొట్టమొదటి ఈ హోటల్‌ను గిటార్ హోటల్‌గా పిలుస్తున్నారు. ఈ భవనం ఇటీవలే అందుబాటులోకి రావడంతో అతిథులకు ఆహ్వానం పలుకుతోంది. అమెరికాలోని ఫ్లోరిడాలో ఈ హోటల్ ఉంది. ఈ హోటల్ నిర్మాణానికి మూడేళ్ల సమయం పట్టింది. సెమినోల్ హార్డ్ రాక్ హోటల్ అండ్ కెసినో, హాలీవుడ్ ఈ హోటల్‌ను నిర్మించింది. ఈ హోటల్ ప్రారంభం సందర్భంగా ఇన్‌స్టాగ్రామ్ వేదికగా సెమినోల్ హార్డ్ రాక్ తన సంతోషాన్ని పంచుకుంది. హార్డ్ రాక్ కుటుంబానికి చాలా గొప్పరోజు. గిటార్ హోటల్‌ను అధికారికంగా ప్రారంభించామంటూ సంతోషాన్ని పంచుకుంది. ఇదిలావుండగా అద్భుత ఇంజనీరింగ్ మాస్టర్ పీస్‌కు ప్రతిరూపమైన ఈ భవనాన్ని చూస్తే ఎవరైనా వారెవ్వా.. అనాల్సిందే. ఫోర్ట్ లాండెర్‌డేల్-హాలీవుడ్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ నుంచి విమానాల్లో ప్రయాణించేవారు ఈ హోటల్‌ను వీక్షించవచ్చునని నిర్వాహకులు వెల్లడించారు.

# దుష్యంత్‌కు డిప్యూటీ

## హర్యానాలో వ్యూహాత్మకంగా అధికారాన్ని కైవసం చేసుకున్న బీజేపీ

● జేజేపీ అధినేతకు డిప్యూటీ సీఎంగా ఆఫర్ ● కాంగ్రెస్‌కు అవకాశం ఇవ్వకుండా బీజేపీ గుప్పిటే స్వతంత్రులు ● ఢిల్లీ కేంద్రంగా రాజకీయ వ్యూహ రచన ● సొంతంగా మెజార్టీ లేకున్నా మరోసారి సీఎం కానున్న ఖట్టర్



**చండీగఢ్ :** హర్యానాలో మరోసారి బీజేపీ ప్రభుత్వం కొలువుదీరబోతోంది. గురవారం విడుదలైన ఎన్నికల ఫలితాల్లో ఏ పార్టీకీ ప్రభుత్వం ఏర్పాటు చేసేంత స్పష్టమైన మెజార్టీ ంాకపోవడంతో... సీఎం పీఠం ఎవరిదని దానిపై తీవ్ర ఉత్కంఠ కొనసాగింది.కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ఎలాగైనా హర్యానాలోనూ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని సామాన్యుడు సైతం ఊహించినా.. కింగ్ మేకర్ దుష్యంత్‌ను ఎలా ఒప్పిస్తారన్న దానిపై ఆసక్తికరమైన చర్చ సాగింది. ఇలాంటి చర్చలు, ఉత్కంఠకు తెరతీస్తూ.. జననాయక్ జనతా పార్టీ అధినేత దుష్యంత్‌కు బీజేపీ డిప్యూటీ సీఎం పదవి ఆఫర్ చేసింది. దీంతో జేజేపీ నుంచి గెలిచిన 10 మంది ఎమ్మెల్యేలు, స్వతంత్రుల మద్దతుతో ప్రభుత్వం ఏర్పాటు చేయబోతోంది. దుష్యంత్‌తో ప్రత్యేకంగా భేటీ అయిన బీజేపీ అగ్ర నాయకత్వం.. ఆయన డిమాండ్లకు ఒప్పుకున్నట్లు తెలుస్తోంది. జేజేపీ ప్రతిపాదించిన కామన్ మినిమన్ ప్రోగ్రాంకు కూడా బీజేపీ ఒప్పుకుందన్న ప్రచారం జరుగుతోంది. బీజేపీకి వచ్చిన 40 అసెంబ్లీ స్థానాలకు తోడూ జేజేపీ 10 స్థానాలు, 8 మంది స్వతంత్ర ఎమ్మెల్యేల మద్దతుతో కాంగ్రెస్ పార్టీ ఊహించని రీతిలో బీజేపీ ప్రభుత్వం కొలువుదీరబోతోందని రాజకీయ పండితులు విశ్లేషిస్తున్నారు.



### నడ్డాతో స్వతంత్ర ఎమ్మెల్యేల భేటీ

హర్యానాలో బీజేపీ ప్రభుత్వ ఏర్పాటుకు కావాల్సిన మద్దతు.. సిద్ధంగా ఉన్న ఎమ్మెల్యేలు బీజేపీ కార్యనిర్వాహక అధ్యక్షుడు జేపీ నడ్డాను కలిశారు. ఎన్నికల్లో 10 మంది స్వతంత్రులు ఎమ్మెల్యేలుగా గెలుపొందడంతో వారిలో 8మంది ఇప్పటికే బీజేపీ తమవైపు తిప్పుకున్నట్లు సమాచారం.. ధరమ్‌పాల్ గోండాన్, నయన్‌పాల్ రావత్, సోంబీర్ సంగ్వాల్, రాకేష్ దులంతాబాద్, రణ్‌దీర్ గొలాన్‌లు జేపీ నడ్డాను కలిసి హర్యానాలో బీజేపీ ప్రభుత్వ ఏర్పాటుకు మద్దతు ఇస్తామని హామీ ఇచ్చారు. బీజేపీ నాయకుడు జవహార్ యాదవ్ - స్వతంత్ర ఎమ్మెల్యేలను జేపీ నడ్డాకు కలిపించి వారి గురించి వివరించారు. బీజేపీకి మద్దతు పలికేందుకు తాము ఢిల్లీ వచ్చినట్లు స్వతంత్ర ఎమ్మెల్యే నయన్‌పాల్ రావత్ తెలిపారు. జేపీ నడ్డాతో భేటీ తర్వాత తాను బీజేపీకి మద్దతిస్తున్నట్లుగా తెలుపే పత్రాన్ని చూపించారు. మరో స్వతంత్ర ఎమ్మెల్యే సోంబీర్ సంగ్వాల్ మాట్లాడుతూ తాను ఎలాంటి షరతులు విధించకుండా బీజేపీకి మద్దతిస్తున్నట్లు వివరించారు. ఈ ఐదుగురు ఎమ్మెల్యేల కంటే ముందే మరో ఎమ్మెల్యే రంజిత్ చౌతారా కూడా ఖట్టర్, జేపీ నడ్డాతో భేటీ అయి తన మద్దతును ప్రకటించారు.

### నేడు బీజేపీ శాసనసభాపక్ష సమావేశం

హర్యానాలో ప్రభుత్వ ఏర్పాటు దిశగా పావులు కదుపుతున్న బీజేపీ.. కావాల్సినంత సంఖ్యాబలాన్ని సాధించుకుంది. స్వతంత్ర ఎమ్మెల్యేలతో పాటు దుష్యంత్ నేతృత్వంలోని జేజేపీ కూడా బీజేపీకి మద్దతు పలకడంతో ఖట్టర్ నేతృత్వంలోని బృందం నేడు గవర్నర్‌ను కలిసి ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించాలని కోరనుంది. అంతకు ముందే బీజేపీ శాసనసభాపక్షం భేటీ అయి ఖట్టర్ ను శాసన సభా పక్ష నేతగా ఎన్నుకోనుంది.

### ఢిల్లీలో మనోహర్‌లాల్ ఖట్టర్ చక్కర్లు

హర్యానా అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీకి స్పష్టమైన మెజార్టీ రాకపోయినప్పటికీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు మనోహ ర్ లాల్ ఖట్టర్ శక్తివంచన లేకుండా కృషి చేశారు. కలిసివచ్చే ఎమ్మెల్యేలందరినీ బీజేపీ వైపు తిప్పుకోవడంలో సఫలమ య్యారు. బీజేపీ అధ్యక్షుడు అమితా షా, కార్యనిర్వాహక అధ్యక్షుడు జేపీ నడ్డాతో భేటీ అయి తాజా పరిణామాలను వివరించారు. దీంతో రంగంలోకి ట్రబుల్ షూటర్ అమిత్ షా.. హర్యానాలో ప్రభుత్వం ఏర్పాటుకు వ్యూహాలు రచించి సఫలమయ్యారు.

# కందా కథ కంచికే..

● హర్యానాలో కింగ్‌మేకర్ అవతావమెత్తబోయి దెబ్బతిన్న గోపాల్ కందా ● బీజేపీకి మద్దతిచ్చి ప్రభుత్వ ఏర్పాటుకు కృషి చేస్తానని వ్యాఖ్య ● ఎయిర్ హోస్టెస్ ఆత్మహత్య కేసులో కందాపై నేరారోపణలు ● ఇంటా, బయటా విమర్శలతో కందా వ్యాఖ్యలపై స్పందించని బీజేపీ

**చండీగఢ్:** హర్యానాలో మరోసారి కింగ్ మేకర్‌గా మారాలనుకున్న హర్యానా లోక్‌హిత్ పార్టీ అధ్యక్షుడు, సిర్సా ఎమ్మెల్యేకు భంగపాటు తప్పలేదు. కందాను వెంటాడిన వివాదాలు, నేరారోపణలు ఆయన భవిష్యత్‌ను అంధకారంలోకి నెట్టేశాయి. ఫలితాల బీజేపీ ప్రభుత్వంలో చక్రంతిప్పాలనుకున్న గోపాల్ కందా.. చివరకు ఏకాకిగా మారిపోయారు.

### ఎవరీ కందా

గోపాల్ కందాకు హర్యానాలో శక్తివంతమైన నాయకుడు పేరుంది. ఎవరినైనా ప్రభావితం చేసి తనవైపు తిప్పుకోవడంలో దిట్ట అయిన కందా..2009 అసెంబ్లీ ఎన్నికల తర్వాత హర్యానాలో హంగ్ ప్రభుత్వ ఏర్పాటులో కింగ్ మేకర్‌లా వ్యవహరించారు. వ్యాపారంలో బాగా రాణించిన కందా.. గుర్గావ్‌లో రియాల్టీ మార్కెట్‌లో బాగా సంపాదించి.. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటుకు అవసరమైన స్వతంత్ర ఎమ్మెల్యేలను పోగుచేయడంలో విజయం సాధించారు. ఫలితంగా 2009లో భూపేందర్ సింగ్ హూడా నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైంది. నాటి హూడా ప్రభుత్వం మంత్రి పదవి ఇచ్చింది.

### ఎయిర్‌హోస్టెస్‌పై వేధింపుల కేసు

గోపాల్ కందా పైకి కనిపించినంత మంచి వాడేమీ కాదంటున్నారు హర్యానా ప్రజలు. ఆగస్టు 2012లో తన ఎయిర్‌లైన్స్ ఎండీఎల్ఆర్‌లో ఎయిర్ హోస్టెస్‌గా పనిచేస్తున్న గీతా శర్మ (23) ఆత్మహత్యకు గోపాల్ కందా కారకుడని ఆరోపణలున్నాయి. ఎండీఎల్ఆర్‌లో ఎయిర్‌హోస్టెస్‌గా పనిచేస్తున్న తనను లైంగికంగా వేధించాడని గీతా శర్మ తన సూసైట్ నోట్‌లో రాసింది. కందా, అతని సహాయకు లు తనను వేధించారని.. వారి వేధింపులు భరించలేక దుబాయి వెళ్తే అక్కడి అధికారులపై ఒత్తిడి తెచ్చి భారత్‌కు రప్పించేలా చేశారని ఆరోపించింది. 2010 లో కందా వేధింపులు



తట్టుకోలేక దుబాయి వెళ్లిన గీతా శర్మను వెనక్కి రప్పించేందుకు కందా అనేక విధాల ప్రయత్నించారని ఆరోపణలున్నాయి. తనను అబాసు పాలు చేసేందుకు దుబాయి అధికారులకు లేఖలు కూడా రాశారని గీతా శర్మ పేర్కొంది. అతడి వేధింపు లు భారత్‌లో, దుబాయిలో తట్టుకోలేక ఢిల్లీలోని తన నివాసంలో గీతా శర్మ ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. గీతా శర్మ సూసైడ్ లేఖ ఆధారంగా గోపాల్ కందాను పోలీసులు అరెస్ట్ చేశారు. 2014 లో బెయిల్‌పై విడుదలైన గోపాల్ .. ఇటీవల ఎన్నికల్లో సిర్సా నంచి గెలవడం గమనార్హం.

### కందా వద్దే వద్దు

బీజేపీ ప్రభుత్వ ఏర్పాటులో కింగ్ మేకర్‌లా మారాలని కందా వ్యూహాలు రచించడాన్ని గుర్తించిన బీజేపీ నాయకురాలు ఉమా భారతి ఘాటుగా స్పందించారు. నైతిక విలువల పునాదులను బీజేపీ మరిచిపోవద్దని, కందా లాంటి నేరగాళ్లను కలుపుకుని పోవద్దని పార్టీ అధినాయకత్వానికి విజ్ఞప్తి చేశారు. గోపాల్ కందా కారణంగా ఎయిర్ హోస్టెస్ ఆత్మహత్యకు పాల్పడితే.. ఆ తర్వాత కందా వేధింపులతోనే ఆమె తల్లి కూడా ఆత్మహత్య చేసుకుందని.. ఆ కుటుంబానికి ఇప్పటికీ న్యాయం జరగలేదని ఆవేదన చెందారు. మహారాష్ట్రలో బీజేపీ మిత్రపక్షమైన శివసేన కూడా కందా వ్యవహారంపై తీవ్రంగా స్పందించింది.శివసేన అధికార ప్రతినిధి ప్రియాంకా చతుర్వేది ట్విట్టర్ వేదికగా స్పందిస్తూ.. మహిళల మనోభావాలను అగౌరవ పరిస్తే.. తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హితవు పలికారు. బీజేపీ కందా మద్దతు కోరుకోవడం సరి కాదని ఆమ్ ఆద్మీ పార్టీ కూడా స్పష్టం చేసింది. సీపీఎం జనరల్ సెక్రటరీ సీతారాం ఏచూరీ మాట్లాడుతూ.. అధికారం కోసం బీజేపీ నేరగాళ్ల మద్దతు తీసుకుంటుందని విమ ర్శలు గుప్పించారు.

# ముందు ఉగ్రవాదం కట్టడి చేయండి

● పాక్‌పై నిప్పులు చెరిగిన ఉపరాష్ట్రపతి వెంకయ్య



**న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ :** ఉగ్రవాదానికి చిరునామాగా మారిన పాకిస్తాన్‌పై భారత ఉపరాష్ట్రపతి ఎం. వెంకయ్య నాయుడు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. సీమాంతర ఉగ్రవాదాన్ని పోత్సహిస్తూ.. భారత భూభాగంపై అస్థిరత, అశాంతిని కోసం కుటిల యత్నాలకు పాల్పడుతున్న పాకిస్తాన్‌పై ఆయన ధ్వజమెత్తారు. నామ్ వేదికపై అన్ని దేశాలు అభివృద్ధి, పరస్పరస సహకారం, ప్రపంచం ఎదుర్కొంటున్న సమస్యలపై మాట్లాడుతుంటే, పొరుగుదేశాలపై ఉగ్రవాదాన్ని ఉసిగొల్పుతున్న పాకిస్తాన్, తన చర్యలను సమర్థించుకునేందుకు ప్రయత్ని స్తోందని ఆయన మండిపడ్డారు. పాకిస్తాన్ తీరును, వ్యవహారశైలిని మిగతా ప్రపంచం గమనించాలని కోరారు. ''నేటి ప్రపంచం ఎదుర్కొంటున్న సవాళ్లు: బాండుంగ్ సూత్రాలు అమలు చేయాల్సిన సందర్భం'' అనే ఇతివృత్తంతో అజర్ బైజాన్ దేశ రాజధాని నగరం బాకులో జరుగుతున్న 18వ అలీనోద్యమదేశాల సదస్సులో భారత బృందానికి నేతృత్వం వహిస్తున్న ఉపరాష్ట్రపతి ఈ మేరకు భారతదేశ ప్రకటన (నేషనల్ స్టేట్‌మెంట్)ను శుక్రవారం విస్పష్టంగా వెల్లడించారు.

## కర్ణాటక ఎమ్మెల్యేల అనర్హతపై

# సుప్రీం తీర్పు రిజర్వు

**న్యూఢిల్లీ:** కర్ణాటకలో గత కుమారస్వామి ప్రభుత్వంపై విశ్వాసతీర్మానానికి ముందు 17మంది ఎమ్మెల్యేలపై అనర్హత వేటుకు సంబంధించిన పిటిషన్లపై సుప్రీంకోర్టు శుక్రవారం తన తీర్పును రిజర్వు చేసింది. కర్ణాటక కాంగ్రెస్ తరపున హాజరైన సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ మాట్లాడుతూ అప్పటి స్పీకర్ రమేష్‌కుమార్ ఎమ్మెల్యేలను అనర్హులుగా ప్రకటించడాన్ని రాజ్యాంగ ధర్మాసనం పరిశీలించాలని వాదించారు. స్పీకర్ నిర్ణయాన్ని ప్రశ్నించలేమని సిబల్ అన్నారు. కర్ణాటక కాంగ్రెస్ చీఫ్ దినేష్ గుండురావ్ తరపున హాజరైన సిబల్ రాజ్యాంగ ప్రాముఖ్యత ఉన్న విషయాలను లేవనెత్తుతున్నందున ఈ విషయాన్ని రాజ్యాంగ ధర్మాసనం వద్దకు పంపాల్సిన అవసరం ఉందని పిటిషన్ సమర్పించారు. రమేష్ కుమార్ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ పిటిషన్‌ను జస్టిస్ ఎన్‌వీ రమణ, జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ కృష్ణమురారీతో కూడిన ధర్మాసనానికి సమర్పించారు. అసెంబ్లీ సభ్యులు తమ పదవికి రాజీనామా చేసే హక్కు ఉందని వారిని అనర్హులుగా ప్రకటించడాన్ని అప్పటి స్పీకర్ తీసుకున్న నిర్ణయంగా ప్రతీకార చర్యగా ఉందని తెలిపారు.

# జమ్మూకాశ్మీర్‌కు ముర్ము లడఖ్‌కు మాథుర్

● గోవాకు సత్యపాల్ బదలీ ● మిజోరం గవర్నర్‌గా శ్రీధరన్ పిళ్లై




**న్యూఢిల్లీ:** జమ్మూకాశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్‌గా గిరిష్ చంద్ర ముర్ము, లడఖ్ లెఫ్టినెంట్ గవర్నర్‌గా రాధాకృష్ణ మాథూర్ నియమితులయ్యారు. ప్రస్తుత జమ్మూకాశ్మీర్ గవర్నర్ సత్యపాల్ మాలిక్‌ను గోవా గవర్నర్‌గా బదలీ అయ్యారు. ముర్ము 1985 బ్యాచ్‌కు చెందిన గుజరాత్ ఐఏఎస్ కేడర్. ప్రస్తు తం కేంద్ర సమాచార కమిషనర్ (సీఐసీ)గా పనిచేసి, గత ఏడాది నవంబర్‌లో పదవీ విరమణ చేశారు. ఇక రక్షణ శాఖ మాజీ కార్యదర్శి రాధాకృష్ణ మాథుర్ కేంద్ర పాలిత ప్రాంతం లడఖ్ లెఫ్టినెంట్ గవర్నర్‌గా బాధ్యతలు చేపట్టనున్నారు.మాథుర్ 1977 బ్యాచ్ త్రిపుర కేడర్ కాగా, రక్షణ శాఖ కార్యదర్శిగా, చీఫ్ ఇన్‌ఫర్మేషన్ కమిషనర్ (సీఐసీ)గా పనిచేశారు.అక్టోబర్ 31 నుంచి జమ్మూకాశ్మీర్, లడఖ్ కేంద్ర పాలిత ప్రాంతాలుగా అమలులోకి రానున్నా యి. ఈ నేపథ్యంలోనే లెఫ్టినెంట్ గవర్నర్లను నియమించినట్లు తెలుస్తోంది.

### మిజోరం గవర్నర్‌గా శ్రీధరన్ పిళ్లై

కేరళ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీఎస్ శ్రీధరన్ పిళ్లై మిజోరం గవర్నర్‌గా నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్రపతిభవన్ ప్రకటన విడుదల చేసింది. ప్రస్తుతం అసోం గవర్నర్ జగ్‌దీష్ ముఖీ మిజోరం గవర్నర్‌గా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. జమ్మూకాశ్మీర్ సంభాషణ కర్తగా కేంద్ర ప్రభుత్వం నియమితులైన ఐబీ మాజీ చీఫ్ దినేష్‌శర్మను లక్ష్మదీప్ పాలనాధికారిగా బదలీ చేస్తూ మరొక ఆదేశం వెలువడింది.

## ఆర్ఎస్ఎస్ నేతలపై ఉగ్రదాడికి కుట్ర

**న్యూఢిల్లీ:** ఆర్ఎస్ఎస్ ప్రధాన కార్యాలయం, సంఘ్ పరివార్ అగ్రనేతలపై ఉగ్రవాదులు ఆత్మాహుతి దాడులకు ప్రణాళిక రచించినట్లు నిఘావర్గాల సమాచారం. దేశరాజధాని ఢిల్లీలోని ఎన్ఐఏ, ఎన్‌సీఆర్, సీజీవో కాంప్లెక్స్, ఎన్ఎస్‌జీ, సీఆర్‌పీఎఫ్ కార్యాలయాలు... ప్రధానంగా పారామిలిటరీ శిక్షణా కేంద్రాలను లక్ష్యంగా దాడులకు కుట్రపన్నినట్లు నిఘా వర్గాలు గుర్తించాయి. ఉగ్రవాదులు ఇప్పటికే పీవోకే ద్వారా దేశంలోకి చొరబడినట్లు నిఘా వర్గాల సమాచారం. తాజా ఘటనల నేపథ్యంలో ఢిల్లీ స్పెషల్ సెల్‌ను కేంద్ర హోంశాఖ అప్రమత్తం చేసింది. ఇటీవల కేంద్ర ప్రభుత్వం జమ్మూకాశ్మీర్‌కు స్వయం ప్రతిపత్తి కల్పించే 370 ఆర్టికల్ రద్దు చేసిన కారణంగా, అనంతరం కాశ్మీర్‌లో చోటు చేసుకున్న పరిణామాలతో ఈ దాడులు చేసేందుకు ఉగ్రవాదులు సిద్ధమయ్యారని నిఘా వర్గాల సమాచారం. ఢిల్లీలో దాడులు జరగొచ్చని హెచ్చరికల నేపథ్యంలో పోలీసులు రెడ్ అలర్ట్ ప్రకటించి... తనిఖీలు చేస్తున్నారు. భద్రతను కట్టుదిట్టం చేశారు.

## మసీదుల్లోకి మహిళల ప్రవేశంపై కేంద్రం స్పందన కోరిన సుప్రీం

**న్యూఢిల్లీ:** ముస్లిం మహిళలు ప్రార్థనలు చేసేందుకు మసీదుల్లోకి ప్రవేశించేందుకు అనుమతించాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై సుప్రీంకోర్టు శుక్రవారం కేంద్రం స్పందన కోరింది. వారం రోజులులోగా తమ స్పందన తెలియజేయాలని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి రంజన్ గొగోయ్, జస్టిస్ బోబ్డే, జస్టిస్ ఎస్ అబ్దుల్ నజీర్‌తో కూడిన ధర్మాసనం ఆదేశించింది. కేంద్రంతోపాటు జాతీయ మహిళా కమిషన్ (ఎన్‌సీడబ్ల్యూ), సెంట్రల్ వక్ఫ్ కౌన్సిల్, ఆలిండియా ముస్లిం పర్సనల్ లా బోర్డ్ (ఏఐఎమ్‌పీఎల్‌బీ) కూడా తమ స్పందన తెలియజేయాలని కోరుతూ తదుపరి విచారణను ధర్మాసనం నవంబర్ 5కు వాయిదా వేసింది. అంతకుముందు ఏప్రిల్ 16న మసీదుల్లో ముస్లిం మహిళల ప్రవేశాన్ని నిషేధించాలని కోరుతూ పుణేకు చెందిన ముస్లిం దంపతులు దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీం ధర్మాసనం విచారణకు అంగీకరించింది. శబరిమల ఆలయం పిటిషన్ తరహాలోనే ఈ పిటిషన్‌ను సుప్రీంకోర్టు విచారించనుంది.

# ప్రతి భారతీయుడూ గర్వపడే వార్త

● జమ్మూకాశ్మీర్‌లో స్థానిక ఎన్నికలపై ప్రధాని మోడీ స్పందన ● 98 శాతం పోలింగ్ నమోదవ్వడంపై సంతోషం



**న్యూఢిల్లీ :** జమ్మూకాశ్మీర్‌లో స్థానిక సంస్థల ఎన్నికలు ప్రశాంతంగా ముగియడంపై ప్రధాని నరేంద్ర మోడీ అమితానందాన్ని వ్యక్తం చేశారు. చరిత్రాత్మక రీతిలో 98 శాతం పోలింగ్ నమోదవ్వడంపై సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రతీ భారతీయుడు గర్వపడే వార్త ఇది. 1947లో స్వాతంత్ర్యం సిద్ధించిన తర్వాత తొలిసారి అక్టోబర్ 24న జమ్మూ, కాశ్మీర్, లేహ్, లఢక్‌లలో బ్లాక్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ ఎన్నికలు జరిగాయి. చరిత్రాత్మకంగా 98 శాతం పోలింగ్ నమోదైంది. 310 బ్లాక్‌ల బరిలో మొత్తం 1080 మంది పోటీలో నిలిచారు. ఆగస్టు నెలలో చరిత్రాత్మకంగా పార్లమెంట్ తీసుకున్న నిర్ణయానికి గర్వపడుతున్నాను. జమ్మూకాశ్మీర్ ప్రజలు ఎంతో ఉత్సాహంగా ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎలాంటి హింస లేదా ఇబ్బందికర పరిస్థితులు కలగలేదు. 98 శాతం పోలింగ్ నమోదైంది. భారత పార్లమెంట్ తీసుకున్న నిర్ణయానికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. జమ్మూకాశ్మీర్‌లోని ప్రజల లక్ష్యాలకు యువత, క్రియాశీలికమైన ప్రతినిధులు రూపమివ్వనున్నారు. జమ్మూకాశ్మీర్ అంశంలో చరిత్రాత్మకంగా పార్టీలకు అతీతంగా మద్దతు తెలిపిన ప్రతి ఎంపీకి మరోసారి ధన్యవాదాలు తెలియజేస్తున్నాని ప్రధాని మోడీ వరుసగా ట్వీట్ చేశారు. ప్రజాస్వామ్యంపై ప్రజల విశ్వాసం అర్థమైందన్నారు. క్షేత్ర స్థాయిలో స్థానిక ప్రభుత్వాలు అవసరమని ప్రజలు చెప్పారన్నారు. జమ్మూకాశ్మీర్‌లో కొత్త నాయకత్వం ఉదయించింది. దేశాభివృద్ధికి వీరంతా సహకారం అందించనున్నారని అభిలాష వ్యక్తం చేశారు. ఆవశ్యత ఎన్నికల్లో విజయం సాధించిన వారికి ఆయన అభినందనలు తెలిపారు. ఇదిలావుండగా మొత్తం 310 బ్లాక్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ స్థానాలకు ఎన్నికలు జరిగాయి. 200 స్థానాల్లో స్వతంత్ర అభ్యర్థులు విజయం సాధించగా.. బీజేపీ 81 స్థానాల్లో గెలుపొందింది. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్, నేషనల్ కాన్ఫరెన్స్, పీడీపీ పార్టీలు పోటీకి దూరంగా ఉన్నాయి. ఆర్టికల్ 370 రద్దు తర్వాత నేతలను నిర్బంధిచడంపై నిరసనగా ఆయా పార్టీల నేతలు ఎన్నికల్లో పోటీచేయలేదు.




# నేనూ ఫెయిలే!

## తొలి ప్రయత్నంలో తిరస్కారం: సచిన్

**ముంబై:** క్రికెటర్‌గా తన ప్రస్థానం అంత సులభంగా ఆరంభం కాలేదని దిగ్గజ బ్యాట్స్‌మన్ సచిన్ టెండూల్కర్ తెలిపాడు. భారత జట్టుకు ఎంపికకోసం చేసిన తొలి ప్రయత్నంలో తాను విఫలమయ్యానని, ఆపై పట్టుదలతో కృషి చేసి భారత జట్టులో స్థానం సంపాదించుకున్నానని చెప్పాడు. వైఫల్యాలను మెట్లుగా మలచుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సచిన్ లేట్ లక్ష్మణరావు దురె పాఠశాల విద్యార్థులకు మార్గదర్శనం చేశాడు. సచిన్ పార్లమెంట్ సభ్యుడిగా ఉన్న కాలంలో ఈ పాఠశాలకు ఎంపి ల్యాడ్స్ నిధులనుంచి మూడు తరగతి గదులు, ఒక సాంస్కృతిక వేదిక నిర్మాణానికి ఆర్థిక సాయం అందించాడు. శుక్రవారం ఆ పాఠశాలను సందర్శించి విద్యార్థులతో సరదాగా గడిపాడు. ఈ సందర్భంగా సచిన్ మాట్లాడుతూ తాను విద్యార్థిగా ఉన్నపుడు భారత జట్టుకు ఎంపిక కావాలన్నదే ధ్యేయంగా ఉండేవాడినని, పదకొండేళ్ల నుంచే తాను జాతీయ జట్టుకు ఎంపిక కావాలని కలలు కన్నానని చెప్పాడు. తొలిసారి ఎంపిక ప్రక్రియలో పాల్గొన్న పుడు తన బ్యాటింగ్ మరింత మెరుగవ్వాలని సెలెక్టర్లు చెప్పినపుడు ఎంతో నిరాశకు గురయ్యానని, అయితే మరింత కష్టించి భారత జట్టుకు ఎంపికయ్యానని తెలిపాడు. తమ కలలు నెరవేర్చుకోవాలంటే ఎవరైనా కష్టించాల్సిందేనని, అడ్డదారులు సహకరించవన్నాడు. టెస్టులలో 15,921 పరుగులు, వన్డేలలో 18,426 పరుగులు సాధించిన టెండూల్కర్ తన విజయంలో తన కుటుంబం, కోచ్ రమాకాంత్ అచ్రేకర్ సహకారం మరువలేనిదన్నాడు. వారి సహకారమే లేకుంటే తానింత వాడిని అయ్యేవాడినే కాదన్నాడు. చిన్నతనంలో తన తల్లిదండ్రులు, సోదరులు అజిత్, నితిన్ ఎంతో సహకరించారన్నాడు. తన సోదరి తనకు జీవితంలో తొలి బ్యాట్‌న బహూకరించిందని తెలిపాడు. వివాహానంతరం భార్య అంజలి, ఆ తరువాత సంతానం అర్జున్, సారాలు తన విజయాలలో పాలుపంచుకున్నారన్నాడు. తన కెరీర్‌ను మలచడంలో గురువు అచ్రేకర్ పాత్ర ఎంత పొగిడినా తక్కువేనన్నాడు.

# డే-నైట్ టెస్టులకు ఓకే!

## బీసీసీఐ ప్రెసిడెంట్ గంగూలీ



**కోల్‌కతా :** డే-నైట్ టెస్టులు ఆడేందుకు కెప్టెన్ కోహ్లీ సంసిద్ధత వ్యక్తం చేశాడని బీసీసీఐ నూతన అధ్యక్షుడు సౌరవ్ గంగూలీ వెల్లడించాడు. సమీప భవిష్యత్తులో డై-నైట్ టెస్టులు ప్రాధాన్యత సంతరించుకోనున్న నేపథ్యంలో కోహ్లీ అందుకు అంగీకారం తెలిపా డన్నాడు. గురువారం ముంబైలో భేటీ సందర్భంగా కోహ్లీ సుముఖత వ్యక్తం చేశాడని గంగూలీ తెలిపాడు. గతంలో కోహ్లీ డే నైట్ టెస్టులకు విముఖత చూపాడని వచ్చిన వార్తలు కేవలం వదంతులేనని, ఈ తరహా టెస్టులకు భవిష్యత్తులో ఆదరణ పెరుగుతుందన్న నమ్మకంతో కోహ్లీ డే-నైట్ టెస్టుల పట్ల ఆసక్తి చూపుతున్నాడన్నాడు. కోహ్లీ ముందుకువస్తే డై-నైట్ టెస్టుల నిర్వహణకు తగిన ఏర్పాట్లు బీసీసీఐ చేస్తుందని గంగూలీ తెలిపాడు.



శుక్రవారం బెంగాల్ క్రికెట్ సంఘం(క్యాబ్) సన్మానించిన సందర్భంగా గంగూలీ పలు అంశాలను వెల్లడించాడు. పింక్ బంతు లతో టెస్టులను ఆడించడం ప్రేక్షకుల సంఖ్యను పెంచు తుందన్నాడు. డే-నైట్ టెస్టులపై తనకు విశ్వాసం ఉందని, అవి త్వరలోనే భారత్‌లోనూ ఆదరణ పొందగలవన్నాడు. అయితే భారత్‌లో డే-నైట్ టెస్టులు ఎపుడు ఆరంభవౌతాయన్నది ఇపుడే చెప్పలేమన్నాడు. తాను అధికారంలో ఉన్నంతకాలం ఈ తరహా టెస్టులను ప్రవేశపెట్టేందుకు కృషి చేస్తూనే ఉంటానన్నాడు. అయితే గంగూలీ పదవీకాలం వచ్చే ఏడాది జులై వరకు మాత్రమే. బంగ్లాదేశ్‌తో టెస్టు సిరీసే ఇండియాకు ఈ ఏడాది చివరి సిరీస్. ఆ తరువాత డిసెంబర్-2020 వరకు మన జట్టుకు టెస్టు మ్యాచ్‌లు లేవు. అందువల్ల పరిమిత పదవీ కాలం నేపథ్యంలో గంగూలీ నేతృత్వంలో మన దేశంలో డే-నైట్ టెస్టు మ్యాచ్‌లు జరిగే అవకాశం లేదు.

బీసీసీఐ టెక్నికల్ కమిటీ చైర్మన్‌గా ఉన్న సమయంలో గంగూలీ దులీప్ ట్రోఫీ మ్యాచ్‌లను ఫ్లడ్‌లైట్ల వెలుతురులో గులాబీ బంతులతో నిర్వహించాలని ప్రతిపాదించాడు. అయితే బౌలర్లు ఎస్‌జీ టెస్టు బంతులు నాణ్యమైనవి కావని ఫిర్యాదు చేయడంతో ఆ ప్రతిపాదన కార్యరూపం దాల్చలేదు. అంతేగాక ఈశాన్య భారతంలో తేమ ఎక్కువగా పడుతుండడంకూడా డే-నైట్ మ్యాచ్‌ల నిర్వహణ కష్టంగా ఉండేది. ముఖ్యంగా స్పిన్నర్లు బంతులపై నియంత్రణ కోల్పోయేవారు. 2016-17 సీజన్‌లో ఫ్లడ్‌లైట్ల వెలుతురులో దులీప్ ట్రోఫీ మ్యాచ్‌లు నిర్వహిస్తున్నప్పటికీ ఈ ఏడాది బోర్డు క్రికెట్ ఆపరేషన్స్ కమిటీ సలహాపై పగటిపూటే నిర్వహించారు. ఇటువంటి పరిస్థితుల్లో భారత జట్టు డే-నైట్ టెస్టులపై ఆసక్తి చూపలేదు. గత ఆస్ట్రేలియా పర్యటనలో డే-నైట్ టెస్టు నిర్వహణకు క్రికెట్ ఆస్ట్రేలియా అభ్యర్థనను కూడా త్రోసిపుచ్చింది.

పరస్పర విరుద్ధ ప్రయోజనాల అంశా న్నికూడా పునఃపరిశీలించాల్సి ఉందని గంగూలీ అన్నాడు. నిపుణులైన క్రికెటర్ల సేవలను పొందాలంటే ఈ నిబంధనలో మార్పులు చేయాల్సిన అవసరముందన్నాడు. మెరుగైన క్రికెటర్లు పలువురు ఇతర వ్యాపకాలలో ఉన్నందున వారి సేవలను వినియోగించుకునేందుకు ఈ నిబంధన అడ్డుగా ఉందన్నాడు. విరుద్ధ ప్రయో జనం అన్నది అర్థవంతంగా ఉండాలని, మెరుగైన సేవలను అందుకునేందుకు అది అడ్డు కారాదన్నాడు. ఆ నిబంధనను సరళతరం చేసి ముందుకు సాగేలా చర్యలు తీసుకుం టామన్నాడు. ఈ నిబంధనతో సచిన్, లక్ష్మణ్, అజరుద్దీన్, రాహుల్ ద్రవిడ్, కపిల్‌దేవ్, గవాస్క ర్‌వంటి దిగ్గజాల సేవలను వినియోగిం చుకోలేకపోతు న్నామన్నాడు. భవిష్యత్తులో ఐసీసీ చైర్మన్ పదవిని చేపట్టాలని భావిసు న్నారా అని విలేకరులు అడిగిన ప్రశ్నలకు బీసీసీఐ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీక రించి రెండు రోజులే అయిందని, ఐసీసీ పదవి గురించి ఇపుడపుడే ఆలోచిం చడం లేదన్నాడు. గంగూలీపై ఇతరుల ప్రభావం ఉందన్న వదంతులను ఖండిస్తూ తాను స్వయం నిర్ణయాలకు కట్టుబడి ఉంటానని, బీసీసీఐని నడిపించడంలో కార్యవర్గం, మేధావుల సలహాలను స్వీకరిస్తామని చెప్పాడు. తాను అధ్యక్షుడిగా ఉన్నకాలంలో బీసీసీఐని కొత్త మార్గంలో నడిపించడం ఖాయమని స్పష్టం చేశాడు.

భారత జట్టు ప్రపంచస్థాయి టోర్నీని గెలిచి చాలాకాలమైందని, టెస్టులు, ప్రపంచ టోర్నీలను గెలిచినపుడే ప్రపంచం ఆ జట్టును గుర్తుంచుకుంటుందని, భారత జట్టుకు ఇపుడు ఆ గుర్తింపు అవసరమన్నాడు. భారత జట్టు గత మూడేళ్లుగా మెరుగైన ప్రదర్శన చేస్తోందని, అయినా గత ఏడెనిమిది సీజన్లల్లో ఒక్క ప్రపంచస్థాయి టోర్నీనికూడా గెలవలేకపోవడం బాధగా ఉందన్నాడు. జట్టులో ప్రతిభకు కొదవలేదని, దానిని సరైన సమయంలో ఉపయోగించాల్సి ఉందన్నాడు. ఐపీఎల్‌గురించి మాట్లాడుతూ ప్రపంచంలో ఐపీఎల్ అత్యంత ప్రజాదరణ కలిగిన లీగ్ అని, ఆ రెండున్నర కాలాలు ఇంగ్లీష్ ప్రీమియర్‌కు ఏమాత్రం తీసిపోని విధంగా ఐపీఎల్ నిర్వహణ జరుగుతోందన్నాడు. ఈ కార్యక్రమానికి మాజీ దిగ్గజాలు మహ్మద్ అజరుద్దీన్, వివిఎస్ లక్ష్మణ్‌లు కూడా హాజరయ్యారు.

### బుమ్రా, మంధానలకు
# విజ్డన్ పురస్కారం





**బెంగళూరు :** భారత ప్రధాన పేస్ బౌలర్ జస్ప్రీత్ బుమ్రా, మహిళా క్రికెటర్ స్మృతి మం ధాన విజ్డన్ ఇండియా ఆల్మానాక్ క్రికెటర్ ఆఫ్ ది ఇయర్ అవార్డుకు ఎంపికయ్యారు. శుక్రవారం ప్రకటించిన విజ్డన్ ఇండియా ఆల్మానాక్ పురస్కారాలలో బుమ్రా, మంధానలకు ఈ అవార్డులు లభించాయి. ఆసియాలో అయిదుగురు ఈ అవార్డుకు ఎంపికయ్యారు. పాకిస్తాన్‌కు చెందిన ఫఖర్ జమాన్, శ్రీలంక ఆటగాడు దిముత్ కరుణరత్నె, అఫ్గానిస్తాన్‌కు చెందిన రషీద్ ఖాన్ ఈ అవార్డుకు ఎంపికయ్యారు. 2019-20 సంవత్సరానికి ముద్రితమైన ఏడో వార్షిక విజ్డన్ క్రికెట్ ముద్రణలో ఉత్తమ దేశవాళీ క్రికెటర్‌గా కె.ఎల్.రాహుల్ ఎంపికయ్యాడు. విజ్డన్ క్రికెటర్ ఆఫ్ ది ఇయర్‌గా ఎంపికైన మూడో భారత మహిళా క్రికెటర్ స్మృతి మంధాన. గతంలో మిథాలీ రాజ్, దీప్తి శర్మ ఈ అవార్డును అందుకున్నారు. విజ్డన్ ఇండియా హాల్ ఆఫ్ ఫేమ్‌లో మాజీ దిగ్గజాలు గుండప్ప విశ్వనాథ్, లాలా అమర్‌నాథ్ పేర్లు చేర్చారు. ప్రశాంత్ కిడాంబి రాసిన క్రికెట్ కంట్రీ: ది అన్‌టోల్డ్ హిస్టరీ ఆఫ్ ఫస్ట్ ఆలిండియా టీమ్ పుస్తకాన్ని విజ్డన్ ఇండియా బుక్ ఆఫ్ ది ఇయర్ అవార్డుకు ఎంపిక చేశారు. ఈ పుస్తకంలో 1911లో భారత జట్టు ఇంగ్లండ్ పర్యటన గురించి, జట్టులో నాటి రాజకీయాల గురించి విశ్లేషించారు.

# సెమీస్‌కు సాత్విక్- చిరాగ్ జోడి

**పారిస్ :** ఫ్రెంచ్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీలో భారత పురుషుల జోడీ సాత్విక్ సాయిరాజ్-చిరాగ్‌శెట్టి సెమీఫైనల్‌కు చేరుకుంది. శుక్రవారం జరిగిన క్వార్టర్‌ఫైనల్లో భారత జంట 21-13, 22-20 స్కోరుతో ప్రపంచ 8వ ర్యాంకింగ్ జోడి, డెన్మార్క్‌కు చెందిన కిమ్ ఆస్ట్రప్-ఆండర్స్ షాకర్ప్‌లను 39 నిమిషాల్లో మట్టికరపించింది. సాత్విక్-చిరాగ్ సెమీస్‌లో జపాన్‌కు చెందిన అయిదో సీడ్ జంట హిరోయుకి ఎండో-యుటా వతనబె, చైనాకు చెందిన మూడో సీడ్ జోడి లియ జున్ హుయి-లియు యు చెన్‌ల మధ్య విజేతతో తలపడుతుంది.

మహిళల సింగిల్స్‌లో 29 ఏళ్ల సైనా నెహ్వాల్ 20-22, 21-23 స్కోరుతో వరుస గేమ్‌లలో ప్రపంచ 16వ ర్యాంకర్ కొరియాకు చెందిన ఆన్ సె యంగ్ చేతిలో 49 నిమిషాలలో ఓటమి చవిచూసింది. ఈ ఏడాది ఆసియా చాంపియన్‌షిప్‌లో ప్రిక్వార్టర్స్ తరువాత క్వార్టర్ ఫైనల్‌కు చేరిన సైనా ఆపై ముందుకు సాగలేకపోయింది. గత మూడు టోర్నీలలో సైనా తొలి రౌండ్‌లోనే నిష్క్రమించింది. 2012లో సైనా ఇక్కడ ఫైనల్‌కు చేరింది. సైనా తదుపరి ఈనెల 29నుంచి ఆరంభమయ్యే సార్లోర్లక్స్ ఓపెన్(జర్మనీ)లో పాల్గొననున్నది.

# ఆసీస్ జట్టులో స్మిత్, వార్నర్

## శ్రీలంకతో రేపు తొలి టి20



**ఆడిలైడ్ :** శ్రీలంకతో జరుగనున్న మూడు మ్యాచ్‌ల టి20 సిరీస్‌కు ఆసీస్ జట్టులో స్టీవ్ స్మిత్, డేవిడ్ వార్నర్ చోటు దక్కించుకున్నారు. వచ్చే ఏడాది స్వదేశంలో జరుగనున్న టి20 ప్రపంచకప్ నేపథ్యంలో పాక్ జట్టుపై సిరీస్ విజయంతో ఉత్సాహం ఉరకలు వేస్తున్న లంకను నిలువరించేందుకు పాత కాపులు స్మిత్, వార్నర్‌లకు అవకాశం ఇచ్చారు. బాల్ ట్యాంపరింగ్ వివాదంలో ఏడాది నిషేధానికి గురైై ఇటీవలే టెస్టు, వన్డే జట్లలో స్థానం దక్కించుకున్న స్మిత్, వార్నర్ ఇపుడు టి20 జట్టులోనూ స్థానం పొందారు. ఇతర ఫార్మాట్లలో విజయాలు సాధించిన ఆస్ట్రేలియా టి20 ఫార్మాట్‌లో మాత్రం ప్రపంచకప్‌లో విఫలమౌతోంది. 2010లో ఫైనల్‌కు చేరడమే టి20 ప్రపంచకప్‌లో వారి ఉత్తమ ప్రదర్శన. ఇరు జట్ల మధ్య ఆదివారం తొలి టి20 అడిలైడ్‌లో జరుగనుండగా, మూడు రోజుల అనంతరం 30న రెండో మ్యాచ్ బ్రిస్బేన్‌లో, నవంబర్ 1న మూడో మ్యాచ్ మెల్‌బోర్న్‌లో జరుగనున్నాయి. అరోన్ ఫించ్ ఆసీస్ జట్టుకు నాయకత్వం వహించ నున్నాడు. స్మిత్ చేరికతో ఆసీస్ బ్యాటింగ్ మరింత బలోపే తమైంది. ఇటీవల యాషెస్ సిరీస్‌లో గొప్పగా రాణించిన స్మిత్‌పైనే ఆసీస్ ఆశలు పెట్టుకున్నది. టెస్టులలో వార్నర్ విఫలమైనప్పటికీ టి20లలో మెరుగైన ప్రతిభనే ప్రదర్శించాడు. అతని ఓపెనింగ్ స్థానం పదిలమే. అతనికి తోడు కెప్టెన్ ఫించ్ ఓపెనర్‌గా బరిలోకి దిగుతాడు. స్టీవ్ స్మిత్, ఆస్టన్ అగర్, అలెక్స్ కేరీ, గ్లెన్ మాక్స్‌వెల్‌లతో ఆసీస్ మిడి లార్డర్‌కూడా పటిష్టంగానే ఉంది. ఇక పాట్ కమిన్స్, మిచెల్ స్టార్క్ కొత్త బంతిని పంచుకోనుండగా, ఆండ్రూ టై, కేన్ రిచర్డ్ సన్, బిల్లీ స్టాన్‌లేక్ బౌలింగ్ భారాన్ని పంచు కోనున్నారు. టీ20 టాప్‌ర్యాంకర్ పాకిస్తాన్‌పై ఇటీవల 3-0తో సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేసిన శ్రీలంక ఆత్మవిశ్వాసంతో ఉంది. పాకిస్తాన్‌లో ద్వితీయశ్రేణి జట్టుతో పర్యటించిన శ్రీలంక ఇపుడు లసిత్ మలింగ సారథ్యంలో కుశాల్ పెరీరా, నిరోషన్ డిక్‌వెల్లాల చేరికతో బలంగా రూపొందింది. పాకిస్తాన్‌లో రాణించిన కొత్త ఆటగాళ్లు భానుక రాజపక్స, ఒషాడ ఫెర్నాండో ఆస్ట్రేలియాలోనూ రాణించాలన్న ఆసక్తితో ఉన్నారు.

**జట్లు :** ఆస్ట్రేలియా - అరోన్ ఫించ్(కెప్టెన్), ఆస్టన్ అగర్, అలెక్స్ కేరీ, పాట్ కమిన్స్, గ్లెన్ మాక్స్‌వెల్, బెన్ మెక్‌డెర్మాట్, కేన్ రిచర్డ్‌సన్, స్టీవ్ స్మిత్, బిల్లీ స్టాన్‌లేక్, మిచెల్ స్టార్క్, ఆస్టన్ టర్నర్, ఆండ్రూ టై, డేవిడ్ వార్నర్, ఆడమ్ జంపా.

**శ్రీలంక** - లసిత్ మలింగ(కెప్టెన్), కుశాల్ పెరీరా, కుశాల్ మెండిస్, ధనుష్క గుణతిలక, అవిష్క ఫెర్నాండో, నిరోషన్ డిక్‌వెల్ల, దసున్ షనక, శేహన్ జయసూరియ, భనుక రాజపక్ష, ఒషాడ ఫెర్నాండొ, వనిందు హసరంగ, లక్షణ్ సందకన్, నువాన్ ప్రదీప్, లాహిరు కుమార, ఇసురు ఉదాన, కసున్ రజిత.



# కర్ణాటక కొట్టేసింది

## విజయ్ హజారె ఫైనల్లో విజయం... రాణించిన మిథున్, రాహుల్



**బెంగళూరు :** కీపర్ బ్యాట్స్‌మన్ కె.ఎల్.రాహుల్ సత్తా చాటగా, బర్త్‌డే బోయ్ అభిమన్యు మిథున్ హ్యాట్రిక్‌తో కర్ణాటక జట్టుకు విజయ్ హజారె ట్రోఫీని అందించారు. శుక్రవారం జరిగిన ఫైనల్లో కర్ణాటక జట్టు 60 పరుగుల తేడాతో తమిళనాడును ఓడించి విజేతగా నిలిచింది. తొలుత బ్యాటింగ్ చేసిన తమిళనాడు ఒక్క బంతి మిగిలి ఉండగా 252 పరుగులకు ఆలౌట్ కాగా, సమాధానంగా కర్ణాటక 23 ఓవర్లలో ఒక వికెట్ నష్టానికి 146 పరుగులు చేసిన తరుణంలో వర్షం కారణంగా ఆట నిలిచిపోయింది. ఆపై ఆట కొనసాగించే వీలు లేకపోవడంతో విజెడి నిబంధనల ప్రకారం కర్ణాటకను విజేతగా ప్రకటించారు. విజెడి ప్రకారం 23 ఓవర్లలో కర్ణాటక 87 పరుగులు చేస్తే చాలు. అప్పటి లక్ష్యంకంటె కర్నాటక 60 పరుగుల ముం దంజలో ఉంది.

విజయ్ హజారె ట్రోఫీని కర్ణాటక గెలుచు కోవడం ఇది నాలుగోసారి. గతంలో 2013-14, 2014-15, 2016-17 సంవత్సరాల్లో కూడా కర్ణాటక ఈ ట్రోఫీని గెలుచుకుంది. తమిళనాడు అయిదుసార్లు ట్రోఫీని దక్కించుకుంది.

టాస్ గెలిచిన కర్ణాటక ప్రత్యర్థిని బ్యాటింగ్‌కు ఆహ్వానించింది. ఓపెనర్ మురళీ విజయ్, వన్‌డౌన్ బ్యాట్స్‌మెన్‌గా వచ్చిన రవిచంద్రన్ అశ్విన్ తక్కువ స్కోర్లకే వెనుతిరిగారు. మరో ఓపెనర్ అభినవ్ ముకుంద్(85, 9 ఫోర్లు), యువ బ్యాట్స్‌మన్ బాబా అపరాజిత్(66, 7 ఫోర్లు) మూడో వికెట్‌కు సెంచరీ భాగస్వామ్యంతో ఇన్నింగ్స్‌ను పునర్నిర్మించారు. అయితే అభిమన్యు మిథున్ మిడిలార్డర్, టేలెండర్ల భరతం పట్టడంతో తమిళ నాడు సవాల్ విసరగల స్కోరును సాధించలేకపోయింది. మిథున్ 252 స్కోరువద్ద షారుఖ్‌ఖాన్, మహ్మద్, మురుగన్ అశ్విన్‌లను వరుస బంతులలో అవుట్ చేసి హ్యాట్రిక్ సాధించాడు. అంతేగాక లిస్ట్-ఎ మ్యాచ్‌లో తొలిసారి అయిదు వికెట్ల ఘనత సాధించాడు. మిథున్ 5, కౌశిక్ 2, జైన్, గౌతం ఒక్కొక్క వికెట్ దక్కించుకున్నారు.

అనంతరం కర్ణాటక ఓపెనర్ దేవదత్ పడిక్కల్ వికెట్‌ను త్వరగానే కోల్పోయినప్పటికీ మరో ఓపెనర్ రాహుల్, మయాంక్ అగర్వాల్ మరో వికెట్ పడకుండా స్కోరును 23 ఓవర్లలో 146 పరుగులకు చేర్చారు. ఈ తరుణంలో వర్షం కారణంగా మ్యాచ్ ఆగిపోయింది. దాదాపు ముప్పావుగంటపాటు వర్షం కొనసాగడంతో ఆపై మ్యాచ్ నిర్వహణకు అనుకూల పరిస్థితి లేకపోవడంతో నిబం ధనల ప్రకారం కర్ణాటకను విజేతగా ప్రకటించారు. విజెడి నిబంధనల ప్రకారం 23 ఓవర్లనాటికి కర్ణాటక 87 పరుగులు చేస్తే సరిపోతుంది. అప్పటికే 60 పరుగులు ముందంజలో ఉన్నందున కర్ణాటకకు ట్రోఫీ దక్కింది.

**సంక్షిప్త స్కోర్లు :** తమిళనాడు - 49.5 ఓవర్లలో 252 ఆలౌట్(అభినవ్ ముకుంద్ 85, బాబా అపరాజిత్ 66, విజయ్‌శంకర్ 38, షారుఖ్‌ఖాన్ 27, అభినవ్ మిథున్ 5/34, కౌశిక్ 2/39), కర్ణాటక - 146/1, 23 ఓవర్లలో(కె.ఎల్.రాహుల్ 52 నాటౌట్, మయాంక్ అగర్వాల్ 69 నాటౌట్).

# జోష్న ముందంజ

**కైరో :** ప్రపంచ మహిళా స్క్వాష్ చాంపియన్‌షిప్‌లో భారత క్రీడాకారిణి జోష్న చినప్ప తొలి రౌండ్‌లో చెమటోడ్చి నెగ్గింది. శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో జోష్న 9-11, 12-10, 8-11, 11-6, 11-6 స్కోరుతో అన్‌సీడెడ్ క్రీడాకారిణి హాలే మెండెజ్(అమెరికా)ను ఓడించింది. కుదురుకునేందుకు సమయం తీసుకున్నందున విజయంకోసం కష్టించాల్సి వచ్చిందని జోష్న తెలిపింది. అయిదు గేమ్‌లో పోరులో క్రమంగా పుంజుకుని చివరి రెండు గేమ్‌లను సునాయాసంగా దక్కించుకుంది. మరో భారత క్రీడాకారిణి సుకన్య కురువిల్ల తొలి గేమ్‌ను గెలుచుకున్నా తరువాత వరుసగా గేమ్‌లను కోల్పోయి బెల్జియం క్రీడాకారిణి నెలె గిలిస్ చేతిలో 11-8, 7-11, 4-11, 5-11 స్కోరుతో ఓడిపోయింది. ఇదే సమయంలో జరుగుతున్న ఈజిప్షియన్ ఓపెన్ టోర్నీలో భారత ఆటగాడు రమిత్ టాండన్ తొలి రౌండ్‌లో 5-11, 7-11, 2-11తో హాంకాంగ్ ఆటగాడు లియో అయు చేతిలో పరాజయం చవిచూశాడు. సౌరవ్ ఘోషాల్‌కు తొలిరౌండ్‌లో బై లభించింది.



# అథ్లెటికో ఘనవిజయం

## ఐఎస్ఎల్ ఫుట్‌బాల్ టోర్నీ



**కోల్‌కతా:** మాజీ చాంపియన్ అథ్లెటికొ కోల్‌కతా జట్టు ఇండియన్ సూపర్‌లీగ్‌లో ఘన విజయం అందుకుంది. శుక్రవారం సొంత మైదానంలో జరిగిన తొలి మ్యాచ్‌లో అథ్లెటికొ 5-0తో హైదరాబాద్ ఫుట్‌బాల్ క్లబ్‌పై గెలుపొందింది. మ్యాచ్ ప్రథమార్థంలోనే అథ్లెటికొ పూర్తి పట్టును సాధించింది. డేవిడ్ విలియమ్స్ 25, 44 నిమిషాలలో రెండు గోల్స్ చేయడంతో విరామ సమయానికే ఆ జట్టు 3-0 ఆధిక్యంలోకి దూసుకుపోయింది. 27వ నిమిషంలో రాయ్ కృష్ణమరో గోల్ నమోదు చేశాడు. ద్వితీయార్థం చివరి క్షణాలలో ఎడు గార్షియా 88, 90 నిమిషాలలో గోల్స్ సాధించి హైదరాబాద్ జట్టు పరాజయానికి కారణమయ్యాడు. అక్టోబర్ 20న ప్రారంభోత్సవ మ్యాచ్‌లో అథ్లెటికొ 0-1తో ఓటమికి ఈ విజయంతో ఊరటపొందింది.

# ఫైనల్లో దీపక్

**వుహాన్(చైనా) :** ప్రపంచ మిలటరీ క్రీడల్లో భారత బాక్సర్ దీపక్ ఫ్లైవెయిట్ విభాగంలో ఫైనల్‌కు చేరి కనీసం రజతం ఖాయం చేసుకున్నాడు. కాగా 20కి.మీ. నడక పోటీలో ఒలింపియన్ ఇర్ఫాన్ తృటిలో పతకం చేజార్చుకున్నాడు. సెమీఫైనల్లో దీపక్ అజర్‌బైజాన్‌కు చెందిన అలిజాద సల్మాన్‌పై 5-0 తేడాతో గెలుపొందాడు. బాంటమ్ వెయిట్ విభాగంలో భారత బాక్సర్ చిరాగ్ 1-4 తేడాతో మంగోలియాకు చెందిన ఖర్ఖూ అమర్ చేతిలో ఓడిపోయాడు. టెన్నిస్ పురుషుల సింగిల్స్‌లో భారత ఆటగాడు శ్రీరాం బాలాజీ 3-6, 4-6 స్కోరుతో చైనాకు చెందిన ఝూంగ్ జి జెన్ చేతిలో ఓటమిపాలయ్యాడు. కాగా పురుషుల 1500 మీ. పరుగులో జిన్సన్ జాన్సన్(3ని. 56.17సె.), 4-400మీ. రిలేలో భారత జట్టు ఫైనల్స్‌కు చేరుకున్నారు.

### ఇర్ఫాన్ పతకం మిస్..

20కి.మీ. నడక పోటీలో ఇర్ఫాన్ 1గంట 25.09 నిమిషాలలో గమ్యం చేరి నాలుగో స్థానంలో నిలిచి తృటిలో పతక అవకాశం చేజార్చు కున్నాడు. చైనాకు చెందిన జు హువా 1గం.22.18ని. టైమింగ్‌తో స్వర్ణం దక్కించుకున్నాడు. కాగా ఉక్రెయిన్ అథ్లెట్ షుమిక్ విక్టర్(1గం.23.18ని.) రజతం, ఉక్రెయిన్‌కు చెందిన ఉరద్నిక్ మిరొస్లావ్(1గం.24.16ని.) కాంస్యం గెలుచుకున్నారు. ఇర్ఫాన్ ఇప్పటికే టోక్యో ఒలింపిక్స్‌కు అర్హత సాధించాడు.

### ఇంగ్లండ్‌తో సిరీస్‌కు
# విలియమ్సన్ దూరం




**వెల్లింగ్టన్ :** ఇంగ్లండ్‌తో త్వరలో జరుగనున్న టి20 సిరీస్‌కు న్యూజిలాండ్ కెప్టెన్ కేన్ విలియమ్సన్ దూరం కానున్నాడు. తుంటి నొప్పి తిరగబెట్టడంతో విలియమ్సన్ సిరీస్‌నుంచి తప్పుకున్నట్టు క్రికెట్ న్యూజిలాండ్ తెలిపింది. అతని స్థానంలో టిమ్ సౌథీ సారథ్యం వహిస్తాడు. అయిదు మ్యాచ్‌ల టి20 సిరీస్ తరువాత జరిగే రెండు మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌కు విలియమ్సన్ అందుబాటులోకి రాగలడని కివీస్ బోర్డు ఆశాభావం వ్యక్తంచేసింది. గత మార్చిలో బంగ్లాదేశ్‌తో టెస్టు సిరీస్ సందర్భంగా విలయమ్సన్ తుంటికి గాయమైందని, ఇపుడు అది తిరగబెట్టిం దని జట్టు కోచ్ గారీ స్టెడ్ తెలిపాడు. కాగా పేస్‌బౌలర్ లోకీ ఫెర్గూసన్ తొలి మూడు మ్యాచ్‌లలో ఆడతా డని, తరువాతి రెండు మ్యాచ్‌లకు అతని స్థానంలో ట్రెంట్ బౌల్ట్ ఆడతాని స్టెడ్ వివరించాడు. గత ప్రపంచకప్ ఫైనల్ తరువాత ఇరు జట్లు ముఖాముఖి పోరుకు సిద్ధమవడం ఇదే తొలిసారి. తొలి మ్యాచ్ నవంబర్ 1న క్రైస్ట్‌చర్చ్‌లో జరుగనుంది.

**న్యూజిలాండ్ జట్టు :** టిమ్ సౌథీ(కెప్టెన్), ట్రెంట్ బౌల్ట్, కొలిన్ డి గ్రాండ్‌హోమ్, లోకీ ఫెర్గూసన్, మార్టిన్ గప్టిల్, స్కాట్ కుగ్లీజిన్, డేరీ మిచెల్, కొలిన్ మన్రో, జిమ్మీ నీషమ్, మిచెల్ సాంట్నర్, టిమ్ సీఫర్ట్, ఐష్ సోధి, రాస్ టేలర్, బ్లెయిర్ టిక్నర్.

Printed & Published by **MOOTHA GOUTAM** on behalf of Andhra Prabha Publications Ltd., and printed at Andhra Prabha Publications Ltd., 13-6-445/a/b1, Konejeti Enclave, Mehdhipatnam, Hyderabad-500028. Published from Andhra Prabha Publications Ltd., 8-2-293/82/A/75, Plot No.75, Road No.9, Jubilee Hills, Hyderabad-500033. Phones: 23559940/41/42/45, Fax No.23558812. Editor: Y S R Sarma, Responsible for News selection under PRB ACT. RNI Regd.No.32178/1977.

lifepage2012@gmail.com





## దూరంగా ఉన్నామని దిగులొద్దు..

# దీపావళి చేసుకోండిలా!

దీపావళి...పండుగ దూసుకు వస్తోంది..మరో కొద్ది గంటల్లో దేశం దీపాల వెలుగుల్లో కాంతులీనబోతోంది. కానీ కొందరికి ముఖ్యంగా భార్యాభర్తలు ఉద్యోగ రీత్యా దూరంగా ఉండాల్సి వస్తుంది. ఇలాంటి పరిస్థితి ఇద్దరికి కాస్త ఇబ్బందే. ఎందుకంటే సెలవు దొరుకుతుంది.. దొరకదు. దొరికితే ఓకే..దొరకక పోతే? అక్కడ ఒకరు ఇక్కడ ఒకరు ఉండి పండుగ రోజు విరహ వేదన అనుభవించాల్సిందేనా? అవసరం లేదంటున్నారు నిపుణులు.. ఇద్దరు ఉద్యోగస్తులు కాబట్టి ముందస్తు ప్లాన్ ప్రకారం సెలవుకు అప్లై చేసుకోవాలి. ఇద్దరికి కాకున్నా ఒకరికైనా సెలవు దొరుకుతుంది. అప్పుడు సెలవు లభించిన వారు, సెలవు లభించని వారి దగ్గరకు వెళ్లి పండుగ చేసుకోవచ్చు. ఇది ఎవరికి తెలియదు..దీనికి ఇంత ఉపోద్ఘాతం అవసరమాఅంటారా? అక్కడికే వస్తున్నాం.. ఇద్దరికి సెలవు లభించలేదు..అప్పుడెలా? అనేకదా మీ ఆలోచన. అప్పుడెలా చేసుకోవాలని అనుకుంటున్నారా? దానికి కొన్ని ఇతర మార్గాలున్నాయి. అవేంటో ఇప్పుడు తెలుసుకుందాం!

**పం**డుగ అంటే మనసుకు ఆనందాన్నిచ్చేది, హాయిని కల్పించేది. కొత్తబట్టలు, పిండివంటలు..వగైరా వగైరా ఎలాగు ఉంటాయి. అయితే భాగస్వామి పక్కనలేని లోటు ఉంటుంది. అక్కడ అతను లేదా ఆమె ఎలా ఉందో అన్న ఆవేదన మనసును తొలిచి వేస్తుంది. ఎందుకంటే ఒకరి సంతోషం మరొకరికి ముఖ్యం కాబట్టి. అలాంటప్పుడు మీరు మీ భాగస్వామికి ఇష్టమైన బహుమతి పండుగకు వారం ముందుగానే కొని..దానిని కొరియర్‌లో పంపించండి. బహుమతి కూడా దీపావళిని దృష్టిలో ఉంచుకొని కొనండి. దీపావళికి అందరు ట్రెడిషనల్ డ్రెస్‌లు ధరిస్తారు. అలాంటి డ్రెస్ కొని మీ భాగస్వామికి పంపారు అనుకోండి..పండుగ రోజు మీరు పంపిన డ్రెస్ ధరించి ఆనందపడతారు. డ్రెస్ మాత్రమే కాదు మీ భాగస్వామికి ఇష్టమైన తలగడ, లేదా ఎప్పటినుంచో కొనాలి అనుకొని కొనలేక పోయిన వస్తువును మీ శ్రీమతి లేదా శ్రీవారికి పంపండి. ఆ వస్తువులో మిమ్ములను చూసుకుని పండుగ నాడు ఆనందంగా గడిపేస్తారు. పండుగ రోజు ప్రియమైన వారు పంపిన గిఫ్ట్ పొందడం కంటే ఆనందం ఏముంటుంది చెప్పండి.

☞ సాంకేతిక విజ్ఞానం పెరిగి పోయాయి. ఆన్‌లైన్‌లో పెళ్లి చూపులు జరుగుతున్న రోజులు.. కాబట్టి దూరంగా ఉన్నామన్న బెంగను పక్కన పెట్టండి. పండుగ రోజు రాత్రి వేళ మీ భోజన సమయం కాగానే డైనింగ్ టేబుల్ మీద దీపాలు వెలిగించి ఆవెలుతురులో డిన్నర్‌కు ప్రిపేర్‌కండి. అప్పుడు మీ భాగస్వామికి వీడియో కాల్ చేయండి. ఇద్దరు పక్కపక్కనే ఉన్న ఫీలింగ్ కలుగుతుంది. ఇద్దరు వీడియో కాల్ ద్వారా కబుర్లు చెప్పుకుంటూ భోజనం చేయండి. ఉదయం నుంచి రాత్రి వరకు జరిగిన విశేషాలు పంచుకోండి. ఒక్కవిషయం మాత్రం మరవకండి..మీ ఇంటర్‌నెట్ కనెక్షన్ కట్ కాకుండా జాగ్రత్త పడండి.. మధ్యలో ఇంటర్‌నెట్ కట్ అయిందనుకోండి నిరుత్సాహం ఆవహిస్తుంది.

☞ దీపావళి ..భాగస్వామి దగ్గర లేదు కాబట్టి మిత్రులతో కలిసి ఉండేందుకు ఇష్టపడతాం. కాబట్టి మీ భాగస్వామితో భోజన సమయంలో ఎక్కడ ఉంటారన్న విషయం తెలుసుకోండి. కాకపోతే వీడియో కాల్ చేస్తానన్న విషయం మాత్రం గోప్యంగా ఉంచండి. భోజన సమయంలో మీ భాగస్వామి ఫ్రెండ్స్‌తో ఉంటారు కాబట్టి ..సర్‌ప్రైజ్‌గా వీడియో కాల్ చేసారు అనుకోండి.. థ్రిల్లింగ్‌గా ఉంటుంది. దోస్తులతో పాటు మీరు పక్కన ఫీలింగ్ భాగస్వామి ఆనందానికి అవధులు లేకుండా చేస్తుంది.



బాలినేని వెంకీనాయుడు..అతనో గ్రామీణ విద్యార్థి.. లక్షలు సంపాదించే ఉద్యోగం వదిలేసి.. అన్నదాతకు వెన్ను దన్నుగా నిలవాలని తపించాడు. అందుకోసం శ్రమించాడు..తను చదివిన చదువుకు పదును పెట్టి....పత్యేక సాఫ్ట్‌వేర్‌ను రూపొందించాడు. ఇంకేముంది .. రైతులు పండిన పంటకు గిట్టుబాటు కోసం వెబ్ సైట్ నిర్వహిస్తున్నాడు.. సాటి యువతకు ఆదర్శంగా నిలుస్తున్నాడు. ఆ వివరాలేంటో తెలుసుకుందాం!

# వెబ్ వ్యవసాయకుడు



## అన్నదాతకు ఆన్‌లైన్ అండ
## ప్రత్యేక యాప్ రూపొందించిన వెంకీ

**ఆ**రుగాలం శ్రమించిన అన్నదాతలు తమ పంటకు గిట్టుబాటు ధర కోసం వేయి కళ్లతో ఎదురుచూస్తూనే ఉన్నారు. సరియైన ధర కోసం రైతన్నలు పడుతున్న పాట్లు అన్ని ఇన్ని కావు. శ్రమకు తగ్గ ఫలితం దక్కడానికి రైతన్నలు పడుతున్న కష్టాలు వర్ణనాతీతం. పుట్టెడు దుఃఖాన్ని గుండెల్లో దాచుకుని, దళారులకు ఏదో ఒక ధరకు అమ్ముకుంటున్న దీనమైన దుస్థితి అన్నదాతది. ఈ విపరీత అనర్థాన్ని తొలగించడానికి ఒక గ్రామీణ విద్యార్థి సాంకేతిక పరిజ్ఞానాన్ని ఆయుధంగా మలిచారు. ఇంతకు ఏమిటా ఆయుధం..? అది రైతులకు ఎలా ఉపయోగ పడుతుంది? వివరాలలోకి వెళితే...

యం.టెక్ రోబోటిక్ కోర్స్ పూర్తిచేసిన ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన గ్రామీణ విద్యార్థి బాలినేని వెంకీనాయుడు ప్రత్యేకంగా ఒక వెబ్‌సైట్‌నే రూపొందించారు. రైతేరాజు డాట్ కామ్ పేరుతో రూపొందించిన ఈ వెబ్‌సైట్ ద్వారా వివిధ పంటలకు మంచి ధర ఎక్కడ లభిస్తుంది.. అనే విషయాలను తెలియజేస్తు న్నారు. ఇప్పుడు అందరికి అందుబాటులో ఉన్న స్మార్ట్‌ఫోన్‌లో రైతులకు సైతం అర్థమయ్యేలా తేలికగా అన్ని వివరాలు అందుబాటులో ఉంచుతున్నారు. సేంద్రియ ఎరువులతో వ్యవసాయం చేస్తున్న వారి వివరాలను, వారి విజయాలను ఈ వెబ్‌సైట్‌లో అందరికి తెలిసేలా చేస్తున్నారు. మంచి ధాన్యాన్ని ప్రజలకు అందేలా ..ప్రతి రైతు అడ్రస్సును వెబ్‌సైట్‌లో పొందుపరుస్తున్నారు. ధాన్యం, వ్యాపార పంటలు, పండ్లు, పూలు, కోళ్లు, పశువులు, గొర్రెలు తదితర వాటన్నింటి వివరాలు..అవి ఏ రైతు వద్ద లభ్యమవుతున్నాయో తెలపడమే కాకుండా .. ఫోన్ నెంబర్లతో సహా అందిస్తున్నారు. ఒకవేళ ఎవరికైనా వంద నాణ్యమైన మామిడిపండ్లు కావాలంటే వెబ్‌సైట్‌లో ఆ రైతు వివరాలు, ఆ పండ్ల రకాల ఫోటోలను చూసి మనం ఫోన్‌చేస్తే ఆ రైతే మన ఇంటికి వచ్చి మామిడి పండ్లను సరసమైన ధరలకు,సేంద్రియ ఎరువులతో పండించిన తాజా పండ్లను అందిస్తారు. ఈ విధంగా చేయడం వలన రైతుకు లాభంతోపాటు వినియోగదారునికి ఇంటి వద్దకే ఫలాలు చేరువకావడంతోపాటు నాణ్యమైన, ఆరోగ్యవంతమైన ఫలాలను అందుకునే వీలు కలుగుతోంది.



### రైతుల మేలు కోసం..

రైతులకు నిత్య నేస్తంగా నిల్వడానికి బాలినేని వెంకీనాయుడు ఆలోచనలకు పదునుపెట్టి రైతేరాజు డాట్ కామ్‌ను నిర్వహిస్తున్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని పాల్వంచ మండలం, సోములగూడెం గ్రామానికి చెందిన వెంకీనాయుడు. జేఎన్‌టియు హైదారాబాద్‌లో రోబోటిక్ కోర్స్‌ను పూర్తిచేశారు. అనంతరం సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేసి లక్షలాది రూపాయలు సంపాదించినప్పటికీ, రైతుబిడ్డగా అన్నదాతలకు తనవంతు సహాయం చేయాలన్న కృషితో సాఫ్ట్‌వేర్ ఉద్యోగాన్ని వదిలి రైతేరాజు డాట్‌కామ్‌ను నిర్వహిస్తున్నారు. ఇండియా, అమెరికా, జపాన్, ఆస్ట్రేలియా, బ్రిటన్ తదితర దేశాల్లో ఉన్న తన మిత్రబృందంతో కలిసి స్వచ్ఛంద సేవ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. పేద విద్యార్థులకు ఆపన్న హస్తం అందిస్తున్న బాలినేని వెంకీనాయుడు నేటి యువతరానికి స్ఫూర్తిగా నిలుస్తున్నారు.

- గుంజులూరి దేవేందర్,
ప్రభ న్యూస్, ఖమ్మం ఎడ్యుకేషన్

# భక్తి

ఈ సువిశాల భారత ఉపఖండంలో ఎన్నో వింతలు.. మరెన్నో విశేషాలు..భక్తి విశ్వాసాలు..కన్నప్ప శివునికి మాంసం ఆహారంగా పెట్టాడు..అంటే అందరూ మాంసంతో పూజచేయమని కాదు..మనం ఎలా కొలిచినా..ఏ రూపంలో కొలిచినా నిష్కల్మషమైన మనసుతో దైవారాధన చేయాలని అర్థం. అలాంటి భక్తివిశ్వాసాలతో దేశంలో కొన్ని ప్రాంతాల్లో పలు రకాల నైవేద్యాలు సమర్పిస్తుంటారు. అవి మనకు వింతగా ఉన్నా..అది అక్కడి భక్తుల విశ్వాసానికి అది ప్రతీక.అలాంటి కొన్ని విభిన్నమైన దైవారాధనల గురించి తెలుసుకుందాం!

## వింత ఆచారాలు - పూజలు

### నూడుల్స్ నైవేద్యం

**అ**ది పశ్చిమ బెంగాల్ రాష్ట్రం, కోల్‌కతా నగరంలోని చైనాబాగ్‌లో ఉన్న టెంపుల్ బాగ్. అక్కడ ఉన్న కాళీ ఆలయంలో కొన్ని చైనీయుల ఆచారాలు కొనసాగడం విశేషం. ఈ గుడిలో భక్తులు దేవికి నూడుల్స్, చాప్సుయే ఆహార పదార్థాలను నైవేద్యంగా సమర్పిస్తారు. కామన్‌గా దేవాలయాలు, తినుబండారాలు నైవేద్యంగా పెడతారు. కానీ ఇక్కడ మాత్రం ఈ ఆచారం ఎందుకు పాటిస్తున్నారు? అంటే దాని వెనుక ఒక కథ ఉంది. పూర్వం ఓ చైనా బాలునికి అనారోగ్యంతో చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్నాడు. అప్పుడు ఆ బాలుని తల్లిదండ్రులు ఆలయానికి వచ్చి దేవికి పూజలు నిర్వహించారు. దేవి మహిమ బాలుడు మృత్యుముఖం నుంచి బయట పడ్డాడు. దీంతో చైన్ బాగ్‌లోని చైనా సమాజం మొత్తం దేవి మహిమల మీద విశ్వాసం పెరిగింది. నాటి నుంచి.. తమ ఆచారం ప్రకారం చైనీయులు పూజ సందర్భంగా పొడవైన కొవ్వొత్తులు వెలిగించడం, కాగితాలను కాల్చి ధూపం వేయడం, బోగ్ నూడుల్స్, చాప్సుయేని దేవికి నైవేద్యంగా సమర్పిస్తున్నారు.నాటి నుంచి ఆలయంలో అదే ఆచారం కొనసాగుతోంది.



### మోటార్ బైక్ దేవుడు

రాజస్తాన్ రాష్ట్రంలోని జోధ్‌పూర్‌కు 52కిలోమీటర్ల దూరంలో బుల్లెట్ బాబా ఆలయం ఉంది. దీని ప్రత్యేకత ఏమిటంటే అక్కడ 350సీసీ బుల్లెట్‌ను స్థానిక ప్రజలు దేవునిగా కొలుస్తారు. దీనికి ఓ కథ ఉంది. ఓ సింగ్ రాథోడ్ అనే వ్యక్తి బుల్లెట్ మీద వెళుతు చెట్టును ఢీకొట్టిన ప్రమాదంలో మరణించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు మృతుడు సింగ్‌కు చెందిన 350సీసీ బుల్లెట్‌ను స్వాధీనం చేసుకున్నారు. అయితే మరుసటి రోజు ఉదయం పోలీసుల స్వాధీనంలో ఉన్న బుల్లెట్ ప్రమాద స్థలంలో కనిపించింది. పోలీసులు తిరిగి దానిని స్వాధీనం చేసుకున్నారు. తిరిగి మరుసటి రోజు బుల్లెట్ అదే ప్రమాద స్థలంలో ప్రత్యక్షమైంది. ఇలా మూడు సార్లు జరిగిందట. అంతే స్థానికులు అదేదో దైవ మహిమగా భావించి ప్రమాద స్థలంలో ఆల యం నిర్మించారు. అందులో సింగ్ బుల్లెట్‌ను దేవునిగా ప్రతిష్టించారు. పూజలు చేస్తున్నారు. ప్రస్తుతం బుల్లెట్ బాబా ఆలయంలో ఓం సింగ్ రాథోడ్ బుల్లెట్ స్థానికులచేత పూజలు అందుకుంటోంది.

### రావణుడికి పూజలు

దేశవ్యాప్తంగా దసరా రోజు రావణ దహన ఘట్టం వైభవంగా జరుగుతుంది. కానీ ఉత్తర ప్రదేశ్‌లోని కాన్పూర్‌కు 10 కిలోమీటర్ల దూరంలో ఉన్న దశనన్ ఆలయంలో మాత్రం రావణాసు రుడు పూజలు అందుకుంటాడు. విశేషం ఏమిటంటే ఈఆలయం దసరా రోజు మాత్రమే తెరుస్తారు. స్థానికులు రావణాసురున్ని భక్తి శ్రద్ధలతో పూజిస్తారు. 140 సంవత్సరాల క్రితం శివశంకర్ అనే రాజు దీనిని నిర్మించాడు. ఉత్తర భారత దేశంలో ఉన్న రెండు రావణ ఆల యాలలో ఇది ఒకటి.

### అమ్మ వారికి మద్యం

మధ్య ప్రదేశ్‌లోని ఇండోర్ నుంచి 56 కిలోమీటర్ల దూరంలో ఉన్న కాలభైరవ ఆలయంలో మరో వింత ఆచారం కొనసాగుతోంది. దేశంలోని ఇతర ఆలయాలలో మాదిరిగానే ఈ ఆలయంలో కూడా దేవికి పూలు సమర్పిస్తారు. కొబ్బరి కాయలు కొడతారు. వాటి తో పాటు 140 మిల్లీ లీటర్ల మద్యాన్ని కూడా భక్తులు నైవేద్యంగా సమర్పిస్తారు. మద్యం పరి మాణం అనేది భక్తులు ఆర్థిక స్తోమతను బట్టి మారుతుందట.

విశేషం ఏమిటంటే భక్తులు తమ వెంట తెచ్చిన మద్యాన్ని ఓ గిన్నెలో పోసీ, గిన్నె అంచును దేవి పెదాలకు ఆనిస్తారు. ఇంకేముం ది గిన్నెలోని మద్యం అంతా అదృశ్యం అవుతుంది. ఇలాకావడాన్ని దేవి మహిమగా భక్తులు భావిస్తారు. విశేషం ఏమి టంటే ఆ మద్యం ఎలా మాయం అవుతుంది అనేది ఇంతవరకు ఎవరు తెలుసుకోలేక పోవడం.










# దినఫలాలు

**మేష రాశి**
పరిచయాలు పెరుగుతాయి. ఆస్తి విషయంలో ఒప్పందాలు. ఆర్థికపరిస్థితి మెరుగ్గా ఉంటుంది. బాకీలు వసూలవుతాయి. వ్యాపారాలు, ఉద్యోగాలు సంతృప్తికరంగా ఉంటాయి. వాహనయోగం.

**వృషభ రాశి**
పనులు సకాలంలో పూర్తిచేస్తారు. సంఘంలో గౌరవం. వస్తులాభాలు. వాహనయోగం. భూవివాదాల పరిష్కారం. వ్యాపారాలు, ఉద్యోగాలలో నూతనోత్సాహం. దైవచింతన.

**మిథున రాశి**
పనులలో కొంత జాప్యం. ఆర్థిక లావాదేవీలు మందగిస్తాయి. శ్రమాధిక్యం. బంధువులతో స్వల్పవివాదాలు. ఆలోచనలు స్థిరంగా ఉండవు. అనారోగ్యం. వ్యాపారాలు, ఉద్యోగాలలో నిరాశ.

**కర్కాటక రాశి**
శ్రమ కొంత పెరుగుతుంది. పనుల్లో అవాంతరాలు. ఆర్థిక వ్యవహారాలు నిరాశ కలిగిస్తాయి. ఆరోగ్యభంగం. వ్యాపారాలు స్వల్పంగా లాభిస్తాయి. ఉద్యోగులకు అదనపు పనిభారం.

**సింహ రాశి**
పనుల్లో విజయం. ఇంటిలో శుభకార్యాలు. ఆర్థికాభివృద్ధి. కీలక నిర్ణయాలు. ఆలయాలు సందర్శిస్తారు. వ్యాపారాలు, ఉద్యోగాలు సజావుగా సాగుతాయి. నూతన విద్యావకాశాలు.

**కన్యా రాశి**
ఆకస్మిక ప్రయాణాలు. బంధువులతో మాటపట్టింపులు. ధనవ్యయం. శ్రమాధిక్యం. దైవదర్శనాలు. వ్యాపారాలు, ఉద్యోగాలలో మార్పులు. ఉద్యోగ యత్నాలలో అవాంతరాలు.

**తుల రాశి**
వ్యవహారాలలో విజయం. శుభకార్యాలు నిర్వహిస్తారు. ఆస్తిలాభం. సోదరులతో వివాదాలు సర్దుబాటు కాగలవు. వ్యాపారాలు విస్తరిస్తారు. ఉద్యోగులకు కొత్త హోదాలు.


**వృశ్చిక రాశి**
కుటుంబ, ఆరోగ్య సమస్యలు. ఆర్థికపరిస్థితి నిరాశ కలిగిస్తుంది. బంధువులతో విభేదాలు. దైవదర్శనాలు. పనులు కొంత నెమ్మదిస్తాయి. వ్యాపారాలు, ఉద్యోగాలలో చికాకులు.

**ధనూ రాశి**
కొత్త వ్యక్తుల పరిచయం. శుభకార్యాలలో పాల్గొంటారు. బాకీలు వసూలవుతాయి. భూవివాదాలు పరిష్కారం. వ్యాపారాలు, ఉద్యోగాలలో వాతావరణం ఉత్సాహవంతంగా ఉంటుంది. ఆలయ దర్శనాలు.

**మకర రాశి**
ప్రత్యర్థులు మిత్రులుగా మారతారు. ఆస్తి వివాదాల పరిష్కారం. శుభవార్తలు వింటారు. వ్యాపారాలు లాభిస్తాయి. ఉద్యోగులకు పదోన్నతులు. దైవచింతన. విందు వినోదాలు.

**కుంభ రాశి**
బంధువులతో స్వల్పవిభేదాలు. శ్రమపడ్డా ఫలితం ఉండదు. బాధ్యతలు పెరుగుతాయి. ఆరోగ్య సమస్యలు. దూరప్రయాణాలు. వ్యాపారాలు, ఉద్యోగాలు నిరుత్సాహపరుస్తాయి.

**మీన రాశి**
కొన్ని వ్యవహారాలు ముందుకు సాగవు. ఆలోచనలు నిలకడగా ఉండవు. ఇంటాబయటా ఒత్తిడులు. బంధువులతో మాట పట్టింపులు. వ్యాపారాలు, ఉద్యోగాలు మందగిస్తాయి.



శ్రీ గుదిమెళ్ళ యతీంద్ర ప్రవణాచార్య సిద్ధాంతి

# చింతన

# నిష్కామ కర్మతో మానసిక శుద్ధి

నిష్కామ కర్మతో మానసిక శుద్ధి

**యోగరతోవా భోగరతోవా**
**సంగరతోవా సంగవిహీనః**
**యస్య బ్రహ్మణి రమతే చిత్తం**
**నన్దతి నన్దతి నన్దత్యేవ**

'బ్రహ్మమందు రమించే బ్రహ్మజ్ఞాని ఆనందమే ఆనందం. అతడు యోగాభ్యాసరతుడైనా, భోగాలను అనుభవించేవాడైనా, విషయ వస్తు జన సమూహాలందు ఆసక్తుడై ఉన్నా వాటి యందు ఎట్టి ఆసక్తి లేని ఏకాంతవాసియైనా అతని చిత్తం ఎప్పుడూ బ్రహ్మమునందే రమిస్తూ ఉంటుంది. అతడు బ్రహ్మానందంలోనే తేలియాడుతూ ఉంటాడు' అనేది ఈ శ్లోకార్థం. ఇది భజగోవిందం శ్లోకాల్లో చేరిన ఆదిశంకరుల శిష్య వరేణ్యుడు ఆనందగిరి రచనగా పేర్కొంటుంటారు. ఏ ప్రవృత్తిగల వ్యక్తి అయినా మనస్సు పరిశుద్ధమయితేనే మనశ్శాంతి లభిస్తుంది. బ్రహ్మానందం కలుగుతుంది. మరో మాటలో చెప్పాలంటే మోక్ష సాధనకు లేదా బ్రహ్మానందం పొందేందుకు వేటినీ త్యజించవలసిన అవసరం లేదు. అయితే అరిషడ్వర్గాలను మాత్రం అవశ్యం త్యజించాలి.

గృహస్తుగా ఉంటూనే మనమందరం మన కర్తవ్యాలను నిష్ఠతో, భక్తి శ్రద్ధలతో నిర్వర్తించడం అలవరచుకోవాలి. అలా కాకుండా మన విధులు నిర్వర్తించకుండా భగవంతుడిని ఎంతో భక్తితో, శ్రద్ధతో ఆరాధిస్తాము. అంతే భక్తి శ్రద్ధలతో మన విధులు నిర్వర్తించినప్పుడే చిత్తశుద్ధి, ఆత్మశాంతి కలుగుతుంది.

శిఖిధ్వజుడనే ఒక మహారాజు జీవన కార్యాలతో విసుగు చెంది మనశ్శాంతి కోసం అన్నింటిని త్యజించి తపోమయ సన్యాస జీవితం గడపాలనుకుంటాడు. అడవిలో ఏకాంతంగా ధ్యానం చేస్తున్నా అతనికి మనశ్శాంతి కరువైంది. మనస్సు పరిశుద్ధం కానిదే ఎక్కడకు వెళ్లినా మనశ్శాంతి లభించదు. మహారాజుకు మనశ్శాంతి కరవైన విషయం ఆయన భార్య చూడాల రహస్యంగా గమనిస్తూనే ఉంది.

కొంతకాలం తరువాత సన్యాసజీవితం గడుపుతున్న భర్త వద్దకు వెళ్లింది. తనకు అక్కడా మనశ్శాంతి లభించడం లేదన్నాడు శిఖిధ్వజుడు. దానికి చూడాల 'ఏకాంతంలో ధ్యానం చేసినంత మాత్రాన బ్రహ్మానందం లభించదు. మీరు మీ రాజ్య విధులను నిస్సంగ బుద్ధితో నిర్వహిస్తే మనస్సు పవిత్రమవుతుంది. అందుకు రాజ్యాన్ని, రాజ ప్రాసాదాన్ని వదలివేయవలసిన అవసరం లేదు. ఎప్పుడైతే మీరు మీ విధులను కర్తవ్య నిష్ఠతో నిర్వహిస్తారో అప్పుడు మీ మనసు స్ఫటికంలా నిర్మలమవుతుంది. అప్పుడు అరణ్యంలో ఉండవలసిన పనిలేదు. అంతఃపురంలో ఉన్నా మీ ఆధ్యాత్మిక పురోగమనం శీఘ్రతరమవుతుంది. పరబ్రహ్మతో జీవితాన్ని మమేకం చేసుకున్న సన్యాసి అయినా, సామాన్య మానవుడైనా, బ్రహ్మ జ్ఞాని అయినా, ఏది సంభవించినా అంతా భగవంతుని ప్రసాదంగా స్వీకరిస్తాడు. తననొక నిమిత్తమాత్రుడిగానే తలుస్తాడు. అటువంటివారు భౌతికపరమైన లాభనష్టాలకు, సుఖదుఃఖాలకు మనసును ప్రభావితం కానివ్వరు.'అంది. భార్య మాటలోని సత్యాన్ని గ్రహించి తిరిగి రాజ్యభారాన్ని స్వీకరించి పారమార్థిక సౌధంలో విహరిస్తూ ఆనందంగా జీవించాడు శిఖిధ్వజుడు.

అందుకే భగవాన్ రమణ మహర్షి మానసిక పవిత్రత గురించి తెలుపుతూ, 'ఈశ్వరార్పితం నేచ్ఛయాకృతం, చిత్త శోధకం, ముక్తిసాధకం' అంటారు. అనగా ఈశ్వరార్పణ బుద్ధితో ఆచరించిన నిష్కామ కర్మలు మనస్సును పరిశుద్ధం గావించి ముక్తి సాధకమవుతాయి. అందువలన చిత్తశుద్ధి మనో నిగ్రహాలను సాధించాలి. ప్రపంచంలో ప్రతి వ్యక్తి ఏదో ఉద్యోగ వ్యాపారం చేస్తాడు. కొందరికి దైవ భక్తి మెండుగా ఉంటుంది. రోజు పూజలు, పునస్కారాలు, తీర్థయాత్రలు చేసి దైవభక్తిని ప్రదర్శిస్తాడు. అయితే అతను ఒక విధంగా తనను తాను మోసగించుకున్నట్టే. చిత్తశుద్ధిలేని శివపూజలేలరా అంటాడు యోగి వేమన. ప్రతి వ్యక్తి తన కర్తవ్యాలను నిష్ఠతో నిర్వహించాలి. ఎట్టి పరిస్థితుల్లోను ఎవరిని దూషించకూడదు. మానవత్వ అభివ్యక్తీకరణే చిత్తశుద్ధికి మొదటి సోపానం. మానవీయ లక్షణాలు అందరికీ తెలిసినవే. వాటి గురించి గంటలకొద్దీ ఉపన్యసించడం అందరికీ చేతనవుతుంది. అయితే కార్యరంగంలో అమానవీయంగా, స్వార్థ ప్రేరితులై ప్రవర్తిస్తారు. మరి అలాంటి వ్యక్తికి మనశ్శాంతి ఎలా లభించగలదు? బ్రహ్మానందం కూడా ఆమడ దూరంలో ఉంటుంది.

సేవ, ప్రేమ, దయ, నిస్వార్థం, అహింస, అంకితభావం, నిజాయితీ, స్వచ్ఛత, సభ్యత, సంస్కారంలాంటి నైతిక గుణాలు కలిగి ఉండడమే మానవత్వ లక్షణం అంటారు స్వామి వివేకానంద. అవి కొరవడితే మనకు మిగిలేది మానసిక అశాంతే. ఈ సద్గుణాలను అలవరచుకోవడం శ్రమతో కూడినదే అయినా అసాధ్యం కాదు. 'రౌతు ఎలాగైతే మొరటు గుర్రాన్ని తనకు అనుగుణంగా మలచుకుంటాడో అలాగే మనిషి తన మనస్సును స్వాధీనపరచుకోవాలి. అప్పుడే అతడు సాధకుడనిపించుకుంటాడు. 'మనోనిగ్రహం పరమ యోగమని తెలునుకో' అంటాడు శ్రీకృష్ణుడు. అరిషడ్వర్గాలను జయించాలంటే మానసిక ఏకాగ్రత మనోనిగ్రహం అవసరం.



"పరబ్రహ్మతో జీవితాన్ని మమేకం చేసుకున్న సన్యాసి అయినా, సామాన్య మానవుడైనా, బ్రహ్మ జ్ఞాని అయినా, ఏది సంభవించినా అంతా భగవంతుని ప్రసాదంగా స్వీకరిస్తాడు. తననొక నిమిత్తమాత్రుడిగానే తలుస్తాడు. అటువంటివారు భౌతికపరమైన లాభనష్టాలకు, సుఖదుఃఖాలకు మనసును ప్రభావితం కానివ్వరు.'"

ఈనాడు దేశంలో సదాచారుల సంఖ్య నానాటికీ తగ్గిపోతోంది. అవినీతి, ఆశ్రిత పక్షపాతం, కాపట్యం, మోసం పెరిగిపోయాయి. వీటి కారణంగా మన దేశం పతనావస్థకు చేరుకుంది. ఈ జాడ్యానికి కారణం వేరొకరి మీద వేసి అందరూ తప్పించుకుంటున్నారు. సగటున అందరూ ఈ జాడ్యం అనే అగ్నిలో తెలిసోతెలియకో సమిధలు వేస్తున్నారు. మార్పు కింది నుంచో మీది నుంచో రావాలనుకుంటే దశాబ్దాలు గడచినా రాదు. రాబోయే తరం నుంచి అయినా మంచి మార్పు రావాలంటే నేటి నుంచి ప్రతి ఒక్కరూ ఆ దిశగా అడుగులు వేయాలి. ఇంట గెలిచి రచ్చ గెలు అన్నట్టు మనం ముందు మారాలి. కర్మానుష్ఠానం ద్వారా మనోనిర్మతలత్వాన్ని సాధించటానికి కంకణం కట్టుకోవాలి. అప్పుడు భగవస్సాక్షాత్కారం, బ్రహ్మ జ్ఞానం ఈ రెండూ లభిస్తాయి. అవి లభించకపోయినా మనం మంచి పౌరులుగ దేశ ఉన్నతికి పాటు పడగలం.

**మనం మార్పు చెందితే ప్రపంచం కూడా మార్పు చెందుతుంది. మనం పరిశుద్ధులమయితే ఈ లోకం పరిశుద్ధమవుతుంది. కర్త మారితే కర్మలో మార్పు వచ్చి తీరుతుంది**
**- స్వామి వివేకానంద**

గుమ్మా ప్రసాదరావు (భిలాయ్)
9755110398

# శివప్రసాదం రుద్రాక్ష

(గతశనివారం సంచిక తరువాయి భాగం)

రుద్రాక్ష ఎంతో మహత్తరమైనదని ఇంతకు ముందే తెలుసుకున్నాం. రుద్రాక్షకు సంబంధించిన పలు విశేషాలను శివపురాణం విస్తృతంగా వివరించింది. ఒకానొక సమయంలో సాక్షాత్తు యమధర్మరాజు తన కింకరులను పిలిచి, 'రుద్రాక్షలు ధరించేవారు మహానుభావులు. పుణ్యాత్ములు. కాబట్టి రుద్రాక్షలు ధరించిన వారిని, భస్మాన్ని (విభూతిని) ధరించిన మానవులను యమపురికి తీసుకురావద్దు. ఎవరి శరీరం మీద రుద్రాక్షలు ఉండవో, ఎవరు విభూతిని ధరించరో, ఎవరు పంచాక్షరీ మంత్రాన్ని పఠించరో వాళ్లను మాత్రమే నరకానికి తీసుకురండి' అని ఆదేశించాడు. యముని ఆదేశాన్ని విన్న కింకరులందరూ ఆశ్చర్యపోయేరు. రుద్రాక్షలను తలమీద ధరించినవారు, విభూతిని ఒక నిర్దిష్ట పద్ధతిలో క్రమంగా ధరించిన వారు (వీటిని శాస్త్రాలు త్రిపుండ్రాలు అంటున్నాయి), పంచాక్షరీ మంత్రాన్ని జపించేవారు యమలోకాన్ని చేరరు' అని శివపురాణం చెబుతోంది.

రుద్రాక్షలను ధరించే అదృష్టం పూర్వజన్మ సుకృతం ద్వారానే లభిస్తుంది. రుద్రాక్షలన్నీ మహిమాన్వితమైనవే. మరీ పెద్ద ప్రమాణంలో ఉన్న రుద్రాక్షకన్న దాని కంటె చిన్న పరిమాణంలో ఉన్న రుద్రాక్ష పదిరెట్లు ఎక్కువ ఫలితాన్ని ఇస్తుంది. ఒక్కొక్క పరిమాణంలో ఉన్న రుద్రాక్షను ఒక్కో తరహాకు చెందినదిగా పేర్కొన్నారు. చిక్కుడు గింజ పరిమాణంలో ఉన్న రుద్రాక్ష అతి ప్రశస్తమైనది. పెద్ద ఉసిరిక పరిమాణంలో ఉన్న రుద్రాక్ష ఉత్తమమైనది. ఇది భక్తుల కష్టాలన్నిటినీ తొలగిస్తుంది. రేగు పండు అంత ఉన్న రుద్రాక్ష మధ్యమం. సెనగ గింజంత ఉన్నది అథమమైనదని శాస్త్రం చెబుతోంది. గురువింద కొలత ఉన్న రుద్రాక్ష అన్ని పనులను సిద్ధింపజేస్తుంది. దీనినే శ్లోక రూపంలో ఈ విధంగా చెప్పేరు.

**ధాత్రీ ఫల ప్రమాణం**
**యచ్ఛ్రేష్టమేత దుదాహృతమ్**
**బదరీఫల మాత్రంతు**
**మధ్యమం సంప్రకీర్తితమ్**
**అధమం చణ మాత్రంస్యాత్ప్రక్రియైషా పరుచ్యతే**
**శృణు పార్వతి సుప్రీత్యాభక్తానాం హిత కామ్యయా**

> చిక్కుడు గింజ పరిమాణంలో ఉన్న రుద్రాక్ష అతి ప్రశస్తమైనది. పెద్ద ఉసిరిక పరిమాణంలో ఉన్న రుద్రాక్ష ఉత్తమమైనది. ఇది భక్తుల కష్టాలన్నిటినీ తొలగిస్తుంది. రేగు పండు అంత ఉన్న రుద్రాక్ష మధ్యమం. సెనగ గింజంత ఉన్నది అథమమైనదని శాస్త్రం చెబుతోంది. గురువింద కొలత ఉన్న రుద్రాక్ష అన్ని పనులను సిద్ధింపజేస్తుంది.



రుద్రాక్షను చూసినా, తాకినా, ఆ మాలతో జపం చేసినా సకల పాపాలూ భస్మీపటలం అవుతాయని ఋషివాక్యం. నున్నగా ఉన్నవి, గట్టిగా ఉన్నవి, కంటకాలతో కూడి ఉన్న రుద్రాక్షలు సమస్త శుభాలను కలిగిస్తాయి. భక్తిని, ముక్తిని ప్రసాదిస్తాయి. కంటకాలు లేనివి, విరిగిపోయినవి, పగిలిపోయినవి, పురుగులు పట్టేసినవి, గుండ్రంగా లేనివి ధరించటానికి పనికిరావు. సహజమైన రంధ్రం ఉన్న రుద్రాక్షలు ఉత్తమమైనవి. మానవులు కృత్రిమంగా రంధ్రాలు చేసిన రుద్రాక్షలు మధ్యమం.

1100 రుద్రాక్షలను ధరించినవాడు రుద్ర స్వరూపుడవుతాడు. 550 రుద్రాక్షలతో చేసిన కిరీటాన్ని ధరించిన శివభక్తుడు ఉత్తముడు. 360 రుద్రాక్షలను మూడు పేటలుగా చేసి నిజమైన శివ భక్తుడు ధరించాలని శాస్త్రం చెబుతోంది.

రుద్రాక్షలను చెవులకు ధరించేటపుడు **'తత్పురుషాయ విద్మహే .... తన్నో రుద్రః ప్రచోదయాత్'** అన్న తత్పురుష మంత్రాన్ని నియమానుసారం ఉపదేశం పొంది పఠించి ధరించాలి. ఇలాగే మిగతావి. శిరసు మీద రుద్రాక్షలు ధరించేటపుడు **'ఈశానః సర్వ విద్యానాం.... శివోమే అస్తు సదాశివోం'** అనే ఈశాన మంత్రాన్ని పఠించాలి. ఉదరం మీద 15 రుద్రాక్షలు ధరించేటపుడు **'వామదేవాయ, నమో జ్యేష్ఠాయ ... నమో మనోన్మనాయ నమః'** అనే వామదేవ మంత్రం పఠించాలి. రుద్రాక్షలను కంఠానికి, రెండు చేతులకు, హృదయం మీద ధరించే సందర్భాల్లో **'అఘోరేభ్యో దఘోరేభ్యో ... నమస్తే అస్తు రుద్ర రూపేభ్యః'** అనే అఘోర మంత్రాన్ని పఠించాలి.

**రుద్రాక్ష మంత్రాలు**

రుద్రాక్షలు ధరించేటప్పుడు పఠించాల్సిన మంత్రాలు కొన్ని ఉన్నాయి. ఒక్కో ముఖం రుద్రాక్షను ఒక్కో మంత్రంతో ధరించాలి. వాటిని అవి తెలిసిన గురువుల వద్ద నుంచి నేర్చుకోవాలి. స్థూలంగా అవి ఇవి.

ఏకముఖిని ధరించేటప్పుడు ఓంహ్రీం నమః అని మంత్రపూర్వకంగా ధరించాలి. ద్వీముఖిని ఓంనమః అని, త్రిముఖిని ఓం క్లీం నమః అని, చతుర్ముఖిని ఓంహ్రీం నమః అని, పంచముఖిని ఓం హ్రీం నమః అని, షణ్ముఖిని ఓం హ్రీం హుం నమః అని, సప్తముఖిని ఓం హుం నమః అని, అష్టముఖిని ఓం హుం నమః అని, నవముఖిని ఓం హ్రీం హుం నమః అని, దశముఖిని ఓం హ్రీం నమః అని, ఏకాదశముఖిని ఓం హ్రీం హుం నమః అని, ద్వాదశ ముఖిని ఓం క్రీం క్షీం రం నమః అని, త్రయోదశ ముఖిని ఓం హ్రీం నమః అనే మంత్రంతోను, చతుర్దశ ముఖిని ఓం నమః అనే మంత్ర పూర్వకంగా ధరించాలి. ఈ మంత్రాలను రుద్రాక్ష మంత్రాలు అంటారు.

మంత్ర పూర్వకంగా రుద్రాక్షలు ధరించిన వ్యక్తిపై ఏ రకమైన దుష్టప్రయోగాలు పనిచేయవు. మంత్రపూర్వకంగా రుద్రాక్షలు ధరించిన వానిని చూసిన వెంటనే భూత ప్రేత శాకినీ, డాకినీ పిశాచాలు పారిపోతాయి. మంత్రపూర్వకంగా రుద్రాక్ష ధారణ చేస్తే ధర్మం వృద్ధి చెందుతుంది. వేద సమ్మతంగా రుద్రాక్షలు ధరిస్తే భయంకరమైన పాపాలు సైతం నశిస్తాయి. ఎవరికి ఏ రంగు రుద్రాక్షలు అనువైనవో చూసుకుని ఆ రంగు రుద్రాక్షలు ధరించాలి. శివ ప్రసాదం రుద్రాక్ష. మానవాళికది శ్రీరామ రక్ష.



- రమాప్రసాద్ ఆదిభట్ల
9348006669


**'రమ'ణీయం**

స్థావర జంగమాత్మకమైన భూత జా
లంబు సుస్థితి గో గణంబు నాశ్ర
యమునన తత్సంభవమును గోవుల
యంద
యవిమూల సంతానమజునకట్లు
గాక సిద్ధుల సాధ్య గణముల మాత లి
ట్లగుట యెరింగిన యతడు బ్రహ్మ
లోక గోలోకాది లోకాంతరములకు
దన యింటి కరుగు చందమున నరుగు
(అను)

గావుల పాలమృతంబని
దేవేంద్రుడుడ సెప్పె హాన ధీరత్వనిధీ స
గోవు నొసగె నమృతము స
ద్భావంబున నిచ్చినట్టి ఫల
యొడగూడున్
(అను. ద్వి. 399)

అనఘ గోవులు ప్రాణంబులని సమస్త
మునులు సెప్పరు రట్లు గావున దలంప
బ్రాణదాన సంప్రాప్తమైన
ఫలము గోదాన కర్తకు గలుగు జూవె
(అను. ద్వి. 400)

నివిష్టం గోకులం యత్ర శ్వాసం
ముంచతి నిర్భయం
విరాజయతి తం దేశం పాపం
చాస్యాపకర్షతి
(అను 51/32)



గోవుల మంద ఎక్కడ నిర్భయంగా కూర్చుని గాలి పీల్చుకుంటుందో, అటువంటి ప్రదేశాలు శోభస్కరం కావడమేకాక, పాపాలు తొలగి పుణ్యప్రదేశాలవుతాయి.


- లక్ష్మణరేఖ గోపాలకృష్ణ
9493053206




## ప్లేటైమ్

ఇక్కడున్న పిల్లలు ఏ ఔట్ డోర్ గేమ్స్ ఆడుతున్నారు. క్రింద పేర్కొన్న గడులలో వాటిని పూరించండి.






# అందరూ పంచుకోండి

చండీదాసు వారానికోసారి గుడికి వెళ్లేవాడు. స్వామిని దర్శించుకుని పూజలు చేయించి తిరిగి వచ్చేటప్పుడు దేవాలయం మెట్లపై కూర్చున్న బిచ్చగాళ్లకు ధర్మం చేసేవాడు. అయితే అతను చిల్లర తీసుకుని వెళ్లేవాడు కాదు. పది రూపాయల నోటును ఒక బిచ్చగాడి ముఖాన వేసి అందరూ పంచుకోండి అని నిర్లక్ష్యంగా వెళ్లిపోయే వాడు. గుడి మెట్లపై పన్నెండు మంది బిచ్చగాళ్లు ఉండేవాళ్లు. పదిమంది తలా ఒక రూపాయి తీసుకుంటే ఇద్దరు మిగిలి పోతున్నారు. అర్ధ రూపాయలు చెల్లకపోవడంతో ఎలా పంచుకోవాలో తెలియక వాళ్లు సతమతమౌతున్నారు.

చండీదాసు ఇచ్చిన పది రూపాయలు ఎలా పంచుకోవాలో బిచ్చగాళ్లకు అర్థమవక కీచులాడుకునేవారు. ఈ విషయం చండీదాసుకు తెలియదు. చండీదాసును ఆదర్శంగా తీసుకుని మరికొందరు భక్తులు కూడా చిల్లర దొరకడం లేదనే నెపంతో బిచ్చగాళ్ల ముఖంపై పదిరూపాయలు విసిరివేసి అందరూ పంచుకోండి అని వెళ్లిపోతున్నారు. రాను రాను బిచ్చగాళ్లలో తగాదాలు పెరిగిపోయాయి. ఈ విషయాన్ని చక్రధర్ మాస్టారు గమనించారు. చండీదాసు ఉంటున్న వీధిలోనే చక్రధర్ మాస్టారు కూడా ఉంటున్నారు. ఒకరోజు కాకతాళీయంగా బజారులో చండీదాసు కనిపించాడు. వెంటనే అతడికి బిచ్చగాళ్లు తగాదా పడుతున్న విషయం గుర్తుకు వచ్చింది.

మిత్రమా! బాగున్నారా? ప్రశ్నించాడు చక్రధర్. ఇద్దరూ కొద్దిసేపు మాట్లాడుకున్నారు. "మీరు ఏమీ అనుకోనంటే నేను ఒక విషయాన్ని చెబుతాను" అన్నాడు చక్రధర్. పర్వాలేదు. చెప్పండి బదులిచ్చాడు చండీదాసు. "మీరు గుడి మెట్లపై కూర్చున్న బిచ్చగాళ్లకు ప్రతివారం పదిరూపాయలు ధర్మం చేస్తున్నారు. కానీ చిల్లరగా మార్చి మీ చేత్తో ధర్మం చేస్తేనే బాగుంటుంది. మీరు అలా చేయడం లేదు. అందరూ పంచుకోండి అని ఒక బిచ్చగాడి ముఖాన నిర్లక్ష్యంగా పదిరూపాయలు వేసి వెళ్లిపోవడం సబబు కాదు. దానాన్ని అంత నిర్లక్ష్యంగా చేయడం మంచి పద్ధతి కాదు. ధనంతో పాటు బిచ్చమెత్తుకొని జీవిస్తున్న తోటి మనుషులను కూడా అగౌరవ పరిచినట్లే. పై పెచ్చు మిమ్మల్ని ఆదర్శంగా తీసుకుని మరికొంతమంది భక్తులు కూడా ఎంతో కొంత బిచ్చగాళ్ల ముఖంపై నిర్లక్ష్యంగా విసిరి అందరూ పంచుకోండి అంటున్నారు. గుడి మెట్లపై బిచ్చగాళ్లు ఎక్కువమంది ఉండటంతో అర్ధరూపాయలు లేకపోవడం వలన ఈ ధనాన్ని సమానంగా ఎలా పంచుకోవాలో తెలియక గొడవపడుతున్నారు. అలా కాకుండా మీరే ఓపిక చేసుకుని చిల్లర మార్చి మీకు ఇష్టమైనవారికి, మీ చేత్తోనే ధర్మం చేస్తే సబబుగా ఉంటుంది. అప్పుడు బిచ్చగాళ్లలో ఎటువంటి గొడవరాదు. భిక్షం పేరుతో ధనాన్ని

ముఖంపై విసిరి తోటి మనుషుల్ని అవమానించే హక్కు మనకు లేదు కదా? మిమ్మల్ని అవమానించాలని నేను ఈ విషయం చెప్పడం లేదు. మీరు చేస్తున్న దానం వలన బిచ్చగాళ్లల్లో సమస్య వచ్చిందని మాత్రమే మీ దృష్టికి తెస్తున్నాను అన్నాడు చక్రధర్.

ఇలా జరిగిందని నాకు తెలియదు మాస్టారు. పని ఒత్తిడి వలన త్వరగా వెళ్లాలనే ఉద్దేశ్యంతో పదిరూపాయలు ఒక బిచ్చగాడికి ఇచ్చి అందరూ పంచుకోండి అని వెళ్లిపోతున్నాను. ఆ పదిరూపాయలు కొంత వేగంగా వేయడం వల్ల బిచ్చగాడి ముఖాన పడటం నేను గమనించలేదు. నన్ను చూసి మరికొంతమంది కూడా ఇలానే వేస్తున్నారని మీరు చెబితేకాని నాకు తెలియలేదు. ఇకపై బిచ్చగాళ్లందరికీ నేనే స్వయంగా ధర్మం చేస్తాను. అందరూ పంచుకోండి అనను. ఎంతో కష్టపడి సంపాదిస్తున్న ధనాన్ని పరధ్యానంలో కొంత విసురుగా వేసి ధర్మం చేయడం కూడా మంచి పద్ధతికాదు. నా తప్పును తెలియజేసినందుకు ధన్యవాదాలు. ఇకపై అలా జరగకుండా చూసుకుంటాను సవినయంగా చెప్పాడు చండీదాసు. ఈ రోజుల్లో పొరపాటు చేయకండి అని ఎవరికైనా చెబితే మీ పని మీరు చూసుకోండి అని హెచ్చరించే వారిని చాలామందిని నేను చూశాను. నా తప్పును సరిచేసుకుంటాను అని మీలా చెప్పేవారు అరుదుగా ఉంటారు. మీ ఔదార్యానికి శిరస్సు వంచి నమస్కరిస్తున్నాను అని చక్రధర్ నమస్కరించాడు. మరుసటి రోజు చండీదాసు గుడికి వెళ్లి దైవకార్యం పూర్తయిన తర్వాత తన జేబులోని చిల్లర తీసుకుని ఒక్కొక్క బిచ్చగాడికి స్వయంగా తానే దానం చేశాడు. దాంతో బిచ్చగాళ్లు తగువు పడాల్సిన అవసరమే రాలేదు. ఆనోటా ఈ నోటా విషయం భక్తులందరికీ తెలిసింది. ఆ రోజు నుండి ఏ భక్తుడూ ఏదో ఒక బిచ్చగాడికి ఒక కరెన్సీ నోటు ఇచ్చి అందరూ పంచుకోండి అనకుండా ఇవ్వదలచుకుంది స్వహస్తాలతో దానం చేయడం మొదలుపెట్టారు.

- షేక్ అబ్దుల్ హకీంజాని




## బంగారు పలుకు

లక్ష్యాన్ని సాధించలేని జ్ఞానం నిరుపయోగమైంది

- జవహర్‌లాల్ నెహ్రూ

# నేలను గుల్ల చేస్తుంది

## ఆరుద్ర పురుగు



వర్షాకాలంలో స్కూలు పిల్లల బ్యాగుల్లో ఒక రకమైన పురుగు కనిపిస్తుంది. ఎర్రటి వెల్వెట్ మైట్స్, రెయిన్ బగ్స్, తెలంగాణ ప్రాంతంలో బీర్‌బాబోటీ, ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం ఆరుద్ర పురుగు అని దీన్ని పిలుస్తుంటారు. ఆరుద్ర కార్తెలో బయటికి వస్తాయి కాబట్టి దీనికా పేరు వచ్చింది. ఈ పురుగును కప్పి ఉంచే వెల్వెట్ చాలా మెత్తగా ఉంటుంది. ఎవరైనా ముట్టుకుంటే వీటి కాళ్లు ముడుచుకుంటాయి. శత్రువు వెళ్లిపోయిన తర్వాత మెల్లిగా నడుచుకుంటూ వెళ్లిపోతుంది. ఇవి ఎప్పుడు బడితే అప్పుడు కనిపించవు. వర్షాకాలంలో మాత్రమే ఇవి కనిపిస్తాయి. వ్యవసాయ పనులు ఆరుద్రకార్తెలోనే ప్రారంభమవుతాయి. ఆరుద్ర పురుగులు రైతుకు కనిపించగానే శుభసూచకంగా భావిస్తారు రైతులు. ఈ సెంటిమెంట్ ప్రతి ఊర్లో ఉంది. అరుద్ర పురుగుకు వర్షాలకు అవినాభావ సంబంధం ఉంది. శాస్త్రీయంగా కూడా ఇది రుజువయ్యింది. ఆరుద్ర పురుగు కనిపించగానే వర్షాలు బాగా కురుస్తాయి. ఇది ఆనాదిగా వస్తోంది.

### మిత్ర పురుగు

ఆరుద్ర పురుగు వల్ల పర్యావరణానికి ఎటువంటి నష్టం లేదు. పైగా ఇవి మిత్ర పురుగుల కోవలోకి వస్తాయి. వాస్తవానికి ఆరుద్ర పురుగుల వల్ల నేల గుల్లబారుతుంది. పంటలకు పోషకాలు అందడానికి మేలు చేస్తాయి. నేలలు సారవంతంగా ఉంటేనే పోషకాలు ఎక్కువగా అందుతాయి. వానపాముల మాదిరిగానే ఆరుద్రపురుగులు రైతు నేస్తాలు అని చెప్పొచ్చు.

### తొలకరి జల్లులతో..

ఆరుద్రపురుగులు తొలకరి జల్లులలోనే బయటికొస్తాయి. భూమిలో చిన్న చిన్న రంధ్రాలు చేసుకుంటాయి. పిల్లలు ఇదే సమయంలో వాటితో ఆడుకుంటారు. అగ్గిపెట్టెల్లో దాచుకుంటారు. ఇవి గడ్డిని తింటాయి కాబట్టి అగ్గిపెట్టెల్లో కూడా గడ్డి వేసి సాకే ప్రయత్నం చేస్తారు కానీ ఇలా చేస్తే ఇవి ఎక్కువ కాలం జీవించలేవు. నగర విద్యార్థులకు ఆరుద్ర పురుగు గూర్చి ఎక్కువగా అవగాహన ఉండదు. అయితే గ్రామీణ ప్రాంతాల్లో నివసించే విద్యార్థులకు మాత్రం బాగా తెలుసు. అరుద్ర కార్తెలో మాత్రమే బయటికి వచ్చే ఈ పురుగులు మిగతా రోజుల్లో కూడా భూమిలోనే బొరియలు చేసుకుని బతికేస్తాయి. 30 నుంచి 40 అడుగుల లోతులో కూడా ఇవి బొరియలు చేస్తాయి. పచ్చిక బయళ్లతో బాటు ఎడారుల్లో కూడా ఆరుద్ర పురుగులు నివసిస్తాయట.

### అంతరించిపోతుంది

ఆరుద్ర పురుగు అంతరించిపోతున్న జాతుల్లో ఒకటిగా నిలిచింది. సంప్రదాయ వైద్యం, సౌందర్య సాధనాల్లో దీన్ని విరివిగా వాడతారు. రైతులు పురుగుల మందులు ఎక్కువగా చల్లడం వల్ల ఇవి అంతరించిపోతున్నాయి. నూనెలను తయారు చేస్తున్నారు. ఔషధాల్లో, అరబ్ కంట్రీస్‌లో మాత్రం పాన్ తయారీలో ఆరుద్రపురుగును వాడుతున్నారు.



# శ్రీరామ పట్టాభిషేకం





వాయునందనుడు
ముందే
రామరాక నెరిగించగ
వాయువేగమున వెళ్లెను
వార్త అయోధ్యకు తెలిపెను!
మహానందపు భరతుడు
మాతలంత ఎదురుచూడ
సీతారాములు అయోధ్య
సీమలో ప్రవేశించిరి!
రామపాదుకల భరతుడు
రాముని పదముల దొడిగెను
పొంగిపొరల భాష్పధార
గంగాజలముతో కడిగెను
వశిష్ఠ రుషి
ఆశీస్సుతో
వైభపట్టము
కట్టెను!
సీతారాముల చిన్మయ
పట్టాభిషేకముగన
భూజనులూ వియచ్ఛరులు
భూరి సంఖ్యనే తెంచగ
తాళ మృందంగాలు మ్రోగె
తన్మయ జగమంత ఊగె
రమ్యంగా శ్రీరామ
రాజ్యమ్మే
కొనసాగె!



డా॥ వడ్డేపల్లి కృష్ణ
సెల్ :9246541699

# అమెరికాలో బాదం సాగు ఎక్కువే!



బాదం గింజల్లో పోషకాలు అధికంగానే ఉంటాయి. దీని గింజలు దేనిలో వేసినా అంత రుచికరంగా ఉంటాయి. పాయసాలు, అనేక రకాల వంటల్లో గిజలు విరివిగా వాడతారు. బాదం చెట్టు గురించి మీకు ఒక ఐడియా రావాలంటే మరిన్ని విషయాలు తెలుసుకోవాలి. బాదం చెట్టు మామూలు చెట్ల మాదిరిగానే ఉంటుంది. నిలువుగా పెరిగే కన్నా అడ్డంగా పెరుగుతుంది.

### అమెరికాలో..

ప్రపంచం మొత్తం మీద ఇంచుమించు 80శాతం బాదం ఒక్క అమెరికాలోనే పెరుగుతుంది. ఇజ్రాయిల్ బాదం పెద్దగా భలే రుచిగా ఉంటుంది.

మధ్య ఆసియా దేశాల్లో బాదం చెట్టు ఎక్కువగా పెరుగుతుంది. ఇంకా అమెరికా, స్పెయిన్, ఇటలీ, మొరాకో, ఆస్ట్రేలియా వంటి దేశాల్లోనూ పెరుగుతుంది. ఈ చెట్టు పెరగాలంటే సూర్యరశ్మి, నీళ్లు ఎక్కువ కావాలి. ఇసుక, బంకమట్టి నేలల్లో పెరుగుతుంది. బాదంలు రెండు రకాలు. ఒకటి తియ్య బాదం. రెండోది చేదు బాదం. తీపిబాదాన్ని మిఠాయిల్లో, బాదం పాలకోసం ఎక్కువగా వాడేస్తుంటారు. రెండోదాన్ని బాదం నూనె తయారీకి ఉపయోగిస్తారు.

### ఆకారం :

బాదం చెట్టు మామూలు చెట్లలానే ఉంటుంది.13 నుంచి 33 అడగుల ఎత్తువరకు పెరుగుతుంది. జీవితకాలం ఇంచుమించు 25 సంవత్సరాలు. ఆకులేమో మూడు నుంచి ఐదు అంగుళాల పొడవు ఉంటాయి. దాదాపు ఐదు నుంచి ఆరు సంవత్సరాల తర్వాత నుంచి కాయలు కాస్తాయి. అవి పండాక పగలగొడితే వచ్చేదే బాదంపప్పు.

**శాస్త్రీయ నామం** : బాదం చెట్టు శాస్త్రీయ నామం ప్రునస్ డల్సిస్. బాదం చెట్టు వల్ల బోలెడంత మేలు జరుగుతుంది. పాలు, పప్పు, నూనె వంటివెన్నో వస్తాయి. బాదం పప్పులో ఉండే మెగ్నీషియం కండరాల నొప్పుల్ని దూరం చేస్తుంది. కాల్షియం ఎముకల్ని ధృఢంగా చేస్తుంది. బాదం పప్పులో విటమిన్ ఈ పుష్కలంగా ఉంటుంది. ఇంకా ప్రోటీన్, పాస్ఫరస్, పొటాషియం, జింక్, కాపర్, బి విటమిన్లు, పీచు పదార్థం వంటివెన్నో గింజల ద్వారా మీక అందుతాయి.

సౌందర్య ఉత్పత్తుల్లో,కొన్ని రకాల ఔషధాల్లో విరివిగా వినియోగిస్తారు. బాదం పప్పు వల్ల జ్ఞాపకశక్తి పెంపొందుతుంది.

# విజిల్ ఫార్ములా హద్దుల్లో...

రివ్యూ



హిట్ ఫార్ములాను పట్టుకోవడం కొందరు దర్శకులకే సాధ్యం. ఆ సూత్రాన్ని చిన్న వయసులోనే తెలుసుకున్నారు అట్లీ. అందుకే వరుసగా విజయాలు సాధిస్తున్నారు. ఈ దర్శకుడు మొదట రాజా రాణితో ప్రేమ కథ, ఆ తర్వాత తెరితో పోలీసు స్టోరీ, అనంతరం వైద్యుల కథతో అదిరింది సినిమాలు చేసి మెప్పించారు. ఇవన్నీ విజయవంతమైన నేపథ్యాలే. అదే క్రమంలో విజిల్‌తో ఇప్పుడు క్రీడా నేపథ్యాన్ని ఎంచుకున్నాడు. ఇదీ భావోద్వేగ అంశమే అయినప్పటికీ వాణిజ్య అంశాలు మరీ మోతాదుమించాయి.

**నటీనటులు** : విజయ్, నయనతార, వివేక్, కథిర్, జాకీ శ్రాఫ్, ఆనంద్ రాజ్, యోగి బాబు తదితరులు.
**సాంకేతిక నిపుణులు** : సంగీతం - ఏఆర్ రెహమాన్ ఎడిటింగ్ - రూబెన్, సినిమాటోగ్రఫీ - జీకే విష్ణు నిర్మాణం - ఏజీఎస్ ఎంటర్‌టైన్‌మెంట్స్ మాటలు - శ్రీరామకృష్ణ దర్శకత్వం - అట్లీ

### కథేంటంటే...

నగరంలోని ఓ ప్రాంత మంచి రౌడీ రాజప్ప (విజయ్). చెడ్డ వాళ్ల నుంచి తన ప్రాంత ప్రజలను కాపాడుతుంటారు. ఈ క్రమంలో ఎంతో హింస జరుగుతుంటుంది. తన కొడుకు మైఖేల్ (విజయ్) ను మాత్రం ఈ గొడవలకు దూరంగా ఉంచుతుంటాడు. మైఖేల్ క్రీడాకారుడు. రాష్ట్రస్థాయిలో ఫుట్‌బాల్ ఆటలో ప్రతిభ చూపిస్తుంటాడు. మైఖేల్ తన ప్రతిభతో ఈ ప్రాంతానికి పేరు తీసుకురావాలని, ఇక్కడి ప్రజల అభివృద్ధికి ఉపయోగపడాలని తండ్రి రాజప్ప కోరిక. తండ్రి కలను కొడుకు నిజం చేశాడా లేదా అనేది కథాంశం.

### ఆకర్షణలు..

రెండు పాత్రల్లో విజయ్ నటన విజిల్ చిత్రానికి ప్రధాన ఆకర్షణ. రాజప్ప, మైఖేల్ పాత్రల్లో ఏ పాత్రకా పాత్ర వైవిధ్యం చూపించే ప్రయత్నం చేశారు విజయ్. ఫుట్‌బాల్ ఆటగాడిగా, కోచ్‌గా అతని నటన సహజంగా అనిపించింది. ఇందుకు ఆటలో అతను తీసుకున్న శిక్షణే ఉపయోగపడింది. రాజప్ప పాత్రలో తన ప్రాంతం బాగుండాలని, ప్రజలకు మేలు జరగాలని కోరుకునే సన్నివేశాల్లో విజయ్ నటన ఆకట్టుకుంటుంది. నయనతార చేసిన ఏంజిల్ పాత్ర కథతో పాటు సాగుతూ బలాన్నిచ్చింది. ఫుట్‌బాల్ క్రీడాకారిణులు అందరూ చక్కగా తమ పాత్రల మేరకు నటించారు. జాకీశ్రాఫ్ విలనీ బాగుంది. దర్శకుడు అట్లీ మరోసారి వాణిజ్య అంశాలు మేళవించి మెప్పించారు. హీరోగా విజయ్‌కు బిల్డప్ ఇస్తూనే, భావోద్వేగాల సన్నివేశాలతో అతను చేస్తున్నది సరైనదే అనిపించేలా కథను నడిపాడు. అనేక మలుపుల సన్నివేశాలు కథను ఆసక్తికరంగా మలిచాయి. సాంకేతిక నిపుణుల పనితనం, నిర్మాణ విలువలు కనిపించాయి. శ్రీరామకృష్ణమాటలు కథకు బలాన్నిచ్చాయి.

### వికర్షణలు..

ద్వితీయార్థం కంటే ప్రథమార్థం కొంత బలహీనంగా సాగుతుంది. పాత్రల పరిచయం, కొంత అనవసర హాస్యం తప్పనిసరి అయ్యింది. నేటివిటీ సమస్య విజిల్‌ను వదలలేదు. చాలా సన్నివేశాలు, కొన్ని ప్రధాన పాత్రల వ్యవహారం అతిగా అనిపిస్తుంటుంది. ఇంతటి బలమైన కథ తెలుగు హీరో చేసుంటే, ఇక్కడ భారీ విజయమే దక్కేది. స్థానికత కోల్పోవడం విజిల్ తెలుగు ఫలితాన్ని ప్రభావితం చేయవచ్చు. చివరగా...కొలతల ప్రకారం చేసిన వంటలు రుచించినట్లే....వాణిజ్య అంశాలను ఆచి తూచి చేర్చిన ఈ విజిల్ సగటు సినీ ప్రియులను మెప్పిస్తుంది.

**రేటింగ్ 2/5**



విజయ్ దేవరకొండ

# అభిమానులతో కలిసి..

క్రేజీ హీరో విజయ్ దేవరకొండ నిర్మాతగా మారిన విషయం తెలిసిందే. కింగ్ ఆఫ్ ద హిల్ ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై 'మీకు మాత్రమే చెప్తా' పేరుతో చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ సినిమా మ్యూజిక్ వీడియో ''నువ్వే హీరో...'' పాట ఆవిష్కరణ విజయ్ దేవరకొండ అభిమానుల చేతుల మీదుగా జరిగింది. హైదరాబాద్‌లోని మల్టీప్లెక్స్‌లో జరిగిన ఈవెంట్‌లో ఫాన్స్ నడుమ విడుదల చేశారు. నవాబ్ రాప్ గ్యాంగ్ పాడిన పాటను విడుదల చేశారు. ఈ సందర్భంగా విజయ్ మాట్లాడుతూ ''ప్రమోషన్ పాట కోసం బాగా శ్రమించాం. నాతో పాటు తరుణ్, అభినవ్ గోమటం కూడా డాన్స్ చేయాలి. కానీ కొన్ని ప్రాక్టికల్ ప్రాబ్లమ్స్ వల్ల కుదరలేదు. శివ మంచి మ్యూజిక్ ఇచ్చారు. హీరోగా తరుణ్ భాస్కర్ యాక్టింగ్‌ను అందరు ఎంజాయ్ చేస్తారు. నవంబర్ ఒకటవ తేదీన సినిమా విడుదలవుతుంది'' అన్నారు. ఈ చిత్రంలో తరుణ్ భాస్కర్, అనసూయ భరద్వాజ్‌తో పాటుగా అభినమ్ గౌతమ్, పావని గంగిరెడ్డి, నవీన్ జార్జ్ థామస్, వాణి భోజన్, అవంతిక, వినయ్ వర్మ ఇతర పాత్రధారులు. లైన్ ప్రొడ్యూసర్: విజయ్ మట్టపల్లి, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: అనురాగ పర్వతినేని, నిర్మాతలు: విజయ్ దేవరకొండ, వర్ధన్ దేవరకొండ, రచన, దర్శకత్వం: షమ్మీర్ సుల్తాన్.



వెంకటేష్

# మంచి కథలను వెతికి పట్టుకుంటున్నారు!

మంచి కథాంశాలే సినిమా విజయానికి ప్రధాన కారణమవుతున్నాయి. అలాంటి కథలను హృద్యంగా తెరకెక్కించగలిగితే ఆకాశమే హద్దు అన్న చందాన విజయం సాధిస్తున్నాయి. ఒక్క తెలుగు, తమిళ, హిందీ భాషల సినీరంగాల్లోనే కాదు ఏ భాషా పరిశ్రమలోనైనా ఇదే విజయానికి తారకమంత్రం అవుతోంది. అయితే ఇప్పటికే వివిధ రకాల కథలతో పుంఖాను పుంఖాను సినిమాలు రావడంతో కొత్త కథలను సృష్టించడం...అది కూడా సక్సెస్ ఫార్ములాకు తగ్గట్టుగా తయారు చేయడం అంత సులువేం కాదు. అందుకే ఎక్కడ మంచి కథ దొరికినా...ఏ బాషలో ఏదైనా చిత్రం విజయం సాధించినా....దర్శక, నిర్మాతలతో పాటు హీరోలు వాటిమీద కన్నేస్తున్నారు. ఆ పాత్ర తమకు సరిపోతుందని అనుకుంటే ఆ చిత్రాన్ని తాము చేసేందుకు ఎనలేని ఆసక్తిని కనబరుస్తున్నారు. ఈ క్రమంలోనే ఎక్కడ హిట్టైన చిత్రమైనా వేరే భాషలోకి వెంటనే వచ్చేస్తోంది. తాజాగా తమిళంలో ధనుష్ కథానాయకుడిగా వెట్రిమారన్ దర్శకత్వంలో రూపొందిన అసురన్ చిత్రం తమిళనాట దసరాకు విడుదలై ఘన విజయాన్ని సాధించింది. ఇప్పటికే ఆ చిత్రం 150 కోట్ల రూపాయలను బాక్సాఫీసు వద్ద వసూలు చేసినట్లు తెలిసింది. దీంతో ఈ యాక్షన్ డ్రామా చిత్రాన్ని తెలుగులో రీమేక్ చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఇందులో వెంకటేష్ నటించబోతున్నారు. అధికారింగా ఆ విషయాన్ని ధృవీకరించారు. సురేష్ ప్రొడక్షన్స్, వి క్రియేషన్స్ సంస్థలపై డి.సురేష్‌బాబు, కలైపులి ఎస్.థాను నిర్మించనున్న తెలుగు వెర్షన్ నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలను త్వరలో వెల్లడించనున్నారు.



ధనుష్

# లక్నోలో ఇందూ షూటింగ్..



కియారా

కియారా ప్రస్తుతం ఇందూ కీ జవానీ అనే చిత్రంలో నటిస్తోంది. ఇది ఆమెకు తొలి నాయిక ప్రధాన చిత్రం. ఈ సినిమాలో గజియాబాద్ అమ్మాయి ఇందూ గుప్తా పాత్రను పోషిస్తోందీ భామ. ఇందూ కీ జవానీ సినిమా డేటింగ్ యాప్‌ల నేపథ్యంతో సాగనుంది. నేటి యువతకు గాలమేస్తున్న ఈ యాప్‌ల దుష్ఫలితాలను చూపించబో తోంది. ఈ చిత్రాన్ని దర్శకుడు అబిర్ సేన్‌గుప్తా రూపొందిస్తున్నారు. ఇందూకీ జవానీ సినిమా ప్రకటించి రోజులు గడుస్తున్నా చిత్రీకరణ మొదల వలేదు. అయితే తాజాగా ఈ సినిమా షూటింగ్ ప్రారంభించుకుంది. తొలి షెడ్యూల్ ఉత్తరప్రదేశ్‌లోని లక్నోలో మొదలయ్యింది. ఈ చిత్రం గురించి గతంలో కియారా స్పందిస్తూ...నేను నటిస్తున్న తొలి నాయిక ప్రధాన చిత్రమిది. ఇందూ చాలా ప్రత్యేకమైన పాత్ర. ఈ క్యారెక్టర్‌లా మారేందుకు ప్రయత్నిస్తా. ఇందూ చూడగానే ఇష్టపడేలా ఉంటుంది, చురుకైన అమ్మాయి, విభిన్నంగా ఉంటుంది. ఈ పాత్ర వైఖరి కొత్తగా ఉంటుంది. డేటింగ్ యాప్‌ల గురించి ఇందులో చర్చిస్తున్నాం. నేను నిజ జీవితంలో సహజీవనానికి వెళ్లలేదు కానీ నా స్నేహితులు చాలా మంది వెళ్లారు. వాళ్లు చెప్పే విషయాలు చాలా వింతగా ఉండేవి. అని చెప్పింది. కియారా ప్రస్తుతం గుడ్‌న్యూస్, లక్ష్మీబాంబ్‌తో పాటు పలు బాలీవుడ్ చిత్రాల్లో తీరిక లేకుండా నటిస్తోంది.

# పోలీస్ అధికారిగా కనిపిస్తా..



శ్రీరామ్

దర్శకుడు శ్రీనివాసరెడ్డి రూపొందిస్తున్న సినిమా రాగల 24 గంటల్లో. ఈషా రెబ్బ, సత్యదేవ్, శ్రీరామ్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్రంతో కొంత విరామం తర్వాత తెలుగు తెరపైకి వస్తున్నారు శ్రీరామ్. ఆయన రాగల 24 గంటల్లో సినిమాలో పోలీసు అధికారిగా కనిపించనున్నారు. ఈ చిత్రం గురించి, తన పాత్ర విశేషాలు గురించి శ్రీరామ్ మాట్లాడుతూ...దర్శకుడు శ్రీనివాసరెడ్డి గారి సహాయ దర్శకుడు ఒకరు తమిళ చిత్రాలకు పనిచేశారు. ఆయన ద్వారా నాకీ కథ వినిపించారు. ముందు నా పాత్ర వరకు చెప్పారు. నేను మొత్తం కథ వినిపించమన్నా. ఈ చిత్రానికి నన్నెందుకు అడుగుతున్నారు అనుకున్నా, అయితే కథ విన్నాకు వీళ్లు నా దగ్గరకు సరిగ్గానే వచ్చారు అనిపించింది. మనం వార్తల్లో రాగల 24 గంటల్లో అంటూ వింటా. ఒక రోజులో జరిగే కథ ఇది. రాత్రి ప్రారంభమై, మరుసటి రోజు రాత్రికి ముగుస్తుంది. ఇదొక సస్పెన్స్ థ్రిల్లర్ కథాంశం. మీరు ట్రైలర్ చూస్తే చివరలో నేనే నా భర్తను చంపాను అంటూ భార్య చెబుతుంది. ఇలా ఎందుకు చేసింది, నిజంగానే హత్య చేసిందా అనేది ఆసక్తికరం. ఈ సినిమాలో ప్రతి పాత్రకు రెండు కోణాలుంటాయి. మంచి కథ. ప్రేక్షకులు ఇది ఇలా జరుగుతుంది అని ఊహించలేరు. నేను పోలీస్‌గా కనిపిస్తా. విచారణ జరపడం, సమాచారం సేకరించడం నా పని. నా పని నేను చేసుకుంటూ వెళ్తా. ఈ చిత్ర షూటింగ్ ముగింపు సన్నివేశాల నుంచి మొదటికి చేసుకుంటూ వచ్చాం. ఇలా నటించడం కష్టం. ఓ పాత్ర స్వభావం కథ మొదటి నుంచీ చేసుకుంటూ వస్తే తెలుస్తుంది. కానీ మేము ఆర్టిస్టుల అందుబాటును బట్టి క్లైమాక్స్ నుంచి వెనక్కి రూపొందిస్తూ వచ్చాం. నాకున్న అనుభవంతో ఇలా నటించగలిగా. తెలుగులో మంచి ప్రేమ కథా చిత్రాలు వస్తున్నాయి. లవ్ స్టోరీస్ చేయడం నాకిష్టం. తమిళంలో ప్రేమ కథలు రావడం తగ్గి చాలా కాలమే అవుతోంది. తెలుగులో ఒకట్రెండు కథలు విన్నాను. ఒక సినిమా షూటింగ్ జరుగుతోంది. అన్నారు.

# ఖైదీ కొత్త ప్రయత్నమే కానీ....

సృజనాత్మకతే ప్రాణమైన చిత్ర పరిశ్రమలో కొత్తగా ఆలోచించేవారికే చోటుంటుంది. ఖైదీ చిత్రంతో దర్శకుడు లోకేష్ అలాంటి వినూత్న ప్రయత్నమే చేశాడు. పేరుకు చెప్పుకునే వాణిజ్య అంశాలన్నీ పక్కన బెట్టి, నిజాయితీగా సస్పెన్స్ యాక్షన్ కథను తెరకెక్కించాడు. మంచి కథలు ఎంచుకునే కార్తీకి ఆ పేరు కొనసాగించే చిత్రమిది.


### కథేంటంటే..

జైలు శిక్ష అనుభవించి విడుదలవుతున్న ఖైదీ ఢిల్లీ (కార్తీ). అప్పటిదాకా చూడని తన కూతురును చూడాలని ఆత్రుతగా జైలు నుంచి బయటకు వెళ్తుంటాడు. ఇంతలో తమను వెంటాడుతున్న మత్తు మందు మాఫియా నుంచి కాపాడమని ఢిల్లీని అభ్యర్థిస్తారు పోలీసులు. ముందు అంగీకరించకున్నా, ఆ మాఫియా వల్ల తన కూతురుకూ ప్రమాదమని తెలుసుకుని ఒప్పుకుంటాడు. అనేక మలుపులు తిరిగిన ఈ యాక్షన్ డ్రామాలో ఢిల్లీ మాఫియా ఆట కట్టించాడా, తన కూతురును చేరుకున్నాడు అనేది ఆసక్తికరం.

### ఆకర్షణలు - వికర్షణలు

నమ్ముకున్న విషయానికి కట్టుబడి ఉండటం ఎప్పుడూ సత్ఫలితాన్నిస్తుంది. ఇలాగే దర్శకుడు లోకేష్ తను ఎంచుకున్న కథను అంతే నిజాయితీగా తెరకెక్కించాడు. రాత్రి నాలుగు గంటల్లో జరిగే కథను ఎక్కడా పక్కదారి పట్టకుండా ఆసక్తికరంగా రూపొందించాడు. కార్తీ నటన ఖైదీ చిత్రానికి ప్రధాన ఆకర్షణ. కూతురు కోసం ఆరాటపడే తండ్రిగా, పోరాట సన్నివేశాల్లో ధీరుడిగా కనిపిస్తారు కార్తీ. తొలిభాగం అనేక మలుపులతో, ప్రశ్నలతో సాగి, ద్వితీయార్థం వాటి సమాధానాలతో ముగుస్తుంది. తొలిభాగంలో ఉన్నంత బలం ద్వితీయార్థంలో లేదు. సాంకేతిక నిపుణుల పనితనం బాగుంది. కొత్త సినిమా చూడాలనుకునేవారు ఖైదీని ఇష్టపడినా, వాణిజ్య అంశాల చిత్రాలు చూసే వారికి ఇది నచ్చకపోవచ్చు.

**రేటింగ్ 2.5/5**



# గోపీచంద్ సినిమాకు బ్రేక్...!



యాక్షన్ హీరోగా పేరున్న గోపీచంద్ మంచి హిట్ కోసం చాలా రోజులుగా ఎదురుచూస్తున్నారు. ఆయన నటించిన చిత్రాలన్నీ బాక్సాఫీస్ వద్ద బోల్తా కొడుతున్నాయి. తాజాగా ఎన్నో ఆశలు పెట్టుకున్న 'చాణక్య' సైతం నిరాశపరిచింది. ఓ మోస్తారు కలెక్షన్లు సైతం తేలేకపోయింది అని టాలీవుడ్ ట్రేడ్ వర్గాలు తెలిపాయి. చాణక్య ఫలితం నేపథ్యంలో ఇప్పటికే గోపీచంద్ హీరోగా కొత్త చిత్రాలు ప్రారంభించిన నిర్మాతలు పునరాలోచనలో పడ్డారనే మాట వినిపిస్తోంది. ప్రముఖ నిర్మాత బీవీఎస్ఎన్ ప్రసాద్ నిర్మించే చిత్రం లాంఛనంగా షూటింగ్ ప్రారంభమైంది. అయితే తాజా సమాచారం ఏమంటే ఈ సినిమాను తాత్కాలికంగా నిలుపుచేశారనే మాట పరిశ్రమ వర్గాల్లో వినిపిస్తోంది. దీనిపై స్పష్టత రావాల్సి ఉంది. అలాగే సంపత్ నంది దర్శకత్వంలో గోపీచంద్, తమన్నా జంటగా శ్రీనివాస్ చిట్టూరి నిర్మించే సినిమా చిత్రీకరణ మాత్రం మొదలుకావాల్సి ఉంది. గతంలో గోపీచంద్, నయనతార జంటగా నటించిన 'ఆరడుగుల బుల్లెట్' చిత్రం ఆర్థిక కారణాలతో నిలిచిపోయింది. ఇంతవరకు విడుదలకాలేదు.

Vaccum Therapy లింగవర్ధక యంత్రం
లింగం చిన్నదని నిరాశ ఎందుకు?

అమెరికా ఏజెన్సీ FDA వారి అభిప్రాయం ప్రకారం Vaccum Therapy లింగవర్ధక యంత్రం మరియు ఔషధాల ద్వారా పురుషుడు తన చిన్న లింగాన్ని 75 రోజులలో 7 నుండి 8 అంగుళాల పొడవు, లావు, గట్టిగా, శక్తివంతంగా మరియు దృఢంగా చేసుకొనవచ్చును. మరియు తన ఇష్టానుసారం శృంగార సమయాన్ని పొడిగించుకోవచ్చును. శీఘ్రస్కలనం, నపుంసకత్వం, లింగము వదులుగా ఉండుట, చిన్నగా ఉండుట, సన్నగా ఉండుటను తొలగించుకోవడంకోసం 30 రోజుల ఔషధం.
ఇంటి దగ్గరకే ఔషధం తెప్పించుకోండి
08943212076